ఈనాడు
విశాఖపట్నం
గురువారం 4 జనవరి 2018 | 16 పేజీలు

నేడు, రేపు జిల్లాలో సీఎం చంద్రబాబు పర్యటన

ధర్మసాగరం జన్మభూమికి హాజరు



ధర్మసాగరంలో సీఎం సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి అయ్యన్నపాత్రుడు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గురువారం ఉదయం విశాఖకు రానున్నారు. విజయవాడ నుంచి ప్రత్యేక విమానంలో మధ్యాహ్నం 12.30 గంటలకు సీఎం విశాఖకు చేరుకుంటారు. అనంతరం 12.40 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం వెళ్తారు. సాయంత్రం విశాఖకు చేరుకుంటారు. ఏయూ ఆవరణలో జీవీఎంసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న సభలో పాల్గొంటారు. స్మార్ట్ సిటీ పనులకు శంకుస్థాపనతో పాటు ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద నగరంలో నిర్మించతలపెట్టిన గృహనిర్మాణ పథకం, వాటర్ పైప్‌లైన్ పనులకు స్నాతకోత్సవం మందిరప్రాంగణంలో సీఎం శిలాఫలకాలను ఆవిష్కరించనున్నారు. అనంతరం జరిగే సభలో పాల్గొంటారు.

5న పర్యటన వివరాలు ఇలా..

ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం ఉదయం 9.15 గంటలకు పోర్టు అతిథిగృహం నుంచి బయలుదేరి బీచ్ రోడ్డులోని కోస్టల్ బ్యాటరీ ఆవరణలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 9.50 గంటలకు నర్సీపట్నం నియోజకవర్గ పరిధిలోని ధర్మసాగరం గ్రామానికి వెళ్తారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకూ జరిగే జన్మభూమి-మావూరు గ్రామసభలో పాల్గొంటారు. 12.30 నుంచి ఒంటిగంట వరకు విరామం ఇచ్చారు. మధ్యాహ్నం ఒంటిగంటకు సభాస్థలి నుంచి బయలుదేరి హెలిప్యాడ్ వద్దకు సీఎం చేరుకుంటారు. 1.10 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి మధ్యాహ్నం 1.50 గంటలకు విజయనగరం జిల్లా బొబ్బిలి వెళ్తారు. సాయంత్రం 5.15 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుని, 5.20 గంటలకు ప్రత్యేక విమానంలో విజయవాడకు తిరుగుప్రయాణం కానున్నారు.

సీఎం సభకు భారీ ఏర్పాట్లు.. 7లో

ఒక్క అడుగు.. స్వచ్ఛత దిశగా...

జన్మభూమిలో భాగంగా రోజుకో అంశంపై చర్చా కార్యక్రమం నిర్వహిస్తున్నారు. గురువారం స్వచ్ఛాంధ్రప్రదేశ్ అమలుకు కార్యాచరణపై చర్చించనున్నారు. ఈనేపథ్యంలో జిల్లాలో ఆయా అంశాల్లో క్షేత్రస్థాయి పరిస్థితులెలా ఉన్నాయో తెలిపే కథనమిది...

ఇంటింటా మరుగుదొడ్డి నిర్మాణాలపై దృష్టి

పచ్చదనం-పరిశుభ్రతపై నేడు చర్చ

చోడవరం, న్యూస్‌టుడే

చోడవరం మండలం కన్నంపాలెం గ్రామం వెళ్లాలంటే భయం. ప్రధాన రహదారి వెంబడి గ్రామస్థులు బహిరంగ మల విసర్జన చేసేవారు. దీంతో ప్రధాన రహదారిని వదిలి పాఠశాల వైపు సందులో నుంచి గ్రామంలోకి వెళ్లేవారు. ఆటోలు, స్కూల్ బస్సులు గ్రామంలోకి వచ్చేవి కావు. గ్రామ పొలిమేరలో ఉన్న బొర్రాలమ్మ గుడి వద్ద నిలిపివేసేవారు. దీనికంతటికి కారణం తారు రహదారిపై చెత్త పోసి, మల విసర్జనకు అనువుగా మార్చేయడమే. ఈ రహదారి మీదుగా రావాలంటే ముక్కు మూసుకున్నా భరించలేని దుర్వాసన. పరిసరాల్లో నివసించే వారి బాధలు వర్ణనాతీతం. పూర్తి బహిరంగ మల విసర్జన ప్రాంతంగా మారిపోయింది. ఇది నిన్నటి వరకు.. మరి నేడు.. రహదారిపై ఎలాంటి చెత్తాచెదారం లేదు. బహిరంగ మలవిసర్జన అనేది.. మిగతా 2లో



స్వచ్ఛతకు అద్దం పట్టేలా ఉన్న కొమాళ్లపూడి పాఠశాలలోని మరుగుదొడ్లు



అప్పు చేసి మరీ మరుగుదొడ్డి కట్టుకున్నా!

ఇన్నాళ్లు ఆరుబయటే మాకు మరుగు. ఇపుడు అది కాస్త నివారించారు. మళ్లీ కొత్తగా దొడ్డి కట్టుకోకపోతే పింఛను కట్ చేస్తామన్నారు. ఓ నెల పింఛను ఆగింది. నాకు ఎవరూ లేరు, ప్రభుత్వమిచ్చే పింఛను ఆదుకుంటోంది. అది కాస్తా పోతుందేమోనన్న భయంతో అప్పు తెచ్చి పనులు చేపట్టాను. దండోరా వేసిన తర్వాత ముందుగా దొడ్డి నిర్మించింది నేనే. ఇపుడు అయిదు వేలు వచ్చాయి. మిగిలిన సొమ్ము వస్తాదని ఎదురుచూస్తున్నాను.

- కింతాడ దేముడమ్మ, వితంతువు, కన్నంపాలెం

భార్యను సరిగా చూడని భర్తకు ఆరు నెలల జైలు

కె.కోటపాడు, న్యూస్‌టుడే: వివాహం చేసుకున్న భార్యను సరిగా చూడని భర్తకు ఆరు నెలల జైలుశిక్ష విధిస్తూ చోడవరం ఏజీఎఫ్‌ఎం కోర్టు తీర్పు ఇచ్చిందని కె.కోటపాడు ఎస్‌ఐ ఎంవీ రమణ తెలిపారు. గొట్లాంకు చెందిన సబ్బి కొండబాబుపై అతని భార్య రూపావతి తనను సరిగా చూడటం లేదని ఇబ్బందులు పెడుతున్నాడని 2013లో పోలీసు స్టేషన్‌కు ఫిర్యాదు చేశారు. అప్పట్లో ఈ వివాదాన్ని చోడవరం కోర్టుకు నివేదించారు. దీనిపై వాదోపవాదాలు అనంతరం బుధవారం చోడవరం కోర్టు కొండబాబుకు ఆరు నెలల జైలుశిక్ష విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారని ఎస్‌ఐ తెలిపారు.

ముగ్గురిని కాపాడిన మెరైన్ పోలీసులు

రేవుపోలవరం (ఎస్.రాయవరం), న్యూస్‌టుడే: రేవుపోలవరం తీరంలో బుధవారం సముద్రంలో మునిగిపోతున్న ముగ్గురు యువకులను మత్స్యకారులతో కలిసి కాపాడినట్లు పెంటకోట మెరైన్ పోలీస్‌స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ పి.జగతిరాజు తెలిపారు. ఈయన కథనం ప్రకారం.. తమిళనాడుకు చెందిన మూడు కుటుంబాలు ఎలమంచిలి, మాకవరపాలెం గ్రామాల్లో స్థిరపడ్డారు. వీరంతా బుధవారం తీరానికి విహారయాత్రకు వచ్చారు. భోజనాల అనంతరం సముద్రంలో దిగి స్నానాలు చేస్తుండగా వీరిలో విజయ్, శివస్వామి, సురేష్ అలల ధాటికి కొట్టుకుపోయారు. వెంటనే కుటుంబ సభ్యులు కేకలు వేయడంతో అక్కడే విధులు నిర్వహిస్తున్న హెచ్‌సీ జగతిరాజు, హోంగార్డు మైలపల్లి శ్రీను, సముద్రంలోకి దిగి కాపాడుతుండగా, మరో నలుగురు మత్స్యకారులు పడవ తీసుకుని వెళ్లి వారిని తాడు సాయంతో సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. వీరిలో సురేష్, శివస్వామి స్పృహలో లేకపోవడంతో స్థానికులు 108 వాహనంలో నక్కపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఈ ముగ్గురు సురక్షితంగా ఉన్నారని తెలిపారు. దీనిపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై కుమారస్వామి తెలిపారు.



కొట్టుకుపోయిన వారిని పడవలో ఒడ్డుకు చేర్చిన మెరైన్ పోలీసులు, మత్స్యకారులు



చికిత్స పొందుతున్న శివస్వామి

సంక్రాంతి తర్వాత వసంతోత్సవం

నర్సీపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: సంక్రాంతి తర్వాత అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో వసంతోత్సవం పేరిట వార్షికోత్సవాలు నిర్వహించాలని డిప్యూటీ ఈఓ. సునీత ప్రధానోపాధ్యాయులకు సూచించారు. బుధవారం ఆమె ధర్మసాగరం ప్రాథమిక పాఠశాలను సందర్శించి నర్సీపట్నంలో హైస్కూళ్ల ప్రధానోపాధ్యాయులతో సమావేశమై పదో తరగతి పరీక్షల సమాయత్తంపై సమీక్షించారు. అనంతరం తనను కలిసిన విలేకర్లతో మాట్లాడుతూ ఫిబ్రవరిలోగా వసంతోత్సవాలు పూర్తి చేయాలని ఆదేశించారు. తన పరిధిలో 319 స్కూళ్లున్నాయని అన్నింటికీ పాఠశాల నిధులు ఇచ్చామని తెలిపారు. స్కూల్ భవనాలను అనుసరించి రూ.10 వేలు నుంచి రూ.17 వేలు వరకు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. గత ఏడాది జిల్లాలో పదో తరగతిలో 94.6 శాతం ఉత్తీర్ణత వచ్చిందన్నారు. ఈ ఏడాది ఇంతకంటే మెరుగైన ఉత్తీర్ణత సాధించడంతో పాటు పది గ్రేడ్‌పాయింట్లు ఎక్కువ మందికి వచ్చేలా చూడాలని ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వారికి రెండు గంటలపాటు విద్యార్థులకు కూచిపూడి నృత్యం, మార్షల్ ఆర్ట్స్ నేర్పిస్తున్నామని తెలిపారు. సర్వశిక్ష అభియాన్ నుంచి నియమితులైన నిపుణులు అన్ని స్కూళ్లకు వెళ్లి శిక్షణ ఇస్తున్నారని తెలిపారు.



సునీత, డిప్యూటీ డీఈఓ

భూగర్భ డ్రైనేజీకి సాయపడాలి

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: అమెరికాలోని జార్జ్ వాషింగ్టన్ విశ్వవిద్యాలయంలో రాజకీయ ఉన్నత విద్య అభ్యసిస్తున్న మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు తనయుడు విజయ్ బుధవారం ప్రపంచబ్యాంకును సందర్శించారు. తోటి విద్యార్థి మిత్రుల సాయంతో ఆయన అనుమతి సాధించి ప్రపంచ బ్యాంకు ప్రతినిధులను కలిశారు. 61,540 జనాభా కలిగిన నర్సీపట్నం పురపాలికలో భూగర్భ డ్రైనేజీ అవసరాన్ని ఆయన వారి దృష్టికి తీసుకువచ్చారు. నర్సీపట్నం సహా చుట్టుపక్కల మండలాల నుంచి ఏటా 3.51 లక్షల మంది వివిధ రకాల అనారోగ్యంతో ప్రాంతీయ ఆసుపత్రికి చికిత్స కోసం వస్తున్నారని ఆయన వివరించారు. భూగర్భ డ్రైనేజీ నిర్మాణానికి సాయపడాలని తాను చేసిన విజ్ఞప్తికి బ్యాంకు ప్రతినిధులు సానుకూలంగా స్పందించారని విజయ్ ఇక్కడకు పంపిన ప్రకటనలో పేర్కొన్నారు.



ప్రపంచబ్యాంకు సందర్శనలో విజయ్

ఒక్క అడుగు..స్వచ్ఛత దిశగా..

(మొదటిపేజీ తరువాయి) మచ్చుకైనా రాదు. స్వచ్ఛతకు మారుపేరుగా మారిపోయింది. త్వరలో మొక్కలు నాటి దారిని సుందరంగా మార్చేందుకు గ్రామస్థులు చర్యలు తీసుకుంటున్నారు. ఇపుడు ఎవరైనా ఆ గ్రామం వెళితే అబ్బో ఎంత మార్పో అంటూ ఆశ్చర్యపోక తప్పదు.

జిల్లాలో నూరుశాతం మరుగుదొడ్ల నిర్మాణాలు చేయాలన్న ప్రభుత్వ హెచ్చరిక మండల స్థాయి అధికారుల్లో చలనం తీసుకొచ్చింది. దీంతో కన్నంపాలెంపై దృష్టి సారించారు. ముందుగా రహదారిని పరిశుభ్రం చేసి మల విసర్జన చేయకుండా చేయాలని నిర్ణయించారు. గ్రామస్థులందర్నీ సమావేశపర్చి ఇందుకు సహకరించాలని కోరారు. గ్రామ పెద్దలు, ప్రతినిధులు, యువకులు ఒక్కటయ్యారు. ప్రధాన రహదారిపై మల విసర్జన మానాలంటూ దండోరా వేయించారు. రాత్రిళ్లు కూడా రహదారి వెంబడి మల విసర్జన చేయకుండా కాపలా కాశారు. క్రమేపీ రహదారి బాగుపడింది. ఇపుడు గ్రామపెద్దలు, అధికారులు గ్రామస్థులందరూ మరుగుదొడ్లు నిర్మించుకునేలా చర్యలు తీసుకుంటున్నారు. 186 మరుగుదొడ్లు నిర్మించాల్సి ఉంది. వీరందరు దొడ్లు నిర్మించకపోతే ప్రభుత్వపరంగా వచ్చే సదుపాయాలు అందనీయబోమని దండోరా వేయించారు. దీంతో గ్రామంలో ఎక్కడ చూసినా మరుగుదొడ్ల నిర్మాణాలు చకచక సాగుతున్న వైనాలు దర్శనమిస్తున్నాయి. మండల అధికారులు, పెద్దల కృషికి కన్నంపాలెం ఉదాహరణగా నిలుస్తోంది.

జిల్లాను బహిరంగ మల విసర్జనరహితం (ఓడీఎఫ్)గా మార్చి ఆదర్శంగా నిలవాలన్న ధ్యేయంతో అధికారులు తీవ్రంగా శ్రమిస్తున్నారు. గ్రామీణ జిల్లాలోని 39 మండలాల్లో ఇంటింటా మరుగుదొడ్డి ఉండేలా 2.5 లక్షల మరుగుదొడ్లు నిర్మించేందుకు సిద్ధమయ్యారు. నర్సీపట్నం మండలం నూరు శాతం నిర్మాణాలతో ప్రథమ స్థానంలో నిలిచింది. అదే దిశలో మిగిలిన మండలాలు పయనిస్తున్నాయి. లక్ష్యంలో ఇప్పటి వరకు 1.64 లక్షల దొడ్ల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. 90,934 మరుగుదొడ్లను పూర్తి చేసేందుకు ఈనెల 13వ తేదీ కటాఫ్‌గా ప్రకటించారు. సొంతంగా స్థలం లేని కుటుంబాలవారికి పంచాయతీ స్థలంలో సామూహిక దొడ్లు నిర్మించేలా చర్యలు తీసుకుంటున్నారు. అదేవిధంగా గ్రామస్థాయి ప్రత్యేకాధికారులకు లక్ష్యాలను నిర్ణయించారు. ఇపుడు వీరికి సహాయంగా అంగన్‌వాడీ కేంద్రం నిర్వాహకులను నియమించారు. వీరంతా ఉదయాన్నే లబ్ధిదారుల చుట్టూ తిరుగుతూ లక్ష్యాలను పూర్తి చేసేందుకు పనిచేస్తున్నారు. చోడవరం పంచాయతీలో 14వ ఆర్థిక సంఘ నిధులతో 16 మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టింది.

బిల్లులకు ఎదురు చూపులు...: దొడ్డు నిర్మించినా బిల్లుల విషయం అధికారులకు ప్రాణసంకటంగా మారింది. మండల సమావేశాలలోనూ, జన్మభూమి సభల్లోనూ బిల్లుల కోసం నిలదీస్తున్నారు. 1.64 లక్షల మరుగుదొడ్లు పూర్తయితే లక్ష మందికే రూ. అయిదు వేల చొప్పున బ్యాంకు ఖాతాలో జమైందని సమాచారం. అధికారులేమో 85 వేల మందికి పూర్తిగా బిల్లులు చెల్లించినట్లు పేర్కొంటున్నారు. జియోట్యాగింగ్ చేసినా బిల్లులు చెల్లించలేదని 5,854 మంది గగ్గోలు పెడుతున్నారు. గొయ్యిలు తవ్వినా బిల్లులు రాకపోవడంతో చోడవరం మండలం జన్నవరం కొత్తూరులో పూడ్చేసుకున్నారు. చెల్లింపుల్లో జాప్యం నివారిస్తే అందరూ వీటి నిర్మాణానికి ముందుకొస్తారని ప్రజాప్రతినిధులు చెబుతున్నారు.

స్వచ్ఛ గ్రామీణం వైపు...: గ్రామాల్లో మట్టి రహదారుల స్థానే సిమెంట్ దారులొచ్చాయి. పరిసరాలు బాగుపడ్డాయి. ఖాళీ స్థలాలను నందన వనంలా తీర్చిదిద్దుతున్నారు. బుచ్చెయ్యపేట మండలం ఎల్‌బీపుర అగ్రహారంలో ఖాళీ స్థలాల్లో పూల మొక్కలు పెంచారు. ప్రతి మార్గానికి జాతీయ నేతల పేర్లు పెట్టారు. కొమళ్లపూడి పంచాయతీ అయితే స్వచ్ఛతకు మారుపేరులా చూడచక్కగా తయారైంది. స్వచ్ఛ పంచాయతీల జాబితాలో జిల్లాలో మూడు పంచాయతీలు దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన విషయం విదితమే. వీటిలో వడ్డాది పంచాయతీ ఒకటి. పంచాయతీలో చెత్త ఉండకుండా చక్కగా ఉండేలా సంపద తయారీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇలాంటి సంపద తయారీ కేంద్రాల ఏర్పాటులో వీడికాడ పంచాయతీ దేశంలోనే మూడో స్థానం పొందింది. ఉపాధి హామీ పథకంలో భాగంగా రహదారుల పక్కన మొక్కల పెంపకాలు చేపట్టి పచ్చదనం పెంపొందిస్తున్నారు.

అత్యాచారం కేసులో మరికొందరు నిందితులు?

★ నివేదిక ఇవ్వని హెచ్.బి.ఎల్.

★ బాధితురాలు మేజరేనని పత్రం

★ విస్మయం వ్యక్తం చేస్తున్న అధికారులు

ఈనాడు, విశాఖపట్నం: దువ్వాడ వీసెజ్‌లో గిరిజన బాలికపై అత్యాచారం కేసు మలుపులు తిరుగుతోంది. ఈ ఘటనకు ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించింది ముగ్గురని తేల్చిన పోలీసులు నిందితులను అరెస్ట్ చేశారు. అత్యాచారం చేయడానికి ప్రధాన నిందితుడిని పురికొల్పిన వారు మరికొందరున్నట్లు, వారిని రక్షించే ప్రయత్నాలు జరుగుతున్నట్లు ఆరోపణలొస్తున్నాయి. నిందితుడు పనిచేస్తున్న హెచ్‌బీఎల్ సంస్థ యాజమాన్యానికి అత్యాచార సమాచారం తెలిసినా వారు పట్టించుకోకపోవడంతో వీసెజ్ డీసీ ఇప్పటికే నోటీసు జారీ చేశారు. ఇప్పటికీ ఆ సంస్థ నుంచి స్పందన లేదు. సంఘటన సంస్థ వెలుపల జరిగింది కాబట్టి తమకు సంబంధం లేదన్నది అందులోని కొందరు ఉద్యోగుల వాదన. ఆ సంస్థ ఉద్యోగులపై ఎలాంటి చర్యలు తీసుకోవచ్చన్న అంశంపై వీసెజ్ ఉన్నతాధికారులు కసరత్తు చేస్తున్నారు. మరోవైపు ఘటన సమయంలో ఎవరైనా కాపలా ఉన్నారా? అన్న కోణంలోనూ విచారణ జరుగుతోంది. బస్సు డ్రైవర్ విశ్వనాధం సంఘటనకు ముందు ఎవరెవరితో మాట్లాడాడు.. ఎవరిని కలిశాడో తెలిస్తే మిగిలిన నిందితుల పాత్ర కూడా నిర్ధరణ అవుతుందని భావిస్తున్నారు. సంస్థలోని సీసీ కెమెరాల్లో ఇప్పటి వరకు ఎలాంటి కీలక ఆధారాలూ లభ్యం కాలేదు. హెచ్.బి.ఎల్.సంస్థలోని సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలిస్తే మరిన్ని వివరాలు తెలిసే అవకాశం ఉందని భావిస్తున్నారు.

బాలిక మైనరా? మేజరా?

మైనరును ఎందుకు విధుల్లో నియమించుకున్నారో తెలపాలన్న వీసెజ్ ఉన్నతాధికారుల నోటీసుకు పుడా గుత్తేదారు సమాధానం ఇచ్చారు. ఆ బాలిక మైనరు కాదని, మేజరని వాదించారు. వీసెజ్‌లో మొక్కల సంరక్షణ బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఆ గుత్తేదారు ఇచ్చిన ధ్రువపత్రం విశ్వసనీయతపై అధికారులు పరిశీలన చేస్తున్నారు. ఆ పత్రం ప్రకారం ఆమె వయసు 19 సంవత్సరాలని గుత్తేదారు వాదిస్తున్నారు. ఆ బాలిక గత మూడేళ్లుగా వీసెజ్‌లో పనిచేస్తున్నట్లు ఉన్నతాధికారులు తేల్చారు.

ప్రమాదంలో మరొకరి మృతి

మత్స్యపాలెం (నాతవరం): మర్రిపాలెంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో చీడిపల్లి స్వామి (19) బుధవారం మృతిచెందినట్లు ఎస్సై జి.అశోక్ తెలిపారు. ద్విచక్ర వాహనంతో ఎల్లవరం నుంచి యర్రవరం వెళ్తూ మర్రిపాలెం వద్ద అదుపు తప్పి విద్యుత్తు స్తంభాన్ని ఢీకొట్టారన్నారు. ఈ సంఘటనలో రామకృష్ణ అక్కడికక్కడే మృతిచెందగా తీవ్రగాయాలైన స్వామి నర్సీపట్నం ప్రాంతీయ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారన్నారు. మృతదేహాలను ఎల్లవరం మధ్యాహ్నం తీసుకువచ్చారన్నారు. మండల పార్టీ అధ్యక్షులు ఎన్.వి.రమణ, సామాజిక కార్యకర్త రాజేష్ బాధిత కుటుంబాలను పరామర్శించారు.



ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన స్వామి

విద్యుదాఘాతంతో కార్మికుడి దుర్మరణం

ఉద్యోగి నిర్లక్ష్యమే కారణమంటున్న సహ కార్మికులు

ఉప్పవరం (అచ్యుతాపురం), న్యూస్‌టుడే: వ్యవసాయం కలిసి రాకపోవడంతో భార్యాపిల్లలను పోషించడానికి విద్యుత్తు కూలీగా మారాడు. అంధకారంలో ఉన్న గ్రామాలకు వెలుగులు ఇవ్వడానికి అందరితోనూ కలిసి ఆనందంగా పనిచేశాడు. అప్పటివరకు అందరితోనూ నవ్వుతూ పనిచేశాడు. సాయంత్రం అవుతుంది త్వరగా పని ముగించాలని అనుకుంటూ అంతలోనే అందరాని లోకాలకు వెళ్లిపోయాడు. ఈ సంఘటన మండలంలోని ఉప్పవరంలో విషాదాన్ని నింపింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కశింకోట మండలం చరకాం గ్రామానికి చెందిన పంచాడ అక్కునాయుడు (38) ఓ గుత్తేదారు వద్ద విద్యుత్తు కార్మికుడిగా పనిచేస్తున్నాడు. రోజూ మాదిరిగానే బుధవారం కూడా గ్రామస్థులతో కలిసి అచ్యుతాపురం మండలంలోని ఉప్పవరం గ్రామానికి విద్యుత్తు లైను మార్పు పనుల కోసం వచ్చాడు. ఉదయం నుంచి సాయంత్రం వరకు విద్యుత్తు తీగల మార్పు పనుల్లో చురుగ్గా పనిచేశాడు. అంతలోనే విద్యుదాఘాతంతో స్తంభంపై నుంచి కిందపడి మృతిచెందాడు. పనులు పర్యవేక్షణ చేస్తున్న ఉద్యోగి అతడి మృతికి కారణమని సహకార్మికులు ఆరోపించారు. అప్పటి వరకు విద్యుత్తు సరఫరా నిలుపుదల చేసిన ఉద్యోగి అక్కునాయుడు దిగకముందే అతి ఉత్సాహంతో సరఫరా పునరుద్ధరించాడని వారు ఆవేదన వ్యక్తం చేశారు. 10 నిముషాల్లో తీగల ఏర్పాటు ముగుస్తుందని, అప్పుడు సరఫరా పునరుద్ధరించాలని కోరినా పట్టించుకోలేదని చెప్పారు. అంత వరకు తమతో కలిసి పనిచేసిన తమ కళ్ల ముందే గిలగిలా కొట్టుకొని చనిపోయాడని సహ కార్మికులు విచారం వ్యక్తం చేశారు. అక్కునాయుడుకు భార్య చినతల్లి, పదేళ్ల వయస్సున్న మణికంఠ, ఏడేళ్ల వయస్సుగల సాయిలు ఉన్నారు. అందరితోనూ మంచి వ్యక్తిగత గుర్తింపు ఉన్న అక్కునాయుడు మృతితో కశింకోటలో విషాదం నెలకొంది.



మృతుడు అక్కునాయుడు (పాతచిత్రం)

చికెన్ ధరలు

బ్రాయిలర్ (బ్యాగ్) లైవ్: 95; డ్రెస్డ్: 160; స్కిన్‌లెస్: 170.
వెన్‌కాబ్: ఫారం గేటు ధర: 87; లైవ్: 109; డ్రెస్డ్: 158; స్కిన్‌లెస్: 180. (కిలో - రూపాయలలో)

మాకవరపాలెం విద్యార్థులకు అరుదైన అవకాశం

మాకవరపాలెం గ్రామీణం, న్యూస్‌టుడే : మాకవరపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అరుదైన అవకాశం లభించింది. గుజరాత్‌లోని రాజ్‌కోట్‌లో జరిగే 28వ రాష్ట్రీయ కథాషివర్ కార్యక్రమానికి విశాఖపట్నం జిల్లా నుంచి మాకవరపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జి.వెంకటాపురం ప్రాథమికోన్నత పాఠశాలలకు చెందిన 14 మంది విద్యార్థులకు ప్రభుత్వం నుంచి ఆహ్వానం అందినట్లు ప్రధానోపాధ్యాయులు డిఎస్ఎన్.రాజు తెలిపారు. ఈ విద్యార్థులకు ఉపాధ్యాయులు ఎమ్.ఎస్.వి.ఎస్.పి.వర్మ గైడ్‌గా వ్యవహరించనున్నట్లు చెప్పారు.



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

రహదారి సమస్యపై ఆగ్రహం

ఎమ్మెల్యే ఈశ్వరిని నిలదీసిన వనుగుపల్లి గిరిజనులు

పాడేరు పట్టణం, న్యూస్‌టుడే: రహదారి సమస్య పరిష్కరించాలంటూ పాడేరు మండలం వనుగుపల్లి పంచాయతీకి చెందిన గిరిజనులు బుధవారం జన్మభూమి గ్రామసభను బహిష్కరించడంతోపాటు పాడేరు ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరిని అడ్డుకుని ఆందోళనకు దిగారు. కందమామిడి కూడలి- వనుగుపల్లి రహదారి మీదుగా సుమారు 30 గ్రామాల గిరిజనులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. బుధవారం కందమామిడిలో అధికారులు జన్మభూమి గ్రామసభ ఏర్పాటు చేశారు. ఈ సభకు వస్తున్న ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరిని విశాఖపట్నం-పాడేరు ప్రధాన రహదారిపైనే అడ్డుకుని సర్పంచి పాంగి నాగరాజు ఆధ్వర్యంలో గిరిజనులు అడ్డుకున్నారు. రహదారి సమస్యపై ఎమ్మెల్యేను నిలదీశారు. ఎమ్మెల్యే సమాధానమిస్తూ నెలలో రహదారి నిర్మాణ పనులు ప్రారంభించేందుకు చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు. నాలుగు విడతల జన్మభూమి సభల్లో వినతులిచ్చినా ఫలితం లేకపోయిందని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సభను బహిష్కరించిన గిరిజనులు ప్రభుత్వానికి, అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోలీసులు ఘటన స్థలంలో చేరుకుని వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించారు. ఎమ్మెల్యే ఆందోళనకారుల నుంచి తప్పించుకుని ఆటోలో కందమామిడి గ్రామానికి మధ్యాహ్నం చేరుకుని గ్రామసభ ప్రారంభించారు. బోయ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేరుస్తూ తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా పంచాయతీ ద్వారా తీర్మానం చేసి తరవాతే సభ ప్రారంభించాలని గిరిజన సంఘం నాయకులు పాలికి లక్కు, సుందరరావు, ఎం.ఎం.శ్రీను ఆందోళన చేపట్టారు. డి.గొందూరు పంచాయతీలో జరిగిన జన్మభూమి సభలో తాగునీటి సమస్య పరిష్కరించలేదని అధికారులను కరకపుట్టు గ్రామస్థులు నిలదీశారు. మధ్యాహ్నం మినుములూరు, ఇరడాపల్లి పంచాయతీల్లో జరిగిన సభల్లో కూడా గిరిజన సంఘం నాయకులు చేరుకుని బోయ వాల్మీకులను ఎస్టీల్లో చేరుస్తూ తీసుకున్న నిర్ణయాన్ని పంచాయతీ పరిధిలో తీర్మానం చేయాలని ఆందోళన చేపట్టారు ఈ కార్యక్రమాల్లో సర్పంచులు పద్మ, సీదరి రాంబాబు, గిరిజన సంక్షేమశాఖ ఉప సంచాలకులు విజయ్‌కుమార్, ఎంపీడీఓ మధుమోహన్‌కుమార్ తదితరలు పాల్గొన్నారు.



ఆటోలో సభకు వెళ్తున్న ఎమ్మెల్యే ఈశ్వరి, జడ్పీటీసీ సభ్యురాలు నూకరత్నం

కాంగ్రెస్ పెద్దలకు సత్కార యోచన

డీసీసీ అధ్యక్షులు బాలరాజు వెల్లడి

చోడవరం పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలో కాంగ్రెసు పార్టీ సీనియర్ నాయకులందరినీ ఒకే వేదికపైకి తెచ్చి సత్కరించేందుకు జిల్లా కాంగ్రెసు కమిటీ (డీసీసీ)ఆలోచన చేసిందని మాజీ మంత్రి, డీసీసీ అధ్యక్షుడు పసుపులేటి బాలరాజు తెలిపారు. బుధవారం చోడవరం వచ్చిన ఆయన స్వాతంత్ర్య సమరయోధుడు, కాంగ్రెసువాది దేవరపల్లి సన్యాసిరావును కలిశారు. దేవరపల్లి స్వగృహానికి మాజీ మంత్రి విచ్చేసి ఆయన యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. పార్టీకి సీనియర్లు చేసిన సేవలు మరువలేనివని బాలరాజు పేర్కొన్నారు. వారిందర్నీ ఒకే చోట కలిపి సన్మానించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. దీనిలో భాగంగా జిల్లాలో ఉన్న కాంగ్రెస్ వాదులను కలుస్తున్నట్లు తెలిపారు. బాలరాజు వెంట పీసీసీ ప్రతినిధి పిన్నమనేని సతీష్‌వర్మ, మండల కాంగ్రెసు పార్టీ అధ్యక్షుడు గూనూరు వెంకటరావు, పట్టణ కాంగ్రెసు అధ్యక్షుడు మండే శ్రీను, బీసీ ప్రతినిధి మొల్లి బంగారునాయుడు, ఎంపీటీసీ సభ్యుడు ఎల్లపు కిషోర్, బొడ్డు శ్రీను తదితరులు ఉన్నారు.



స్వాతంత్ర్య సమరయోధుడు దేవరపల్లితో మాట్లాడుతున్న మాజీమంత్రి బాలరాజు



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ సూర్యారావు

7న జన్మభూమి 5కె రన్

నర్సీపట్నం, న్యూస్‌టుడే: జన్మభూమి కార్యక్రమాన్ని పురస్కరించుకొని జిల్లావ్యాప్తంగా ఈ నెల 7న అన్ని మండలాల్లో చేపట్టనున్న 5కె రన్‌ను విజయవంతం చేయాలని ఆర్డీఓ కె.సూర్యారావు కోరారు. స్థానిక రెవెన్యూ డివిజన్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం ప్రిన్సిపాళ్లు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ఆ రోజు ఉదయం 7గంటలకు నర్సీపట్నంలో ఎన్టీఆర్ మినీ స్టేడియం నుంచి పెదబొడ్డేపల్లి గురుకుల పాఠశాల వరకు చేపట్టనున్న రన్‌లో పెద్ద సంఖ్యలో విద్యార్థులు, మహిళలు పాల్గొనేలా చూడాలన్నారు. పాల్గొనే వారందరికీ టీషర్టులు, జన్మభూమి టోపీలు అందజేస్తారన్నారు. ముందు జాగ్రత్తగా ప్రథమ చికిత్సకు ఏర్పాట్లు చేయాలన్నారు. సెట్విస్ సీఈఓ వెంకటేశ్వరావు, జిల్లా క్రీడా అధికారి జూన్ గాలియేట్, ఆర్డీఓ కార్యాలయం పరిపాలనాధికారి ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

'అనుచరగణానికే ప్రభుత్వ పథకాలు'

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు వర్తింప జేయకుండా తమ అనుచరులకే ఇప్పించుకుంటున్నారని సీపీఐ ఆరోపించింది. నర్సీపట్నంలో సీపీఐ ద్వితీయ మహాసభ బుధవారం సందడిగా నిర్వహించారు. ఈ పార్టీ శ్రేణులు శ్రీకన్య కూడలి నుంచి ఎన్‌జీఓ హోం వరకు ర్యాలీ చేశారు. జిల్లా కార్యదర్శి ఎ.జె.స్టాలిన్ తదితరులు ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన సభలో పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణమూర్తి ప్రసంగిస్తూ జన్మభూమి కమిటీలు స్వార్థపూరితంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. నాయకులు బాలేపల్లి వెంకటరమణ, ఎ.విమల, రావు జగ్గారావు, మాకిరెడ్డి రామునాయుడు, డీసీహెచ్ రాజబాబు తదితరులు పాల్గొన్నారు. అనంతరం రుత్తల పెదబుజ్జిని పట్టణ సి.పి.ఐ. కార్యదర్శిగా, మరో 11 మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు.




నర్సీపట్నంలో సి.పి.ఐ. శ్రేణుల ప్రదర్శన

గిరిజనుల సమగ్ర అభివృద్ధికే ఐటీడీఏలు

పాడేరు, న్యూస్‌టుడే: గిరిజనుల సంస్కృతి, హక్కుల పరిరక్షణ, అభివృద్ధి ధ్యేయంగా ఐటీడీఏలు ఏర్పడ్డాయని పాడేరు ప్రాజెక్టు అధికారి రవిసుభాష్ పేర్కొన్నారు. చెన్నైలోని ఏషియన్ కాలేజీ ఆఫ్ జర్నలిజం కళాశాలకు చెందిన 30 మంది సభ్యులతో కూడిన విద్యార్థుల బృందం బుధవారం మన్యంలో పర్యటించింది. ఈ బృందం సభ్యులకు పాడేరు ఐటీడీఏ కార్యాలయం వద్ద పాలనాధికారి వేగి అప్పారావు, వెలుగు ఏపీఎం ప్రసాదరావు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా విద్యార్థుల బృందం బుధవారం పీఓను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఐటీడీఏ స్థాపన, ధ్యేయాలపై విద్యార్థుల బృందానికి పీవో వివరించారు. 1/70 చట్టం ప్రకారం గిరిజన ప్రాంతంలో గిరిజనేతరులకు ఎటువంటి భూమి హక్కులేదని చెప్పారు. గిరిజనులు కాఫీ వంటి వాణిజ్య పంటల ద్వారా మంచి లాభాలు కళ్లజూస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ, గిరిజన సంక్షేమశాఖ, జిల్లా పరిషత్ సంస్థల ద్వారా గిరి విద్యార్థులకు విద్య బోధన జరుగుతుందని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రత్యేక చట్టాలను అనుసరించి మాత్రమే పరిశ్రమల ఏర్పాటు జరుగుతుందని జర్నలిజం బృందం సభ్యులు అడిగిన ప్రశ్నను సమాధానంగా చెప్పారు. ఈ కార్యక్రమంలో సహ డివిజినల్ మీడియా ప్రొఫెసర్ దేవదాస్ రాజరామ్, టీవీ ప్రొఫెసర్ నిశాత్ అహ్మద్, ఐటీడీఏ మేనేజర్ సునీల్ ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

మొదటగా ఈ బృందం సభ్యులు స్థానిక ఐటీడీఏ కార్యాలయం వద్ద తమకు ఉద్యోగ భరోసా కల్పించాలని రిలే దీక్షలు చేపడుతున్న ఆరోగ్య సహాయకుల దీక్ష శిబిరాన్ని సందర్శించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా ప్రత్యేక పరిస్థితులున్న ఏజెన్సీ ప్రాంతంలో నెలకొన్న పరిస్థితులు, ఆచార వ్యవహారాలు, కట్టుబాట్లపై బృందం సభ్యులు అధ్యయనం చేయనున్నారు. గిరిజన ప్రాంతంలో వాడుకలో ఉన్న భాషలు, గిరిజన సాంప్రదాయాలు, నృత్యాలు, ఇతర కళలపై సర్వే చేసి ఈ నివేదికను కళాశాల యజమాన్యానికి ప్రాజెక్టు రిపోర్టును అందిస్తామని బృందం సభ్యులు పేర్కొంటున్నారు.



పాడేరు ఐటీడీఏ కార్యాలయంలో జర్నలిజం విద్యార్థుల బృందం

స్వచ్ఛతను పరిశీలించిన దిల్లీ బృందం



ఇందిరా మార్కెట్‌లో బృందం సభ్యుల పరిశీలన

నర్సీపట్నం, న్యూస్‌టుడే: మున్సిపాలిటీలోని స్వచ్ఛతను బుధవారం దిల్లీ బృందం పరిశీలించింది. క్వాలిటీ కంట్రోల్ ఆఫ్ ఇండియా (క్యూసీఐ) బృందానికి చెందిన క్రాంతి, నరేష్ ఇక్కడి పరిసరాలను చూశారు. వీరు ముందుగా శివపురంలోని ప్రాథమిక పాఠశాలలోని మరుగుదొడ్లను పరిశీలించారు. ఈ ప్రాంతంలో ఎక్కడా బహిరంగ మలవిసర్జన చేయడం లేదని, అక్కడి విద్యార్థుల నుంచి రాతపూర్వకంగా లేఖలు తీసుకున్నారు. ఇందిరా మార్కెట్‌లో పారిశుద్ధ్యం, మరుగుదొడ్లను పరిశీలించారు. దుకాణల వద్ద చెత్త బకెట్లు ఉన్నది లేనిది తెలుసుకున్నారు. పెదబొడ్డేపల్లిలో గతంలో బహిర్భూమి ప్రాంతంగా ఉండి ఇప్పుడు పరిశుభ్రంగా మారిన ఆ స్థలాన్ని పరిశీలించారు. వీటి ఫొటోలు తీశారు. ఎస్సీకాలనీ, రెల్లివీధి, వెంకునాయుడిపాలెం, జోగునాథునిపాలేంలలో పర్యటించిన ఈ బృందం సభ్యులు అక్కడి వారిని ప్రశ్నించారు. వీరి వెంట స్థానిక మున్సిపల్ కార్యాలయం సీనియర్ సహాయకుడు పీఎస్ఎన్ నాగరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టరు గంగరాజు, సూపర్‌వైజర్ సంతోష్ తదితరులు ఉన్నారు. జన్మభూమి కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ ఛైర్‌పర్సన్ అనిత, వైస్‌ఛైర్మన్ సన్యాసిపాత్రుడు, కమిషనరు సురేంద్రలను కూడా ఈ బృందం సభ్యులు కలిసి వివిధ అంశాలపై చర్చించారు.

అనకాపల్లి

సినిమాలు

రాజా : ఒక్క క్షణం
రామచంద్ర : 2 కంట్రీస్
శ్రీసత్యనారాయణ : హలో
శ్రీ సత్యనారాయణ స్క్రీన్2- జుమాంజి
షిర్డిసాయి : నీ ప్రేమే నా ప్రాణం
పర్తిసాయి : ఎంసీఏ
వేంకటేశ్వర : ప్రాజెక్ట్ జెడ్

బెల్లం ధరలు

అనకాపల్లి: అనకాపల్లి బెల్లం మార్కెట్‌లో బుధవారం 19,792 దిమ్మలు అమ్మకాలు చేశారు.

రకం	ధర పదికిలోలు రూ.
రంగులు	341
మధ్యరకాలు	290
నాసిరకాలు	273



ఎమ్మెల్యే పీలా
చదువుతోనే అభివృద్ధి



ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే, ఇతర అధికారులు



హాజరైన గ్రామస్థులు

అనకాపల్లి, న్యూస్‌టుడే: చదువుతోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే పీలా గోవిందసత్యనారాయణ తెలిపారు. స్థానిక వేల్పులవీధిలో 6,7,10 వార్డుల జన్మభూమి - మాఊరు కార్యక్రమం సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. ఆడపిల్లకు చదువెందుకనే భావన విడనాడాలని తెలిపారు. పేదలు విదేశాల్లో చదువుకునేందుకు ప్రభుత్వం రూ. 10 లక్షలు సహాయం అందిస్తుందని తెలిపారు. నియోజకవర్గంలో ఇంతవరకు 18 మందికి ఇలా సాయం అందివ్వగా వారిలో 12 మంది ఆడపిల్లలేనని గుర్తుచేశారు. చంద్రన్న కానుకలు, బ్రాహ్మిణ్ కోపరేటివ్ క్రెడిట్ సొసైటీ బృందాలకు మంజూరు చేసిన రుణాలను ఎమ్మెల్యే అందజేశారు. జోనల్ కమిషనర్ సుబాని అందరితో ప్రతిజ్ఞ చేయించారు. జీవీఎంసీ ఈఈ ఉదయకుమార్, బ్రాహ్మిణ్ సొసైటీ డైరెక్టరు భానుమూర్తి, ప్రణాళికా విభాగం అధికారి అమ్మాజీరావు, పేదరిక నిర్మూలన పథకం ప్రాజెక్టు డైరెక్టరు రజని, బుద్ద నాగ జగదీశ్వరరావు, బొలిశెట్టి శ్రీనివాసరావు, డాక్టరు కె. సత్యవతి, తాకాశిబాబు, డాక్టరు కె.విష్ణుమూర్తి, సురేంద్ర పాల్గొన్నారు.

ప్రొటోకాల్ పాటించాలి

జన్మభూమి సభలు తెలుగుదేశం పార్టీ కార్యక్రమాల్లా జరుగుతున్నాయంటూ పత్రికల్లో కథనాలు రావడంతో అధికారులు స్పందించారు. వేల్పులవీధిలో నిర్వహించిన సభకు అధ్యక్షత వహించిన జోనల్ కమిషనర్ సుబాని ప్రొటోకాల్ పాటించాలని కోరారు. దీంతో వేదికపై ఉన్న తెలుగుదేశం నేతలు కొందరు కిందకు దిగిపోయారు. జన్మభూమి కమిటీలను ప్రభుత్వం రద్దు చేసింది. అయితే కొత్తకమిటీలను నియమించనందున అంతవరకు తామే ఉన్నామంటూ పట్టణ జన్మభూమి కమిటీ సభ్యులు ముగ్గురు ముందు వరసలో కూర్చున్నారు. మంగళవారం వెనుకవరసలో కూర్చున్న జీవీఎంసీ ఈఈని బుధవారం నాటి సభలో ముందువరసలో కూర్చోబెట్టారు. ఎమ్మెల్యే పీలా గ్రామాల్లో నిర్వహిస్తున్న సభల్లో పాల్గొని ఆలస్యంగా వచ్చారు. ఆయన వచ్చిన తర్వాత మాత్రం కొందరు నేతలు వేదిక వెనుక కూర్చున్నారు. పార్టీ జెండాలు ఎక్కడా ఏర్పాటు చెయ్యకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.

అనకాపల్లి గ్రామీణం: 90 రోజుల్లో జన్మభూమి మా ఊరు కార్యక్రమంలో వచ్చిన ప్రతి అర్జీని పరిష్కరిస్తామని ఎమ్మెల్యే పీలాగోవింద సత్యనారాయణ పేర్కొన్నారు. ఈవోఆర్డీ అప్పలరాజు, డిప్యూటీ తహసీల్దార్ శ్రీరామ్మూర్తి ఆధ్వర్యంలో బుధవారం శంకరంలో గ్రామసభలు నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారి సూర్యచంద్రరావు మాట్లాడుతూ జన్మభూమిని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. సర్పంచి కరణం లక్ష్మీ శ్యామల, వ్యవసాయశాఖ జేడీ శివప్రసాద్, ఐసీడీఎస్ సీడీపీవో రత్నకుమారి, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

అనకాపల్లి గ్రామీణం: గ్రామసమస్యల పరిష్కారానికి జన్మభూమి చక్కటి వేదిక అని ఆర్డీవో సూర్యకళ పేర్కొన్నారు. గొలగాంలో బుధవారం జన్మభూమి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో సూర్యకళ మాట్లాడుతూ గ్రామస్థులు తమ సమస్యలపై ప్రత్యేక అర్జీ కౌంటర్‌లో దరఖాస్తు చేసుకుంటే డిజిటల్ రశీదు ఇస్తామన్నారు.

మండల ప్రత్యేక అధికారి సూర్య చంద్రరావు మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న సంక్షేమ పథకాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సర్పంచి రాంబాబు, ఎంపీటీసీ సభ్యురాలు శలపరెడ్డి దుర్గాభవాని, ఉప సర్పంచి శ్రీను, ఎంపీడీవో వెంకటరమణ అధికారులు పాల్గొన్నారు.

సోమవరం(కశింకోట): సోమవరం గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడమే ధ్యేయంగా సంక్షేమ పథకాలు అమలుచేస్తున్నట్లు శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ తెలిపారు. బుధవారం సోమవరం గ్రామంలో తహసీల్దారు కుంచె జ్ఞానవేణి, జెట్టపురెడ్డి తుని పంచాయతీ నర్సింగబిల్లి గ్రామంలో ఈవోఆర్డీ కె.ధర్మారావు ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామసభల్లో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా రూ.95లక్షలతో నిర్మించిన అంతర్గత రోడ్లు, నర్సింగబిల్లిలో రూ.15 లక్షలతో నిర్మించిన పంచాయతీ భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. సర్పంచులు గొంతిన నాగరత్నం, మజ్జి సూర్య ప్రకాశరావు, ఎంపీపీ పంచదార్ల లక్ష్మి ఉన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీవో సూర్యకళ



సోమవరంలో రహదారులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

జన్మభూమిని సద్వినియోగం చేసుకోవాలి

కొత్తూరు(అనకాపల్లి), న్యూస్‌టుడే: ప్రభుత్వం సదాశయంతో చేపట్టిన జన్మభూమి కార్యక్రమం గ్రామాభివృద్ధికి సద్వినియోగం చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆయుష్ శాఖ సంచాలకురాలు, జన్మభూమి మా ఊరు విశాఖ జిల్లా ప్రత్యేక అధికారి శోభ పేర్కొన్నారు. అనకాపల్లి మండలంలోని సత్యనారాయణపురం పంచాయతీ పరిధిలో బుధవారం జరిగిన గ్రామసభలో ఆమె పాల్గొన్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని అడ్డుకోవద్దని చెప్పారు. సభకు అధ్యక్షత వహించిన తహసీల్దార్ సత్యనారాయణ మాట్లాడుతూ దత్తత గ్రామం అయిన సత్యనారాయణపురంపై ప్రత్యేక దృష్టి పెడతానన్నారు. గర్భిణులకు సీమంతాలు, పిల్లలకు అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు. మండల తెదేపా నాయకులు కొణతాల శ్రీనివాసరావు, సర్పంచి కోరాడ నూకరత్నం, ఎంపీటీసీ సభ్యులు చొప్పా క్రాంతి సీతా రామలక్ష్మి, కర్రిమజ్జి అలివేణి, మాజీ సర్పంచి తాడి శ్రీరాములు, కార్యదర్శి అబ్రహం, ఎంఈఓ పరదేశినాయుడు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞలో ప్రత్యేక అధికారి శోభ, తహసీల్దార్

ఆటల పోటీలు

కొత్తూరు(అనకాపల్లి), న్యూస్‌టుడే: వేటజంగాలపాలెం గ్రామంలో బుధవారం పంచాయతీ పరిధిలోని పెద్దలకు ఆటల పోటీలు నిర్వహించారు. మహిళల విభాగంలో బుదిరెడ్డి వెంకటలక్ష్మి, ఉగ్గిన అచ్చియ్యమ్మ, జి.వరహాలమ్మ, పురుషుల విభాగంలో బొండా అప్పారావు, నారంశెట్టి రాములు వరుసగా బహుమతులు పొందారు. సర్పంచి పూడి చిన్నారావు, ఎంపీటీసీ గోవింద, అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పింఛనుదారులకు రుణాలు

కశింకోట, న్యూస్‌టుడ్: ప్రభుత్వ పింఛనుదారులకు రుణాలు అందజేస్తామని కశింకోట ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ ఎం.బద్రీనాథ్ తెలిపారు. అర్హులైన వారంతా రుణాల వివరాలకు తమను సంప్రదించవచ్చునని తెలిపారు. స్థానిక మండల విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో బుధవారం సంఘ అధ్యక్షుడు పాము సూర్యనారాయణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పింఛనుదార్లకు బ్యాంకు ఖాతాలో కనీస నగదు నిల్వ అవసరం లేదన్నారు. ఎఫ్‌ఆర్‌డీఐ బిల్లుపై అపోహలు అవసరం లేదన్నారు. విశ్రాంత ఉద్యోగుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా సీనియర్ పింఛనుదారులకు సంఘం తరఫున సన్మానం చేశారు. భీమిశెట్టి శ్రీనివాసరావు, గోపాలరావు, బొండా అప్పారావు, శిమ్మనపూడి ఉమామహేశ్వరరావు, ఎస్. రామారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ బద్రీనాథ్

కంటి వైద్యశిబిరాలు నిర్వహిస్తాం

స్పందనకు వందనం

అనకాపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: జన్మభూమి సభల్లో ఉచిత కంటి వైద్యశిబిరాలు తప్పనిసరిగా నిర్వహిస్తామని ఎమ్మెల్యే పీలాగోవింద సత్యనారాయణ పేర్కొన్నారు. ఈనెల 3వ తేదీన జన్మభూమి సభల్లో 'కానరాని ఉచిత కంటి వైద్యశిబిరాలు' అనే శీర్షికతో వెలువడిన కథనానికి ఆయన స్పందించారు. శంకరంలో బుధవారం జరిగిన జన్మభూమి సభలో పాల్గొనడానికి వచ్చిన ఆయన 'న్యూస్‌టుడే'తో మాట్లాడారు. ప్రస్తుతం ఎన్టీఆర్ ఆసుపత్రికి చెందిన రెండు కంటి వైద్యబృందాలు పట్టణంలో జరుగుతున్న జన్మభూమి సభల్లో ఉచితంగా కంటి వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నారన్నారు. గ్రామాల్లో జరిగే సభలకు సరిపడనంత కంటి వైద్యబృందాలు లేకపోవడం వల్ల శిబిరాలు నిర్వహించలేక పోతున్నామన్నారు. పట్టణంలో పూర్తి అవ్వగానే జన్మభూమి లోపు లేదా జనవరి చివరి నాటికి 32 పంచాయతీల పరిధిలోని గ్రామాల్లో ప్రత్యేకంగా దండోరా వేయించి కంటి వైద్యశిబిరాలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా కళ్లద్దాలు, మందులు పంపిణీ చేస్తామన్నారు.

బాలిక ఆత్మహత్యాయత్నం

కొత్తూరు(అనకాపల్లి), న్యూస్‌టుడే: అనకాపల్లి గవరపాలెం కర్రివారి వీధికి చెందిన ఆడారి హేమ(19) బుధవారం బొద్దింకల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన బంధువులు ఆమెను ఎన్టీఆర్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. హేమ ప్రేమను తల్లిదండ్రులు అంగీకరించకపోవడంతో మనస్తాపంతో ఆత్మహత్యకు యత్నించినట్లు పోలీసులు తెలిపారు.

విద్యుత్తు కార్మికుడి మృతిపై వివాదం

కొత్తూరు(అనకాపల్లి), న్యూస్‌టుడే: అచ్యుతాపురం మండలం ఉప్పవరంలో జరిగిన విద్యుత్తు ప్రమాదంలో కార్మికుడు పి.అక్కునాయుడు మృతికి అదే శాఖలో లైన్‌మెన్‌గా పనిచేస్తున్న సురేష్ కారకుడంటూ బంధువులు ఆరోపించారు. పోలీసులు చెప్పిన వివరాల ప్రకారం.. అక్కునాయుడు కశింకోట మండలం చెరకాం గ్రామస్థుడు కావడంతో గ్రామానికి వారంతా అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రికి వచ్చిన సురేష్‌పై దాడికి దిగారు. దీంతో సురేష్ ఆసుపత్రిలో రోగుల గదిలోకి పరుగెత్తాడు. అక్కడ జరిగిన ఘర్షణలో ఆసుపత్రి అద్దాలు పగిలిపోయాయి. సమాచారం మేరకు పట్టణ పోలీసులు ఆసుపత్రికి చేరుకొని ఎటువంటి గొడవలు జరగకుండా సురేష్‌ను స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తాగి వాహనం నడిపినందుకు జైలు

కొత్తూరు(అనకాపల్లి): తాగి వాహనం నడిపిన నెల్లూరుకు చెందిన షేక్ సత్తార్‌కు మూడు రోజుల జైలు, రూ.వెయ్యి అపరాధ రుసుం విధిస్తూ న్యాయమూర్తి ఎస్‌వీ రమణ గుప్తా బుధవారం తీర్పు చెప్పారని పోలీసులు తెలిపారు.

పేదలకు చీరల పంపిణీ

అనకాపల్లి, న్యూస్‌టుడే: సంక్రాంతి సందర్భంగా రామచంద్ర ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం రూ.లక్ష విలువైన చీరలు పేదలకు పంపిణీ చేశారు. స్థానిక వేల్పులవీధి కల్యాణ మండపంలో 300 మంది మహిళలకు చీరలు అందించారు. ఈ సందర్భంగా ట్రస్టు ఛైర్మన్ శరగడం శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ గత 27 ఏళ్లుగా సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. విద్యార్థులకు పుస్తకాలు, ఉపకారవేతనాలు, క్రీడాకారులకు ప్రోత్సాహకాలు అందిస్తున్నామన్నారు. పురపాలక సంఘం మాజీ ఛైర్మన్ కడ్మిశెట్టి రాంజీ, ట్రస్టు ఆర్గనైజింగ్ కార్యదర్శి పీలా నాగ శ్రీను, మళ్ల చంద్రశేఖర్, మద్దాల కూర్మారావు, దోమరౌతు రామారావు, నల్లల దేముళ్లు పాల్గొన్నారు.



పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న శ్రీరామచంద్రమూర్తి

పాడిరైతుల సంక్షేమమే ధ్యేయం

విస్సన్నపేట(కశింకోట): పాడిరైతుల సంక్షేమమే ధ్యేయంగా డెయిరీ పనిచేస్తుందని పాలసంఘం అధ్యక్షుడు సిదిరెడ్డి వెంకటరమణ అన్నారు. విస్సన్నపేట పాలఉత్పత్తి సహకార సంఘంలో బుధవారం విశాఖ డెయిరీ ఆధ్వర్యంలో 120 మంది రైతులకు రూ.2.94లక్షలు బోనస్‌గా అందజేశారు. మృతిచెందిన సంఘ సభ్యుల వారసులకు రూ.30వేల బీమా నగదు జనశ్రీ పథకం కింద అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికంగా పాలుపోసిన రైతులకు డెయిరీ ప్రోత్సాహక బహుమతులు అందజేస్తుందన్నారు. సర్పంచి సిదిరెడ్డి వెంకటేశ్వరరావు(శ్రీను), జోనల్ అధికారి నక్కా నాగేశ్వరరావు, పర్యవేక్షకులు ఎస్.రాంబాబు, మాజీ సర్పంచి గొల్లవిల్లి లక్ష్మి, సిరిపోల కొండలరావు, మండే శ్రీను, వేతన కార్యదర్శులు కె.ప్రకాశరావు, పి.బాలకృష్ణ పాల్గొన్నారు.

అనకాపల్లి

గ్రామాల్లో ఎల్ఈడీ వెలుగులు

కొత్తూరు(అనకాపల్లి), న్యూస్‌టుడే: గ్రామాల్లో విద్యుత్తు వెలుగులు ప్రసరించడం హర్షణీయమని, ఇందుకు కృషి చేసిన ప్రజాప్రతినిధులు, అధికారులను అభినందించాలని తహసీల్దార్ సత్యనారాయణ పేర్కొన్నారు. అనకాపల్లి మండలంలోని సత్యనారాయణపురం, మూలపేట గ్రామాల్లోని వేసిన ఎల్ఈడీ విద్యుత్తు దీపాలను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని అన్ని కూడళ్లలో దీపాలు ఏర్పాటు చేస్తున్నారని వివరించారు. ఏఈ వీరేంద్ర, సర్పంచి కోరాడ నూకరత్నం పాల్గొన్నారు.

మూడోవిడత రుణమాఫీ రూ.95 కోట్లు

కశింకోట, న్యూస్‌టుడే: మూడవ విడత రైతుల రుణమాఫీ రూ. 95 కోట్లు మంజూరు చేశారని వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకులు పి. శివప్రసాద్ తెలిపారు. ఇప్పటికే రూ. 65 కోట్లు విడుదల చేసినట్లు ఆయన తెలిపారు. ఇంకా రూ. 30 కోట్లు విడుదల కావాల్సి ఉందన్నారు. బుధవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ జిల్లాలో మూడు విడతలుగా మొత్తం రూ. 638 కోట్లు మంజూరయ్యాయని వివరించారు. రబీ సమయంలో సూక్ష్మ పోషక ఎరువుల కింద జింక్ సల్ఫేట్, జిప్సమ్ నూరుశాతం రాయితీపై 224 టన్నులు పంపిణీ చేస్తున్నామన్నారు. వేరుశనగ, పెసలు, మినుములు, నువ్వులు 230 క్వింటాళ్లు రాయితీపై రైతులకు అందజేస్తామన్నారు. చంద్రన్న రైతు రథం కింద జిల్లాకు రూ. 12.5 కోట్ల విలువ కలిగిన 700 ట్రాక్టర్లు మంజూరుకాగా నియోజకవర్గానికి 66 ట్రాక్టర్ల చొప్పున కేటాయించినట్లు ఆయన వివరించారు.



వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకులు శివప్రసాద్

కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

అనకాపల్లి గ్రామీణం: విద్యుత్తుశాఖ కాంట్రాక్టు కార్మికులు అందర్నీ రెగ్యులర్ చేయాలని ఆంధ్రప్రదేశ్ విద్యుత్తు కాంట్రాక్టు కార్మికుల ఐక్యవేదిక అనకాపల్లి డివిజన్ అధ్యక్షుడు ఎల్. నూకరాజు డిమాండ్ చేశారు. ఈమేరకు గవరపాలెం విద్యుత్తుశాఖ కార్యాలయంలో సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన తెలిపి డీఈకి వినతిపత్రం అందజేశారు. మీటర్ రీడర్ యూనియన్ బి. శ్రీను మాట్లాడుతూ విధినిర్వహణలో ప్రమాదవశాత్తూ కార్మికులు మరణిస్తే 20 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు.



డీఈకి వినతిపత్రం ఇస్తున్న కాంట్రాక్టు విద్యుత్తు ఉద్యోగులు

ఉపాధ్యాయురాలికి సత్కారం

కొత్తూరు(అనకాపల్లి): కూండ్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలుగా పదవీ విరమణ పొందిన విజయ వికాసిని సత్కార కార్యక్రమం బుధవారం జరిగింది. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ శాసన మండలి సభ్యుడు గాదె శ్రీనివాసులు నాయుడు, ఎమ్మెల్యే గోవింద సత్యనారాయణ, పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బుద్ద కాశీ విశ్వేశ్వరరావు, ప్రధానోపాధ్యాయుడు ఎం. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం

అనకాపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం పొందవచ్చని ట్రాఫిక్ సీ.ఐ కె. శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఎన్టీఆర్ క్రీడా మైదానంలో మాజీమంత్రి కొణతాల రామకృష్ణ జన్మదిన వేడుకలు పురస్కరించుకొని పలకా రవి ఎడ్యుకేషనల్ ట్రస్టు ఆధ్వర్యంలో జిల్లాస్థాయి కొణతాల కప్ క్రికెట్ పోటీలు జరుగుతున్నాయి. బుధవారం జరిగిన సెమీఫైనల్ పోటీల్లో ట్రాఫిక్ సీ.ఐ కె. శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా పాల్గొని తిలకించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. కొత్తవలస ఎమ్.యూ టీమ్ మెంబర్ దుర్గాకు సెమీఫైనల్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందించారు. గురువారం ఫైనల్ పోటీలు జరుగుతాయని ట్రస్టు ఛైర్మన్ పలకా రవి తెలిపారు. సాయంత్రం 5 గంటలకు కొణతాల రఘునాథ్ చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. నిర్వాహకులు ఉగ్గిన శ్రీను, నాగార్జున, అర్జు, అప్పలరాజు పాల్గొన్నారు.



మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందిస్తున్న ట్రాఫిక్ సీ.ఐ శ్రీనివాసరావు

ఇద్దరు ఉపాధ్యాయులకు పురస్కారాలు

అనకాపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: సావిత్రిబాయి పూలే జయంతి పురస్కరించుకొని విశాఖపట్నంలోని పౌర గ్రంథాలయంలో సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషనల్ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించి వేడుకల్లో మండలంలోని ఇద్దరు ఉపాధ్యాయులకు ఉత్తమ సేవా పతకాలు వరించాయి. ఎరుకువానిపాలెం ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వై. రాంబాబు, శంకరం ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాంప్రసాద్‌కు ఉపాధ్యాయ వృత్తిలో చేపట్టిన సేవలకుగాను ట్రస్టు ఛైర్మన్ గూనూరు సీతామహాలక్ష్మి, ప్రతినిధులు ముఖ్య అతిథులు సావిత్రిబాయి పూలే ఉత్తమ సేవా పురస్కారాలు అందించి సత్కరించారు.

అనకాపల్లి గ్రామీణం: సావిత్రిబాయి పూలే ఆశయసాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల ఐక్య పోరాట వేదిక అధ్యక్షుడు బోని గణేష్ పేర్కొన్నారు. పట్టణంలోని రామచంద్ర థియేటర్ సమీపంలోని కార్యాలయంలో బుధవారం సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. మైలపల్లి పోతురాజు, ఎల్. శ్రీనివాసరావు, బహుజన సమాజ్‌వాదీ పార్టీ నాయకులు సూదికొండల మాణిక్యాలరావు, సంజీవరావు, కె.వి. సత్యనారాయణ, మైలపల్లి అప్పలనరసింహం, నాగరాజు పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

అనకాపల్లి: మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ జన్మదిన సందర్భంగా గురువారం రక్తదాన శిబిరం, పేదలకు చీరలు, బియ్యం పంపిణీ కార్యక్రమాలు ఏర్పాటు చేశామని మాజీ కౌన్సిలర్ పీలా నాగశ్రీను ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక రింగ్‌రోడ్డులోని మార్కెట్ యార్డు ఎదురుగా ఉన్న కొణతాల క్యాంప్ కార్యాలయంలో ఉదయం 9 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.

కొత్తూరు(అనకాపల్లి): సత్యనారాయణపురంలో గురువారం ఎల్‌వీ ప్రసాద్ కంటి వైద్యాలయం ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య పరీక్షల శిబిరం జరుగుతుందని ఎన్ఎస్ఎస్ పథక అధికారి డాక్టర్ వాసుదేవరావు తెలిపారు. శిబిరంలో ఉచితంగా పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఆపరేషన్లకు కూడా ఎంపిక చేస్తారన్నారు.

CLASSIFIEDS

REAL ESTATE

FLAT FOR SALE

3 BHK Apartment Flats available for Sale at Sheelanagar Cost per Sft.: 2500/- Cont: 9494166863, 0891-2574666.

JOBS

Job Supported Meidcal Coding & CPC Training @ Joshi Medicode, Visakhapatnam, Ph: 9032795333, www.joshimedicode.com

సూపర్‌వైజర్స్ కావలెను. ప్రభుత్వరంగ సంస్థ కాంట్రాక్టర్ వద్ద లైట్ వెహికిల్స్ (కార్స్) మెయింటెనెన్స్ చూసుకొనుటకు అనుభవం గలవారు కావలెను. ఆకర్షణీయమైన జీతం. ✆ 99121 26115.

కారు డ్రైవర్స్ కావలెను. ప్రభుత్వరంగ సంస్థ కాంట్రాక్టర్ వద్ద పనిచేయుటకు మంచి నడవడిక + LMV లైసెన్స్ + బాడ్జి కలిగిన డ్రైవర్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం. ✆ 99121 26115.

AUTOMOTIVE

VEHICLES WANTED

Wanted Tata Indica, Tata Indigo, Swift D-Zire for Dry Lease ✆ 9494467595, 7702011223.

BUSINESS SERVICES

WANTED DEALERS/AGENTS

ప్రముఖ టెలిమార్కెటింగ్ కొరకు డీలర్స్ డిస్ట్రిబ్యూటర్స్ కావలెను. Franchise కొరకు సంప్రదించండి. 8142657223, 040 38163916.

BUSINESS OFFER

Wanted Independent Business Associates to do Part / Full Time work in wellness Industry to make Extra Income. Age 25+ ✆ 7842176975.

R.K.లక్ష్మీబాలజి పేపర్ ప్రొడక్ట్స్. J.K.K. రాజు మా వద్ద పేపర్ ప్లేట్స్, టేబుల్ రోల్స్, బఫే ప్లేట్స్, డిస్పోజిబుల్ ఐటమ్స్, రా మెటీరియల్, మిషనరీ లభించును. 92467 48697, 08821-224631.

హోల్‌సేల్ వస్త్రవ్యాపారులకు మావద్ద ఆల్ శారీస్, డ్రస్‌మెటీరియల్స్, షూటింగ్ షర్టింగ్స్ మ్యాన్‌ఫ్యాక్చరింగ్ కాస్ట్‌కు లభించును. Hyd: 7095930991/ 9121017798/ E/G ద్వారపూడి: 7337530469

థర్మాకోల్ & పేపర్‌ప్లేట్స్, టీ కప్స్, అగరబత్తి తయారీ మెషిన్లు & రా మెటీరియల్ కలవు. నె॥ 20 వేలు ఆ॥, బై బ్యాక్ అగ్రిమెంట్, (నో ఛార్జెస్). స్కై ఇంజినీరింగ్, వైజాగ్ - 77940 62711.

గొప్ప బిజినెస్ ఆఫర్: చాయ్‌బాబు చాయ్ కంపెనీకి డిస్ట్రిబ్యూటర్స్ & టీ స్టాల్స్ కొరకు సంప్రదించండి. ★ అమలాపురం మరియు విశాఖపట్నం. Contact: 90141 42345.

HEALTH CARE

బొల్లి, తెల్లమచ్చలు, సోరియాసిస్‌లకు ఎటువంటి పత్యంలేని చికిత్స కలదు. మందులు ఉచితముగా ఇవ్వబడును. సంప్ర॥ 79953 92747, 96030 55647.

మద్యపానం మానేయడం ఎలా? బరువు పెరగడానికి/ తగ్గడానికి, జాయింట్ పెయిన్స్‌కు విశాఖపట్నం: హోటల్ దాక్షాయని, చావులమదుం జంక్షన్, స్టేషన్ రోడ్, ప్రతీనెల 5, 19 తేదీల్లో మందులు.

HYPNOTISM

పరీక్షల భయమా! ఆలోచనలా! ఏకాగ్రత లేదా! చదివినా గుర్తుండదా! నిద్రలేమి మానసిక సమస్యలా! టెన్షన్, గుండె దడలతో సమస్యా, కాళ్లు చేతులు వణుకులు, చెడు అలవాట్లా ✆ 9440186589.

HOME NEEDS

PEST CONTROL

No Smell, No Polution Genuine & Safe. Govt. Licenced Spl. in Termite & Cockroach Coastal Pest Control. Ph: 0891-6532121, 8121219307.

Pest Masters India (Bayer Network Partner & ISI Certified) Call: 9866544868 for Pest Control Services (Termite, Cockroach etc.).

Hari Pestcontrol: White Ants, Cockroaches, Rats, Lizards, Spider for Old & New Buildgs, Aptmt Services ✆ 9000253382, 9010001239.

PROFESSIONAL SERVICES

ASTROLOGY

శ్రీసాయిదుర్గా జ్యోతిష్యాలయం విద్యా, ఉద్యోగ, వ్యాపార, పెళ్లి, ప్రేమ, శత్రుపీడ స్త్రీ-పురుష ఎటువంటి సమస్యలకైనా పరిష్కారముకు సం॥ కొత్తగాజువాక. 7702201190.

PEOPLE CARE

OLD AGE HOME

Elder's Home Medical & 24 Hrs Nursecare, Beside Attenders, Home care Services & Physiotherapy @ Rly. New Colony, Gajuwaka. ✆ 8790449799.

SVS Old age Home, VZM. భోజన వసతి, 1st AID వైద్యం మంచం పట్టినవారిని కూడా వైద్యం చేయబడును. హోమ్ కేర్ సదుపాయం కలదు. 9440435006.

మదర్ & ఫాదర్ ఓల్డేజ్‌హోం & హోంనర్సింగ్ సర్వీసెస్ గురుద్వార జంక్షన్ వద్దవున్న మా ఓల్డేజ్‌హోంలో డాక్టర్ల పర్యవేక్షణలో వృద్ధులకు, బెడ్ పేషెంట్లకు ఆశ్రమ సేవలు & మీ ఇంటివద్దకే నర్సింగ్ సేవలు. ✆ 7794948777.

మన గాజువాకలో గల సిటీఓల్డేజ్ హోంలో వృద్ధులకు, బెడ్ పేషెంట్స్‌కు మంచి వాతావరణంలో రుచికరమైన భో॥ 24 గం॥, డా॥ నర్సింగ్, ఆయా సేవలు మా హోంనందు అందించబడును. 7,000 నుండి మొదలు. ✆ 9100817761/ 62

REAL ESTATE

FLAT FOR SALE

3 BHK Flat 2270 Sft. N/F & S/F at Plot No.36 Doctors Colony, Seethammadhara. Ready to Start. Contact: 9866611179 / 9640755318.

2 BHK 1025 Sft 3rd Floor Gitam College Main Road, Lift, Car Parking, Yendada. ✆ 8099920300.

100% Bank Loan Buy New Apartment with 0% Down Payment & Registration Charges Free as special offer. ✆ 9703400023/ 27.

HOUSE FOR SALE

House with VUDA LP No. Construction Cost per Sft. Rs. 1499/- Plots Avl 90, 167, 180, 200, 267 Sq.Yds. (1) Near Vizag City at "Y" Jn., Near IIM Dorathota Bheemili Road (2) Atchutapuram (3) Pendurthi. In Gated Community. 65% Bank Loan. Venugopal, Director, Diamond Home Projects. 7995881655.

Independent House 3 Floors 100 Sq.Yds North Facing at BVK College Backside Road, Dwarakanagar, Vizag. ✆ 7995106813.

Commercial Plot 450 Sq.yds. G+1, 2 Floors old House Sale. At Ramatalkies North 40' Road size 51x80 Venugopal ✆ 7995881655.

LAND FOR SALE

3 Acres Land for Sale at Bheemili, Ready to Construct 267 Yds VUDA Plot for Sale at Satya Kalyani, Layout. ✆ 99894 58845.

PLOT FOR SALE

Ready for Construction in VUDA Site NH-5 Facing at Bhogapuram beside Bank & Hotels Contact: 73862 97555.

VUDA LP No Plots At SONTYAM Highway & Gandigundam. Price Starts From 6.95 Lac. Loans Available. ✆ 8639273289

Own Plot Nr. AP Model School Kothavalasa 200 Syds W/F in gated community, well developed. ✆ 8367626789, 9948955788.

At Revidi Near Oakridge International School N/r New Airport Bhogapuram 500 Sq.Yds. Vacant Plot approved layout. 9618665992.

విజయనగరం కలెక్టర్ ఆఫీస్ దగ్గర 1250చ॥గ॥ Vuda ప్లాట్ E/N/W కార్నర్, అర్జెంట్ సేల్ ఓన్లీ డైరెక్ట్ పార్టీస్ @ Sq.yd. 5000/- ✆ 9052445644.

సిరివెంకటేశ్వరవారి VUDA ప్లాట్లు @ ఆనందపురం, భీమిలి, తగరపువలస, భోగాపురం, దాకమర్రి, అచ్యుతాపురం స్పాట్ రిజి॥ ✆ 9246667272, 9246267272.

తగరపువలసకు 1KMలో అతితక్కువ ధరలో ఉడా ప్లాట్స్ కలవు. చ॥గ॥ 8,500/- మాత్రమే. Contact: 7032776515.

కొత్తవలస టౌన్ పరిధిలో తక్షణమే ఇల్లు కట్టుకొనే ఫెసిలిటీతో బిల్డింగ్‌లకు ఆనుకొని రైల్వేస్టేషన్ దగ్గర్లో 30 ఫీట్ రోడ్స్‌తో స్థలం చ॥గ॥ 2900/-కే ✆ 9059334789.

విశాఖజిల్లాలో విలేజ్ ఆనుకొని 30 ఫీట్‌రోడ్స్, కన్వర్షన్‌తో, మార్కెట్, బస్‌స్టాప్, వెంటనే ఇల్లు కట్టుకొనే ఫెసిలిటీతో ఒక్కొక్క Bit 500 చ॥గ॥. చ॥గ॥ 1200/-కే. 9618885533.

వంటింటి ఆదాయంతో సొంత ఇంటి స్థలం. సులభ వాయిదాల పద్ధతిలో స్థలం పొందండి. 3 రకాల లాభాలు పొందండి. వెంటనే సంప్ర:- ✆ 7997481081.

కొత్తవలసలో గోల్డ్‌స్టార్ జంక్షన్ దగ్గర ప్లాట్స్ అమ్మకమునకు సిద్ధముగా యున్నవి. (ప్లాట్స్ రోడ్డుకు ఆనుకొని యున్నవి). Cont.: 6281962575, 6281950265 (No Mediators).

REPAIRS

TV REPAIR

9989962939 TV రిపేరా? 1 ఫోన్ కాల్‌తో మీ ఇంటి వద్దనే Ex-Enggచే TV, LED, LCD, A/C, ఫ్రిజ్, వాషింగ్‌మెషిన్స్ స్పాట్ రిపేరు. (25 సం॥లు సంస్థ) 5 Yrs వారంటీ. చార్జీ 49/-. SS ఎలక్ట్రానిక్స్.

JOBS

Wanted Telecallers (Female) & Male Executives for Airtel - Srinagar - Gajuwaka Freshers also apply. 9100056780 / 81.

Wanted Exp. Salesman for Men's Wear Showroom (Experience Compulsory) Modern Point, Dwarakanagar, Vizag. Cont: 7995880376.

Grow- better sKills and better Jobs looking for a Job? We Offer training and employment with reputed Companies. Ph: 7337550603. @ Anakapalli.

Part/Fulltime Jobs Online Promotion for all Students, Employees, Housewifes for a Free Demo & Training. Tech Media. ✆ 72074 14075.

Req Civil Eng(JR/SR) with 2 to 15 yrs Exp To work in Railway BGLINE Project. ✆ 82973 13335. E-mail:irpinfratech@yahoo.in.

Wanted Marketing Executives & field officers, 2 wheeler must, Good Salary Cont: M.J.S college, NAD Ph no: 7331175611

Wanted Receptionist (F) in Logos Educational Institute. Qlf.: Any Degree Address Opp: Swarna Bharathi Indoor Stadium, Resapuvanipalem, VSP. ✆ 9246638222.

Excellent Career Opportunities for Denties in Gadam Dental. Eligible candidates will get Good Remuneration, Accommodation preference for Couple. Dentists. ✆ 9490399902.

Wanted: Urgent Office Staff 2 No's (Female only) Languages: Hindi & Telugu, Sal: 8000/- to 10,000/-+ T.A. Ph: 9706618915.

Required 10th/ ITI/ Diploma. Salary: 6000 to 7000 Marine Corporation Of India, Rajavari Street, VSP. ✆ 9490671085.

Wanted Personal Assistant (M) for Male MBA Student for Motivation & Helpings at Seethammadhara. ✆ 8247429749, 9866914254.

Experienced & Trained Lady Teachers to Teach English, Social Studies & Telugu for Mid School Candidates who have studied in English Medium Schools only need apply Olivet School, Ph: 2569859.

Wanted Female Telecallers with 6 months exp. to recover Bank loans by doing Telecalling. Walk-in: Padmalaya Solutions, Lalithanagar. ✆ 2703889.

Wanted Sales Managers for MNC Insurance Company Male / Female any Degree. Salary 15K-25K ✆ 9652558993 / 9848158215.

Amruta's 6teen to 6t wanted experienced qualified Hair Stylist n Beautician & House keeping for a family salon. C: 9640662999.

హైదరాబాద్‌లోని ఇళ్ళల్లో 24 గం.లు వృద్ధులకు సేవచేయడాన్కి, పిల్లలను చూసోవడాన్కి 100 మంది ఆడ/మగవారు కావలెను. జీతం:10 వేలు. భోజనం+వసతి ఫ్రీ. ✆ 7032025222

ప్రముఖ స్వీట్‌షాప్ హౌస్‌కీపింగ్‌లో సెక్యూరిటీగా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతం: 8000/- Ph: 8106532652.

రాంబిల్లిలో ఎలక్ట్రికల్ & మెకానికల్ వర్క్స్ పనిచేయుటకు ITI మరియు డిప్లొమా (EEE & MEC) చదివి 0-1 Yr. అనుభవంగలవారు కావలెను. ✆ 90591 32562.

మీ ప్రస్తుత ఉద్యోగానికి/చదువులకు ఎలాంటి ఆటంకం లేకుండా ప్రముఖ కార్పోరేట్ కంపెనీతో పార్ట్/ఫుల్ టైం వర్క్‌చేస్తూ మంచి ఆదాయం సంపాదిస్తూ మీ కలల్ని సాకారం చేసుకొనే గొప్ప అవకాశం. ✆ 7702607920.

Airtel పోస్టుపెయిడ్ కోసం పనిచేయుటకు టెలికాలర్స్ (F) కావలెను. అర్హత: ఇంటర్ & above. మచి జీతం+ ఇన్సెంటివ్. రైల్వే కాలనీ. ✆ 89788 32668, 70953 60313.

ఉచిత శిక్షణ నిరుద్యోగ యువతీ యువకులకు Hardware & Retail కోర్సుల్లో ఉచిత శిక్షణ మరియు ఉపాధి అవకాశం. ✆ 96424 34570, 95733 44477.

అవకాశాలు కోసం ఎదురుచూస్తున్న వారికి ఒక కంపెనిలో పార్ట్/ఫుల్ టైం వర్క్ చేసుకునే అద్భుత అవకాశం Q: డిగ్రీ, ఏజ్: 24+ ✆ 9849170937

కార్గో సర్వీసెస్‌లో పనిచేయుటకు లోడర్స్, టెల్లర్స్, ప్యాకింగ్ బాయిస్, సెక్షన్ సూపర్‌వైజర్స్ (స్త్రీ/పు) కావలెను. జీతం: రూ. 14000 - 19000/- Age: 18-35 లోపు. ✆ 95423 73962, 95423 27384.

బ్యాడ్జి నెంబర్ కల్గిన డ్రైవర్స్ కావలెను. రోజుకు రూ॥ 1200/- + వసతి కలదు. లక్ష్మి టెక్నాలజిస్, వనస్థలిపురం, Hyd. ✆ 7997977267.

విశాఖ సిటీలో కార్పొరేట్ స్కూల్స్‌లో పనిచేయుటకు ఇంగ్లీష్ (25 వేలు P.M), కెమిస్ట్రీ (50 వేలు P.M) Faculty కావలెను. Cont: Xperthrd Consultants, 9533342719, 9912342719

సెక్యూరిటీ మార్కెటింగ్‌లో 2సం॥ల అనుభవం, విశాఖపట్నంలో పనిచేయాలి. ఏదైనా డిగ్రీ, స్వంత వాహనం, మంచి జీతం, అలవెన్సులు, మొబైల్ సౌకర్యం, ఇన్సెంటీవ్‌లు పొందవచ్చు. సురభి సెక్యూరిటీ సర్వీసెస్, విశాఖపట్నం ✆ 7995599940

కంప్లీట్ DTP, ఫొటోషాప్ డిజైనింగ్ ప్రాక్టికల్ ట్రైనింగ్ ఇచ్చి వెంటనే మా ద్వారా ఖచ్చితమైన జాబ్ అసిస్టెన్స్ ఇవ్వబడును (M/F) శాలరీ: 10-15 వేలు. Q: 10th పాస్ / ఫెయిల్ ✆ 7286849692.

వైజాగ్ ప్రైవేట్ బ్యాంక్ క్లర్క్, టెలికాలర్స్, కంప్యూటర్ ఆపరేటర్స్, ఎగ్జిక్యూటివ్స్, BDM, CRM కావలెను. ఫాస్ట్‌ట్రాక్ సర్వీసెస్. ఫోన్: 81210 08736.

ఉద్యోగం లేదని చింతించకండి. Animation, డేటా ఎంట్రీ, హార్డ్‌వేర్ నెట్ వర్కింగ్, రిటైల్ సేల్స్‌ల్లో ఉచిత శిక్షణ, ఉచిత ఉపాధి కల్పించబడును. ✆ 9618812967, 7702877622.

ప్రముఖ SFC సంస్థ నందు పనిచేయుటకు MBA, B.Tech., Dip., Degree / Inter చదివిన యువతీ, యువకులు కావలెను. జీ॥ 8K - 12K + వసతి. ✆ 8885494368, 7036139196.

బ్యాడ్జి మరియు అనుభవం ఉన్న డ్రైవర్లు మా స్కూల్ బస్ నడుపుటకు కావలెను. జీ॥ 9000 + వసతి / బస్‌పాస్ సదుపాయం. ✆ 7386442990 / 9291671692 / 7396999968.

SBI Lifeలో సేల్స్ ఆఫీసర్స్ M/F కావలెను. 10th+ & Govt. & Pvt. Rtd. ఎంప్లాయిస్, H.వైఫ్స్, బిజినెస్ పర్సన్స్, Ex. సర్వీస్‌మెన్స్ పాన్‌కార్డుతో సం॥ P.M. 10-30K. 9247225447.

ప్రముఖ హోర్డింగ్ సంస్థకు జిల్లాలవారిగా సూపర్‌వైజర్స్, అటెండర్స్, మేనేజర్స్ 10th to MBA, ఐటిఐ (ఆల్‌బ్రాంచ్) (ఫుడ్ + వసతి) జీ॥ 8K to 20K. ✆ 7032226195 / 7036139196.

డ్రైవరు కావలెను. మా వద్ద ఉంటూ పనిచేయుటకు అనుభవం గల ఇన్నోవా డ్రైవరు కావలెను. Ph: 8919186364, 7386846110.

భారత ప్రముఖ సంస్థ Exide Life నందు డెవలప్‌మెంట్ ఆఫీసర్‌గా పనిచేయుటకు ఉద్యోగావకాశం. గమనిక: 25సం॥పై వయస్సు, డిగ్రీ అర్హత & 1సం॥ కనీస అనుభవం సంప్ర॥ ✆ 9849166788.

ISO సర్టిఫైడ్ కంపెనీ MVP బ్రాంచ్‌కి Asst. General Manager కావలెను. జీతం+ ఇన్సెంటివ్స్ ఇవ్వబడును. రిటైర్డ్ పర్సన్స్ & గృహిణులు కూడా అర్హులు. Age: 35 yrs. ఆపైన 2 వీలర్ ఉన్నవారికి ఏదైనా డిగ్రీ కల్గివుండాలి. Peela Subramanyam ✆ 9948441497.

TOURS & TRAVELS

గోవా, కర్ణాటక 20 క్షేత్రాల యాత్ర జనవరి 19న జనవరి 29న శిరిడి+ 5 జ్యోతిర్లింగాలతో 21 క్షేత్రాలు, శివరాత్రికి రామేశ్వరం+ 30 క్షే॥ ఫిబ్రవరి 7న. ✆ 98662 46466.

14 రో॥ నేపాల్- ముక్తినాథ్ యాత్ర. ఖాట్మాండ్, ముక్తినాథ్, జనక్‌పూర్, లుంబిని, పోక్రా, మనోకామ్న, కాశీ తే. 27.03.18 Rs @ 15,999/- పసుపతినాథ్ ట్రావెల్స్. ✆ 96767 43487.

18 రో॥ అమర్‌నాథ్ & పంచకన్యకలు యాత్ర అమృత్‌సర్, వైష్ణవిదేవి జమ్ము, నైనాదేవి, చింతపూర్ణి, కాగ్డా వజ్రేశ్వరి, జ్వాలాముఖి, చాముండా, ధర్మశాల రైల్లో యాత్ర తేది: 27-07-18 అన్ని ఖర్చులతో మనిషి ఒక్కరికి 22,999/- Shree Rajesh Travels Vizag. 9347559136, 9963186928.

భద్రాచలం- గోదావరినదిపై బోటుయాత్ర * 2 రో॥ * 15/01 రాత్రి * పాపికొండలు * పేరంటాలపల్లి * పోచారం * పర్ణశాల * ద్వారకాతిరుమల * మద్ది ఆంజనేయస్వామి * భువనేశ్వరి ట్రావెల్స్. ✆ 98496 56525/ 98669 55238.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

గ్రామసభ నిర్వహణ భేష్

కశింకోట, న్యూస్‌టుడే: ప్రభుత్వ నిబంధనలు అనుసరించి నిర్వహించిన జన్మభూమి-మాఊరు నిర్వహణలో గురువుభీమవరం పంచాయతీ రాష్ట్రంలో మొదటి పది పంచాయతీల్లో స్థానం దక్కించుకుంది. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఈ విషయాన్ని వెల్లడించారు. తహసీల్దారు కుంచె జ్ఞానవేణి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ గ్రామసభలో నిబంధనల ప్రకారం సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటలు, వ్యాసరచన, ముగ్గుల పోటీలు, వైద్యశిబిరాలు, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు, పౌష్టికాహారం తదితర కార్యక్రమాలు నిర్వహించడం వలన టాప్ టెన్‌లో నిలిచింది. రాష్ట్రంలో 13 వేల పంచాయతీల్లో గ్రామం మొదటి పది స్థానాల్లో ఉండటంపట్ల అధికారులు సర్వత్రా హర్షం వ్యక్తం చేశారు.

డిమాండ్‌కు అనుగుణంగా నీటి విడుదల

సీలేరు, న్యూస్‌టుడే: జలవనరుల శాఖ డిమాండ్ మేరకు గోదావరి డెల్టాకు సీలేరు నుంచి నీరు విడుదల చేస్తున్నామని ఏపీ జెన్‌కో ఈఈ వి.ఎల్.రమేష్ తెలిపారు. బుధవారం సీలేరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. రోజువారీ అవసరమైన నీటి లభ్యతపై సమీక్షిస్తూ నీటిని విడుదల చేస్తున్నామని చెప్పారు. ఇందులో భాగంగా విద్యుదుత్పత్తి అనంతరం 4500 క్యూసెక్కులు, డొంకరాయి జలాశయం ద్వారా 2500 క్యూసెక్కులు గోదావరి డెల్టాకు విడుదల చేస్తున్నామని పేర్కొన్నారు.



జెన్‌కో ఈఈ రమేష్

గత ఏడాది డిసెంబరు 1 నుంచి నీరు విడుదల చేస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు విద్యుదుత్పత్తి అనంతరం 1,22,397 టీఎంసీలు, జలాశయం నుంచి నేరుగా 34,272 టీఎంసీల చొప్పున మొత్తం 1,56,669 టీఎంసీలు విడుదల చేశామని తెలిపారు. ప్రస్తుతం మన వాటాగా బలిమెలతో పాటు డొంకరాయిలో 315 టీఎంసీల నీరు ఉందని, పొదుపుగా వినియోగించుకోగలిగితే మార్చి 31 వరకు నిరభ్యంతరంగా గోదావరి డెల్టాకు విడుదల చెయ్యవచ్చని పేర్కొన్నారు. జనవరి 5 నుంచి వంతుల వారీగా నీరు విడుదల చేసే అవకాశం ఉందన్నారు.

సీఎం సభకు భారీ ఏర్పాట్లు

★ పర్యవేక్షించిన మంత్రి అయ్యన్నపాత్రుడు

★ ధర్మసాగరంలో వేర్వేరుగా సభలు



ఏర్పాట్లపై చర్చిస్తున్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ

ధర్మసాగరం (నర్సీపట్నం గ్రామీణం), న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ నెల 5న నర్సీపట్నం మండలం ధర్మసాగరం పర్యటన ఖరారు కావడంతో ఒక్కసారిగా సందడి మొదలైంది. జిల్లా అధికారులంతా సభ ఏర్పాట్లలో మునిగిపోయారు. మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు సాయంత్రం ఈ గ్రామాన్ని సందర్శించి ఏర్పాట్లను పర్యవేక్షించారు. సి.ఎం. హెలిపాడ్ దిగిన దగ్గర నుంచి స్టాల్స్ ప్రదర్శన, గ్రామసభకు ఎంపిక చేసిన రావిచెట్టు ప్రదేశం, బహిరంగ సభ స్థలం తదితరాలను పరిశీలించి డి.ఆర్.డి.ఎ. పి.డి. సత్యసాయి శ్రీనివాస్‌కు పలు సూచనలు చేశారు. వినూత్నంగా ఊరి మధ్యలోని రచ్చబండ వంటి రావిచెట్టు చప్టా వద్ద గ్రామసభ నిర్వహిస్తుండడంతో ఈ చెట్టును విభిన్నంగా చూపాలని మంత్రి సూచించారు . చెట్టు మొదట జన్మభూమి లోగో అమర్చాలన్నారు. ముఖ్యమంత్రి రోడ్డు నుంచి నడుచుకుంటూ స్టాల్స్ సందర్శించేలా ఏర్పాట్లు చేయాలన్నారు. గ్రామసభ వద్ద దాదాపు వెయ్యి మంది కూర్చునేలా కుర్చీలు వేస్తున్నట్టు పీడీ సత్యసాయి శ్రీనివాస్ తెలిపారు. ఈ పరిశీలనలో ఈ గ్రామాన్ని దత్తత తీసుకున్న మంత్రి సతీమణి పద్మావతి, మండలాధ్యక్షురాలు సుకల రమణమ్మ, ఆర్అండ్‌బీ ఎస్ఈ సీఎస్ఎన్ మూర్తి, డ్వామా పీడీ కళ్యాణ చక్రవర్తి, డీఎల్‌పీఓ శిరీష తదితరులు పాల్గొన్నారు. అనంతరం మంత్రి ఆర్డీఓ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించిసీఎం పర్యటనను విజయవంతం చేయాలని కోరారు.

పెదబొడ్డేపల్లి కూడలి నుంచి ధర్మసాగరం వరకు అవసరమైన చోట రోడ్డు మరమ్మతులు చేపట్టారు. విద్యుత్తు లైన్లు, వీధిదీపాలు సరిచేస్తున్నారు. ఊరంతా శుభ్రం చేయిస్తున్నారు. పోలీసు బలగాలు ధర్మసాగరం చేరుకుంటున్నాయి. హెలిపాడ్ వద్ద ఇప్పటికే బందోబస్తు ఏర్పాటు చేశారు.



గ్రామసభ నిర్వహించేది ఈ రావిచెట్టు కిందనే..

ఉన్నతాధికారుల సందర్శన

సీఎం పర్యటన నేపథ్యంలో కలెక్టర్ ప్రవీణ్ కుమార్, జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ బుధవారం ధర్మసాగరం గ్రామాన్ని సందర్శించారు. వివిధ ప్రదేశాలు పరిశీలించిన అనంతరం గ్రామసభను గ్రామ మధ్యలో నిర్వహించాలని, బహిరంగసభ ఊరి శివారులో గల పొలాల్లో నిర్వహించాలని నిర్ణయించారు. తదనుగుణంగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ వివిధ శాఖల అధికారులకు సూచించారు. గ్రామసభ తలపెట్టిన రావిచెట్టు ప్రాంతం గ్రామీణ నేపథ్యాన్ని తలపిస్తూ ఆహ్లాదకర వాతావరణంలో ఉండడంతో ఈ చెట్టుకింద చప్టా మీదనే ముఖ్యమంత్రి కూర్చుని సభ నిర్వహిందుకు వీలుగా ఏర్పాట్లు చేయాలని పంచాయతీరాజ్ అధికారులకు కలెక్టర్ సూచించారు. ముగ్గులు, ఆటల పోటీలు నిర్వహించి విజేతలను ఎంపిక చేసి సిద్ధంగా ఉంచితే ముఖ్యమంత్రి చేతుల మీదుగా బహుమతులు ఇప్పిద్దామని కలెక్టర్ పేర్కొన్నారు. పిల్లల నృత్యాలు, పౌష్టికాహార స్టాళ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. డి.ఆర్.డి.ఎ. పి.డి. సత్యసాయి శ్రీనివాస్ ఉదయాన్నే గ్రామం చేరుకుని అధికారులతో కలిసి వివిధ ప్రదేశాలు పరిశీలించారు. కలెక్టర్ రాగానే ఎక్కడే కార్యక్రమం అనుకూలమో, పండగ వాతావరణం కనిపించేలా చేపట్టే ఏర్పాట్లు వివరించారు.

ఎస్.పి. రాహుల్‌దేవ్ శర్మ, ఎ.ఎస్.పి. ఆరీఫ్ హఫీజ్, ఇంటిలిజెన్స్ డి.ఎస్.పి. శ్రీనివాసరావు, స్పెషల్ బ్రాంచి డి.ఎస్.పి. యాళ్ల వెంకటరమణ, సి.ఐ. రేవతమ్మ తదితరులు బందోబస్తు ఏర్పాట్లపై చర్చించారు. సీఎంతో పాటు గ్రామసభలో మంత్రులు, గ్రామాన్ని దత్తత తీసుకున్న మంత్రి అయ్యన్న సతీమణి పద్మావతి, మండలాధ్యక్షురాలు సుకల రమణమ్మ మాట్లాడుతారు. సి.ఎం.తో ముఖాముఖిగా మాట్లాడేందుకు ఐదారుగురుని అందుబాటులో ఉంచుతారు. ఉపకారవేతనాలు, వడ్డీలేని రుణాలు ముఖ్యమంత్రి చేతులమీదుగా పంపిణీ చేస్తారు.

ఘనంగా సౌత్‌జోన్ క్రికెట్ పోటీలు ప్రారంభం

తగరపువలస, న్యూస్‌టుడే: ఏయూ, రఘు కళాశాల సంయుక్తంగా నిర్వహిస్తున్న సౌత్‌జోన్ అంతర విశ్వవిద్యాలయాల పురుషుల క్రికెట్ పోటీలు రఘు కళాశాల క్రీడామైదానంలో బుధవారం ప్రారంభమయ్యాయి. మంత్రి గంటా శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా విచ్చేసి పోటీలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్రీడాకారులకు అకడమిక్ పరీక్షల్లో వెయిటేజీ ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తున్నామన్నారు. అగనంపూడి వద్ద 150 ఎకరాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో సమీకృత క్రీడా కాంప్లెక్స్‌ను నిర్మిస్తున్నామన్నారు. ఏయూ ఉపకులపతి ఆచార్య నాగేశ్వరరావు మాట్లాడుతూ అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ వర్సిటీ రెండు ప్రతిష్ఠాత్మక క్రీడాంశాల నిర్వహణ బాధ్యతను తమ వర్సిటీకి అప్పగించిందన్నారు. ఆంధ్రా రంజీ క్రికెట్ జట్టుకు ఎంపికైన లెఫ్ట్‌ఆర్మ్ ఫాస్ట్ బౌలర్, రఘు కళాశాలలో సివిల్ ఇంజినీరింగ్ తృతీయ సంవత్సరం చదువున్న విద్యార్థి వై.పృథ్వీరాజ్‌కు రూ.20వేల నగదు ప్రోత్సాహాన్ని, జ్ఞాపికను మంత్రి అందించారు.



పదోతరగతి వార్షిక పరీక్షలు మార్చి 15వ తేదీ నుంచి నిర్వహించేందుకు ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించింది. పది గ్రేడు పాయింట్ల సాధనే లక్ష్యంగా పురపాలక సంఘ పాఠశాలలు కృషి చేస్తున్నా ఏదో ఒక సబ్జెక్టులో వెనుకబడటం వల్ల ఆశించిన ఫలితాలు రాని పరిస్థితి. ఏటా నిరాశే మిగులుతోంది. అయితే ఈ విద్యా సంవత్సరంలో మున్సిపల్ పాఠశాలలో పదోతరగతి పరీక్ష ఫలితాల్లో పదిశాతం విద్యార్థులు పది గ్రేడు పాయింట్లు సాధించడానికి పురపాలక శాఖ అధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు.

90శాతానికి పైగా మార్కులు సాధించే విద్యార్థులను ఎంపిక చేసి మంచి గ్రేడు సాధించేలా నిపుణులైన ఉపాధ్యాయులతో ప్రతి ఆదివారం, ఇతర సెలవు రోజుల్లో శిక్షణ ఇప్పించటానికి ఏర్పాట్లు చేశారు. పాఠ్యాంశాలపై మరింత పట్టు సాధించేలా ప్రోత్సహిస్తున్నారు.



నెహ్రూచౌక్ (అనకాపల్లి), న్యూస్‌టుడే

పదికి పదే లక్ష్యం



జీవీఎంసీ పాఠశాలలో కార్పొరేటు తరహా తరగతులు

విద్యార్థులకు భోజనం, అల్పాహారం ఏర్పాటు



పట్టణంలో జీవీఎంసీ పరిధిలో ఆరు ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలల నుంచి ఈ విద్యా సంవత్సరంలో సుమారు 380 మంది విద్యార్థులు పది పరీక్షలకు హాజరుకానున్నారు. గత విద్యా సంవత్సరంలో ఆయా పాఠశాలలో విద్యార్థులు పదోతరగతి ఫలితాల్లో పదికి పది గ్రేడు పాయింట్లు అయిదుగురు విద్యార్థులు మాత్రమే సాధించారు. తొమ్మిది గ్రేడు పాయింట్లు అనేక మంది విద్యార్థులు సాధించారు. కొన్ని సందేహాలు నివృత్తి చేయలేకపోవడం వల్ల ఆశించిన లక్ష్యానికి కొద్ది దూరంలో నిలిచిపోవాల్సి వచ్చింది. అయితే ఈ విద్యా సంవత్సరంలో తప్పకుండా అనుకున్న లక్ష్యాన్ని సాధించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇప్పుడు ఈ సంఖ్య పదిశాతానికి పెంచడానికి రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ మున్సిపల్ పాఠశాలలో పది చదువుతున్న విద్యార్థులకు పరీక్షను నిర్వహించి స్టార్, డబుల్‌స్టార్, ట్రిపుల్ స్టార్‌గా విభజించి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. గ్రేటర్ విశాఖ పరిధిలో 5 కేంద్రాల్లో ఎంపిక చేసిన విద్యార్థులకు అదనపు తరగతులు నిర్వహిస్తున్నారు. అనకాపల్లి జోన్‌కు సంబంధించి ఆరు ఉన్నత పాఠశాలల నుంచి మంచి ప్రతిభ, సమ్మెటివ్ పరీక్షల్లో తొంభై శాతం మార్కులు సాధించిన 77 మంది విద్యార్థులకు ప్రతి ఆదివారం, రెండో శనివారం, ఇతర సెలవు రోజుల్లో నిపుణులైన ఉపాధ్యాయులతో జీవీఎంసీ గాంధీనగరం ఉన్నత పాఠశాల కేంద్రంగా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు.

ఉదయం 8:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ తరగతులు కొనసాగుతాయి. ఇలా అదనపు తరగతులు చెప్పే ఉపాధ్యాయులకు గంటకు 250 రూపాయలు పారితోషికం కూడా ప్రభుత్వం అందజేస్తుంది.

ప్రత్యేక తరగతులతో మేలు



ప్రతిరోజు పాఠశాలలో నిర్వహిస్తున్న తరగతులతోపాటు ప్రతి ఆదివారం నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులు బాగా ఉపయోగపడుతున్నాయి. ఉపాధ్యాయులు దగ్గరుండి చదివించడంతో తెలియని అంశాలను వెంటనే అడిగి తెలుసుకొనే అవకాశం ఉంటుంది. ఈ ప్రత్యేక తరగతులను సద్వినియోగం చేసుకొని పది గ్రేడు పాయింట్లు సాధిస్తా.

- రమ్య, గాంధీనగరం ఉన్నత పాఠశాల

ప్రత్యేక తరగతుల్లో ఏం చెబుతారంటే..



ఈ ప్రత్యేక తరగతుల్లో ఒత్తిడి లేకుండా పరీక్షల్లో మంచి మార్కులు సాధించే అంశాలపై విద్యార్థులకు మెలకువలు నేర్పిస్తారు. గత పరీక్షల ప్రశ్నాపత్రాలు బేరీజు వేసుకొని రానున్న పరీక్షల్లో ఎటువంటి ప్రశ్నలు వచ్చే అవకాశం ఉందో, వాటికి మంచి మార్కులు వచ్చేలా జవాబులు ఎలా రాయాలో, చేతిరాతను ఏవిధంగా మెరుగు పరుచుకోవాలో వివరిస్తారు. బిట్లు, మ్యాప్ పాయింటింగ్, పటాలు తదితర అంశాలపై మెలకువలు నేర్పిస్తారు.

మధ్యాహ్న భోజనం, అల్పాహారం



సెలవు రోజుల్లో ప్రత్యేక తరగతులకు హాజరయ్యే విద్యార్థులకు రోజూ ఉదయం, సాయంత్రం అల్పాహారం అందిస్తారు. దీంతోపాటు మధ్యాహ్న సమయంలో భోజనం ఏర్పాటు చేయాలని పురపాలక సంఘం ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థులకు పోషకాహారం అందించాలని సూచించారు.

పర్యవేక్షిస్తున్నాం



పట్టణంలో ఆరు ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు పరీక్ష నిర్వహించి 77 మంది విద్యార్థులను ఎంపిక చేసి ప్రతి ఆదివారం, రెండో శనివారం, ఇతర సెలవు రోజుల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. ఆయా సబ్జెక్టుల్లో నిపుణులైన ఉపాధ్యాయులతో అదనపు తరగతులను ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తాం. తరగతులకు వచ్చే సమయంలో ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం అల్పాహారం కూడా ఇస్తున్నాం.

- హెచ్.నేతాజీ, అర్బన్ కోఆర్డినేటర్, జీవీఎంసీ జోన్ అనకాపల్లి

సందేహాలను తీర్చుకుంటే సత్ఫలితాలు



ఈఏడాది జరిగే పది పరీక్షల్లో పదిశాతం మంది విద్యార్థులు పదికి పది గ్రేడు పాయింట్లు సాధించడమే లక్ష్యంగా కృషిచేస్తున్నాం. పాఠశాలలో ప్రతిరోజు ఉదయం, సాయంత్రం గంట సమయంపాటు జరిగే ప్రత్యేక తరగతులతోపాటు సెలవు రోజుల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను ఏకాగ్రతతో అభ్యసించాలి. తరగతిగదిలో వచ్చే సందేహాలను భయపడకుండా ఉపాధ్యాయుల దృష్టికి తీసుకెళ్లాలి. విద్యార్థులు ఎటువంటి ఒత్తిడికి లోనుకాకుండా అవగాహన కల్పిస్తున్నాం. ఈ 77 మంది విద్యార్థులు పరీక్షల్లో పదికి పది గ్రేడు పాయింట్లు సాధించటానికి ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. **- దువ్వూరి శ్రీనివాసరావు, ప్రధానోపాధ్యాయులు, గాంధీనగరం ఉన్నత పాఠశాల**



భరతమాత సేవలో...



దేశ రక్షణలో రాణిస్తున్న ఒమ్మలి కుర్రాళ్లు

గ్రామం నుంచి భారీగా చేరిక

ఆసక్తి చూపుతున్న యువకులు

నేటి యువత శారీరక శ్రమను ఏమాత్రం ఇష్టపడటం లేదు. అందునా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానానికి బానిసలవుతూ లక్ష్య సాధన లేకుండా గడిపేస్తున్నారు. బాగా చదువుల్లో రాణించే వారేమో సాఫ్ట్‌వేర్ రంగం వైపు పరుగులు తీస్తున్నారు. వీటన్నింటికీ భిన్నంగా ఎంత కష్టమైనా ఫర్వాలేదు.. దేశ రక్షణ కోసం మేము సిద్ధమంటున్నారీ యువకులు.. మాడుగుల మండలంలోని ఒమ్మలికి చెందిన యువకులు సైన్యంలో చేరి భరతమాత సేవ చేయడమే లక్ష్యంగా పెట్టుకుంటున్నారు.



చత్తీస్‌గఢ్‌లో విధి నిర్వహణలో తోటి సైనికులతో అప్పలనాయుడు

ఒమ్మలి (మాడుగుల గ్రామీణం), న్యూస్‌టుడే

ఆ గ్రామమంటే పాతికేళ్ల కిందట అందరికీ భయం. పోలీసులకు సవాల్. నేడు అదే గ్రామం దేశ రక్షణలో కీలకమైన ఆర్మీ ఉద్యోగులను అందించడంలో ఆదర్శంగా నిలుస్తోంది. జిల్లాలో శివారు మండలమైన మాడుగుల మండలంలో మారుమూల గ్రామమైన ఒమ్మలి ఉంది. ఈ గ్రామస్థులందరికీ వ్యవసాయమే జీవనాధారం. ఏ తల్లిదండ్రులైనా తమ పిల్లలు ఉన్నత చదువులు అభ్యసించి లక్షలు సంపాదించాలనుకుంటారు. ఈ గ్రామ ప్రజలు అలాకాకుండా దేశ సేవ చేసేందుకు ప్రోత్సహిస్తారు. వీరి ఆర్థిక పరిస్థితి అంతంతైనా వెనకడుగు వేయలేదు. ఇక్కడ చదువరులున్న కుటుంబాల సంఖ్యా ఎక్కువే. క్రమేపీ వందశాతం అక్షరాస్యత సాధించడంలో ఒమ్మలి ముందంజ వేసింది.

అనుకున్న లక్ష్యం ముందు చిన్నచిన్న సమస్యలు ఉన్న లెక్క చేయకుండా యువకులు కష్టపడి చదివి తల్లిదండ్రుల కలలను సాకారం చేశారు. ఏకంగా 11 మంది సైనికులుగా ఎంపికై తాము అనుకున్న లక్ష్యాన్ని సాధించారు. తమ ప్రాణాలు ఒడ్డి దేశరక్షణ విధులు నిర్వహిస్తున్నారు. ఈ గ్రామంలో మరెందరో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు.

మొదటి ప్రయత్నంలో ఆర్మీ ఉద్యోగం



నేను ఆరో తరగతి నుంచి ఆర్మీలో చేరాలని చాలా కోరికగా ఉండేది. దీంతో పదోతరగతి పూర్తి చేసి బాగా చదువుకున్న వారి నుంచి సూచనలు స్వీకరించాను. శారీరక వ్యాయామాలు సాధన చేస్తూ ఆర్మీలో చేరడానికి కృషి చేశాను. దీంతో మొదటి ప్రయత్నంలోనే సైన్యంలో చోటు దక్కించుకున్నాను. అప్పటి నుంచి దేశం కోసం సేవలు అందిస్తూ ముందుకెళుతున్నాను.

- జొన్నపల్లి గణేష్

గ్రామం నుంచి మొట్టమొదటిసారిగా అక్కిరెడ్డి గణేష్ సైన్యంలో చేరారు. తర్వాత నావికాదళంలో కొండపల్లి సంజీవరావు ఉద్యోగం సాధించారు. ఆ తర్వాత యువకులు ఒకరు తర్వాత ఒకరు వీరిని స్ఫూర్తిగా తీసుకొని సైన్యంలో చేరడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నారు. ఇప్పటివరకు వుగ్గిన వెంకటరావు - ఐటీబీపీ, కాత అప్పలనాయుడు(హరి) - సీఆర్‌పీఎఫ్, తానాపతి గణేష్ - ఆర్మీ, సుంకరి కొండలరావు - సీఐఎస్ఎఫ్, కాత నరసింహమూర్తి - రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్, వుగ్గిన సత్తిరాజు - ఏపీఎస్పీ, కాత లోవ - ఏపీఎస్పీలో చేరారు. పుట్టిన ఊరికి పేరు తేవడంతోపాటు, దేశ సేవలో పాల్గొనడానికి మించిన ఆనందం మరొకటి లేదని యువకులు చెబుతున్నారు.

కష్టపడనిదే ఏదీ రాదు



పాఠశాల దశలోనే జీవితంలో ఎలా ఎదగాలో ప్రణాళిక రూపొందించుకున్నాను. నా తల్లిదండ్రులు వెన్నుతట్టి ప్రోత్సహించారు. సాధనతో నావీలో ఉద్యోగం సాధించాను. కష్టపడనిదే ఏదీ దక్కించుకోలేమని నేటి యువతరం గుర్తించాలి. **- కొండపల్లి సంజీవరావు**

అమ్మానాన్న ప్రోత్సాహంతో...

ఒకటో తరగతి నుంచి పదోతరగతి వరకు ప్రభుత్వ పాఠశాలలో చదివాను. నాకు చిన్నప్పటి నుంచి క్రీడలంటే చాలా మక్కువగా ఉండేది. మా అమ్మానాన్న ప్రోత్సాహంతో సైన్యంలో ఉద్యోగం సాధించాను. నేను దేశం కోసం సేవ చేసే ఉద్యోగంలో చేరతానంటే ఏనాడూ వద్దనలేదు.



- కాత అప్పలనాయుడు (హరి), సీఆర్‌పీఎఫ్

అదృష్టం ఉండాలి...

దేశానికి సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నా. వివిధ రంగాల్లో పని చేయడానికి సైన్యంలో పని చేయడానికి చాలా తేడా ఉంది. రక్షణ విభాగం ద్వారా వచ్చే సంతృప్తి ఇంకే ఉద్యోగం చేసినా రాదు.



- ఉగ్గిన వెంకటరావు, ఐటీబీపీ సైనికుడు



రోగులకు సాంత్వన

ఎముకలకు ఆధునిక శస్త్రచికిత్సలు చేసే సదుపాయం

నర్సీపట్నం ప్రాంతీయ ఆసుపత్రి ప్రగతి సిగలో కలికితురాయిగా 'సీఆమ్' శస్త్రచికిత్స చేరనుంది. వీటితో ప్రమాదాల్లో ఎముకలు విరిగిపోయిన వారికి శస్త్రచికిత్సను స్థానికంగానే నిర్వహించవచ్చు. ఇన్నాళ్లూ ఇటువంటి రోగులను విశాఖ కేజీహెచ్‌కు తరలిస్తున్నారు. వీటిద్వారా త్వరలోనే ఈ రోగుల కష్టాలకు తెర పడనుంది. మంత్రి అయ్యన్నపాత్రుడి చొరవ ఫలితంగా ఇప్పుడు ఈ శస్త్ర చికిత్సల పరికరాలు నర్సీపట్నంలోని ప్రాంతీయ ఆసుపత్రికి సమకూరనున్నాయి.

తొమ్మిది మండలాల రోగులంతా నర్సీపట్నం ప్రాంతీయ ఆసుపత్రినే ఆశ్రయిస్తుంటారు. ఈ ప్రాంతంలో రోడ్డు ప్రమాదాలు అధికం. వీటిలో ఎక్కువగా ఎముకలు విరిగిపోయిన వారందరినీ ప్రాంతీయ ఆసుపత్రికి తీసుకువస్తుంటారు. ఇక్కడ మాత్రం వీరికి ఏ సేవలు అందించలేని దుస్థితి. ఇటువంటి వారిని వెంటనే విశాఖ కేజీహెచ్‌కు తరలిస్తున్నారు. ఇలాంటి రోగుల్లో కొందరు మార్గమధ్యంలోనే ప్రాణాలు కోల్పోతున్నారు. నర్సీపట్నం ఆసుపత్రిలో ఏళ్ల తరబడి ఎముకల విభాగం వైద్య నిపుణుల పోస్టే భర్తీ కాలేదు. మూడేళ్ల నుంచి ఇందులో ఈ వైద్యుని సేవలు అందుబాటులోకి వచ్చినప్పటికీ శస్త్ర చికిత్సలు అవసరమయ్యే రోగులను విశాఖ తరలిస్తున్నారు.



ప్రాంతీయ ఆసుపత్రి

ఎందరో రోగుల ప్రాణాలు నిలిపినట్లవుతుంది



నర్సీపట్నం ఆసుపత్రిలో ఈ శస్త్రచికిత్సల యంత్ర పరికరాలను ఏర్పాటు చేసేందుకు తీసుకుంటున్న చొరవ అభినందనీయం. దీని వల్ల ఎందరో రోగుల ప్రాణాలు నిలబెట్టినట్లవుతుంది. వీటికి ఎంపీ నిధులు విడుదల అయ్యాయి. కలెక్టరు నుంచి సంబంధించిన చెక్కు జారీ కానున్నది. గోవాలోని సీమెన్స్ సంస్థ నుంచి ఈ యంత్ర పరికరాలను త్వరలోనే కొనుగోలు చేయనున్నాం.

- డాక్టరు సుధాశారద, ప్రాంతీయ ఆసుపత్రి పర్యవేక్షకురాలు, నర్సీపట్నం

నర్సీపట్నం అభివృద్ధిలో మరో కలికితురాయి



ఎంపీ నిధుల సాయంతో...

ప్రమాదాల్లో ఎముకలు విరిగిపోయిన వారికి జిల్లాలో అనకాపల్లి ఎన్టీఆర్ ఆసుపత్రి, విశాఖ కేజీహెచ్‌లో మాత్రమే శస్త్రచికిత్సలకు సదుపాయం ఉంది. దీని వల్ల ఏజెన్సీతోపాటు నర్సీపట్నం ప్రాంతంలోని రోగులంతా వీటి నిమిత్తం నానా అవస్థలు పడుతున్నారు. ఒక్కోసారి వేలాది రూపాయలు ధారపోసినా ప్రాణాలు నిలిచే పరిస్థితి లేదు. ఈ విషయమై వైద్యుల ద్వారా తెలుసుకున్న మంత్రి అయ్యన్న స్పందించారు. అరకు ఎంపీ గీతతో దీనిపై సంప్రదించి శస్త్రచికిత్స యంత్ర పరికరాలు కొనుగోలుకు రూ.20 లక్షల ఎంపీ నిధులను నుంచి సాధించగలిగారు. ఇవి నర్సీపట్నం ఆసుపత్రిలో ఏర్పాటైతే శరీరంలో ఎముక ఎక్కడ విరిగిందో పరికరాల్లోని కెమెరా ద్వారా తక్షణం గుర్తించడం.. వెనువెంటనే శస్త్రచికిత్స నిర్వహించడం.. చకచకా జరిగిపోతుంది.




'సీఆమ్'గా పేర్కొంటున్న శస్త్ర చికిత్స యంత్ర పరికరాల నమూనా

బోధనలో ఎంతోమంది ఉపాధ్యాయులు.. ఒక్కొక్కరు ఒక్కో విధానం అనుసరిస్తుంటారు. రోలుగుంట మండలం బుచ్చెంపేట జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలకు చెందిన సైన్సు ఉపాధ్యాయుడు ఐ.శ్రీనివాస్ తమ పాఠశాలలోని విద్యార్థులకు వినూత్నంగా సైన్సు రంగవల్లుల పోటీ నిర్వహించారు.

వైజ్ఞానిక రంగవల్లులు

ఉపాధ్యాయుడి వినూత్న ప్రయోగం

ఆసక్తిగా పాల్గొన్న విద్యార్థులు



రంగులతో రూపుదిద్దుకున్న గుండె



థైరాయిడ్ గ్రంథి

బుచ్చెంపేట (రోలుగుంట), న్యూస్‌టుడే

నర్సీపట్నానికి చెందిన ఐ.శ్రీనివాస్ కొన్ని సంవత్సరాలుగా రోలుగుంట మండలం బుచ్చెంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్సు టీచరుగా పనిచేస్తున్నారు. వృత్తిపరంగా విద్యార్థులకు నూతన విధానంతో బోధించడానికి నిరంతరం తపన పడుతుంటారు. ఈ క్రమంలో తాజాగా 2018 నూతన సంవత్సర ఆరంభంలో పాఠశాలలోని పిల్లలకు ఏదైనా నూతన ప్రక్రియలో బోధించాలనే ప్రయత్నంలో భాగంగా బుధవారం బుచ్చెంపేటలో సైన్సుకు సంబంధించి చిత్రాల పోటీలు నిర్వహించారు. 8, 9, 10 తరగతులకు చెందిన సుమారు 50మందికి పైగా పిల్లలు పోటీలో పాల్గొన్నారు. వీరంతా వారి తరగతి స్థాయి చిత్రాలను రంగురంగులతో తీర్చిదిద్దారు. ఈ చిత్రాలు చూడటానికి ఎంతో బాగున్నాయి.



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు


స్వరపేటిక పనితీరు, స్త్రీ ప్రత్యుత్పత్తి, విసర్జన వ్యవస్థ, నీటి ఉత్పత్తి తీరు, కిరణ జన్య సంయోగ క్రియ.. ఇలా అనేక చిత్రాలను విద్యార్థులు రంగురంగుల ముగ్గులతో వేసి అందరినీ మెప్పించారు. దీంతో ఉపాధ్యాయులు పిల్లల తల్లిదండ్రులతో అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేసి మరీ విద్యార్థుల ప్రతిభను వారికి చూపించారు.



నీటి ఉత్పత్తి వ్యవస్థ

సొంత నిధులతో బహుమతులు

సాధారణంగా గ్రామాల్లో సంక్రాంతి సీజన్‌లో ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ఇస్తుంటారు. అలాంటి సందర్భాన్నే స్ఫూర్తిగా తీసుకుని వినూత్నంగా ముగ్గుల పోటీలను సైన్సు సబ్జెక్టుపై నిర్వహించాలనే ఆలోచన వచ్చింది. ఇలా చేయడంవల్ల పిల్లలకు అవగాహన వస్తుంది. 8, 9, 10 ప్రతి తరగతిలోని విజేతలకు నా సొంత ఖర్చులతో గురువారం బుచ్చెంపేటలో నిర్వహించే జన్మభూమి కార్యక్రమంలో మండల నోడల్ బృందంచే బహుమతులు ఇవ్వాలని నిర్ణయించాం. ఇందుకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, తోటి ఉపాధ్యాయుల సహకారం ఎంతో ఉంది.



- ఐ.శ్రీనివాస్, ఉపాధ్యాయుడు, బుచ్చెంపేట

వికెట్లతో ఆట... పరుగుల వేట...

ఆకట్టుకుంటున్న 'స్ప్రైట్ ఈసీసీ కప్-2017' క్రికెట్ పోటీలు

విశాఖ క్రీడలు, న్యూస్‌టుడే: పదునైన బంతులతో వికెట్లపై దాడి ఓవైపు... బౌండరీలు, సిక్సర్లతో పరుగుల వర్షం మరోవైపు.. ఆడుతున్నది అంతర్జాతీయ క్రీడాకారులా? అన్నంతగా మైమరపిస్తున్నారు. పోరాట స్ఫూర్తితో.. క్రీడా నైపుణ్యంతో చూపరులను ఆకట్టుకుంటున్నారు. నారాయణ విద్యాసంస్థల ఆధ్వర్యంలో నగరంలోని వివిధ మైదానాల్లో బుధవారం జరిగిన 'స్ప్రైట్ ఈసీసీ కప్-2017' క్రికెట్ మ్యాచ్‌లు ఆద్యంతం అలరించాయి.

భీమిలి జీవీఎంసీ మినీ గ్రౌండ్‌లో

అదరగొట్టిన అనిట్స్ కళాశాల జట్టు



అనిట్స్ కళాశాల జట్టు 44 పరుగుల తేడాతో బీవీకే డిగ్రీ కళాశాల జట్టుపై గెలుపొందింది. తొలుత అనిట్స్ జట్టు 10 ఓవర్లలో 2 వికెట్లకు 120 పరుగులు చేసింది. ప్రసాద్ 56 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. అనంతరం బీవీకే జట్టు 9.5 ఓవర్లలో 8 వికెట్లకు 76 పరుగులే చేసి ఓటమి పాలైంది.

వైజాగ్ ఇన్‌స్టిట్యూట్ టెక్నాలజీ జట్టు విజయం



వైజాగ్ ఇన్‌స్టిట్యూట్ జట్టు 7 వికెట్ల తేడాతో ఎన్.ఎస్.ఆర్.ఐ.టి.జట్టుపై విజయం సాధించింది. తొలుత ఎన్.ఎస్.ఆర్.ఐ.టి.జట్టు 10 ఓవర్లలో 7 వికెట్లకు 78 పరుగులు చేసింది. అనంతరం వైజాగ్ ఇన్‌స్టిట్యూటు ఆఫ్ టెక్నాలజీ జట్టు 9.5 ఓవర్లలో 3 వికెట్లకు 79 పరుగులు చేసి విజయాన్నందుకుంది.

డాల్ఫిన్ స్పోర్ట్స్ గ్రౌండ్ నియర్ ఐఎన్ఎస్ శాతవాహన

చైతన్య ఇంజినీరింగ్ జట్టు గెలుపు ఆనందం



చైతన్య ఇంజినీరింగ్ కళాశాల జట్టు 10 పరుగుల తేడాతో రఘు ఇన్‌స్టిట్యూటు ఆఫ్ టెక్నాలజీ జట్టుపై విజయం సాధించింది. తొలుత చైతన్య జట్టు 10 ఓవర్లలో 9 వికెట్లకు 91 పరుగులు చేసింది. తర్వాత రఘు జట్టు 10 ఓవర్లలో 9 వికెట్లకు 81 పరుగులే చేసి ఓటమి పాలైంది.

సుజన కళాశాల జట్టు అలవోక గెలుపు



సుజన కాలేజ్ ఆఫ్ ఫార్మశీ జట్టు 6 వికెట్ల తేడాతో పైడా కౌశిక్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ జట్టుపై గెలుపొందింది. తొలుత పైడా కౌశిక్ కళాశాల జట్టు 10 ఓవర్లలో 2 వికెట్లకు 102 పరుగులు చేసింది. అనంతరం సుజన కళాశాల జట్టు 8.4 ఓవర్లలోనే 4 వికెట్లు కోల్పోయి 107 పరుగులు చేసి గెలుపొందింది. సాయికుమార్ 45 పరుగులతో రాణించాడు.

కైలాసగిరి జిల్లా పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో

రఘు డిగ్రీ కళాశాల జట్టు ఉత్కంఠ గెలుపు



రఘు డిగ్రీ కళాశాల జట్టు శ్రీచైతన్య ఇంజినీరింగ్ కళాశాల(కొమ్మాది) జట్టుపై 3 వికెట్ల తేడాతో జయకేతనం ఎగరేసింది. తొలుత శ్రీచైతన్య ఇంజినీరింగ్ జట్టు 10 ఓవర్లలో 3 వికెట్లకు 67 పరుగులు చేసింది. తర్వాత రఘు డిగ్రీ కళాశాల జట్టు చివరి వరకూ పోరాడి 9.5 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 68 పరుగులు చేసి విజయాన్నందుకుంది.

వెల్ఫేర్ ఇన్‌స్టిట్యూట్ జయకేతనం



వెల్ఫేర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ జట్టు 16 పరుగుల తేడాతో సెయింట్ జేవియర్స్ డిగ్రీ జట్టుపై జయకేతనం ఎగరేసింది. తొలుత వెల్ఫేర్ జట్టు 10 ఓవర్లలో 6 వికెట్లకు 91 పరుగులు చేసింది. తర్వాత సెయింట్ జేవియర్స్ జట్టు 10 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 75 పరుగులు మాత్రమే చేసింది.

విశాఖ టెక్నికల్ క్యాంపస్ విజయదుందుభి



విశాఖ టెక్నికల్ క్యాంపస్ జట్టు 32 పరుగుల తేడాతో ఆదిత్య డిగ్రీ కళాశాల జట్టుపై విజయదుందుభి మోగించింది. తొలుత విశాఖ టెక్నికల్ క్యాంపస్ జట్టు 10 ఓవర్లలో 97 పరుగులకు ఆలౌటైంది. తర్వాత ఆదిత్య డిగ్రీ జట్టు 10 ఓవర్లలో 7 వికెట్లకు 65 పరుగులు చేసి ఓటమిని చవిచూసింది.

సాయిగణపతి ఇంజినీరింగ్ జట్టు జయభేరి



సాయిగణపతి ఇంజినీరింగ్(గిడిజాల) కళాశాల జట్టు 6 వికెట్ల తేడాతో ఎ.క్యు.జె.డిగ్రీ, పీజీ కళాశాల జట్టుపై గెలుపొందింది. తొలుత ఎ.క్యు.జె.డిగ్రీ జట్టు 10 ఓవర్లలో 5 వికెట్లకు 64 పరుగులు చేసింది. అనంతరం సాయిగణపతి ఇంజినీరింగ్ కళాశాల జట్టు 7.2 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 65 పరుగులు చేసి విజయఢంకా మోగించింది.

టి.ఎస్.ఆర్ అండ్ టి.బి.కె.జట్టు గెలుపు



టి.ఎస్.ఆర్ అండ్ టి.బి.కె.కళాశాల జట్టు 30 పరుగుల తేడాతో దారివీరునాయుడు కళాశాల జట్టుపై గెలుపొందింది. తొలుత టి.ఎస్.ఆర్ అండ్ టి.బి.కె. జట్టు 10 ఓవర్లలో 5 వికెట్లకు 111 పరుగులు చేసింది. పి.పోలరాజు 51 పరుగులు చేశాడు. తర్వాత దాడి వీరునాయుడు కళాశాల జట్టు 10 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 81 పరుగులే చేసి ఓటమి పాలైంది.

04-01-2018 గురువారం మ్యాచ్‌లు

కైలాసగిరి జిల్లా పోలీస్ పెరేడ్ గ్రౌండ్, విశాఖపట్నం

ఉదయం 8.30 గంటలకు: విజ్ఞాన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజి, దువ్వాడ Vs డా॥ వి.ఎస్. కృష్ణ గవర్నమెంట్ డిగ్రీ కాలేజి, మద్దిలపాలెం

ఉదయం 10.30 గంటలకు: విశ్వనాథ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజి & మేనేజ్‌మెంట్, మిందివానిపాలెం Vs ప్రిజమ్ డిగ్రీ & పీజీ కాలేజి

మధ్యాహ్నం 12.30 గంటలకు: గాయత్రి విద్యా పరిషత్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, మధురవాడ Vs వైజాగ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజి, దాకమర్రి

భీమిలి జి.వి.ఎం.సి. మినీ గ్రౌండ్ (భీమునిపట్నం)

ఉదయం 8.30 గంటలకు: సుజన కాలేజ్ ఆఫ్ ఫార్మశి, ఆనందపురం Vs సాయి గణపతి ఇంజినీరింగ్ కాలేజి, గిడిజాల

ఉదయం 10.30 గంటలకు: రఘు డిగ్రీ కాలేజి, దాకమర్రి Vs చైతన్య ఇంజినీరింగ్ కాలేజి, కొమ్మాది

డాల్ఫిన్ స్పోర్ట్స్ గ్రౌండ్ నియర్ ఐ.ఎన్.ఎస్. శాతవాహన

ఉదయం 8.30 గంటలకు: వెల్ఫేర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ టెక్నాలజి & మేనేజ్‌మెంట్, పినగాడి Vs విశాఖ టెక్నికల్ క్యాంపస్, నరవ

ఉదయం 10.30 గంటలకు: టి.ఎస్.ఆర్. & టి.బి.కె. డిగ్రీ కాలేజి, శ్రీనగర్, గాజువాక Vs అనిట్స్, సంగివలస

05-01-2018 శుక్రవారం మ్యాచ్‌లు

కైలాసగిరి జిల్లా పోలీస్ పెరేడ్ గ్రౌండ్, విశాఖపట్నం

ఉదయం 8.30 గంటలకు: విశ్వనాథ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజి & మేనేజ్‌మెంట్, మిందివానిపాలెం (or) ప్రిజమ్ డిగ్రీ & పీజీ కాలేజి Vs గాయత్రి విద్యాపరిషద్ కాలేజి ఆఫ్ ఇంజినీరింగ్, మధురవాడ (or) వైజాగ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజి, దాకమర్రి

ఉదయం 10.30 గంటలకు: సుజన కాలేజి ఆఫ్ ఫార్మశి, ఆనందపురం (or) సాయిగణపతి ఇంజినీరింగ్ కాలేజి, గిడిజాల Vs రఘు డిగ్రీ కాలేజి, దాకమర్రి (or) చైతన్య ఇంజినీరింగ్ కాలేజి, కొమ్మాది

మధ్యాహ్నం 12.30 గంటలకు: విజ్ఞాన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజి, దువ్వాడ (or) డా॥ వి.ఎస్. కృష్ణ గవర్నమెంట్ డిగ్రీ కాలేజి, మద్దిలపాలెం Vs టి.ఎస్.ఆర్. & టి.బి.కె. డిగ్రీ కాలేజి, శ్రీనగర్, గాజువాక (or) అనిట్స్, సంగివలస

క్రీడాకారులకు గమనిక..: క్రీడాకారులు పదోతరగతి ఒరిజినల్ మార్కుల మెమో, కళాశాల గుర్తింపు కార్డు, స్టడీ సర్టిఫికెట్‌లను తప్పనిసరిగా తీసుకురావాలి. క్రీడాకారులంతా నిర్ణీత సమయానికి ఓ గంట ముందే మైదానం వద్దకు చేరుకుని అక్కడ టోర్నీ నిర్వాహకులకు రిపోర్టు చేయాలి. మ్యాచ్ జరిగే సమయంలో బ్యాట్స్‌మన్, వికెట్ కీపర్ తప్పనిసరిగా హెల్మెట్లు, లెగ్‌ప్యాడ్స్, అండర్ గార్డ్స్, హేండ్ గ్లౌజ్స్, వైట్ డ్రెస్, వైట్ షూ తప్పక ధరించాలి.

క్రీడాకారులకు అందుబాటులో వైద్య సేవలు

విశాఖ క్రీడలు: క్రీడాకారులు గాయాల బారినపడినా, అనారోగ్యానికి గురైనా వారికి తక్షణమే వైద్యసేవలు అందించేందుకు 'ఈనాడు' వైద్యులను, అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచింది. భీమిలి మైదానం వద్ద టి.సుబ్బరామిరెడ్డి సేవా పీఠం అంబులెన్స్‌ను, కైలాసగిరి పోలీసు పరేడ్ గ్రౌండ్ వద్ద కళాఆసుపత్రి అంబులెన్స్, శాతవాహన డాల్ఫిన్ స్పోర్ట్స్ కాంప్లెక్సు గ్రౌండ్ వద్ద డాక్టర్ కూటికుప్పల సూర్యారావు ఆసుపత్రి అంబులెన్స్‌లు, వైద్యసేవలు అందించారు.

ఆర్టీసీలో సంక్రాంతి సందడి

ప్రత్యేక సర్వీసుల షెడ్యూల్ విడుదల

విశాఖపట్నం, న్యూస్‌టుడే: సంక్రాంతి సందర్భంగా ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపడానికి ఏర్పాట్లు చేసినట్లు ఆర్ఎం సుదేష్‌కుమార్ తెలిపారు. గురువారం నుంచి ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ఎప్పటికప్పుడు సర్వీసులు నడపడంతోపాటు దూర ప్రాంతాలకెళ్లే బస్సుల షెడ్యూల్‌ను విడుదల చేశారు. నగరం నుంచి శ్రీకాకుళం, నరసన్నపేట, టెక్కలి, సోంపేట, పాలకొండ, పలాసకు 100 సర్వీసులు నడపనున్నట్లు పేర్కొన్నారు. దూర ప్రాంతాలకు ముందస్తు రిజర్వేషన్ కోసం www.apsrtconline.in వెబ్‌సైట్‌లో గానీ ఆర్టీసీ అధీకృత టిక్కెట్ బుకింగ్ ఏజెంట్ల నుంచి గానీ బస్‌స్టేషన్ కౌంటర్లలో సంప్రదించాలని కోరారు. ఇతర వివరాలకు 9959225602, 9177101947లను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

మెట్టపాలెం వీఆర్పీ తాత్కాలికంగా తొలగింపు

కొత్తూరు(అనకాపల్లి): అనకాపల్లి మండలంలోని మెట్టపాలెం మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం క్షేత్ర సహాయకుడు బోయిన శ్రీనివాసరావును తాత్కాలికంగా విధుల నుంచి తొలగిస్తూ(సస్పెండ్) చేస్తూ డ్వామా అధికారులు బుధవారం ఉత్తర్వులు విడుదల చేశారు. ఆయనపై వచ్చిన ఫిర్యాదు మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఈమేరకు శ్రీనివాసరావుకు ఉత్తర్వులు అందజేసినట్లు వారు తెలిపారు. వారం రోజుల్లోపు వచ్చిన ఆరోపణలపై వివరణ ఇవ్వాలని ఆదేశించినట్లు వారు వివరించారు.

క్రమబద్ధీకరణకు మరో మూడు నెలలు..

గడువు మార్చి వరకు పొడిగింపు

ఈనాడు, విశాఖపట్నం: అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణ, అక్రమ కట్టడాల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం గడువు మీద గడువు పొడిగిస్తున్నా.. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవడంలో చాలామంది ఆసక్తి చూపించడం లేదు. గతేడాది డిసెంబరు నెలాఖరు వరకు ప్రభుత్వం గడువు పొడిగించింది. అయినా స్పందన అంతంతమాత్రంగానే ఉంది. మరికొంత గడువు కావాలన్న విజ్ఞప్తులు అందడంతో ప్రభుత్వం మరో మూడు నెలలు పొడిగించింది. ఎల్ఆర్ఎస్, బీపీఎస్‌లకు మార్చి నెలాఖరు వరకు సమయం దక్కింది. వుడా పరిధిలోని అనకాపల్లి, గాజువాక, పెందుర్తి, విశాఖ సిటీ, మధురవాడ, ఆనందపురం, భీమిలి, విజయనగరం, శ్రీకాకుళం, వీకేపీసీపీఐఆర్ జోన్ల పరిధిలో లేఅవుట్ల క్రమబద్ధీకరణకు 4,632 దరఖాస్తులొచ్చాయి. వీటిలో 381 దరఖాస్తులు తిరస్కరణకు గురవగా.. క్రమబద్ధీకరించినవి 455. మరో 87 అనుమతులకు సిద్ధంగా ఉన్నాయి. మిగిలిన వాటిలో 3,709 దరఖాస్తుల్లో చిన్నచిన్న అభ్యంతరాలు తెలిపిన వుడా వాటికి సంబంధించిన ఆధారాలు, ఇతరత్రా అంశాలతో మళ్లీ దరఖాస్తు చేయాలని సంబంధితులకు తాకీదులిచ్చింది. తాజాగా గడువు పెరిగినందున ఈసారైనా మొత్తం దరఖాస్తులను పరిష్కరించాలని వుడా భావిస్తోంది.

మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య

పరవాడ, న్యూస్‌టుడే: మరుగుదొడ్డి వ్యర్థాల విషయమై తోడికోడలు దుర్భాషలాడడంతో మనస్తాపం చెందిన వివాహిత మడక శ్వేత (35) ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన కన్నూరు పంచాయతీ పరిధి మడకపాలెంలో బుధవారం ఉదయం చోటుచేసుకుంది. మృతురాలు తల్లి కృష్ణకుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై వెంకటరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రోలుగుంట మండలం కొంతలం గ్రామానికి చెందిన కృష్ణకుమారి, సన్యాసిరావు దంపతుల కుమార్తె శ్వేత, మడకపాలేనికి చెందిన వెంకటరమణకు 1997లో వివాహమైంది. ప్రస్తుతం వెంకటరమణ పంజాబ్‌లోని ఆర్మీ ఉద్యోగిగా



మృతిచెందిన శ్వేత

విధులు నిర్వహిస్తున్నారు. కొంతకాలంగా శ్వేత ఇంటి ముందుకు పక్కనే ఉన్న తోడికోడలు నాగరత్నం మరుగుదొడ్డి నుంచి వ్యర్థాలు వస్తుండటంతో ఇద్దరి మధ్య తరచూ ఘర్షణ జరిగేది. గతంలో ఈ విషయాన్ని పంచాయతీ పెద్దల సమక్షంలో పెట్టగా ఇటువంటి పొరపాటు జరగకుండా చూసుకుంటామని నాగరత్నం భర్తయిన సర్పంచి రాజునాయుడు హామీ ఇచ్చారు. అయితే మళ్లీ బుధవారం ఉదయం ఈ విషయమై ఇద్దరి మధ్య గొడవలు రావడంతో నాగరత్నం, శ్వేతను దర్భాషలాడింది. తీవ్ర మనస్థాపానికి గురైన శ్వేత వెంటనే ఇంటి తలుపులు వేసుకుని చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకుంది. కుటుంబసభ్యులు ఆమెను అగనంపూడి సీహెచ్‌సీకి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వెల్లడించారు. మృతురాలి పెద్ద కుమారుడు తరుణ్ ఇంటర్, చిన్న కుమారుడు దీపక్ పదోతరగతి చదువుతున్నాడు. భర్త వెంకటరమణ పంజాబ్ నుంచి బయలుదేరాడని పోలీసులు తెలిపారు.

టీయూ సందర్శన వేళల మార్పు..

ఈనాడు, విశాఖపట్నం: సాగర తీరంలోని టీయూ-142 యుద్ధ విమాన ప్రదర్శనశాలలోకి సందర్శకులను అనుమతించే వేళల్లో మార్పు చేసినట్లు వుడా వీసీ బసంత్‌కుమార్ తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు సందర్శనకు అవకాశం కల్పిస్తామని వెల్లడించారు.

సంక్షేమ పథకాలకు ఏటా రూ.65వేల కోట్లు

మంత్రి అయ్యన్న పాత్రుడు



రేషన్ కార్డును లబ్ధిదారునికి అందిస్తున్న మంత్రి అయ్యన్న

విశాఖపట్నం, న్యూస్‌టుడే: ప్రజా సంక్షేమానికి రూ. 65 వేల కోట్లతో 130 పథకాల్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందని రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. ఒకటో వార్డు పరిధిలోని ఆరిలోవ అయిదో సెక్టరు సాయి కళ్యాణ మండపంలో బుధవారం నిర్వహించిన జన్మభూమి కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా పింఛను పథకం ప్రవేశపెట్టారని, అప్పట్లో రూ.75లు అందిస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 200లు చేసిందని, ఇప్పుడు రూ. వెయ్యి పింఛను ఇస్తున్నామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన ఘనత ఎన్టీఆర్‌దేనన్నారు. ఇంటింటికీ తెలుగు దేశం కార్యక్రమం చేపడితే, అలాంటి కార్యక్రమమే వైకాపా నిర్వహించిందని, అయితే దొంగల పార్టీ కావడంతో, ఇంట్లో నుంచి ఏ వస్తువు పట్టుకుపోతారోనని ప్రజలు భయపడేవారని ఎద్దేవా చేశారు. వృద్ధులకు పింఛను ఇవ్వడం వల్ల తన కోడలు రోజూ భోజనం పెడుతోందని ఓ వృద్ధురాలు తనతో చెప్పిన విషయాన్ని మంత్రి ఉటంకించారు. చంద్రన్న బీమా, ఉపకార వేతనాలను విద్యార్థులకు అందచేశారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సీమంతం కార్యక్రమంలో మహిళలకు చీరలు పంపిణీ చేశారు. సభ ప్రారంభంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రసంగాన్ని వినిపించారు. తర్వాత ఎమ్మెల్యే వెలగపూడి ప్రజల చేత జన్మభూమి, మా ఊరు ప్రతిజ్ఞ చేయించారు. 227 కొత్త రేషన్ కార్డులు, 230 ఇంటి పన్ను పుస్తకాలు, 129 వృద్ధాప్య పింఛన్లు, 67 ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. కార్యక్రమంలో జన్మభూమి ప్రత్యేక అధికారి వై.వి. అనూరాధ, జి.వి.ఎం.సి. కమిషనర్ హరినారాయణన్, మాజీ డిప్యూటీ మేయర్ మళ్ల అప్పలరాజు, మాజీ కార్పొరేటరు ఒమ్మి సన్యాసిరావు, చినగదిలి గ్రామీణ మండల తహశీల్దార్ భాస్కరరెడ్డి, జోనల్ కమిషనర్ సత్యవేణి, తెదేపా వార్డు అధ్యక్షులు ధర్మారావు, కార్యదర్శి యల్లమిల్లి సురేష్ తదితరులు పాల్గొన్నారు. 1,2,3 వార్డుల పరిధిలో క్రీడా మైదానం, రైతుబజారు, జూనియర్ కళాశాల ఏర్పాటుచేయాలంటూ మంత్రి అయ్యన్నపాత్రుడికి సి.పి.ఐ. నాయకుడు పిల్లి వీర్రాజు వినతి పత్రం అందచేశారు. కార్యక్రమానికి ముందు పలు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.



బాలికల నృత్య ప్రదర్శన

144 ప్రాంతాల్లో జన్మభూమి గ్రామసభలు

పాల్గొన్న మంత్రులు, ఎమ్మెల్యేలు, ఐఏఎస్ అధికారులు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: జన్మభూమి-మవూరు 5వ విడత గ్రామసభలు వరుసగా రెండోరోజు బుధవారం కొనసాగాయి. మొత్తం 147 చోట్ల సభలను నిర్వహించాల్సి ఉండగా అనివార్య కారణాల వల్ల మూడు సభలు జరగలేదు. 123 గ్రామసభలకు గాను 120 చోట్ల గ్రామసభలు జరిగాయి. విశాఖ నగరంతో పాటు ఎలమంచిలి, నర్సీపట్నం మున్సిపాల్టీల్లో 24 వార్డుల్లో సభలను నిర్వహించారు. రేషనుకార్డులు, సంక్రాంతి కానుకలు, పింఛన్లు, చంద్రన్న బీమా బాండ్లు పంపిణీ చేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణీలకు సీమంతం కార్యక్రమాలను చేపట్టారు. జిల్లా మంత్రులు అయ్యన్నపాత్రుడు నగర పరిధిలో జరిగిన గ్రామసభలో పాల్గొనగా మరో మంత్రి గంటా శ్రీనివాసరావు తన నియోజకవర్గమైన భీమిలిలో జరిగిన గ్రామసభలో పాల్గొన్నారు. మిగతా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తమతమ నియోజకవర్గాల్లో జరిగిన సభల్లో పాల్గొన్నారు. నగర పరిధిలో జరిగిన గ్రామసభలకు జేసీ డాక్టర్ జి. సృజన, వుడా వీసీ పి. బసంత్‌కుమార్‌లు హాజరయ్యారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు ప్రత్యేక అధికారులుగా నియమితులైన సీనియర్ ఐఏఎస్, ఐఎఫ్ఎస్ అధికారులు వై.వి. అనూరాధ, పి.ఎ. శోభ, శేఖర్‌బాబు పాడేరు ఐటీడీఏ పీవో రవిపట్టంశెట్టి, పాడేరు సబ్‌కలెక్టర్ డి.కె. బాలజీలు వారి వారి ప్రాంతాల్లో జరిగిన గ్రామసభలకు హాజరయ్యారు. కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ నర్సీపట్నం మండలం ధర్మసాగరం గ్రామానికి వెళ్లారు. ఇక వితనులు ఎప్పటి మాదిరిగానే వస్తున్నాయి. కొన్ని చోట్ల పింఛన్లు తమకు రాలేదని వృద్ధులు నిరసన తెలిపారు. గత రెండు రోజుల వ్యవధిలో గ్రామీణ ప్రాంతాల్లో 240 సభలు, నగర, పట్టణ ప్రాంతాల్లో 48 వార్డుల్లో సభలను పూర్తి చేశారు. మండల, గ్రామ, నియోజకవర్గ స్థాయిలో సభలకు హాజరవుతున్న ప్రజా ప్రతినిధులు, అధికారులు, ప్రత్యేక అధికారుల వివరాలను సేకరిస్తూ ప్రతీరోజూ ప్రణాళిక విభాగం ప్రభుత్వానికి నివేదికలు పంపుతోంది.

ఉత్తమ ఉపాధ్యాయినులకు పురస్కారాలు



పురస్కారం అందుకుంటున్న ఎరుకువానిపాలెం ప్రధానోపాధ్యాయులు రాంబాబు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: తొలి మహిళా ఉపాధ్యాయిని సావిత్రిబాయి పూలే జయంతిని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా రాష్ట్రప్రభుత్వం నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా విద్యారంగంలో ఉత్తమ సేవలందించిన ఉపాధ్యాయినులకు ఆంధ్ర విశ్వవిద్యాలయం స్నాతకోత్సవ మందిరంలో బుధవారం మంత్రి గంటా శ్రీనివాసరావు పురస్కారాలను సర్వశిక్ష అభియాన్ ఆధ్వర్యంలో అందించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ మాధవ్, ఎస్ఎస్ఏ రాష్ట్ర ఈడీ శ్రీనివాస్, ఏయూ వీసీ ఆచార్య నాగేశ్వరరావు, రెక్టార్ ఆచార్య గాయత్రిదేవి తదితరులు పాల్గొన్నారు.

పురస్కారాలు పొందిన వారు వీరే

కస్తూరిబా బాలికా విద్యాలయాలు:

బి. సన్యాసమ్మ (శ్రీకాకుళం), జి. జ్యోతి (పోలాకి, శ్రీకాకుళం), పి. శారద (గంట్యాడ, విజయనగరం), వి. యర్రాయమ్మ(జామి, విజయనగరం), ఎల్. లలిత భాను ఉమ(సబ్బవరం, విశాఖ), పి. సరోజని (రాంబిల్లి, విశాఖ), ఆర్. ఎస్. ఎల్. కె. దుర్గ (తొండంగి, తూ.గో.), వి. పోశమ్మ(వెలేరు, ప.గో.), ఎన్. అంజలి దేవి(ఎ. కొండూరు, కృష్ణా), కె. కవిత, ఎ. ఉషారాణి (ముప్పాళ్ల, గుంటూరు), బి. హెప్సిబా(చవటపాలెం, ప్రకాశం), ఎన్. శోభ(కె. బిట్రగుంట, ప్రకాశం), ఐ. కె. మాలిని(ఎ. ఎస్. పేట), కె. సి. ఝాన్సీ (కురుగుంట, అనంతపురము), పి. విజయవాణి(తాడపత్రి, అనంతపురము), ఎల్. ప్రమీల (పెండ్లిమర్రి, కడప), ఎల్. సుమంతమ్మ(చిట్వేల్, కడప), నాగరత్నమ్మ(కురబలకోట, చిత్తూరు), కె. జ్ఞానప్రసూనాంబ, జి. లక్ష్మి(డోన్, కర్నూలు), జి. జయలక్ష్మి(కల్లూరు, కర్నూలు).

ప్రధానోపాధ్యాయినులు...

పి. ఇందిరామణి(ఎ.వి.ఎన్.ఎం.సి. హెచ్ పాఠశాల, శ్రీకాకుళం), జి. విక్టోరియారాణి (జడ్పీహెచ్ఎస్, కొండవెలిగొండ, విజయనగరం), డి. సైరాభాను(జడ్పీహెచ్ఎస్ బాలుర, చిన్నమండెం, కడప), పి. శ్రీదేవి (జడ్పీహెచ్ఎస్, గట్టు, చిత్తూరు జిల్లా), బి. జీవరత్న(హిందూపురం మున్సిపల్ హైస్కూల్, అనంతపురము), సాజిదాబేగం(ఏపీఆర్ఎస్, బానవాసి, కర్నూలు).

సెకండ్ గ్రేడ్ టీచర్స్ (ఎస్‌జీటీ) విభాగం

బి. సుబ్బమ్మ(పురుషోత్తపురం, శ్రీకాకుళం), డి. రమాదేవి(వై.వి.పాలెం, విజయనగరం), ఎం. అనసూయ (ఎస్ఆర్‌పురం, విశాఖపట్నం), జి. అరుణకుమారి(మేడిచెర్లపాలెం, తూ.గో.), వి.ఎం. కిరణ్మయి(మట్టుమూడెం, ప.గో.), బి. విజయలక్ష్మి(సుల్తాన్‌నగరం, మచిలీపట్నం, కృష్ణా), మక్కెన జవహర్‌రాణి(పెదనందిపాడు, గుంటూరు), యడ్లపల్లి సమత(వింజనంపాడు, ప్రకాశం), పి. స్వతంత్రకుమారి(చిట్టమూరు, నెల్లూరు), జి. పద్మావతిహైమావతి(జాగవారిపల్లి, కడప), ఎ. ఆదిలక్ష్మి(తుమ్మలగుంట, చిత్తూరు), ఎస్.శైలజ(మిడతూరు, అనంతపురము), వి. రుక్మిణమ్మ(హనుమాన్‌నగర్, బేతంచెర్ల, కర్నూలు).

ఎల్ఎఫ్ఎల్ హెచ్‌ఎం. విభాగం

ఎ. వరలక్ష్మీదేవి(ఎంపీపీఎస్, ఎస్.వి.పి. నగర్, మండపేట, తూ.గో.), కె. మల్లీశ్వరి(ఎంపీపీఎస్ పందిళ్లపల్లి, ప్రకాశం), కె.వి. శ్రీదేవి(ఎంపీపీఎస్ కుప్పం, చిత్తూరు).

పీడీ, పీఈటీల విభాగం

పి. జయలక్ష్మి(జీహెచ్ఎస్, ఇచ్ఛాపురం, శ్రీకాకుళం), సిహెచ్. ఎ. సరస్వతి(శాలిపేట, కాకినాడ అర్బన్), డి. వరలక్ష్మి(జీజీహెచ్ఎస్, పొదిలి, ప్రకాశం).

వృత్తి విద్యా కోర్సుల విభాగం

కె. విజయలక్ష్మి(ఏపీఎస్‌డబ్ల్యుఆర్ఎస్, చీపురుపల్లి, విజయనగరం).

స్కూల్ అసిస్టెంట్లు..

ఎస్. గౌరీశ్వరమ్మ (జడ్పీహెచ్ఎస్ కోస్త, శ్రీకాకుళం), సిహెచ్. సుజాత(జడ్పీహెచ్ఎస్, రామవరం, విజయనగరం), వి. శ్రీదేవి (జడ్పీ గర్ల్స్ హైస్కూల్, తుని, తూ.గో.), సి. హెచ్. చిన్నతేరియాజమ్మ (జడ్పీహెచ్ఎస్, చింతలపూడి, ప.గో.), పి. నాగలక్ష్మి (ఏకేటీపీఎంజీహెచ్ఎస్, గుడివాడ, కృష్ణా), టి. సీతామహాలక్ష్మి(ప్రభుత్వ ఉన్నత పాఠశాల, గుంటూరు), మేడికొండ సుమలత(ఎస్‌వీఎస్ఏకే హైస్కూల్, గంగవరం, ప్రకాశం), టి. శశి(ఏపీఎస్‌డబ్ల్యుఆర్ఎస్, సూళ్లూరుపేట, నెల్లూరు), కె. భార్గవి(జడ్పీహెచ్ఎస్ బాలికల, ఖాజీపేట, కడప), సి. విజయలక్ష్మి(జడ్పీహెచ్ఎస్ వెంకటాపురం, అనంతపురము), ఎస్. రాజేశ్వరి(ఎంపీయూపీఎస్, వేములపాడు, కర్నూలు).

ఐఈఆర్‌టీ విభాగం..

ఉప్పు మహేశ్వరి(రేగిడి, శ్రీకాకుళం), ఎల్. నారాయణమ్మ(గంట్యాడ, విజయనగరం), బి. ఉమాదేవి(గాజువాక, విశాఖనగరం), ఎల్. వరలక్ష్మి(రాజమహేంద్రవరం), ఎస్. శ్యామల(ఏలూరు), కె. వెంకటసుధ(విజయవాడ), జి. అనురాధ(చేబ్రోలు, గుంటూరు జిల్లా), పి. రాజ్యలక్ష్మి(వెంకటగిరి, నెల్లూరు), ఎస్. ఎస్. సుకవిత(కనిగిరి, ప్రకాశం జిల్లా), ఎం. వి. సుభద్రమ్మ(చెన్నూరు, కడప జిల్లా), ఎస్. ఎస్తేరు రాణి (గూడూరు, కర్నూలు జిల్లా), కె. అక్కమ్మ(సింగనమల, అనంతపురము జిల్లా).

కస్తూరిబా బాలికా విద్యాలయం ప్రత్యేకాధికారులు..

ఎస్. హైమావతి (లావేరు, శ్రీకాకుళం), ఇ. ధనలక్ష్మి(చీపురుపల్లి, విజయనగరం), గంగ (పద్మనాభం, విశాఖపట్నం), ఎం. రాజేశ్వరి(తుని, తూ.గో.), జె. కృపామణి(కుక్కునూరు, ప.గో.), ఎం. వెంకటలక్ష్మి(ఎ. కొండూరు, కృష్ణా), బి. ఎస్. ఈశ్వరమ్మ (నూజెండ్ల, గుంటూరు), ఎన్. స్రవంతి(కె. బిట్రగుంట, ప్రకాశం), వి. శ్రీలక్ష్మమ్మ (కళిగిరి, నెల్లూరు), ఎస్. ఎం. రఫియాప్రవీణ్(పెద్దమాండ్యం, చిత్తూరు), జె. రమాదేవి(నంద్యాల, కర్నూలు), పి. శిరీష(అమడగరు, అనంతపురము), ఎస్. నసీమున్నీసా(వల్లూరు, కడప).

సమస్యలు పరిష్కరించకపోతే.. సంక్రాంతిలోపే ఆందోళన

ఈనాడు, విశాఖపట్నం: ఆర్టీసీ డిపోల్లో నెల కొన్న సమస్యలను పరిష్కరించకపోతే సంక్రాంతి లోపే ఆందోళనకు దిగుతామని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అదనపు కార్యదర్శి పలిశెట్టి దామోదరరావు స్పష్టం చేశారు. ఆయన 'ఈనాడు'తో మాట్లాడారు. జిల్లాలోని 10 డిపోల్లో యాజమాన్యం వైఖరి కారణంగా అధిక శాతం కార్మికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని ఆరోపించారు. కొందరు అధికారులు, సూపర్‌వైజర్లు ఒకే వర్గానికి కొమ్ముకాస్తూ నిబంధనలు లెక్క చేయకుండా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. సమస్యలను పరిష్కరించడంలో గుర్తింపు సంఘం విఫలమైందన్నారు. విశాఖ రీజియన్‌లో ఏడీసీల పదోన్నతిలో అవకతవకలను సరి చేసి రూరల్ డివిజన్‌లో ఉన్నవారందరికీ న్యాయం చేయాలని కోరారు. స్టీల్ సిటీ డిపోలో అక్రమంగా సస్పెండ్ చేసిన ఆరుగురిని విధుల్లోకి తీసుకోవాలన్నారు. అర్హత ఉన్న సీనియర్లకు గ్రేడ్ 1 పదోన్నతులు అన్ని కేటగిరీల్లోనూ ఇవ్వాలన్నారు. విశాఖ రూరల్ డిపోలో పనిచేస్తూ 55 ఏళ్లు దాటిన డ్రైవర్లను సిటీ డిపోలకు బలవంతంగా బదిలీ చేయకుండా అదే డిపోల్లోని పల్లెవెలుగు సర్వీసులు ప్రవేశపెట్టి విధుల్లో వేయాలన్నారు. కేసుల పరిష్కారంలో గాజువాక, స్టీల్‌సిటీ, సింహాచలం డిపోల్లో డిపో మేనేజర్లు వివక్ష వీడాలని డిమాండ్ చేశారు.



ప్రపంచ వాణిజ్య సంస్థ అంతర్జాతీయ వాణిజ్యాన్ని నియంత్రించడానికి ఏర్పాటైంది. ఇది ప్రపంచంలోనే అతిపెద్ద అంతర్జాతీయ ఆర్థిక సంస్థ. భాగస్వామ్య దేశాల మధ్య జరిగే వస్తువులు, సేవలు, మేధోసంపత్తి హక్కుల వాణిజ్యాన్ని నియంత్రించడం, వాణిజ్య సంబంధాలను సమర్థంగా నిర్వహించేందుకు అనువైన కార్యాచరణను రూపొందించడం, వివాదాలను పరిష్కరించడం దీని ప్రధాన బాధ్యతలు. తాజాగా జరిగిన ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీఓ) IIవ మంత్రుల స్థాయి సదస్సు ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలకు ఏ పరిష్కారం చూపకుండానే ముగిసింది.



ప్రతిభ

ఆహారానికి ఏదీ భద్రత...?

డబ్ల్యూటీవో మంత్రుల స్థాయి సదస్సు - 2017

ప్రపంచ వాణిజ్య సంస్థ 11 వ మంత్రులు స్థాయి సదస్సు అర్జెంటీనా రాజధాని బ్యూనస్ ఎయిర్స్‌లో డిసెంబరు 10 నుంచి 13 వరకు నాలుగురోజుల పాటు జరిగింది. ఈ సదస్సులో 164 సభ్య దేశాలు పాల్గొన్నాయి. సేవా వాణిజ్యాన్ని సులభతరం చేయడం, ఈ-కామర్స్ సేవలు, మార్కెట్ సౌలభ్యం, దేశీయ నియంత్రణలు, ఆహారభద్రత, వాణిజ్యం - మహిళా సాధికారిత తదితర అంశాలపై చర్చ జరిగింది. ఈ సమావేశాల్లో ఆహారధాన్యాల నిల్వ, రాయితీల సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆశించినా ఎలాంటి పరిష్కారం చూపకుండానే చర్చలు ముగిశాయి. బహుళైచ్ఛిక వాణిజ్య విధానాల విషయంలోనూ ఎలాంటి పురోగతి లేదు. అయితే మత్స్య సంపదపై రాయితీల నిషేధం విషయంలో సభ్యదేశాలకు ఉన్న నిబద్ధతపై 2019 కల్లా పరిష్కారాన్ని చూపుతామనే భరోసా ఇచ్చేందుకు మంత్రుల స్థాయి సమావేశం ప్రయత్నించింది.

- ✦ భారత్, చైనా సహా పలు అభివృద్ధి చెందుతున్న దేశాలు ఎలాంటి కఠినతర నిబంధనలు లేకుండా తమ తమ దేశాల్లో ఆహారభద్రతా కార్యక్రమాలను అమలు చేసేందుకు అమెరికా మోకాలడ్డింది. దీంతో చర్చలు విఫలమయ్యాయి. ప్రధాన విషయాలకు సంబంధించి నిర్ణయాలు తీసుకోవడంలో ప్రపంచ వాణిజ్య సంస్థలోని భాగస్వామ్య దేశాలన్నీ మూకుమ్మడిగా ఏకాభిప్రాయానికి రావాల్సి ఉంటుంది. కాబట్టి ఏ ఒక్క దేశమైనా కావాలనుకుంటే ప్రక్రియను ముందుకు సాగనీయకుండా చేయొచ్చు.
- ✦ 2001 లో ప్రపంచ వాణిజ్య సంస్థ ఆవిర్భావం నుంచి నేటి వరకు ఎన్నో అపరిష్కృత సమస్యలకు పరిష్కారాలను ప్రతిపాదించకుండానే 'కొత్త అజెండా'ను తెరమీదకు తెచ్చేందుకు యూరోపియన్ సమాఖ్య (ఈయూ) దేశాలు పావులు కదుపుతున్నాయి. ఆహారభద్రత సాధనలో అభివృద్ధి చెందుతున్న దేశాల హక్కులపై 2001 లో దోహాలో జరిగిన చర్చలు ఎటూ తేలకుండా ముగిశాయి. నాటి నుంచి నేటి వరకు ఆహారభద్రత హక్కుల విషయమై ఇతమిద్ధంగా తేలిందేమీ లేదు. సమావేశం అనంతరం వెలువరించాల్సిన మంత్రుల ప్రకటన కూడా రద్దయ్యింది. దీంతో భారత్ సహా పలు అభివృద్ధి చెందుతున్న దేశాలు తీవ్ర నిరాశకు గురయ్యాయి.
- ✦ సభ్య దేశాలు నిరాశకు గురవడం కొంత కటువైందైనప్పటికీ అవి ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని డబ్ల్యూటీఓ డైరెక్టర్ జనరల్ రాబెర్టో అజ్వేడో వ్యాఖ్యానించడం గమనార్హం. ఈ సమావేశాలకు భారత్ తరపున కేంద్రమంత్రి సురేశ్ ప్రభు హాజరయ్యారు. ఒక సభ్య దేశం వైఖరి కారణంగా ఎలాంటి నిర్ణయాలు లేకుండానే సమావేశాలు ముగిశాయని భారత్ ప్రకటించింది.

భద్రతలేని ఆహార హక్కు

ప్రపంచ వాణిజ్య సంస్థ మంత్రులు స్థాయి సమావేశంలో అమెరికా వ్యతిరేకత చూపినా భారత్ మాత్రం ఆహార భద్రత హక్కు విషయంలో అభివృద్ధి చెందుతున్న దేశాల పక్షాన గట్టిగానే వాదించింది. గత దశాబ్ద కాలంగా తమ దేశాల్లోని వ్యవసాయోత్పత్తులకు మద్దతు ధరలను చెల్లిస్తూ రైతులకు అండగా నిలుస్తున్న అమెరికా, యూరోపియన్ సమాఖ్య దేశాలు ఇదే విషయంలో అభివృద్ధి చెందుతున్న దేశాలకు మాత్రం మోకాలడ్డుతున్నాయి.

- ✦ సంపన్న దేశాలకు అనుకూలంగా రూపొందించుకున్న డబ్ల్యూటీఓ నిబంధనలను సవరించాలని భారత్, చైనా ప్రతిఘటించినా అడుగు ముందుకు పడలేదు. ఆది నుంచి భారత్ ఈ దిశగా పట్టిన పట్టు విడవకుండా కృషి చేస్తోంది. సన్న, చిన్నకారు, అల్పాదాయవర్గ రైతుల నుంచి సరైన మద్దతు ధరకు ధాన్యాన్ని సేకరించి, తిరిగి దారిద్ర్యరేఖకు దిగువనున్న ప్రజలకు ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా సరఫరా చేసే యంత్రాంగాన్ని మెరుగుపరిచి, పటిష్టవంతం చేసే దిశగా భారత్ సుదీర్ఘ కసరత్తు చేస్తోంది.
- ✦ డబ్ల్యూటీఓ నిబంధనల ప్రకారం రైతుల నుంచి సేకరించే వ్యవసాయ ఉత్పత్తులకు, ఆహార రాయితీల కింద ఇచ్చే మొత్తం సొమ్ము, ఆ దేశ మొత్తం ఆహార ఉత్పత్తుల విలువలో (1986-88 నాటి ధరల ప్రకారం) 10 శాతానికి మించకూడదు. ఒకవేళ అభివృద్ధి చెందుతున్న దేశాలు రైతులకు అంతకు మించి

జనరల్ స్టడీస్

చెల్లించినట్లయితే దాన్ని వాణిజ్య నిబంధనల ఉల్లంఘనగా పరిగణిస్తారు. ఇలాంటి పరిమితులు తాము అమలు చేస్తున్న 'ఆహారభద్రత' కార్యక్రమానికి విఘాతం కలిగిస్తాయంటూ భారత్ తీవ్ర అభ్యంతరాన్ని వ్యక్తం చేసింది. 2013 లో బాలిలో జరిగిన సమావేశంలో కూడా దీనిపై చర్చించారు. అప్పట్లో ఈ విషయమై ఒక అంగీకారానికి వచ్చి 'శాంతి నిబంధన' ప్రతిపాదించారు. ఇది ఒకరకంగా భారత్ లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాలకు రక్షణ కవచం లాంటిది. దీని ప్రకారం ఏ దేశమైనా ఈ 10 శాతానికి మించి చెల్లించరాదనే నిబంధనను ఉల్లంఘిస్తే దాన్ని డబ్ల్యూటీఓలో సవాలు/ ఫిర్యాదు చేయకూడదనేది ప్రధాన సారాంశం. ఈ శాంతి నిబంధన ఉన్నా భారత్ లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాల సార్వభౌమ హక్కులను కాలరాసి, రైతులకు ఆహార రాయితీలు ఇవ్వకుండా, కనీస మద్దతు ధర చెల్లించకుండా సంపన్న రాజ్యాలు ఒత్తిడి చేస్తున్నాయి. కాబట్టే భారత్ ఈ బ్యూనస్ ఎయిర్స్ సమావేశంలో 'శాంతి నిబంధన' లోని అంశాలను మరింత మెరుగుపరచి, ఆహార భద్రత సమస్యలకు శాశ్వత పరిష్కారాన్ని కనుక్కునేలా దీన్ని తీర్చిదిద్దాలని డిమాండ్ చేసింది. తృతీయ ప్రపంచ దేశాలు సైతం ఈ విషయంలో భారత్‌లో గొంతు కలిపాయి.

- ✦ నిజానికి అమెరికా, యూరోపియన్ దేశాలు ఉమ్మడిగా తమ రైతులకు ఏటా 16 వేల కోట్ల డాలర్లకు పైగా భారీ రాయితీలు ఇస్తున్నాయి. స్థూలదేశీయోత్పత్తిలో వ్యవసాయరంగం నుంచి సమకూరుతున్న వాటాలో అమెరికా తిరిగి సగభాగాన్ని రైతుల సబ్సిడీల కోసమే కేటాయిస్తోంది. అమెరికాతో పోలిస్తే భారత్ రాయితీల రూపంలో రైతులకు చెల్లిస్తున్నది అత్తెసరు మాత్రమే.

అమెరికా సేంద్రియ సాగు, పర్యావరణ పరిరక్షణ పేరు చెప్పుకుని వ్యవసాయ స్థూలదేశీయోత్పత్తి వాటాలో 40 శాతం నిధులను 'గ్రీన్ బాక్స్' పేరిట రాయితీల రూపంలో రైతులకు చెల్లిస్తోంది. అయినా ప్రపంచవాణిజ్య సంస్థ వీటిని మార్కెట్ విచ్ఛిన్నకర రాయితీలుగా పరిగణించకపోవడం దారుణం. అమెరికా లాంటి సంపన్న దేశాలు 'గ్రీన్ బాక్స్' పేరుతో డబ్ల్యూటీఓ నిబంధనలకు చిక్కకుండా తప్పించుకుంటున్నాయి.

- ✦ సగానికిపైగా జనాభాకు వ్యవసాయమే జీవనాధారంగా ఉన్న, మూడోవంతు జనం అర్ధాకలితో అలమటిస్తున్న భారత్ లాంటి దేశంలోని పరిస్థితులు అమెరికాకు పూర్తి భిన్నం. రైతులకు మద్దతు ధరలు చెల్లించడంతో పాటు వ్యవసాయ ఉత్పాదకాలపై రాయితీలు ఇవ్వక తప్పదు. ఈ తరహా చర్యలు ప్రపంచ వాణిజ్య సంస్థ నిర్దేశించిన 'మార్కెట్ విచ్ఛిన్నకర' రాయితీల పరిధిలోకి వస్తాయని ఐరోపా, అమెరికా దేశాలు గొంతు చించుకుంటున్నాయి. ఈ రకమైన సంపన్న దేశాల దాష్టీకాన్ని భారత్ మొదటి నుంచీ అనేక వేదికలపై ఎప్పటికప్పుడు ఎండగడుతూనే వస్తోంది.
- ✦ 2013 లో బాలిలో, 2015 లో నైరోబీ సదస్సుల్లో వర్ధమాన దేశాలను కూడగట్టుకుని, న్యాయమైన తమ హక్కులు, బడుగు బలహీన వర్గాల ఆహార భద్రత కోసం, రైతులను ఆదుకోవడానికి భారత్ తన వాదనను గట్టిగానే వినిపించింది. ఆహార భద్రత హక్కుల కోసం కృషి చేస్తున్న అభివృద్ధి చెందుతున్న దేశాలపై 10 శాతం పరిమితి నిబంధనను ఎత్తేయాలని గతంలోనే 45 దేశాలను కూడగట్టుకుని డబ్ల్యూటీఓలో వాదించింది.

కానీ అమెరికా, యూరోపియన్ సమాఖ్య దేశాలు భారత్ వాదనను తోసిపుచ్చాయి. ఈసారి మాత్రం వర్ధమాన దేశాల గళం మరింత పదునెక్కింది. చైనాతో సహా 100 కు పైగా దేశాలు మద్దతు ఇచ్చాయి. ఎలాంటి నిర్ణయం లేకుండా సమావేశాలు ముగిసినా అమెరికా తీరుపై ధిక్కార స్వరం మరింత పెరగడం ఆ దేశ వైఖరిలో మార్పు తెస్తుందేమో చూడాలి.

ప్రపంచ వాణిజ్యం - మహిళా సాధికారత

ఆహారభద్రత విషయంలో ఎటూ నిర్ణయం తీసుకోలేకపోయిన డబ్ల్యూటీఓ - 17 సమావేశం 'మహిళా సాధికారత' పట్ల మాత్రం చారిత్రాత్మక నిర్ణయాన్ని ప్రకటించింది. ప్రపంచంలో నాలుగింట మూడోవంతు దేశాలు సభ్యులుగా ఉన్న డబ్ల్యూటీఓ వర్తక, వాణిజ్యాల్లో మహిళల భాగస్వామ్యంపై ఎదురవుతున్న అవరోధాలను తొలగించడానికి సత్వర చర్యలకు ఉపక్రమించాలని నిర్ణయించింది. లింగ సమానత, మహిళా సాధికారత కోసం విశేషంగా మద్దతు ఇస్తున్న భారత్ డబ్ల్యూటీఓలో మైనార్టీ వర్గంలో ఉన్నా, బాగా ప్రభావితం చేసేదిగా ఉండి కూడా ఈ విషయంపై సానుకూలంగా వ్యవహరించలేదు. లింగ భేదం వాణిజ్య సంబంధమైన విషయం కాదని, వాణిజ్య సంబంధిత అంశాలకు - మహిళా సాధికారకతకు లంకె పెట్టడం సమంజసం కాదనే అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది.

- ✦ అభివృద్ధి చెందిన దేశాలు అవలంబిస్తున్న లింగపరమైన విధానాల్లో ఉన్నత ప్రమాణాలుగా పేర్కొంటున్నవి అభివృద్ధి చెందుతున్న దేశాల ఎగుమతులకు అడ్డుకట్ట వేయడమేకాక అభివృద్ధి చెందుతున్న దేశాలు తమ మహిళలకు ప్రోత్సాహం కల్పించడాన్ని పరోక్షంగా నియంత్రిస్తున్నాయి. అలాగే లింగసంబంధమైన అంశాలపై చర్యలు చేపట్టడానికి డబ్ల్యూటీఓ వేదికగా, ఒక సరైన వేదిక అవసరమని భారత్ అభిప్రాయపడింది. ఎందుకంటే ప్రపంచ వాణిజ్య సంస్థ అనేది కేవలం వాణిజ్య సంబంధ సంస్థ. వాణిజ్యేతర అంశాలైన కార్మికులు, పర్యావరణం- ప్రమాణాలు మొదలైనవి చర్చించడానికి డబ్ల్యూటీఓలో మరొక విభాగాన్ని ఏర్పాటు చేయడం సమంజసమని భారత్ అభిప్రాయం.
- ✦ ప్రపంచ వాణిజ్య సంస్థ చరిత్రలోనే తొలిసారిగా 119 సభ్య దేశాలు 'మహిళలు - వాణిజ్యం' అనే బ్యూనస్ ఎయిర్స్ డిక్లరేషన్‌కు మద్దతు ఇచ్చేందుకు అంగీకరించాయి. మహిళల వాణిజ్య భాగస్వామ్యంలోని ప్రతిబంధకాలను తొలగించేందుకు, ఆర్థిక - వాణిజ్య రంగంలో మహిళా సాధికారతను వేగవంతం చేసేందుకు ఇది దోహదం చేస్తుంది. డిక్లరేషన్‌లో పొందుపర్చిన కార్యాచరణ మహిళలకు మరిన్ని మెరుగైన ఉపాధి అవకాశాలను కల్పిస్తుందని డబ్ల్యూటీఓ పేర్కొంది. లింగ సమానత ద్వారా సాధికారత సాధ్యమవుతుందని, తద్వారా ఐక్య రాజ్య సమితి నిర్దేశించిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను సాధించేందుకు ఇవి దోహదం చేస్తాయని పేర్కొంది.
- ✦ వాణిజ్యంలో మహిళల భాగస్వామ్యాన్ని పెంచడం ద్వారా మహిళలకు సమానావకాశాలను కల్పించడం సాధ్యమవుతుందని, తద్వారా ప్రపంచ స్థూల దేశీయోత్పత్తికి 2025 నాటికి 28 ట్రిలియన్ డాలర్లు జతకూడతాయని ఇంటర్నేషనల్ ట్రేడ్ సెంటర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అర్చనా గోంజాలెజ్ అభిప్రాయపడ్డారు.
- ✦ ఈ డిక్లరేషన్ మహిళల అభ్యున్నతికి ప్రతిబంధకంగా నిలుస్తున్న డబ్ల్యూటీఓ నిబంధనలను గురించి వెల్లడించడంలో విఫలమైందని, దీనికి బదులు అసమానతలు, అణిచివేతలకు దోహదం చేస్తున్న డబ్ల్యూటీఓ విధానాలకు ముసుగువేసి చూపించినట్లు ఉందని 160 దేశాలకు చెందిన మహిళా హక్కుల సంస్థలు ఒక సంయుక్త ప్రకటనలో ఖండించాయి. ప్రపంచంలోని అన్ని మహిళా హక్కుల సంఘాలు ఈ డిక్లరేషన్‌ను తిరస్కరించాయని, డబ్ల్యూటీఓ అనుసరిస్తున్న హానికారక విధానాల నుంచి దృష్టి మళ్లించడానికి చేపపిల్లలకు వేసిన ఎరగా దీన్ని ప్రకటించారని మహిళల న్యాయం,

ప్రపంచ వ్యవసాయ వాణిజ్య నిబంధనలను ప్రజాస్వామికంగా సంస్కరించాలన్నదే భారత్ ప్రధాన ఆశయం. ఆకలి, దారిద్ర్యం నుంచి ప్రపంచానికి విముక్తి కల్పించాలనేది ఐక్య రాజ్య సమితి సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో కీలకమైంది. ఆహారభద్రత కల్పనలో అభివృద్ధి చెందుతున్న దేశాల హక్కులను గౌరవించాల్సిన ఆవశ్యకత సుస్పష్టం.

సంక్షేమ విభాగం, ఆసియా ఎకనామిక్ ఫోరం, గ్లోబల్ కో-ఆర్డినేటర్ కేట్ లాపిన్ అభిప్రాయపడ్డారు.

- ✦ డబ్ల్యూటీఓ సభ్య దేశాలు, మద్దతుదారులు మాత్రం వాణిజ్య, ఆర్థిక లావాదేవీల్లో మహిళల వెనుకబాటుతనాన్ని సరిదిద్ది, వారిని ప్రోత్సహించేదిగా ఉందని, మహిళల ఆర్థిక స్వావలంబనకు ఇది దోహదం చేస్తుందని చెబుతున్నాయి. లింగ సమానత్వాన్ని దృష్టిలో ఉంచుకుని సభ్య దేశాలు విధానాలను రూపొందించి, మదింపు చేస్తాయని, దీని ప్రగతి నివేదిక 2019 లో విడుదల చేసే అవకాశం ఉందని ప్రపంచ వాణిజ్య సంస్థ పేర్కొనడం గమనార్హం. భారత్ మాత్రం ఈ చర్యను నిర్ద్వంద్వంగా తోసిపుచ్చింది.

ఈ-కామర్స్

ఈ-కామర్స్ సేవలపై ప్రపంచవ్యాప్త నిబంధనలు ఉండకూడదని భారత్ వాదిస్తోంది. ఇలాంటి నిబంధనలకు తాము వ్యతిరేకం కాకపోయినా ఇవి తమకు ఇబ్బందికరంగా ఉంటాయని భారత్ అభిప్రాయం. ఈ-ట్రాన్స్‌మిషన్‌పై సభ్యదేశాలు కస్టమ్ డ్యూటీ విధించడాన్ని నిషేధించేందుకు ఉద్దేశించిన మారటోరియాన్ని విస్తరించడంపై అంగీకారం తెలిపేందుకు భారత్ ముందస్తు షరతులు విధించింది.

- ✦ 1998 లో జరిగిన రెండో మంత్రుల స్థాయి సమావేశంలో 'గ్లోబల్ ఈ-కామర్స్ డిక్లరేషన్'లో ఈ మారటోరియాన్ని అమల్లోకి తెచ్చారు. దీని ప్రకారం సభ్య దేశాలు తమ ఈ-ట్రాన్స్‌మిషన్ కార్యకలాపాలపై కస్టమ్స్ సుంకం విధించడాన్ని కొనసాగించవచ్చని నిర్ణయించారు. ఇది తాత్కాలికమే అయినా ప్రతి రెండేళ్లకోసారి జరిగే మంత్రుల స్థాయి సమావేశంలో దీన్ని పొడిగించుకుంటూ వస్తున్నారు. అభివృద్ధి చెందిన దేశాలు మాత్రం ఈ-ట్రాన్స్‌మిషన్ కార్యకలాపాలపై కస్టమ్స్ సుంకం విధించేందుకు 'శాశ్వత మారటోరియం' విధించాలని డిమాండ్ చేస్తున్నాయి. ఈ చర్య అభివృద్ధి చెందుతున్న దేశాలు చూపుతున్న చొరవను ప్రభావితం చేసేదిగా ఉందని భారత్ అభిప్రాయపడింది. ఇలాంటి చర్యలు భారత్ సహా పలు దేశాల్లోని దేశీయ ఔషధ తయారీ పారిశ్రామిక రంగానికి హాని కలిగించవచ్చనేది అభివృద్ధి చెందుతున్న దేశాల వాదన. ప్రపంచ వాణిజ్య సంస్థకు చెందిన విభాగాల్లో రూపొందించిన వర్క్ ప్రోగ్రామ్ మార్గదర్శకాలు, ప్రస్తుతం అమల్లో ఉన్న విధానాన్ని అనుసరించి ఈ-కామర్స్‌పై చర్చలు కొనసాగించడానికి ఇతర సభ్యదేశాల అంగీకారాన్ని, మద్దతును బట్టి మారటోరియంపై భారత్ తన నిర్ణయాన్ని వెల్లడిస్తుందని పేర్కొంది.
- ✦ మొత్తానికి ఈ-కామర్స్‌పై ప్రతిబంధకంగా పరిణమిస్తున్న నిబంధనలను ఎత్తివేయాలని భారత్ లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాలు అభిప్రాయపడుతున్నాయి. అలాగే తమ దేశ సాఫ్ట్‌వేర్, అకౌంటింగ్ నిపుణులు, నర్సులకు ఇతర దేశాల్లో అవకాశాలు కల్పించాలని భారత్ కోరుతోంది.



రచయిత:
డాక్టర్ జి.వి.ఎల్. విజయ్‌కుమార్

ఏపీ టెట్

చరిత్ర

ఆహార సేకరణ నుంచి ఆహార ఉత్పత్తి వరకు

ఆదిమానవుడు

- భారతదేశంలో నివసించిన ఆదిమానవుడిని రామా పిథికస్ అంటారు.
- ఐరోపాలో నివసించిన ఆదిమానవుడిని నియాండెర్తల్ నరుడు అంటారు.
- మొదటి మేధావి మానవుడిగా హోమో ఎరక్టస్‌ను పేర్కొంటారు.
- ఆధునిక మానవుడి శాస్త్రీయ నామం హోమో సెపియన్.
- మానవుడి అభివృద్ధి మొత్తం 5 దశల్లో జరిగింది.
- ఆదిమానవుడి కాలాన్ని మూడు యుగాలుగా విభజించారు. అవి: 1. ప్రాచీన శిలాయుగం, 2. మధ్య శిలాయుగం, 3. నవీన శిలాయుగం
- ప్రాచీన, మధ్య శిలాయుగాల్లో మానవుడు వేటను ప్రధాన వృత్తిగా చేసుకుని సంచార జీవితాన్ని గడిపేవాడు. ఈ యుగాల్లో మానవుడు ఆహార సేకరణ/ఆహార అన్వేషణ దశలో ఉండేవాడు.
- ప్రాచీన శిలాయుగంలో మానవుడు పెద్ద పెద్ద బండరాళ్లను పెచ్చులుగా కొట్టి ఆయుధాలుగా ఉపయోగించేవాడు. వాటినే ఛేదకాలు, దరకాలు, చేతి గొడ్డళ్లు అనేవారు.
- మానవుడు చేతి గొడ్డలిని వాడిన కాలం ప్రాచీన శిలాయుగం.
- మధ్య శిలాయుగంలో అతిచిన్న రాళ్లను ఆయుధాలుగా ఉపయోగించాడు. కాబట్టి ఈ యుగాన్ని సూక్ష్మ శిలాయుగం అంటారు.
- సూక్ష్మ శిలాయుగంలో మానవుడు నిప్పును కనుక్కున్నాడు. జంతువులను మచ్చిక చేసుకున్నాడు.
- నవీన శిలాయుగంలో మానవుడు వ్యవసాయాన్ని ప్రధాన వృత్తిగా మార్చుకుని, స్థిర నివాసాన్ని ఏర్పాటు చేసుకున్నాడు. ఈ యుగంలో రాతి గొడ్డలి, రాతి కొడవలి, రాతి పారలను ఆయుధాలుగా ఉపయోగించాడు.
- మధ్యప్రదేశ్‌లోని నంద్రా గ్రామంలో రాతి పనిముట్లు లభించాయి.
- జమ్మూ కశ్మీర్‌లో రాతితో చెక్కిన పరికరాలు లభించాయి.
- ఝార్ఖండ్‌లో పురాతన రాతి పనిముట్లు లభించాయి.
- తమిళనాడులోని గుడియం గుహల నుంచి సూక్ష్మరాతి పరికరాలను వెలికితీశారు.
- మహారాష్ట్రలోని నెవాస ప్రాంతంలో నవీన శిలాయుగపు పనిముట్లు లభించాయి.
- ఆదిమానవుడు ఉపయోగించిన రాతి గొడ్డలి ఆంధ్రప్రదేశ్‌లోని పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని కామకూర్‌లో లభించింది.
- కర్నూలు జిల్లాలోని బెలూమ్ గుహలు, బేతంచెర్ల, బనగానపల్లి ప్రాంతాల్లో ఆదిమానవుడి ఆనవాళ్లను కనుక్కున్నారు.
- ఎముకలతో చేసిన పనిముట్లు కర్నూలు జిల్లాలోని ముచ్చట్ల చింతమానులో లభించాయి (ఇవి భారత ఉపఖండంలో ఇంకెక్కడా దొరకలేదు).
- ఆదిమానవుడు గుహల్లో చిత్రాలను గీసేవాడు.
- వై.ఎస్.ఆర్. కడప జిల్లా, ముద్దనూరు మండలంలోని చింతకుంట గ్రామంలో ఆదిమానవుడి పది రాతి చిత్రకళా స్థావరాలు లభించాయి.
- చింతకుంట రాతి చిత్రకళా స్థావరాల్లో మొత్తం 200 చిత్రాలున్నాయి. వీటిలో 10 తెలుపు రంగులో ఉండగా మిగిలినవి ఎరుపు రంగులో ఉన్నాయి.
- ఎరుపు రంగు చిత్రాల్లో ఒకే గుహలోని మూపురం ఉన్న ఎద్దు చిత్రం ప్రసిద్ధి చెందింది. ఈ గుహను స్థానికంగా ఎద్దుల, ఆవుల గుండు అని పిలుస్తారు.

ఆంధ్రదేశంలో ఉన్న ఇతర రాతి చిత్ర కళా స్థావరాలు

- బొల్లారం, కాలువబుగ్గ, కేతవరం, ఆథోని - కర్నూలు జిల్లా.
- శ్రీకాళహస్తి, రేణిగుంట, వెంబ ఖండ్రిగ - చిత్తూరు
- నాయుడుపల్లె, సింగరాయకొండ - ప్రకాశం
- వేల్పుమడుగు, భోగదవి తెనగల్ - అనంతపురం
- చింతకుంట, దాపల్లి - కడప
- కావలి, నందిపాడు - నెల్లూరు
- వినుకొండ - గుంటూరు
- 12000 సంవత్సరాల నుంచి మానవులు వ్యవసాయం చేసి, పంటలు పండించడం ద్వారా ఆహారాన్ని పొందుతున్నారు.

- సుమారు 100 కోట్ల సంవత్సరాల కిందట భూమి ఏర్పడింది.
- భూమిపై ఆవిర్భవించిన తొలి జీవ పదార్థం లార్వా.
- ప్లాజిల్లేటాను ప్రాథమిక జీవరాశిగా పేర్కొంటారు.
- ఏప్స్ అనే తోకలేని కోతి నుంచి మానవుడు ఆవిర్భవించాడు.
- మానవుడు నివసించిన తొలి ఖండం ఆఫ్రికా. ఆఫ్రికాలోని ఆదిమానవుడిని ఆస్ట్రలో పిథికస్ అంటారు.

ప్రతిభ

భారత్‌లో ఆవిర్భవించిన తొలి సామ్రాజ్యం..?



రచయిత
బొత్స నాగరాజు
విషయ నిపుణులు

- **భారతదేశంలో ఆదిమానవుల ప్రారంభ వ్యవసాయ ఆనవాళ్లు లభించిన ప్రాంతాలు**
  బెలూచిస్థాన్ - 9000 సంవత్సరాల కిందటి ఆనవాళ్లు
  కశ్మీర్ - 5000 సంవత్సరాల కిందటి ఆనవాళ్లు
  బిహార్ - 4000 సంవత్సరాల కిందటి ఆనవాళ్లు
- ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాల్లో 5000 సంవత్సరాల కిందటి బూడిద దిబ్బలు బయటపడ్డాయి.
- అనంతపురం జిల్లాలోని పాళ్యాయిలో బూడిద దిబ్బలు/మసి దిబ్బలు వెలుగు చూశాయి.
- ఆదిమానవులు అటవీ ప్రాంతంలో పోడు వ్యవసాయం చేసేవారు.
- మన రాష్ట్రంలో నేటికీ యానాదులు, చెంచులు సంచార జీవితాన్ని గడుపుతున్నారు.
- ఆదిమానవులు పురుషులు, స్త్రీలు, పిల్లలు అంతా కలిసి గుంపులు, గుంపులుగా వేటకు వెళ్లేవారు.
- వేట బాగా జరగాలని జంతువులు, వృక్షాలు, నదులు, పర్వతాలను పూజించేవారు.
- ఆదిమానవుడు తన ఆహార పదార్థాలను మట్టి పాత్రలు/ కుండల్లో దాచుకునేవాడు.
- చనిపోయిన వారికి రాక్షసగుళ్ల పేరుతో సమాధులు నిర్మించేవారు.

సామ్రాజ్యాలు, గణతంత్రాల ఆవిర్భావం

- 2700 సంవత్సరాల కిందట ప్రజలు గంగా, యమునా పరీవాహక ప్రాంతాల్లో స్థిరపడ్డారు.
- సంస్కృత భాషలో జన అంటే తెగ, పదం అంటే స్థిర పడిన ప్రాంతం.
- మహా జనపదాల కాలంలో ఢిల్లీ, ఆత్రంజిఖేర, కౌశాంబి, పట్నా, అయోధ్య, రాజగిర్ లాంటి నగరాలు అభివృద్ధి చెందాయి. (రెండో నగరీకరణ).
- గమనిక: సింధు నాగరికత కాలాన్ని తొలి నగరీకరణగా పేర్కొంటారు.
- 16 మహాజనపదాల్లో 14 జనపదాలు రాచరిక వ్యవస్థను, 2 జనపదాలు గణతంత్రాలను కలిగి ఉండేవి.
- వజ్జి, మల్ల నాటి రెండు గణతంత్రాలు.
- ఎన్నికైన రాజ్యాధినేత ఉన్న రాజ్యాలను గణతంత్రాలుగా పేర్కొంటారు.
- భారతదేశంలో ఆవిర్భవించిన తొలి సామ్రాజ్యం మగధ సామ్రాజ్యం.
- వజ్జి గణరాజ్యం మగధకు ఉత్తర దిక్కులో ఉండేది.
- మహిళలు, బానిసలు, సేవకులకు గణరాజ్య సభల్లో పాల్గొనే హక్కు లేదు.
- బుద్ధుడు, మహావీరుడు గణ రాజ్యాలకు చెందినవారే.
- **మగధ తొలి సామ్రాజ్యంగా ఆవిర్భవించడానికి దోహదపడిన అంశాలు:**
  - శక్తిమంతమైన రాజులు, వంశాల పాలన
  - ఇనుప గనులు విస్తారంగా ఉండటం
  - సారవంతమైన నదీ తీరప్రాంతాలు ఉండటం.
- మగధ రాజ్యం గంగానదికి రెండు వైపులా విస్తరించి ఉంది.
- మగధ దక్షిణ భాగంలో ఇనుప గనులు విస్తారంగా ఉన్నాయి.
- హర్యంక వంశానికి చెందిన బింబిసారుడు, అజాతశత్రువు మగధను బలమైన రాజ్యంగా తీర్చిదిద్దారు.
- మహాపద్మనందుడి కాలంలో మగధ వాయవ్యం నుంచి ఒడిశా వరకూ విస్తరించింది.
- మహాజనపదాల కాలంలో భూయజమానులను గృహపతి/ గాహపతి అనేవారు.
- వ్యవసాయ కూలీలను భర్తుకా అని, బానిసలను దాసులు అని పిలిచేవారు.
- యుద్ధంలో ఓడిపోయిన సైనికులను దాసులుగా మార్చేవారు.
- రాజులు సిరిసంపదలతో ఉండటానికి పన్నులు అధికంగా వసూలు చేయడంతోపాటు నిత్యం ఇతర రాజ్యాలపై దండయాత్రలు చేసేవారు.
- పట్టణాల్లో ఉండే వృత్తిపనివారు ఒకరోజు రాజు పొలంలో ఉచితంగా పని చేయడం ద్వారా వృత్తి పన్ను చెల్లించేవారు.
- రైతులు రాజుకు చెల్లించే భూమి శిస్తును 'భాగ' అనేవారు. ఇది పంటలో 1/6 వంతు.
- గొండుల గ్రామపెద్ద పట్లాను పోలి ఉండేవాడు.
- గ్రామంలో అధిక ధనవంతుడైన వ్యక్తిని గ్రామపెద్దగా నియమించేవారు.
- గ్రామపెద్ద పాలనా, న్యాయ, పోలీస్ విధులు నిర్వహించేవాడు.
- నాణేల ముద్రణ, ఉపయోగం మహాజనపదాల కాలంలోనే ప్రారంభమైంది.

మొదటి సామ్రాజ్యాలు

- మౌర్య వంశ, మౌర్య రాజ్య స్థాపకుడు చంద్రగుప్త మౌర్యుడు. గొప్పవాడు అశోకుడు.
- మౌర్యుల పాలనకు ఆధారాలు: అశోకుడి శాసనాలు, అర్థశాస్త్రం, ఇండికా.
- కౌటిల్యుడు సంస్కృత భాషలో రచించిన అర్థశాస్త్రం ఒక పాలనాశాస్త్రం.
- గ్రీకు రాయబారి మెగస్తనీస్ చంద్రగుప్త మౌర్యుడి ఆస్థానంలో ఇండికా గ్రంథాన్ని గ్రీకుభాషలో రాశాడు.
- మౌర్యుల కాలంలో రాజ్యం నేటి అఫ్గనిస్థాన్ నుంచి దక్షిణాన కర్ణాటక వరకు, తూర్పున బెంగాల్ వరకు విస్తరించింది.
- మౌర్యుల రాజధాని పాటలీపుత్రం.
- పాటలీపుత్రం, దాని చుట్టూ ఉన్న ప్రాంతం చక్రవర్తి ప్రత్యక్ష పర్యవేక్షణలో ఉండేది.
- అధికారుల పనితీరును వేగుల ద్వారా రాజులు తెలుసుకునేవారు. దూతల ద్వారా రాజు తన సందేశాలను అధికారులకు పంపేవాడు.
- తక్షశిల, ఉజ్జయిని, సువర్ణగిరి, తోశాలి లాంటి ప్రాదేశిక రాజధానులను రాజకుమారులు పరిపాలించేవారు. వారిని గవర్నర్లు/ కుమారామాత్యులుగా పిలిచేవారు.
- మౌర్యుల కాలంలో సువర్ణగిరి బంగారు గనులకు ఎంతో ప్రసిద్ధి చెందింది.
- తక్షశిలలో విదేశీ వస్తువులు విరివిగా దొరికేవి.
- భారతదేశంలో తొలి శాసనాలు వేయించింది అశోకుడు. అతడి శాసనాలు ఎక్కువగా ప్రాకృత భాషలో, బ్రాహ్మీలిపిలో ఉన్నాయి.
- 'నేను చక్రవర్తి అయిన 8 సంవత్సరాలకు కళింగయుద్ధం (క్రీ.పూ. 261) చేశాను' అని అశోకుడు తన 13 వ శిలాశాసనంలో (దౌళీ/ జౌగాడ శాసనం) పేర్కొన్నాడు.
- కళింగ యుద్ధంలో లక్షమందికి పైగా మరణించడంతో అశోకుడు హృదయ పరివర్తన చెంది, యుద్ధాన్ని త్యజించాడు.
- ఉపగుప్తుడి సలహాతో అశోకుడు బౌద్ధ మతాన్ని స్వీకరించాడు.
- ధమ్మ/ ధర్మ సిద్ధాంతాన్ని ప్రచారం చేయడానికి ధర్మ మహామాత్రులు అనే ఉద్యోగులను నియమించాడు.
- ధమ్మ ప్రాకృత పదం కాగా ధర్మ అనేది సంస్కృత పదం.
- సిరియా, ఈజిప్ట్, గ్రీస్, శ్రీలంక దేశాల్లో ధర్మాన్ని ప్రచారం చేయడానికి రాయబారులను పంపాడు.
- మనుషులకే కాకుండా జంతువులకు కూడా వైద్య సదుపాయాలు కల్పించిన తొలి భారతీయ చక్రవర్తిగా అశోకుడు పేరొందాడు.
- మౌర్యులకు సామంతులుగా ఉన్న శాతవాహనులు దక్కన్‌లో స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకున్నారు.
- శాతవాహనుల రాజధాని ధాన్యకటకం (అమరావతి).
- గౌతమీపుత్ర శాతకర్ణి, వాశిష్ఠీ పుత్ర పులోమావి, యజ్ఞశ్రీ శాతకర్ణి లాంటి రాజులు గొప్పవారు.
- అమరావతి, భట్టిప్రోలు, వడ్డమానుకొండ లాంటి ప్రాంతాల్లో బౌద్ధ ఆలయాలు, స్తూపాలను నిర్మించారు.
- రోమ్, బెంగాల్‌తో సముద్ర వ్యాపారం చేశారు.
- రోమన్ నాణేలు, రోమ్ శైలి కుండలు వీరి రాజ్య భాగాల్లో లభించాయి.
- పులోమావి పాలనాకాలం నాటి మ్యాకదోని శాసనం కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారి జిల్లాలో దొరికింది.
- పులోమావి 8 వ పాలనా సంవత్సరంలో మ్యాకదోని శాసనం వేశారు.
- పులోమావి మహాసేనాపతి స్కందనాగుని శాతవాహన ఆహారంలో కుమారదత్త అధిపతిగా ఉన్న వేపుర గ్రామంలో కాంత తెగ నాయకుడు సమ్ప ఒక చెరువును తవ్వించినట్లు మ్యాకదోని శాసనం పేర్కొంటోంది.
- వేపుర గ్రామాధిపతి - కుమారదత్త. కాంత తెగ నాయకుడు - సమ్ప
- శాతవాహనులను ఓడించి క్షాంతామూలుడు ఇక్ష్వాక రాజ్యాన్ని స్థాపించాడు.
- ఇక్ష్వాకుల రాజధాని విజయపురి (కృష్ణానది తీరం, నాగార్జున కొండ ప్రాంతం)
- వీరు రాముడి వంశానికి చెందినవారుగా చెప్పుకున్నారు.
- క్షాంతామూలుడు, వీరపురుషదత్తుడు లాంటి రాజులు అశ్వమేధ, రాజసూయ యాగాలు చేశారు.
- నాగార్జున కొండవద్ద అతిపెద్ద ఆరామం, స్తూపం నిర్మించారు. (స్తూపం, చైత్యం, విహారం ఈ మూడూ ఉన్న ప్రాంతాన్ని ఆరామం అంటారు.)

భారత ఉపఖండంలో కొన్ని ముఖ్యమైన సామ్రాజ్యాలు

కుషాణులు

- కుషాణులు రెండువేల సంవత్సరాలకు పూర్వమే చైనా ప్రాంతం నుంచి వలస వచ్చి అఫ్గనిస్థాన్ కేంద్రంగా తమ సామ్రాజ్యాన్ని స్థాపించారు.
- కుషాణుల్లో గొప్పవాడు కనిష్కుడు.
- కనిష్కుడు క్రీ.శ. 78 లో సింహాసనాన్ని అధిష్ఠించి, శక యుగాన్ని ప్రారంభించాడు.
- శక యుగాన్నే శాలివాహన శకం లేదా శతాబ్దంగా పేర్కొంటున్నారు.
- భారతదేశం శక క్యాలెండర్‌ను అనుసరిస్తోంది. శక యుగం సాధారణ యుగానికి 78 సంవత్సరాల తర్వాత ఉంటుంది.
- భారత్‌లో కుషాణుల కాలంలో ఇరాన్, చైనా, రోమ్ దేశాలతో వ్యాపారం బాగా జరిగేది.

గుప్తులు

- గుప్తులు బిహార్‌లోని పాటలీపుత్రాన్ని రాజధానిగా చేసుకుని సామ్రాజ్యాన్ని స్థాపించారు.
- గుప్త వంశ మూలపురుషుడు శ్రీగుప్తుడు. (క్రీ.శ. 320 లో శ్రీగుప్తుడు గుప్త సామ్రాజ్యాన్ని స్థాపించినట్లు చెబుతారు)
- గుప్త రాజ్య స్థాపకుడు మొదటి చంద్రగుప్తుడు.
- గుప్త రాజుల్లో గొప్పవాడు రెండో చంద్రగుప్తుడు. ఇతడి బిరుదు విక్రమార్కుడు.
- రెండో చంద్రగుప్తుడి కాలాన్ని స్వర్ణయుగంగా పేర్కొంటారు.
- రెండో చంద్రగుప్తుడి ఆస్థానంలో నవరత్నాలు అనే కవులు ఉండేవారు. నవరత్నాల్లో కాళిదాసు గొప్పకవి.
- **ముఖ్యమైన గుప్తరాజులు:** మొదటి చంద్రగుప్తుడు, సముద్రగుప్తుడు, రెండో చంద్రగుప్తుడు, కుమారగుప్తుడు, స్కందగుప్తుడు.

హాయ్! బుజ్జీ!!



రంగు రంగుల పేపర్ వెయిట్‌లు...
వాటి లోపల్లోపల చిత్రమైన ఆకారాలు...
మధ్య మధ్యలో గాలి బుడగలు...
అక్కడక్కడా అలంకారాలు...
అన్నీ కలిసి గుండ్రటి ఆ గాజులో...
ఎలా దూరాయి చెప్మా?

పేపర్ వెయిట్.. తయార్!

తయారీ ఎలా?

మనం స్కూళ్లలో, కార్యాలయాల్లో గాజు పేపర్ వెయిట్‌లను చూస్తూనే ఉంటాం కదూ. పరీక్షించి వాటిని ఎప్పుడైనా చూశారా? లోపల బోలెడు రంగులుంటాయ్. ఆకులు, పువ్వుల్లాంటి డిజైన్‌లుంటాయ్. మధ్య మధ్య నీటి బిందువుల్లా కనిపించే గాలి బుడగలుంటాయ్. అవన్నీ లోపలికి ఎలా వెళ్లి ఉంటాయ్? ఎప్పుడైనా ఆలోచించారా? లోపలికి వెళ్లినట్టు ఎక్కడా దారి కనిపించదు. ఎక్కడా అతికినట్టూ అనిపించదు. మరి అంత అందంగా, గుండ్రంగా అవి ఎలా తయారవుతాయబ్బా?



◆ గాజు పేపర్ వెయిట్‌లను తయారు చేయడానికి మూల పదార్థంగా కరిగి ఉన్న గాజు ద్రవాన్ని వాడతారు. గాజు ముక్కల్ని 2000డిగ్రీల ఫారన్‌హీట్ దగ్గర మండించి ద్రవరూపంలోకి మారుస్తారు. అది ఒక కొలిమి దగ్గర ద్రవరూపంలో పై నుంచి కారుతుంటుంది. అక్కడ దూరం నుంచి గాలి ఊదడానికి వీలుగా ఉండేలా స్ట్రాలాంటి ఇనుప గొట్టాన్ని వాడతారు. దాని చివరను గాజు ద్రవం పడే దగ్గర పెట్టి గుండ్రంగా తిప్పుతూ ఉష్ణోగ్రతని తగ్గిస్తారు.



◆ అది కొంచెం కొంచెం గట్టి బడే సమయంలో చమ్కీల్లాంటివాటిని, రంగుల్నీ అద్దుతారు. పొడవు గొట్టాన్ని అటూ ఇటూ తిప్పుతూ మెత్తగా ఉన్న గాజును మెలికలు తిప్పి రకరకాల ఆకారాలు సృష్టిస్తారు.



◆ లోపలి డిజైన్ పూర్తయిన తర్వాత పైన మరోసారి గాజు ద్రవం పోసి గొట్టాన్ని గుండ్రంగా తిప్పుతారు. దాన్ని ఓ గుంట గరిటలాంటి దాంట్లో పెట్టి గుండ్రంగా తిప్పుతూ బంతి ఆకారం తెస్తారు.



◆ గొట్టానికి చివరిగా ఉన్న గాజు బంతిని చాకుతో కత్తిరించి అడుగుభాగాన్ని చదును చేస్తారు. అంతే. వేడి పూర్తిగా చల్లారే వరకూ పక్కన పెట్టి తర్వాత దాన్ని ప్యాక్ చేసేస్తారు. వాటినే మనం బజార్‌లో కొనుక్కుంటాం.

◆ ఇది సాధారణంగా గాజు పేపర్ వెయిట్ తయారీలో పాటించే విధానం. ప్రాంతాల్ని బట్టి ఈ విధానంలో కొన్ని మార్పులు ఉంటుంటాయి. కొన్నింటిని ఒక్కొక్కటిగా మనుషులే తయారు చేస్తే మరి కొన్ని ఫ్యాక్టరీల్లో పెద్ద ఎత్తున తయారవుతున్నాయి. గాజు పేపర్ వెయిట్‌లతోపాటు ఇప్పుడు ప్లాస్టిక్, రెజీన్‌లతో చేసిన పేపర్ వెయిట్‌లనూ ఎక్కువగా వాడుతున్నారు.

పుట్టింది ఎప్పుడంటే?


● 1845 నుంచి 1860ల మధ్యలో తొలిసారిగా యాంటిక్ పేపర్ వెయిట్‌లను తయారుచేశారు.
● జస్టిన్ స్కూబర్ట్ అనే ఆయన మొదటగా వీటిని తయారు చేశారని చెబుతారు. ఎక్కడంటే ఫ్రాన్స్‌లో.
● ఇప్పుడు మనం చూస్తున్న గాజు వెయిట్‌లు మాత్రం 1940ల తర్వాత పుట్టినవే.

లోపల పువ్వులెలా?

● ద్రవపు గాజు మెత్తబడే సమయంలో ప్రత్యేకమైన పరికరాల్ని ఉపయోగించి చిన్న పువ్వులు, ఆకుల్లాంటి డిజైన్‌లను ముందే చేసి పెట్టుకుంటారు. వాటిని వెయిట్ తయారు చేసేప్పుడు లోపలే ముందు అందంగా పేరుస్తారు. రంగులు అద్దడం అయినా అంతే. నీటి బిందువుల్లా కనిపించాలనుకున్న చోట స్ట్రాలాంటి గొట్టంలో నుంచి గాలిని ఊదుతారు. దీంతో లోపల సన్నని గాజు బుడగలొస్తాయి.



దారి కనుక్కోండి!




సబ్జెక్ట్ ల్యాబ్ - సైన్స్

ఇక్కడున్న బొమ్మలు, వాక్యాల ఆధారంగా ఖాళీల్లో వచ్చే పదాలేంటో కనుక్కోగలరా?

1. We ______ with our (nose)
2. We ______ with our (eyes)
3. We ______ with our (ear)
4. We ______ with our (tongue)
5. We ______ with our (hands)

జవాబులు: స్కూల్ సవాల్: 1.1857 2.పోర్చుగల్ 3.నయా రాయ్‌పూర్
కవలలేవి: 2,4 సబ్జెక్ట్ ల్యాబ్ - సైన్స్: 1.Smell 2.See
3.Listen 4.Taste 5.Touch

బింబా & బబ్లూ — అండమాన్‌లో సాహసాలు 1



ఛత్తీస్‌గఢ్ రాజధాని ఏది?

స్కూల్ సవాల్

1. మన దేశంలో సిపాయిల తిరుగుబాటు ఎప్పుడు జరిగింది?
2. వాస్కోడీగామా ఏ దేశస్థుడు?
3. ఛత్తీస్‌గఢ్ రాజధాని ఏది?



- షణ్ముఖరావు, తొమ్మిదో తరగతి
బి. నేతాజీ, ఏడో తరగతి,
జడ్పీహెచ్ స్కూల్, చల్లవానిపేట, శ్రీకాకుళం జిల్లా

ఆణిముత్యం

మంచిపనిని మించిన పూజలేదు, మానవత్వాన్ని మించిన సంపద లేదు
- మదర్ థెరిసా

నేర్చుకుందాం!

ఆంగ్లంలో చాలా పదాల్లో సైలెంట్ లెటర్స్ ఉంటాయి. తెలియక మనం వాటిని తప్పుగా పలికేస్తుంటాం. వాటి సరైన ఉచ్చారణ తెలుసుకుంటే సరి.

Thumb - థమ్
Subtle - సటల్

కవలలేవి? ఒకేలా ఉన్న జతను పట్టుకోండి



బాలికలకు ఆత్మరక్షణ అంశాలపై శిక్షణ

కొమ్మాది, న్యూస్‌టుడే: కౌమారదశ బాలికలకు ఆత్మరక్షణ అంశాలపై శిక్షణ అవసరమని ఆర్ఎంఎస్ఏ ఆత్మరక్షణ శిక్షణ తరగతుల రాష్ట్ర కో-ఆర్డినేటర్ పి.గీత అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో రాష్ట్రీయ మాధ్యమిక శిక్షా అభియాన్ ఆధ్వర్యంలో న్యూ ఏపీ తైక్వాండో అసోషియేషన్ సహకారంతో బాలికలకు మార్షల్‌ఆర్ట్స్‌లో ఇస్తున్న శిక్షణ శిబిరాలను ఆమె బుధవారం పరిశీలించారు. ఎండాడ, చంద్రంపాలెం, ఆనందపురం ప్రాంతాల్లోని ఉన్నత పాఠశాలల తొమ్మిదో తరగతి బాలికలతో మాట్లాడి శిక్షణ అంశాలను తెలుసుకున్నారు. జిల్లాలో 387 పాఠశాలల్లో 31,969 మంది బాలికలకు శిక్షణ ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో సహాయ జీసీడీవో అధికారిణి ఎం.భారతి, తైక్వాండో అసోషియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.అచ్యుత్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు ఎం.రాజబాబు, అదనపు ప్రధానోపాధ్యాయులు ఎ.జయప్రద, పీడీ పి.రాము తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ తరగతుల తీరును బాలికలను అడిగి తెలుసుకుంటున్న కో-ఆర్డినేటర్ గీత

ఆసుపత్రి రంగంలో వృత్తి నైపుణ్య శిక్షణకు దరఖాస్తులు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని మైనారిటీ(ముస్లిం, క్రిస్టియన్) నిరుద్యోగ యువతకు ఆసుపత్రి, డయాగ్నస్టిక్ రంగంలో వృత్తి నైపుణ్య శిక్షణ ఇస్తున్నామని, ఆసక్తిగలవారు దరఖాస్తు చేసుకోవాలని సంస్థ మేనేజర్ సాయి శ్రీనివాస్ తెలిపారు. జనరల్ డ్యూటీ అసిస్టెంట్, ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్, డయాలిసిస్ టెక్నీషియన్, డెంటల్ అసిస్టెంట్, ఫ్లేబోటోమి టెక్నీషియన్ తదితర కోర్సుల్లో శిక్షణ ఇస్తామని తెలిపారు. ఈ శిక్షణకు 10 నుంచి డిగ్రీ పూర్తి చేసిన 19 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సుగల నిరుద్యోగ మైనారిటీ యువత దరఖాస్తు చేసుకోవాలని కోరారు. శిక్షణ కోసం ద్వారకానగర్ ఎఎన్ఆర్ షాపింగ్‌మాల్ దగ్గర, జికె టవర్స్‌లోని నాల్గవ అంతస్తులోని కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. ఇతర వివరాలకు 90150 46000, 70937 04555 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఈటీవీలో ఈనాడు

ఉదయం

05-45: ఆరాధన, 06-30: అన్నదాత, 07-00: ఈటీవీ న్యూస్, 07-30: శుభమస్తు: సొంతింటి కల నెరవేరాలంటే చేయాల్సిన దానాలు?, వాస్తురీత్యా విద్యుత్ ఉపకరణాలు ఏ దిశలో ఉండాలి?, 08-30: టాలీవుడ్ టైమ్స్, 09-00: ఈనాడు సినిమా: ఆడదే ఆధారం (సీత, విసు).

మధ్యాహ్నం

12-00: తెలుగు'రుచి': ఘుమఘుమలు 'వంకాయ ఉలవకారం', మీ చేతివంట 'పన్నీర్ చెనా కర్రీ', 'ఆలూ పాలక్‌రైస్', జస్ట్ ఎ మినిట్ 'కాజూ గోబీపకోడి' తయారు చేసే విధానం, ఇంటింటి వంటింటి చిట్కాలు, 01-00: స్టార్ మహిళ (మెగా గేమ్ షో), 02-00: అభిషేకం (డైలీ సీరియల్), 02-30: అత్తారింటికి దారేది (డైలీ సీరియల్), 03-00: సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు (విధి 2) (డైలీ సీరియల్), 03-30: ఆడదే ఆధారం (డైలీ సీరియల్).

సాయంత్రం

04-00: ఋతుగీతం (డైలీ సీరియల్), 04-30: వసంతం (డైలీ సీరియల్), 05-00: జీన్స్–2 (రిపీట్), 06-00: ఒకరి ఒకరు (డైలీ సీరియల్), 06-30: తేనెమనసులు (డైలీ సీరియల్).

రాత్రి

07-00: సావిత్రి (డైలీ సీరియల్), 07-30: మనసు మమత (డైలీ సీరియల్), 08-00: స్వాతిచినుకులు (డైలీ సీరియల్), 08-30: నా పేరు మీనాక్షి (డైలీ సీరియల్), 09-00: ఈటీవీ న్యూస్, 09-30: జబర్దస్త్ – సూపర్‌హిట్ కామెడీ షో, 10-30: జబర్దస్త్ జల్సాటైం...

ఈటీవీ ప్లస్

ఉదయం

11:00 కిక్ రిపీట్

మధ్యాహ్నం

12:00 జబర్దస్త్ రిమిక్స్

01:00 డీజే రిపీట్

01:15 స్టే..ఫూలిష్ రిపీట్

01:30 పటాస్ రిపీట్

02:00 అల్లరే అల్లరి రిపీట్

02:30 సరదాగా కాసేపు రిపీట్

03:00 తారక్ మామా అయ్యోరామ రిపీట్

03:30 నా షో నా ఇష్టం రిపీట్

సాయంత్రం

04:30 ఎక్స్‌ప్రెస్ రాజా

05:00 జిల్ జిల్ జిగా

06:00 అమృతం రిపీట్

06:30 ఎక్స్‌ప్రెస్ రాజా

రాత్రి

07:30 తారక్ మామా అయ్యోరామ

08:00 పోవే..పోరా

09:00 పటాస్

09:30 టాప్స్

10:00 కిర్రాక్ కిడ్స్ రిపీట్

11:30 ఎక్స్‌ప్రెస్ రాజా రిపీట్

ఈటీవీ లైఫ్

- ★ మానస - బ్రహ్మకుమారి (ఉ.6:00, రా.11:30)
- ★ యోగమంత్ర (ఉ.7:00, సా.6:00, రా.10:30)
- ★ గెట్‌సెట్‌ఫిట్ (ఉ.7:30, సా.6:30, రా.10:00)
- ★ అమృతం: డైరీ డిలైట్స్ (ఉ.8:00, మ.12:30, రా.8:00)
- ★ హెల్దీ & టేస్టీ (ఉ.8:30, మ.1:00, రా.8:30)
- ★ కౌంట్ యువర్ కేలరీస్ (మ.1:30)
- ★ జీవనరేఖ చైల్డ్‌కేర్: మీ పిల్లలు ఆడుకునే బొమ్మలు - తీసుకోవాల్సిన జాగ్రత్తలు (ఉ.9:30)
- ★ జీవనరేఖ చైల్డ్‌కేర్: మీ పిల్లలు తక్కువ బరువుతో పుట్టారా? (మ.2:00, రా.7:00)
- ★ సుఖజీవనం (ఉ.10:00, మ.2:30, రా.9:30)
- ★ ఆరోగ్యమస్తు: 1. చెడు అలవాట్లు - కీళ్ల నొప్పులు, 2. నొప్పి నివారణ మాత్రలు - వాస్తవాలు, 3. చెవిలో శబ్దాలు (ఉ.10:30)
- ★ ఆరోగ్యమస్తు: 1. మీ జుట్టు తీరు - మీ ఆరోగ్య స్థితి, 2. బాడీ పెయిన్స్ రావడానికి కారణాలు - పరిష్కారాలు, 3. మీ పళ్ళు జుంమంటున్నాయా? (మ.3:00, రా.9:00)
- ★ డా. ఈటీవీ: క్యాన్సర్ కేర్ (ఉ.11:00)
- ★ డా. ఈటీవీ: దంత సంరక్షణ (ఉ.11:15)
- ★ డా. ఈటీవీ: అజీర్తి సమస్యలు (మ.3:30, రా.7:30)
- ★ డా. ఈటీవీ: జనరల్ హెల్త్ (మ.3:45, రా.7:45)

ఈటీవీ సినిమా

ఉదయం: 6-00: టెలిషాపింగ్, 7-00: సన్‌రైజ్ సినిమా: ఇద్దరు కొడుకులు (శోభన్‌బాబు, రాధ) 10-00: మార్నింగ్ షో: నిత్యాకల్యాణం పచ్చతోరణం (చలం) మధ్యాహ్నం: 1-00: మాట్నీ: దొంగమొగుడు (చిరంజీవి, రాధిక) సాయంత్రం: 4-00: ఈవినింగ్ షో: ఒక సినిమాకథ (రాజేంద్రబాబు) రాత్రి: 7-00: ఫస్ట్ షో: వాడె వీడు (ఎన్టీఆర్, మంజుల) 10-00: ప్రముఖ దర్శకుడు పి.సి.రెడ్డితో గుర్తుకొస్తున్నాయి... (రెండవ భాగం).

ఈటీవీ అభిరుచి

ఉ.6.00: బ్రేక్ ఫాస్ట్ షో - కాబూలీ చెనా ముల్లంగి పరాటా & మష్రూమ్ మఫిన్స్, ఉ.8.00, రా.9.00: బ్రేక్ ఫాస్ట్ షో - కీన్వ కాబూలినా టిక్కీ & జుకిని మిల్లెట్ మఫిన్స్, ఉ.8.45: టేస్ట్ ఆఫ్ ఇండియా (కర్ణాటక క్యూసైన్) - మసాలా ఎనగై, ఉ.9.30: సూపర్ భీమ్ - గేమ్ షో, ఉ.11.00: గోరుముద్దలు - సగ్గుబియ్యం టిక్కీస్, ఉ.11.15, రా.8.30: డైట్ మెనూ (మైగ్రేన్ నివారణకు) - బ్రొకోలి సూప్, ఉ.11.30, రా.8:00: గోదావరి నెయ్యి "బాబాయ్ హోటల్" - జొన్న రొట్టె & పండుమిరపకాయ పచ్చడి, మ.12.00, సా.5.45: టేస్ట్ ఆఫ్ ఇండియా (కర్ణాటక క్యూసైన్) - మిక్స్డ్ వెజ్ సాగూ, మ.12.15, రా.10.15: మమ్మీస్ కిచెన్ - చెనా ఘూర్ గరం, మ.12.30, రా.8.45: సూపర్ చెఫ్ (మొగలై స్టైల్) - బెండకాయ మటన్ కర్రీ, మ.12.45, సా.6.15: ఛాట్స్ & సూప్స్ - మేతి బార్లీ సూప్, మ.1.00, సా.4.30: వావ్ ఏమి రుచి (పార్సీ క్యూసైన్) - పార్సీ బిర్యానీ & పాలక్ ఈడ, మ.1.30, రా.10.00: చట్‌పట్ (అత్తమ్మ రుచుల స్పెషల్) వంకాయ బజ్జీ, మ.1.45, రా.7.30: పెరటి రుచులు - ఆయుర్వేదిక పెరటి మొక్కలు - ఇంటి చిట్కాలు, మ.2.15: మటన్‌తో మస్తీ మస్తీ - మటన్ ఖీమ బఠానీ రైస్ & గోంగూర మటన్, మ.2.30, సా.6.00: మంత్రా డిటర్జెంట్ సోప్ "చోటా షెఫ్" - టమాటో అటుకులు, మ.2.45, రా.10.30: కారాలు, పొడులు - ఉసిరి కారం & రాగి తీపి అట్టు పొడి, మ.3.30: భళా మిస్టర్ బ్రహ్మచారి - చికెన్ ఫ్రైడ్ రైస్.

ఈటీవీ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 ప్రార్థనా సమయం, 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360⁰, 08-30 యువ (రి), 09-00 ఘంటారావం, 09-30 సుఖీభవ, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్ (రిపీట్), 11-00 ఘంటారావం,11-30 ఇదీ సంగతి!, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 ప్రత్యేక వాణిజ్య కార్యక్రమం, 01-00 ఈటీవీ 360⁰, 02-30 సఖి, 03-00 ఘంటారావం, 03-30 సుఖీభవ: పిల్లలు.. అత్యవసర పరిస్థితులు, **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 తీర్థయాత్ర: శ్రీ సాయిబాబా మందిరం, అలంపురం, పశ్చిమ గోదావరి జిల్లా, 05-00 ఘంటారావం, 05-30 కమర్షియల్ స్లాట్, 06-00 ఘంటారావం, 06-30 జై కిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం,07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360⁰, 09-00 ప్రతిధ్వని, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 బీబీసీ ప్రపంచం, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి.

ఈటీవీ తెలంగాణ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 యువ (రి), 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360⁰, 08-30 యువ, 09-00 ఘంటారావం, 09-30 ఈటీవీ టాకీస్, 10-00 ఘంటారావం, 10-30 సుఖీభవ, 11-00 ఘంటారావం, 11-30 ఇదీసంగతి!, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 కమర్షియల్ స్లాట్, 01-00 ఈటీవీ 360⁰, 02-30 సఖి, 03-00 ఘంటారావం, 03-30 తీర్థయాత్ర: శ్రీ సాయిబాబా మందిరం, గంగారం, వికారాబాద్ జిల్లా, **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 సుఖీభవ: పిల్లలు.. అత్యవసర పరిస్థితులు, 05-00 ఘంటారావం, 05-30 కమర్షియల్ స్లాట్, 06-00 ఘంటారావం, 06-30 జైకిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360⁰, 09-00 ప్రతిధ్వని, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 బీబీసీ ప్రపంచం, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి.

ఏ ఛానల్లో ఏముంది.. 04-01-2018

SVBC: **ఉదయం:** 05-30 తిరుప్పావై - గోదాస్తుతి, 06-30 శుభోదయం + నిత్యపూజలివిగో, 07-00 విష్ణు సహస్రనామస్తోత్రం, 07-30 శ్రీవారి సేవలు (తిరుప్పావడ సేవ), 08-00 శతమానం భవతి, 08-30 పూజకువేళాయె - దత్తాత్రేయస్వామి, 09-00 ఆధ్యాత్మిక విశేషాలు, 09-30 భక్తిగీతమాలిక, 10-00 ఆధ్యాత్మిక విశేషగలు - కన్నడ, 10-30 లైవ్ శ్రీపద్మావతి అమ్మవారి కల్యాణం - తిరుచానూరు, 11-30 స్పెషల్ న్యూస్ + ఆముక్తమాల్యద, **మధ్యాహ్నం:** 12-00 లైవ్ కల్యాణోత్సవం, 01-00 ఆధ్యాత్మిక విశేషాలు, 01-30 విష్ణుసహస్ర నామామృతం + లైవ్ డోలోత్సవం, 02-00 లైవ్ ఆర్జిత బ్రహ్మోత్సవం, 02-30 లైవ్ వసంతోత్సవం, 03-00 అన్నమయ్య పాటకు పట్టాభిషేకం, **సాయంత్రం:** 04-30 యక్షప్రశ్నలు, 05-00 లైవ్ ఎస్.డి. సేవ + స్పెషల్ న్యూస్ + ఆళ్వార్ శ్రీసూక్తి, 06-00 లైవ్ నాదనీరాజనం - తిరుమల, **రాత్రి:** 07-30 లైవ్ ఘంటానాదం + శ్రీనివాసగద్యం + ఖడ్గమాలస్తోత్రం, 08-00 లైవ్ అధ్యయనోత్సవాలు నేను.. నా.. స్వామి, 08-30 మల్లికార్జున సుప్రభాతం - చాగంటి, 09-00 ఆలయదర్శనం - రామేశ్వరలక్ష్మణేశ్వర దేవస్థానం, 09-30 శివమహాపురాణం - శ్రీసామవేదం, 10-00 ఆధ్యాత్మిక విశేషాలు, 10-30 శ్రీరామ రసవాహిని - సాటులూరి గోపాల కృష్ణమాచార్యులు.

భక్తి TV: **ఉదయం:** 6-00 శ్రీసాయి హారతి, 6-30 సద్గురుస్తోత్రం, 7-00 అర్చన, 7-30 సాయి గీతామృతం, 8-00 పుణ్యక్షేత్రం, 8-30 జ్యోతి స్వరూపా అయ్యప్ప, 9-00 సంపూర్ణ మహాభారతం, 11-00 ధర్మసందేహాలు, **సాయంత్రం:** 4-30 పుణ్యక్షేత్రం, 5-00 శ్రీకనకధారాస్తోత్రం, 5-30 సాయిగీతామృతం, 6-00 సద్గురుస్తోత్రం, 7-00 భక్తివిశేషాలు,7-30 అమృతకలశం, 8-00 పరిహారం, 8-30 శ్రీమద్భగవద్గీత 9-00 దుర్గాసప్తశతి, 9-30 మహాభారత పాత్రలు, 10-00 ధర్మ సందేహాలు, 10-30 భక్తివిశేషాలు, 11-00 గోదామృతం.

ZEE తెలుగు: **ఉదయం:** 06-30 ఎంజాయ్ ఎవ్రిడే లైఫ్, 07-00 టెలిషాపింగ్, 07-30 శుభోదయం, 08-30 సినిమా: నాగవల్లి 11-30 వారెవా, **మధ్యాహ్నం:** 12-00 గోల్డ్‌రష్ 01-00 బతుకు జట్కా బండి, 02-00 గృహప్రవేశం, 02-30 నా కోడలు బంగారం, 03-00 సూర్యవంశం (రిపీట్), 03-30 కల్యాణ వైభోగం (రిపీట్), **సాయంత్రం:** 04-00 బిగ్ సెలబ్రిటి చాలెంజ్ ఇంటర్‌నేషనల్, 05-00 జై కృష్ణా ముకుంద మురారి, 05-30 కుంకుమ భాగ్య, 06-00 పక్కింటి అమ్మాయి, 06-30 పున్నాగ, **రాత్రి:** 07-00 అమెరికా అమ్మాయి, 07-30 ముద్దమందారం, 08-00 దట్ ఈజ్ మహాలక్ష్మీ, 08-30 ఎవరే నువ్వు మోహిని, 09-00 కల్యాణ వైభోగం, 09-30 ముత్యాల ముగ్గు, 10-00 సూర్యవంశం, 10-30 నా కోడలు బంగారం (రిపీట్),11-00 బిగ్ సెలబ్రిటి ఛాలెంజ్ ఇంటర్‌నేషనల్ (రిపీట్).

maa: **ఉదయం:** 06-30 సిల్వర్ స్క్రీన్, 07-00 హరహర మహాదేవ, 08-00 రాశి ఫలాలు దినఫలం, 08-30 జానకి రాముడు, 09-00 సినిమా: చంద్రలేఖ, **మధ్యాహ్నం:** 12-00 కోడలా కోడలా కోడుకు పెళ్లామా, 12-30 అగ్నిసాక్షి (రిపీట్), 01-00 కుంకుమపువ్వు (రిపీట్), 01-30 చూపులు కలిసిన శుభవేళ, 02-00 కార్తీక దీపం, 02-30 సినిమా: యమదొంగ, **సాయంత్రం:** 06-00 ఉయ్యాలా జంపాలా, 06-30 అగ్నిసాక్షి, **రాత్రి:** 07-00 లక్ష్మీ కల్యాణం, 07-30 కార్తీకదీపం, 08-00 కోయిలమ్మ, 08-30 కుంకుమ పువ్వు, 09-00 సుందరకాండ, 09-30 పవిత్రబంధం, 10-00 నీలికలువలు, 10-30 దసరా వచ్చిందయ్య (రిపీట్).

GEMINI: **ఉదయం:** 06-00 టెలిషాపింగ్, 07-00 అమృతకలశం, 07-30 అనుగ్రహం, 08-00 శ్రీ ఆంజనేయం (రిపీట్), 08-30 సినిమా: దేవుళ్లు, 11-30 నాగిని -2 (రిపీట్), **మధ్యాహ్నం:** 12-00 నువ్వు నాకు నచ్చావ్ (రిపీట్) 12-30 చక్రవాకం, 01-00 నందిని (రిపీట్), 01-30 మొగలి రేకులు, 02-00 అమ్మ నేను ఓ అమ్మాయి, 02-30 శిరిడి సాయి, 03-00 సినిమా: ఆ నలుగురు, **సాయంత్రం:** 06-00 ప్రతిఘటన, 06-30 శ్రీ ఆంజనేయం, **రాత్రి:** 07-00 నాతిచరామి, 07-30 జై జై వినాయక, 08-00 మాతృదేవోభవ, 08-30 శనీశ్వరుని దివ్యచరిత్ర, 09-00 నందిని, 09-30 బోల్ బేబీ బోల్ - సీజన్ 10, 10-30 సినిమా: ఆర్య.

HBO: ఉదయం: 06-00 స్టార్ ట్రెక్ 2: ది రాత్ ఆఫ్ ఖాన్, 07-56 ది కరాటే కిడ్ పార్ట్ 2, 09-59 బ్యాక్ టు ది ఫ్యూచర్ పార్ట్ 3, మధ్యాహ్నం:12-03 మ్యాన్ ఆఫ్ స్టీల్, 02-27 పుష్ ఇన్ బూట్స్, సాయంత్రం: 04-03 వే ఆఫ్ ది డ్రాగన్, 5-53 ది డిక్టేటర్ రాత్రి: 07-08 ది లాస్ట్ ఎయిర్‌బెండర్, 09-00 కుంగ్ ఫూ పాండా 2, 10-40 పాల్.

మిరపలో తెగుళ్ల నివారణ

వాణిజ్య పంటలలో ప్రధానమైనది మిరప. ఈ పంటను ఎక్కువగా కృష్ణా, గుంటూరు, ప్రకాశం, కర్నూలు జిల్లాలో పండిస్తారు. నష్టమైనా, లాభమైనా ఏటా ఎంతో కొంత విస్తీర్ణంలో సాగు చేస్తారు. అలాంటి మిరపకు కొన్నేళ్లుగా చీడపీడలు అధికమయ్యాయి. పెట్టుబడి ఎక్కువగా పెట్టే ఈ పంట సాగులో సరైన జాగ్రత్తలు తీసుకోకుంటే నష్టాలు తప్పవు. ప్రస్తుతం మిరప పూత, పిందె, కాయ దశలో ఉంది. ఈ ఏడాది బొబ్బర తెగులు (వైరస్) సోకి చాలా మంది రైతులు నష్టపోయారు. మిరపలో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలను పిడుగురాళ్ల ఉద్యానశాఖ అధికారి మోహన్ వివరించారు.

పైముడత: తామర పురుగులు ఆకుల అడుగు భాగంలో చేరి రసం పీల్చడం వల్ల ఆకులు పైకి ముడుచుకొని ఉంటాయి. దీని నివారణకు లీటరు నీటికి ట్రైజోఫాస్ 1.25 మి.లీ. లేదా పిప్రోనిల్ 2 మి.లీ. వేపనూనె 5 మి.లీ. జిగురు 1.5 మి.లీ. (గమ్)తోకలిపి పిచికారి చేయాలి.

కింది ముడత: ఇది నల్లి వల్ల వస్తుంది. నల్లి ఆశించిన ఆకులు కిందికి ముడుచుకొని తిరగబడిన పడవ ఆకారంలో కనిపిస్తాయి. ఇంకా ముదిరితే ఆకు పసుపు రంగులోకి మారి పూత, పిందె రావటం తగ్గిపోయి, వచ్చినవి రాలిపోతాయి. దీని నివారణకు ఫాసలోన్ 3 మి.లీ. డైకోపాల్ 5 మి.లీ. లీటరు నీటికి చొప్పున పిచికారి చేయాలి. దీనికి వేపనూనె, జిగురు కలపాలి. పైముడత, కింది ముడత రెండూ ఉన్నట్లయితే పెగాసిస్ లీటరు నీటికి 2 గ్రా. చొప్పున పైరుపై చల్లుకుని బొబ్బర తెగులు ఆశించకుండా చూసుకోవచ్చు.



పైముడత తెగులు

పేనుబంక: చిన్న పురుగులు గుంపులు గుంపులుగా చేరి లేత కొమ్మలు, ఆకుల కాండంపై చేరి రసం పీల్చడం వల్ల నల్లగా మారి వైరస్‌ను వ్యాప్తి చెందిస్తాయి. దీని నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి. అంతేగాక పేనుబంక, తెల్లదోమను ముందుగానే గుర్తించి సస్యరక్షణ చర్యలు చేపట్టి, బొబ్బర తెగులు రాకుండా అరికట్టవచ్చు.

ఆకుమచ్చ: సర్కోస్పోర తెగులు వల్ల ఆకులపై గోధుమరంగు మచ్చలు ఏర్పడతాయి. నివారణకు బ్లైటాక్స్ 3 గ్రా. గానీ డైథేన్-ఎం-45 2.5 గ్రా./లీటరు నీటికి చొప్పున కలిపి, దానికి + స్ట్రెప్టోసైక్లిన్ 1 గ్రాము 10 లీటర్ల నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి.

బూడిద తెగులు: బూడిద తెగులు సోకిన ఆకులపై తెలుపురంగులో బూడిదలా కనిపించే మచ్చలు ఏర్పడతాయి. తెగులు మరింత ఉధృతమైనప్పుడు ఆకులు పుసుపు వర్ణంలోకి మారి రాలిపోతాయి. దీని వల్ల పూత, పిందె నిలబడకుండా రాలిపోతాయి. దీని నివారణకు కెరాథేన్ 1 మి.లీ. లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి.

ఎండు తెగులు: ఎండు తెగులు భూమిలోని శిలీంధ్రం వల్ల వస్తుంది. దీని వల్ల మొక్కలు గుంపులు గుంపులుగా ఎండిపోతాయి. దీని నివారణకు కిలో ట్రైకోడర్మావిరిడీ శిలీంధ్రాన్ని 100 కిలోల పశువుల ఎరువులో కలిపి పైరులో చల్లుకోవాలి. పంటకు నీటి తడులు అందించినప్పుడు ఈ శిలీంధ్రం వ్యాప్తి చెంది తెగులు పెరగకుండా ఆపుతుంది. అంతేగాక బైటాక్స్ 3 గ్రా. లీటరు నీటికి చొప్పున కలిపి మొక్కలపై చల్లాలి.

పూత రావటానికి : పూత బాగా రావటానికి పొటాషియం నైట్రేట్ (13-0-45) 10 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి. అంతేగాక వచ్చిన పూత పిందెగా మారి రాలుతుంటే ప్లానోఫిక్స్ 4 మి.లీ., 5 లీటర్ల నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి. సూక్ష్మపోషకాల లోపం తలెత్తినప్పుడు ఫార్ములా-4, 5 గ్రా. + బోరాన్ 1 గ్రాము లీటరు నీటికి కలిపి పైరుపై పిచికారి చేయాలి.

– న్యూస్‌టుడే, మాచవరం (గుంటూరు జిల్లా)

పాడి పరిశ్రమలో పాకల ప్రాధాన్యం

పాకలను ఒక వరుసలో కానీ, రెండు వరుసల్లో కానీ కట్టేసేలా నిర్మించుకోవచ్చు. ఈ పాకల నిర్మాణానికి ప్రభుత్వం- ఉపాధి హామి పథకం ద్వారా తోడ్పాటునిస్తోంది. గాలి, వెలుతురు ధారాళంగా వచ్చేలా పాకలను గడ్డితో గానీ, షేడ్ రేకులతో గానీ కప్పి, నిర్మించుకోవచ్చు. పాకల్లో దాణా, పశుగ్రాసం తినేందుకు 'మేంజర్' ఏర్పాటుచేయాలి. పాకల్లో నేల జరుడుగా కాక, కాస్త గరుకుగా ఉండాలి. పాడి పశువులు కూర్చున్నప్పుడు, శరీర బరువులో సగానికిపైగా వాటి మోకాళ్ళపై పడుతుంది కాబట్టి రబ్బర్‌మ్యాట్లను పరచాలి.. తక్కువ ధరలో పాకల నిర్మాణం చేపట్టాలి. పశువుల మల మూత్రాలు నీటితో జారిపోయేలా వాలు ఉండేలా పాకలు నిర్మించాలి. షెడ్‌కు దగ్గరలోనే నీటి సౌకర్యం ఉండాలి. షెడ్‌నుండి వచ్చే పశువుల మూత్రం, పేడ, దగ్గరలోని పశుగ్రాస క్షేత్రాలకు మళ్ళించాలి. పాకల వల్ల చలి, ఎండబారి నుండి పశువులకు రక్షణ లభిస్తుంది. పశువుల ఆరోగ్యం మెరుగ్గా ఉండి, పాల దిగుబడి పెరుగుతుంది.

కనిపిస్తే ఖాళీ.. కబ్జాల మోళీ

కొత్తకోటలో పంచాయతీకి చెందిన గ్రామ కంఠం, రెవెన్యూ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయి. మండల పరిషత్‌కు చెందిన విలువైన స్థలాలది కూడా ఇదే పరిస్థితి. ఖాళీ జాగా కనిపిస్తే చాలు దాన్ని ఆక్రమించేసి అందులో పాగా వేస్తున్నారు. ఒకరిని చూసి మరొకరు అన్నట్లుగా ఆక్రమణల పర్వం పెరుగుతుందే తప్ప తగ్గడంలేదు. ఇంతలా ఇక్కడ ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తున్నా అటు పంచాయతీ, ఇటు రెవెన్యూ అధికారులు తమకు పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. దీంతో ఆక్రమణలకు అంతులేకుండా పోతోంది.

రెండు చోట్ల రూ. లక్షల విలువైన భూముల ఆక్రమణ

జన్మభూమి గ్రామసభల్లో ఫిర్యాదుల వెల్లువ



శారదా మహిళా మండలి దగ్గర ఆక్రమించిన స్థలంలో మట్టి పోస్తున్న ట్రాక్టర్

కొత్తకోట (రావికమతం), న్యూస్‌టుడే

తాజాగా రూ.50 లక్షలకు పైగా విలువైన గ్రామ పంచాయతీకి చెందిన రెండు గ్రామ కంఠం స్థలాలను అధికార పార్టీకి చెందిన సొసైటీ మాజీ అధ్యక్షుడు వెల్లంకి మోదినాయుడు ఆక్రమించాడు. ఆక్రమించిన ఆ రెండు స్థలాల్లో ఇప్పటికే ఒక దాన్ని చదును చేయించి దాంట్లోకి ఎవరూ వెళ్లనీయకుండా కంచె వేయగా, మరో స్థలంలో బుధవారం ట్రాక్టర్‌తో మట్టి పోయిస్తున్నాడు. పోలీస్ స్టేషన్‌కు కూత వేటు దూరంలో బి-ఎన్ రోడ్డును ఆనుకొని సర్వే నెంబరు.244-2ఎలో సుమారు ఒక ఎకరా విస్తీర్ణంలో గ్రామ కంఠం ఉండగా దాంట్లో ఇప్పటికే చాలా వరకు ఆక్రమణలు వెలిశాయి. శారదా మహిళా మండలి భవనం పక్కనే ఖాళీగా ఉన్న ఐదు సెంట్లు స్థలాన్ని తెదేపా నాయకుడు తన గుప్పిట్లో పెట్టుకున్నాడు. ఇటీవల ఆ స్థలంలో సర్పంచి బంధువు ఒకరు పాకవేయడానికి ప్రయత్నించగా దాన్ని ఆయన తొలగించేశారు. తన ఆధీనంలో ఉంచుకున్న ఆ స్థలంలో బుధవారం నుంచి ట్రాక్టర్‌పై మట్టిని తోలుతూ చదును చేయిస్తున్నాడు. ఈ స్థలాన్ని గతంలో తనకు ఇచ్చినట్లు ఆయన చెబుతున్నారు. వెల్లంకి వారి రామాలయానికి సమీపంలో నూతనంగా నిర్మించతలపెట్టిన కల్యాణ మండపాన్ని ఆనుకొని ఉన్న ఎనిమిది సెంట్ల స్థలాన్ని ఆక్రమించాడు. మూడు రోజుల క్రితం ఆ స్థలాన్ని చదును చేయించి, దాంట్లోకి ఎవరూ వెళ్లకుండా ఇనుప కంచె వేయడానికి సిమెంటు కాంక్రీటు స్తంభాలు ఏర్పాటు చేశాడు. ఈ స్థలాన్ని చదును చేయించి, కంచె వేయడాన్ని స్థానికులు ప్రశ్నించగా ఆ స్థలం కూడా తనదేనని ఆధారాలు ఉన్నాయంటూ వాదిస్తున్నాడు. కాగా అధికార పార్టీ నాయకుడు ఆక్రమించిన ఆ స్థలాలు ప్రభుత్వానివేనని వాటిని వెంటనే ఖాళీ చేయించాలని మంగళవారం గ్రామంలో జరిగిన జన్మభూమి గ్రామసభలో స్థానికులు, దళిత నాయకులు పూడి దేవా, పూడి అర్జున తదితరులు లిఖిత పూర్వకంగా అధికారులకు ఫిర్యాదు చేశారు. తక్షణమే ఆక్రమణలను తొలగించకుంటే ప్రజాందోళన చేస్తామని వారంతా హెచ్చరించారు. కొత్తకోటలో ఆక్రమణలకు గురైనవి గ్రామ కంఠం స్థలాలని, వాటిని సంరక్షించే బాధ్యత పంచాయతీ వారిదేనని మండల సర్వేయర్ శ్రీనివాసరావు తెలిపారు.

స్థలాల ఆక్రమణలపై తెదేపా నాయకుడు మోదినాయుడును వివరణ కోరగా తాను భూ ఆక్రమణలకు పాల్పడలేదని స్పష్టం చేశారు. శారదా మహిళా మండలికి గతంలో ఎనిమిది సెంట్ల స్థలాన్ని ఇచ్చారని, దాంట్లో మూడు సెంట్లు భవన నిర్మాణానికి పోగా, మిగిలిన ఐదు సెంట్లు ఖాళీ స్థలం మహిళా మండలిదేనని చెప్పారు. వెల్లంకి వారి రామాలయం దగ్గర ఖాళీ స్థలం తనదేనని దానికి సంబంధించిన ఆధారాలు తన వద్ద ఉన్నాయని ఆయన వివరణ ఇచ్చారు.



వెల్లంకివారి రామాలయం సమీపంలో చదును చేయించిన ప్రభుత్వ స్థలం



తికమక పెట్టే బోర్డుల తొలగింపు

ఎలమంచిలి-గాజువాక రహదారిలో గ్రామాల పేర్లు తెలియజేస్తూ ఏర్పాటు చేసిన వాటిలో గందరగోళం కలిగించే విధంగా ఉన్న బోర్డులను ఆర్‌అండ్‌బీ అధికారులు తొలగించారు. దీనిపై 'తెలియజేసేందుకా.... తికమక పెట్టేందుకా' శీర్షికతో మంగళవారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనం అధికారులను కదిలించింది. తికమకకు కారణమైన బోర్డులను అధికారులు బుధవారం తొలగించేశారు. దోసూరుపాలెం, మడుతూరు కూడలి పేరుతో ఏర్పాటు చేసిన రెండు బోర్డులో ఒకదానిని గుట్టుచప్పుడు కాకుండా పీకేశారు. దీంతోపాటు సానికాల వవైపు ఏర్పాటుచేసిన బోర్డును కూడా ఆర్‌అండ్‌బీ అధికారులు కనిపించకుండా చేశారు. గ్రామాల పేర్లు తప్పులుగా రాసిన ఎదురువాడ, ఆవసోమవారం బోర్డులను మాత్రం అలాగే ఉంచారు. **– న్యూస్‌టుడే, అచ్యుతాపురం**



జైపాతాళ భైరవి నాటకంలో సన్నివేశం

ఆకట్టుకొన్న జై పాతాళభైరవి

మునగపాక, న్యూస్‌టుడే: మునగపాకలో నిర్వహిస్తున్న నాటక ప్రదర్శనల్లో రెండో రోజయిన బుధవారం సురభి కళాకారులు ప్రదర్శించిన జై పాతాళ భైరవి నాటకం ప్రేక్షకులను ఆకట్టుకొంది. మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ 61వ జన్మదినోత్సవం సందర్భంగా ఆయన అభిమానులు సురభి నాటకోత్సవాలు నిర్వహిస్తున్నారు. ప్రేక్షకులను ఆశ్చర్యపరిచే విధంగా నాటకంలో ఎన్నెన్నో వింతలతో సెట్టింగులు వేశారు. శ్రీ వేంకటేశ్వర నాట్యమండలి ఆధ్వర్యంలో కళాకారులు నాటకాన్ని ప్రదర్శించారు. నాటకాలను తిలకించేందుకు జిల్లా నలుమూలల నుంచి వందలాది మంది ప్రేక్షకులు తరలివచ్చారు. ప్రాంగణం నిండిపోయింది.

న్యాయం కోసం వస్తే....

బాధితురాలితో సీఐ అసభ్యకర ప్రవర్తన

ఈనాడు, విశాఖపట్నం: ప్రియుడు మోసం చేశాడని, తనకు అతనితో వివాహమయ్యేలా న్యాయం చేయాలని వచ్చిన ఓ యువతి పట్ల అసభ్యకరంగా ప్రవర్తించారన్న ఆరోపణలపై నగరంలోని మూడో పట్టణ సీఐ బెండి వెంకటరావుపై నగర పోలీస్ కమిషనర్ యోగానంద్ సస్పెన్షన్ వేటు వేశారు. ఐటీ ఉద్యోగినిగా పని చేస్తున్న బాధితురాలి పట్ల సీఐ అభ్యంతరకరంగా ప్రవర్తించినట్లు ప్రాథమిక విచారణలో ఆధారాలు ఉన్నాయంటూ సీపీ తన ఉత్తర్వ్యుల్లో పేర్కొన్నారు.

నగరంలోని ఒక ఐ.టి. ఉద్యోగినిని ఒక ప్రబుద్ధుడు ప్రేమ పేరుతో నమ్మించి మోసం చేశాడు. అతడికి బుద్ధి చెప్పాలన్న ఉద్దేశంతో బాధితురాలు మూడో పట్టణ పోలీసులను ఆశ్రయించింది. తమ ప్రేమకు సంబంధించిన అన్ని ఆధారాలనూ అందించింది. కేసు నమోదు చేసిన సి.ఐ. వెంకటరావు తొలుత ఆమెతో మర్యాదగానే వ్యవహరించారు. కేసు దర్యాప్తు కూడా బాగానే చేశారు. ఆమెకు న్యాయం చేయడానికి అవసరమైన చర్యలు తీసుకున్నారు. కొద్దిరోజుల తరువాత ఆయన ప్రవర్తనలో మార్పు వచ్చింది. దీంతో బాధితులికి ఏమీ పాలుపోలేదు. ఈ విషయాన్ని మాటలతో చెబితే సరిపోదని, పక్కా ఆధారాలు ఉండాలన్న ఆలోచనతో ఆయన అసభ్య ప్రవర్తనను నిరూపించేలా కొన్ని సాక్ష్యాలను సంపాదించి నేరుగా పోలీస్ కమిషనర్ యోగానంద్‌ను ఆశ్రయించింది. వాటిని పరిశీలించిన సీపీ వెంటనే స్పందించారు. ఫిర్యాదుపై ప్రాథమిక విచారణ చేయించి బాధితురాలి ఫిర్యాదు వాస్తవమేనని నిర్ధరించుకున్నారు. ఆ వెంటనే సీఐ వెంకటరావును సస్పెండ్ చేశారు.

బాధితురాలు సి.ఐ.పై కేసు నమోదు చేయాలని పట్టుబడుతోందా? లేదా? అన్నదానిపై స్పష్టత రాలేదు. సీఐ వ్యవహారశైలిని ఉన్నతాధికారుల దృష్టి తీసుకెళ్లే ఉద్దేశంతోనే ఆమె ఫిర్యాదు చేశారని, కేసు పెట్టే ఉద్దేశం లేదని తెలుస్తోంది. సీఐ బెండి వెంకటరావు బుధవారం సాయంత్రం వరకు విధి నిర్వహణలోనే ఉన్నారు. సస్పెన్షన్ వేటును ఆయన ఊహించలేదు. పోలీసు ఉన్నతాధికారులు మూడో పట్టణ సీఐగా స్టీల్‌ప్లాంట్ సి.ఐ. ఎం. శేషుకు పోస్టింగు ఇచ్చి.. విజయనగరం నుంచి కమిషనరేట్‌కు వచ్చిన సీఐ ఎ.వి.లీలారావుకు తాత్కాలికంగా స్టీల్ ప్లాంట్ పోలీస్‌స్టేషన్ సీఐగా అటాచ్‌మెంట్ ఇచ్చారు.

లోపాలపై 104కు ఫోన్ చేయండి

పెదగుమ్ములూరు (ఎస్.రాయవరం), న్యూస్‌టుడే: రాష్ట్రంలోని తెలుపు రేషన్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ ఎన్టీఆర్ ఉచిత వైద్యసేవకు అర్హులేనని ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్టు సీఈఓ డాక్టర్ ఎ.రవిశంకర్ అన్నారు. బుధవారం పెదగుమ్ములూరులో జరిగిన అయిదో విడత జన్మభూమి మా ఊరు కార్యక్రమానికి అమరావతి నుంచి పరిశీలకునిగా వచ్చిన ఆయన ముందుగా మీ-సేవ కేంద్రాన్ని పరిశీలించి, అర్జీల నమోదు పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఎన్టీఆర్ వైద్యసేవపై ప్రజలకు సరైన అవగాహన లేదని, భయంతో కూడా ఎక్కువ మంది పథకాన్ని ఉపయోగించుకోలేక పోతున్నారని తెలిపారు. ప్రతి ఆసుపత్రిలో ఎన్టీఆర్ వైద్యమిత్రలను నియమించామని, ప్రజలు నిర్భయంగా వెళ్లి, చికిత్స పొందడం వారి హక్కని వివరించారు. ఎన్టీఆర్ వైద్య సేవలు అందిస్తున్న ఆసుపత్రుల్లో సరైన సౌకర్యాలు లేని, సేవలు అందించకపోతే 104కి ఫిర్యాదు చేస్తే ఆసుపత్రి యాజమాన్యంతో చర్చించి, ఆసుపత్రిని తనిఖీ చేసి ఎన్టీఆర్ వైద్యసేవల నుంచి తొలగిస్తామన్నారు. నియోజకవర్గంలోని వైద్యులతో సమావేశం ఏర్పాటుచేసి మల్టీస్పెషాలిటీ ఆసుపత్రిని ఏర్పాటు చేస్తామన్నారు. ఎన్టీఆర్ వైద్యసేవల ద్వారా ప్రభుత్వం ఏడాదికి ఓ కుటుంబానికి రూ. 2.5 లక్షలు చెల్లిస్తుందని, కుటుంబం ఎంత మొత్తాన్ని సేవలు పొందారో చరవాణికి సందేశాల ద్వారా తెలియజేస్తామన్నారు. గతేడాది సుమారు లక్షమంది ఎన్టీఆర్ వైద్యసేవలను వినియోగించుకున్నారని, వీరిపై రూ. 568 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేసిందని తెలిపారు. సక్రమంగా సేవలు అందించని గుంటూరు, కృష్ణా, నెల్లూరు, కర్నూలు, విశాఖ జిల్లాలకు చెందిన 30 ఆసుపత్రులను ఎన్టీఆర్ వైద్య సేవల నుంచి సస్పెండ్ చేశామని తెలిపారు.



ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్టు సీఈఓ రవిశంకర్



మీ సేవా కేంద్రాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ రవిశంకర్

ఈనాడు-ఈటీవీ ఆంధ్రప్రదేశ్ నిర్వహిస్తున్న

ముత్యాల ముగ్గుల పోటీ జనవరి 2, 2018 విజేతలు

1. సి.హెచ్ జ్యోతి నిఖిల, జగ్గయ్యపేట; 2. వి. రమ్య, మధిర; 3. కె.పద్మ భారతి, యలమంచిలి; 4. ఎస్. శైలజ, జగ్గయ్యపేట; 5. కె. పూజిత, చిలకలూరిపేట; 6. డి. నాగయశస్వి, వైజాగ్; 7. దుర్గా స్రవంతి, కనుమోలు, కృష్ణా; 8. కె.వి. లావణ్య, బుచ్చిరెడ్డి పాలెం; 9. సి.హెచ్. సంధ్యారాణి, చీరాల; 10. శైలజ, రామదుర్గం, బళ్ళారి. విజేతల వివరాలు ఈనాడు డాట్ నెట్‌లో చూడవచ్చు.

అరకులోయ

ఘనంగా ఉపాధ్యాయుల దినోత్సవం

అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలో గల చిలకలగెడ్డ గ్రామంలో గల పాఠశాల ఆవరణలో బుధవారం ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా ఉపాధ్యాయినుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో పలువురు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు పాల్గొని సావిత్రిబాయి చిత్రపటానికి జ్యోతి వెలిగించారు. కార్యక్రమంలో ఎంఈఓ వెంకటరావు, సన్యాసిరావు, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి జన్మభూమి కార్యక్రమాలు

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే : 5వ విడత జన్మభూమి మాఊరు కార్యక్రమాలు నేడు మండలంలోని పద్మాపురం, సుంకరమెట్ట పంచాయతీల్లో నిర్వహించనున్నారు. ఎంపీడీఓ మల్లికార్జునరావు ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు పద్మాపురం ఆర్సీఎం పాఠశాల ఆవరణలో గ్రామసభ జరుగుతుంది. మధ్యాహ్నం 2 గంటలకు తహసీల్దారు అరుణ పర్యవేక్షణలో సుంకరమెట్ట పంచాయతీ కార్యాలయం వేదికగా గ్రామసభను నిర్వహించనున్నారు.

అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి

అరకులోయ, న్యూస్‌టుడే: ప్రభుత్వం గిరిజన విద్యార్థులకు ఉన్నతవిద్య అందించేందుకు అన్ని రకాల సహాయ సహకారాలను అందిస్తోందని ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు అన్నారు. బుధవారం అరకులోయలోని వైటీసీ కేంద్రంలో ఏకలవ్య పాఠశాల తరగతులను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డుంబ్రిగుడ మండలానికి మంజూరైన ఏకలవ్య పాఠశాల తరగతులు ప్రభుత్వం ఈఏడాది తాత్కాలికంగా అరకులోయలో ప్రారంభించాలని నిర్ణయించిందన్నారు. భవనాల నిర్మాణానికి రూ. 12 కోట్లు మంజూరయ్యాయన్నారు. త్వరలోనే స్థల సేకరణ జరిపి పనులు ప్రారంభిస్తారన్నారు. ఆంగ్ల మాధ్యమంలో విద్యార్థులకు నాణ్యమైన విద్య ఏకలవ్య పాఠశాల ద్వారా లభిస్తుందన్నారు. ఈ ఏడాది గిరిజన సంక్షేమ పాఠశాలల్లో చదువుకుంటున్న 120 మంది విద్యార్థులతో ఆరోతరగతి నుంచి ఏకలవ్య పాఠశాల ప్రారంభిస్తున్నామన్నారు. గతేడాది గురుకుల పాఠశాలల్లోని విద్యార్థులు 36 మంది ఐఐటీలో సీట్లు సాధించారని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి అరకులోయను ఆధ్యాత్మిక పర్యటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ఆలోచన చేస్తోందన్నారు. నియోజకవర్గంలో వంద చర్చిలను ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపించామన్నారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ నారాయణరావు మాట్లాడుతూ ఏకలవ్య పాఠశాలలో తాత్కాలికంగా డిప్యుటేషన్‌పై ఉపాధ్యాయులను ప్రభుత్వం నియమించిందన్నారు. ఈ మూడు మాసాల కాలంలో విద్యార్థులకు ఆంగ్లంలో అవగాహన కల్పిస్తారన్నారు. సర్పంచి సమర్డి గులాబి, ఎంపీపీ అరుణకుమారి, ఉప ఎంపీపీ అమ్మన్న, ఉప సర్పంచి సత్యానందం, తెదేపా నాయకులు సమర్డి రఘునాథ్, శెట్టి అప్పాలు, ఏటీడబ్ల్యూవో బొంజుబాబు, క్రీడా పాఠశాల ప్రిన్సిపాల్ మూర్తి పాల్గొన్నారు.


ఏకలవ్య పాఠశాల తరగతులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కిడారి

జోలాపుట్టులో కానుకల పంపిణీ

ముంచంగిపుట్టు గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పనిచేస్తున్నారని ఏ.ఎం.సీ డైరక్టర్ ఎం.డి.సులేమాన్ అన్నారు. బుధవారం మండలంలో గల జోలాపుట్టులో సంక్రాంతి కానుకల పంపిణీని ఆయన ప్రారంభించారు. జోలాపుట్టు పంచాయతీ పరిధిలోగల బొంద్రుగుడ, గొడ్డిపుట్టు, జోలాపుట్టు తదితర గ్రామాలకు చెందిన వినియోగదారులకు సంక్రాంతి కానుకలు అందించారు. జోలాపుట్టు డీఆర్ డిపోలో మొత్తం 332 రేషన్ కార్డుదారులు ఉండగా.. అందరికీ సరకులు అందజేశారు. బుధవారం నాడు సంక్రాంతి కానుకల పంపిణీలో జోలాపుట్టు సర్పంచి వి.రామస్వామి పాల్గొన్నారు.


సంక్రాంతి కానుకలు పంపీణీ చేస్తున్న నాయకులు

సీకరిలో..

పెదబయలు గ్రామీణం, న్యూస్‌టుడే: సంక్రాంతి పండగ సందర్భంగా పెదబయలు మండలం సీకరిలో తెదేపా మండల అధ్యక్షుడు సన్యాసిదొర ఆధ్వర్యంలో లబ్ధిదారులకు చంద్రన్న కానుకలు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రన్న కానుకలతో ప్రతిఇంటా పండగ వాతావరణం నెలకొంటుందని, అందరూ సంతోషంగా గడపాలని అన్నారు. అనంతరం మేనేజర్ మాట్లాడుతూ ప్రతి లబ్ధిదారునికి చంద్రన్న కానుకలు అందేలా చూస్తున్నామని అన్నారు.


చంద్రన్న కానుకలు పంపిణీ చేస్తున్న సన్యాసి దొర, వెంకటేష్

రూ.53 లక్షలతో సామాజిక భవనం

పానిరంగిని(అరకులోయ): మండలంలో పెదలబుడు పంచాయతీ పానిరంగిని గ్రామంలో సామాజిక భవనం, గ్రంథాలయ భవన నిర్మాణానికి రూ.53 లక్షలను ప్రభుత్వం మంజూరు చేసింది. ఇటీవల అరకులోయ పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి గ్రామస్థులు సామాజిక భవనం, గ్రంథాలయం మంజూరు చేయాలని కోరారు. దీనిపై స్పందించిన ఆయన గిరిజన ఉపప్రణాళిక నిధులు రూ.35 లక్షలు సామాజిక భవనానికి, రూ.18 లక్షలు గ్రంథాలయ భవన నిర్మాణానికి నిధులు కేటాయించినట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. పానిరంగిని గ్రామంలో సౌకర్యాల కల్పనకు వీలుగా ముఖ్యమంత్రి నిధులు కేటాయించటంపై రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుడు ఎల్‌బి.వెంకట్రావు హర్షం వ్యక్తం చేశారు. గ్రామస్థుల తరపున ముఖ్యమంత్రికి ఆయన కృతజ్ఞతలను తెలియజేశారు.

చిన్నారులకు చలిదుస్తుల పంపిణీ

హుకుంపేట, న్యూస్‌టుడే: సికెల్‌సెల్ ఎనీమియా, తలసీమియా వ్యాధిగ్రస్థులకు అండగా ఉంటామని 'ఉత్తరాంధ్ర - మాఆసరా' ఫౌండేషన్ సీఈవో మాలతి పేర్కొన్నారు. బుధవారం స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల విద్యార్థులు 100 మందికి చలిదుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ వ్యాధి ఉన్నవారికి ప్రభుత్వం పింఛన్లు అందించనుందని.. తమను సంప్రదిస్తే పింఛన్లు వచ్చేలా సహకరిస్తామని పేర్కొన్నారు. సంస్థ సభ్యులు ప్రసాద్, చిన్నారావు, గౌరీశంకర్, సంతోషి, అనూష, వెంకటలక్ష్మి, రామ్‌సాగర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


చలిదుస్తులు పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

సంక్రాంతి సరకులు సద్వినియోగం చేసుకోండి

అరకులోయ, న్యూస్‌టుడే: ప్రతి ఇంటా పండుగ నాడు చిరునవ్వులు తొణికిసలాడాలనే ఉద్దేశంతో ప్రభుత్వం పంపిణీ చేస్తున్న చంద్రన్న సంక్రాంతి సరకులను సద్వినియోగం చేసుకోవాలని తెదేపా మండల అధ్యక్షుడు శెట్టిబాబూరావు కోరారు. బుధవారం మండలంలోని కొత్త భల్లుగుడ పంచాయతీ జనంగుడ గ్రామంలో లబ్ధిదారులకు చంద్రన్న సంక్రాంతి సరకులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదవాడి ఇంట్లోనూ సంక్రాంతి పండుగని అందరిలా చేసుకోవాలనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆరు రకాల సరకులను ఉచితంగా అందిస్తున్నారన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రతి ఇంటా ఈ సరకులతో పిండి వంటలు తయారు చేసుకొని సంక్రాంతిని ఘనంగా చేసుకోవాలన్నారు. పేద ప్రజల సంక్షేమానికి తెదేపా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు కాసులమ్మ పాల్గొన్నారు.


సరకులు పంపిణీ చేస్తున్న శెట్టి బాబూరావు

పెదబయలులో 5కె రన్ పరుగు

పెదబయలు, న్యూస్‌టుడే: జన్మభూమి మాఊరు కార్యక్రమంలో భాగంగా ఈనెల 5న పెదబయలులో విద్యాశాఖ ఆధ్వర్యంలో 5కె రన్ పరుగుపోటీలు ఏర్పాటు చేస్తున్నట్లు మండల విద్యాశాఖాధికారి కె.సింహాచలం తెలిపారు. జన్మభూమి కార్యక్రమంలో భాగంగా విద్య, ఆరోగ్యం ఆవశ్యకత చాటిచెప్పేలా భారీస్థాయిలో నిర్వహిస్తారు. పెదబయలు నుంచి అరడకోట వరకు జరిగే ఈ కార్యక్రమాన్ని అరకులోయ ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు ప్రారంభిస్తారని చెప్పారు. అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, అధికారులు, పోలీసులు, ప్రజాప్రతినిధులు, వర్తకులు పాల్గొనాలని ఆయన కోరారు.

నిత్యావసర సరకులు పక్కాగా అందిస్తాం

జీసీసీ డీఎం మోహన్‌రావు

అనంతగిరి, న్యూస్‌టుడే: ప్రతి కార్డుదారునికి నిత్యావసర సరకులు పక్కాగా అందించేందుకు అన్నివిధాలా చర్యలు చేపడుతున్నామని జీసీసీ డీఎం మోహన్‌రావు అన్నారు. బుధవారం మండలంలో పర్యటించిన ఆయన అనంతగిరి జీసీసీ డిపోను తనిఖీ చేశారు. అనంతరం కార్డుదారులతో మాట్లాడుతూ.. నిత్యవసర సరకులు సక్రమంగా అందుతున్నాయా అని ఆరాతీశారు. ఈ సందర్భంగా అక్కడే ఉన్న గిరిజన సంఘం నాయకులు సుమారు 150 కార్డులకు చాలాకాలంగా సరకులు అందటం లేదని.. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకు వెళ్లినప్పటికీ ప్రయోజనం శూన్యంగా ఉందని చెప్పారు. దీనిపై చర్యలు చేపట్టాలని వినతిపత్రాన్ని మోస్య అందించారు. ఈ-పోస్ సమస్యను సబ్‌కలెక్టర్ దృష్టికి తీసుకునివెళతానని డీఎం అన్నారు.


ఈ-పోస్‌ను పరిశీలిస్తున్న డీఎం

ఏకలవ్య పాఠశాల ప్రారంభం

పెదబయలు గ్రామీణం న్యూస్‌టుడే: పెదబయలు వైటీసీలో ఏకలవ్య పాఠశాల ప్రారంభోత్సవం ఎంపీపీ సల్లంగి ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఏకలవ్య పాఠశాల ప్రత్యేక అధికారి అలమండ మహేశ్వరరావు మాట్లాడుతూ ఈ పాఠశాల ముంచంగిపుట్టు మండలానికి చెందినదని, భవన నిర్మాణం పూర్తయిన వెంటనే అక్కడికి తరలిస్తామని అన్నారు. శనివారం ప్రవేశ పరీక్షలు నిర్వహించామని.. 120 మంది బాలిబాలికలను ఎంపిక చేశామని పేర్కొన్నారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ ఈ పాఠశాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏపీఆర్ సొసైటీ ఆధ్వర్యంలో పాఠశాల పర్యవేక్షణ ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా ఏటీడబ్ల్యూవో శాంతకుమారి, మాజీ ఎంపీపీ వి.కొండయ్య, తెదేపా మండల అధ్యక్షుడు సీకరి సన్యాసిదొర, గంపరాయి సూరయ్య, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు బి.సన్నిబాబు, మర్రిచెట్టు అప్పారావు పాల్గొన్నారు.


పాఠశాలను ప్రారంభిస్తున్న నాయకులు

మహిళలకు కుట్టుశిక్షణ

అరకులోయ, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దత్తత పంచాయతీ పెదలబుడు గిరిజన మహిళలకు స్వయం ఉపాధి కల్పించేందుకు వీలుగా కుట్టుశిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఐటీడీఏ - ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో 35 మంది మహిళలకు తొలివిడత కుట్టుపనిలో శిక్షణని ఇచ్చేందుకు చర్యలు చేపట్టారు. గ్రామతరంగ్ సంస్థ ఆధ్వర్యంలో రెండు మాసాలపాటు ఉచిత శిక్షణతోపాటు ఉదయం, మధ్యాహ్నం ఉచిత భోజన వసతి కల్పించేందుకు చర్యలు చేపట్టారు. విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు ఉచితంగా కుట్టు మిషన్ని అందించడం జరుగుతుందన్నారు. అలాగే నిరుద్యోగ యువకుల కోసం ఉచిత డ్రైవింగ్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పదోతరగతి విద్యార్హత కలిగిన అభ్యర్థులు అర్హులని నిర్వాహకులు తెలిపారు. 45 రోజుల శిక్షణ అనంతరం డ్రైవింగ్ లైసెన్స్ ఇస్తారన్నారు. కార్యక్రమంలో సమన్వయకర్త చంటిబాబు, శిక్షకుడు శోభన్‌బాబు, వైటీసీ కేర్‌టేకర్ శ్యాంసన్ తదితరులు పాల్గొన్నారు.


కుట్టుశిక్షణ కార్యక్రమంలో గిరిజన మహిళలు

అరకులోయ

అత్యాచార నిందితుడిని కఠినంగా శిక్షించాలి

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే : విశాఖపట్నం గాజువాక పరిధిలో దువ్వాడ ఎస్‌ఈజెడ్‌లో ప్రాంతంలో అరకులోయ మండలం లోతేరు గ్రామానికి చెందిన గిరిజన మూగబాలికపై అత్యాచారానికి పాల్పడిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, నిర్భయ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని సీపీఎం అరకు డివిజన్ కార్యదర్శి కిల్లో సురేంద్ర డిమాండ్ చేశారు.

తెదేపా హయాంలోనే మన్యం అభివృద్ధి

ఎమ్మెల్యే కిడారి సర్వేశ్వరరావు

హుకుంపేట, న్యూస్‌టుడే: తెదేపా ప్రభుత్వం అనేక పథకాలు పెట్టి ప్రజలను ఆదుకుంటోందని ప్రభుత్వ విప్ కిడారి సర్వేశ్వరరావు తెలిపారు. బుధవారం ఓల్డా, రాప పంచాయతీలో నిర్వహించిన జన్మభూమి మాఊరు కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం విడిపోయి రూ.16 వేల కోట్ల లోటు బడ్జెట్‌తో ప్రారంభించి నేడు అభివృద్ధిలో పయనిస్తున్నామంటే అది చంద్రబాబునాయుడు మూలంగానే జరిగిందని పేర్కొన్నారు. నియోజకవర్గంలో 85శాతం తాగునీరు పథకాలు, 99శాతం మారుమూల గ్రామాల్లో విద్యుత్తు, 90శాతం రహదారులు కల్పించామని.. వాటిని ప్రజలు సక్రమంగా వినియోగించుకోవాలని కోరారు. ప్రతి గ్రామంలోనూ మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తిచేసి స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్‌కు సహకరించాలన్నారు. సంతారి ఉప్ప రహదారికి రూ.2 కోట్లు ఖర్చు చేశామని.. నేడు బస్సు సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. సర్పంచి పుణ్యవతి, ఎంపీడీఓ రామచంద్రమూర్తి, విద్యాశాఖ డీఈవో జ్యోతికుమార్, ఎంఈవో రామచంద్రరావు, సీడీపీవో నాగమణి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ రామేష్‌బాబు, తెదేపా పార్టీ నాయకులు శెట్టి లక్ష్మణుడు, వెంకటరమణరాజు, సుబ్బారావు, కామేశ్వరరావు, శంకర్ పాల్గొన్నారు.


గిరిజనుల వద్ద నుంచి దరఖాస్తులు తీసుకుంటున్న కిడారి


చొంపిలో అధికారులను మరుగుదొడ్ల బిల్లుల కోసం ప్రశ్నిస్తున్న గ్రామస్థులు

అరకులోయ, న్యూస్‌టుడే: మండలంలోని చొంపి పంచాయతీ కేంద్రంలో బుధవారం నిర్వహించిన జన్మభూమి-మా ఊరు కార్యక్రమంలో మరుగుదొడ్ల బిల్లుల స్వాహాపై ప్రజలు అధికారులను నిలదీశారు. ఎంపీడీవో మల్లికార్జునరావు ఆధ్వర్యంలో సర్పంచి పాడి లక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన జన్మభూమి కార్యక్రమం తూతూమంత్రంగా సాగింది. చొంపి పంచాయతీ పరిధిలోని గెమ్మెలివలస, కొత్తవలస, పప్పుడువలస తదితర గ్రామాల్లో లబ్ధిదారుల సొంత సొమ్ముతో మరుగుదొడ్లు ఉపాధిహామీలో నిర్మించుకుంటే అధికారులు బిల్లులు చెల్లించకుండా వాటిని అక్రమంగా గుత్తేదారుల ఖాతాల్లోకి మళ్లించేశారని ఆరోపిస్తూ అధికారులను నిలదీశారు. తాము నిర్మించుకున్న మరుగుదొడ్లకి సొమ్ము చెల్లించాలని డిమాండ్ చేశారు. బాధ్యుల నుంచి సొమ్ము తిరిగి రాబట్టాలని కోరారు. దీనిపై స్పందించిన ఎంపీడీవో మల్లికార్జునరావు విషయాన్ని ఐటీడీఏ పీవో దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని హామీఇచ్చారు. ఈ సందర్భంగా పంచాయతీ పరిధిలో 20 మంది రైతులకు రుణమాఫీ పత్రాలు అందజేశారు. ఉదయం పది గంటల నుంచి జన్మభూమి కార్యక్రమం కోసం ప్రజలు ఎదురుచూడగా అధికారులు మాత్రం కార్యక్రమాన్ని పదకొండున్నరకి ప్రారంభించారు. రెండు గంటల్లోనే అయ్యిందనిపించారు. కార్యక్రమం సగంలోనే ప్రజలంతా కార్యక్రమం ప్రాంగణం నుంచి వెళ్లిపోవటం గమనార్హం. ఎంఈవో భారతీరత్నం, ఏఈలు త్రినాథరావు, రాజేష్, ఐసీడీఎస్ పీవో ఉమ, వ్యవసాయాధికారి సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ గృహాల మంజూరుపై రగడ

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: దారెల, బంగారుమెట్ట గ్రామాల్లో బుధవారం నిర్వహించిన జన్మభూమి వ ఊరు కార్యక్రమంలో ఎన్టీఆర్ గృహాల మంజూరుపై ప్రజలు ధ్వజమెత్తారు. బంగారుమెట్టలో గత జన్మభూమిలో 1200 ఇళ్లు మంజూరు చేస్తున్నామని ప్రకటించిన అధికారులు అర్హులైన వారికి ఇళ్లు కేటాయించలేదని.. గ్రామసభను బహిష్కరించాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్నం రెండు గంటలకు ప్రారంభమైన కార్యక్రమాన్ని 4 గంటల వరకు కొనసాగించకుండా అధికారులను అడ్డుకున్నారు. ఎంపీడీఓ ప్రభాకరరావు, ఉపాధిహామీ పథకం ఏపీఓ రాజు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలపై ప్రజలకు వివరించారు. దారెల గ్రామంలో రెండేళ్ల కిందట తవ్విన ఇంకుడుగుంతలకు రూ.1200 చెల్లించారని, మిగతా రూ.600 చెల్లించలేదని ఉపాధిహామీ పథకం కింద తక్షణమే చెల్లించాలని సీపీఎం నాయకులు పాంగి శాస్త్రిబాబు డిమాండ్ చేశారు. గృహ నిర్మాణ ఏఈ ప్రేమానందం, ఐసీడీఎస్, వ్యవసాయశాఖ, రెవెన్యూ, జీసీసీ అధికారులు పాల్గొన్నారు.


తీర్మానాన్ని తహసీల్దార్‌కు అందజేస్తున్న పీసీ కమిటీ ప్రతినిధులు, సర్పంచి గోపాలరావు

ఎస్టీల్లో చేర్చొద్దంటూ జన్మభూమిలో తీర్మానం

బొండాం(అరకులోయ): బోయ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చరాదని కోరుతూ బొండాంలో జరిగిన జన్మభూమి కార్యక్రమంలో ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఈసందర్భంగా తహసీల్దార్ అరుణకి తీర్మానాన్ని అందజేశారు. అలాగే చొంపి గ్రామంలో జరిగిన జన్మభూమి కార్యక్రమంలోనూ బోయవాల్మీకులకు వ్యతిరేకంగా తీర్మానం చేశారు. సర్పంచి గోపాలరావు, పీసా కమిటీ ప్రతినిధులు ఆనందరావు పాల్గొన్నారు.


గోమంగి జన్మభూమిలో అధికారులు

మంచినీటి సమస్య తీర్చాలి

గోమంగి(పెదబయలు), న్యూస్‌టుడే: పెదబయలు మండలంలోని మారుమూల గోమంగిలో జరిగిన జన్మభూమి మాఊరు కార్యక్రమంలో మంచినీటి సమస్య తీర్చాలని.. బోయ, వాల్మీకి కులస్థులని ఎస్టీ జాబితాలో చేర్చవద్దని పంచాయతీ ప్రజలు, వైకాపా నాయకులు జన్మభూమి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఎంపీడీఓ వెంకన్నబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాడేరు ప్రత్యేక ఉపకలెక్టర్ వేణుగోపాలరావు, మండల ప్రత్యేకాధికారి త్రినాథ్, ఎంపీపీ ఉమామహేశ్వరరావు, జడ్పీటీసీ సభ్యురాలు గంగాభవాని హాజరై ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, సర్పంచ్ సింహాచలం పాల్గొన్నారు.

అనంతగిరి: మండలంలో జరిగిన టోకూరులో తహసీల్దార్ బృందం, గరుగుబిల్లిలో ఎంపీడీఓ బృందాలు జన్మభూమి కార్యక్రమాలను నిర్వహించాయి. టోకూరులో బోయలను ఎస్టీలలో చేర్చవద్దని నినాదాలు చేస్తూ వినతులను స్థానిక గిరిజన సంఘం నాయకులు మోస్య, నాగులు, శుభశేఖర్ తదితరులు అందించారు. గరుగుబిల్లిలో సమస్యలపై వినతులు అందాయి. గరుగుబిల్లిలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న జడ్పీ ఉపాధ్యక్షులు కొట్యాడ అప్పారావు, ఎంపీపీ పైడతల్లి మాట్లాడుతూ... ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమన్నారు.

ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి


కార్యక్రమంలో మాట్లాడుతున్న యూటీఎఫ్ జిల్లా కౌన్సిలర్ చిట్టిబాబు

అరకులోయ, న్యూస్‌టుడే: అరకులోయ మండలంలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. కొత్తభల్లుగుడ గిరిజన సంక్షేమ బాలికల పాఠశాలలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రధానోపాధ్యాయిని మంగమ్మ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కౌన్సిలర్ చిట్టిబాబు మాట్లాడుతూ ఆదర్శ ఉపాధ్యాయినిగా పనిచేస్తూ సాంఘిక దురాచారాలపై సావిత్రిబాయి పూలే పోరాటం చేశారన్నారు. ఉపాధ్యాయ సంఘం నాయకులు ఈశ్వరరావు, బాలన్న, సుబ్బారావు, లకోయి దొర పాల్గొన్నారు.

అనంతగిరి, న్యూస్‌టుడే: మహిళలకు సావిత్రిబాయి పూలే ఎంతో ఆదర్శమని అనంతగిరి బాలికల పాఠశాల-1 ప్రధానోపాధ్యాయురాలు మల్లీశ్వరి అన్నారు. బుధవారం బాలికల పాఠశాల-1లో మహిళా ఉపాధ్యాయుల దినోత్సవం నిర్వహించారు. సీనియర్ ఉపాధ్యాయులను సన్మానించారు. యూటీఎఫ్ నాయకులు రాంబాబు, రమణ, మల్లేష్, బాలకృష్ణ పాల్గొన్నారు.

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకొని బుధవారం డుంబ్రిగుడలో పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానించారు. పదవీ విరమణ చేసిన కిల్లోగుడ పాఠశాల ఉపాధ్యాయిని ఆరి లక్ష్మిని ఉపాధ్యాయులు సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈవో త్రినాథరావు మాట్లాడారు. సంఘం నాయకులు అప్పలరాజు, కన్నయ్య, జలంధర్ తదితరులు పాల్గొన్నారు.


ఉపాధ్యాయిని లక్ష్మిని సన్మానిస్తున్న ఉపాధ్యాయ సంఘ నాయకులు

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: మండలంలో కిలగాడ గ్రామంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో బుధవారం సావిత్రిబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. విద్యాలయం ప్రత్యేక అధికారిణి సత్యవతి ఆధ్వర్యంలో సర్పంచి సిహెచ్.రాజేశ్వరి, యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా కార్యదర్శి పాంగి నీలకంఠం పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సావిత్రిబాయిపూలే రచయిత్రిగా, సంఘ సంస్కర్తగా, ప్రగతిశీల ఉపాధ్యాయినిగా పేదల పక్షాన ఉండి పోరాడారన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం మండల నాయకులు కె.బంగారయ్య, ఎం.ధర్మారావు, జిల్లా నాయకులు నాగేశ్వరరావు, వసంతరావు, శ్రీదేవి, రత్నాకుమారి పాల్గొన్నారు.

హుద్‌హుద్ గృహ నిర్మాణాలు వేగవంతం

అరకులోయ: అరకులోయ సబ్‌డివిజన్‌లో హుద్‌హుద్ బాధితుల కోసం నిర్మిస్తున్న మోడల్ కాలనీల్లో గృహ నిర్మాణాలను వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు గృహ నిర్మాణశాఖ డీఈఈ(ప్రాజెక్ట్స్) ప్రసన్నరాజు తెలిపారు. బుధవారం మండలంలోని ములియగలుంగు వద్ద హుద్‌హుద్ బాధితుల కోసం నిర్మిస్తున్న మోడల్ కాలనీలో నిర్మాణాలను ఆయన పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. ములియగలుంగులో 36 గృహాలు మంజూరవ్వగా 24 లింటెల్ దశలో ఉన్నాయన్నారు. సుంకరమెట్టలో 109 గృహాలు పునాదుల దశలో ఉన్నాయని పేర్కొన్నారు. దోమలజోరులో 47 గృహాలకు మట్టి పనులు పూర్తయ్యాయన్నారు. డుంబ్రిగుడ మండలంలోని కె.పనసపుట్టులో 54 గృహాలు మంజూరవ్వగా వాటిలో 34 పునాదులను పూర్తి చేసుకున్నాయన్నారు. వీటిలో కొంతమంది లబ్ధిదారులు గతంలో ఇందిరమ్మ గృహాల లబ్ధిదారులుగా ఉండటంతో ఆన్‌లైన్ అనుమతుల్లో జాప్యం జరిగిందన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న గృహనిర్మాణ డీఈఈ

ఏపీటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

హుకుంపేట, న్యూస్‌టుడే: హుకుంపేట మండలంలోని ఏపీటీఎఫ్ మండలశాఖ ఆధ్వర్యంలో యూనియన్ డైరీలు, క్యాలెండర్లను ఎంపీడీవో రామచంద్రమూర్తి, తహసీల్దార్ శ్యామ్‌బాబు, ఎంఈవో రామచంద్రరావు విడుదల చేశారు. బుధవారం స్థానిక ఎంఈవో కార్యాలయం వద్ద ఉపాధ్యాయుల సమక్షంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేసి విద్యార్థులకు మంచి భవిష్యత్తు కల్పించాలని కోరారు. ఏపీటీఎఫ్ మండల నాయకులు చిన్నారావు, వెంకటరమణదొర, మత్స్యరాజు, ప్రభాకర్‌రావు, సత్యారావు, స్వామినాయుడు పాల్గొన్నారు.

పెదబయలు గ్రామీణం, న్యూస్‌టుడే: పెదబయలు స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో ఏపీటీఎఫ్ 2018 డైరీ, క్యాలెండర్‌ను ఎంఈవో కె.సింహాచలం ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈసందర్భంగా సంఘం మండల అధ్యక్షుడు ఎస్.లక్ష్మీనారాయణ మాట్లాడుతూ వృత్తి పట్ల బాధ్యతగా నిలబడిన ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి నిర్విరామంగా కృషి చేస్తుండాలని అన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కె.భీమరాజు, జె.మాలంనాయుడు, వి.రాజేష్, లక్ష్మి, వెంకటలక్ష్మీ ఎస్.పావని, ఎస్.బి.ఎల్.స్వామి పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంఈవో, ఎంపీడీవో తదితరులు

చోడవరం

వెండితెర

శ్రీసాయిలక్ష్మి: 2 కంట్రీస్,
సాయిలక్ష్మి: ఎంసీఏ సాయి సిరిమాక్స్: ఒక్క క్షణం ఎల్.కె.పూర్ణా: హలో,
రవి టాకీస్(కొత్తకోట): 2 కంట్రీస్
శ్రీ వెంకటేశ్వర (రావికమతం): ఎంసీఏ
కనకరత్నం(మాడుగుల): ఒక్క క్షణం


గ్యాస్ సమాచారం

చోడవరం : స్థానిక పుష్కల గ్యాస్ ఏజెన్సీ నుంచి సిలెండర్లను గురువారం చోడవరం, గ్రామాల విని యోగదారులకు పంపిణీ చేస్తారు. ఇతర సమాచారానికి ఫోను నం. 245122లో సంప్రదించగలరు.

నేడు ఉచిత వైద్యశిబిరం

సీతయ్యపేట (బుచ్చెయ్యపేట), న్యూస్‌టుడే: మండలంలోని సీతయ్యపేటలో గురువారం ఉచిత వైద్యశిబిరం జరగనుంది. సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. అన్ని రకాల వ్యాధులకు ఉచితంగా వైద్యపరీక్షలు చేసి మందులు అందిస్తారని సేవా ఫౌండేషన్ ధర్మప్రచారక్ సాదరబోయిన రాంబాబు తెలిపారు.

వడ్డాది కూడలిలో ట్రాఫిక్ కష్టాలు


నాలుగు రోడ్ల కూడలిలో వాహనాల బారులు

వడ్డాది (బుచ్చెయ్యపేట), న్యూస్‌టుడే: జిల్లాలోనే ముఖ్య కూడలిగా పేరొందిన వడ్డాది కూడలిలో ట్రాఫిక్ కష్టాలు పెరిగిపోయాయి. అటు నాలుగు రోడ్ల కూడలితో పాటు ఇటు గ్రామంలో కూడా ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. వాహనాల రద్దీతో గ్రామమంతా పద్మవ్యూహంలా తయారైంది. దీంతో ప్రయాణికులు, వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ట్రాఫిక్ సమస్యతో గ్రామస్థులు కూడా ఆందోళన చెందుతున్నారు. ఇక్కడ నుంచి అన్ని ప్రాంతాలకు రహదారి సదుపాయం ఉంది. జిల్లాలోని నాలుగు రెవెన్యూ డివిజన్లకు కూడా ఇది కూడలిగా ఉంది. జిల్లా కేంద్రమైన విశాఖపట్నంతో పాటు పాడేరు, అనకాపల్లి, నర్సీపట్నం ప్రాంతాలకు వెళ్లే బస్సులు, ఇతర వాహనాలన్నీ ఇటే తిరుగుతాయి. రాష్ట్ర రహదారి (ఎస్‌హెచ్-38) కూడా వడ్డాది మీదుగానే వెళ్తుంది. దాంతో వడ్డాది కూడలికి వాహనాల తాకిడి ఎక్కువగా ఉంటుంది. దీనికి తోడు చెరకు గానుగ సీజన్ ప్రారంభం కావడంతో వాహనాల రద్దీ మరింత పెరిగింది. ఏటా వాహనాల సంఖ్య పెరుగుతున్నా ఇక్కడ రహదారులు మాత్రం విస్తరించలేదు. కూడలి అంతా ఇరుగ్గా ఉంది. నాలుగు వైపుల నుంచి ఒకేసారి వాహనాలు వచ్చాయంటే ఈ కూడలి కిక్కిరిసిపోతుంది. ఉదయం, సాయంత్రం వేళల్లో వాహనాలన్నీ బారులు తీరుతున్నాయి. పాదచారులు కూడా తప్పుకోవడానికి స్థలం ఉండటం లేదు. ఎక్కడ వాహనాలు అక్కడే నిలిచిపోయి ప్రయాణికులు, వాహనచోదకులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ట్రాఫిక్ సమస్యపై పోలీసులు కూడా పెద్దగా పట్టించుకోలేదు. ప్రధాన కూడలి కావడంతో ఇక్కడ ప్రత్యేకంగా ఔట్‌పోస్టును ఏర్పాటు చేసి నిరంతరం ట్రాఫిక్ విధులను నిర్వహించాల్సి ఉంది. సిబ్బంది కొరత అంటూ అప్పుడప్పుడు మాత్రమే సాధారణ తనిఖీలు నిర్వహించి వదిలేస్తున్నారు. అలాగే గ్రామంలోకి వెళ్లే ప్రధాన రహదారి కూడా ఎప్పుడూ రద్దీగా ఉంటోంది. ఇసుక వాహనాలు, స్కూల్ బస్సులు, సంతకి వెళ్లేవాహనాలతో ఈ రోడ్డు కిక్కిరిసిపోతోంది. గ్రామస్థులు రాకపోకలు సాగించడానికి కూడా ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాలలకు వెళ్లే పిల్లలంతా ఉదయం, సాయంత్రం వేళల్లో రోడ్లపైనే తిరుగుతారు. వాహనాల రద్దీ వల్ల ఎక్కడ ప్రమాదాలు జరుగుతాయోనని తల్లిదండ్రులు భయపడుతున్నారు. వడ్డాదిలో ట్రాఫికర్‌పై పోలీసులు దృష్టిసారించాలని స్థానికులు కోరుతున్నారు.


వాహనాలతో కిక్కిరిసిన వడ్డాది వెళ్లే ప్రధాన రోడ్డు

పాడి రైతులకు బోనస్ పంపిణీ

చినపాచిల (రావికమతం), న్యూస్‌టుడే: మండలంలోని చినపాచిలలో పాడి రైతులకు విశాఖ డెయిరీ ద్వారా రూ.3.25 లక్షల నగదు, పశువుల దాణా బేసిన్‌లను ప్రోత్సాహకాలుగా బుధవారం అందజేశారు. ఇక్కడి విశాఖ డెయిరి పాల సొసైటీలో 203 మంది పాడి రైతులు పాలు పోస్తున్నారు. ఎంపీటీసీ సభ్యుడు సాసుబిల్లి నూక రాజు, పాల సంఘం అధ్యక్షుడు ఆదాడ రాజారావు, ఉప సర్పంచి కోమటి శంకరరావు రైతులకు అందజేశారు. అలాగే సభ్య రైతులు అందరికీ పశువులకు దాణా పెట్టుకోడానికి అవసరమైన సిల్వర్ బేసిన్‌లను ప్రోత్సాహకాలుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో విశాఖ డెయిరీ ఆఫీసర్ ఎస్.ఓ గణేష్‌కుమార్, విశాఖ డెయిరీ పాల సొసైటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


దాణా బేసిన్‌లు అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

ఆటో.. బైక్ ఢీ ఇద్దరికి తీవ్ర గాయాలు

గొంప (రావికమతం), న్యూస్‌టుడే: గొంప గ్రామానికి సమీపంలో ఆటో, ద్విచక్ర వాహనం ఢీకొని ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. తట్టబందకు చెందిన సింబోతు ఈశ్వరరావు, బుచ్చెయ్యపేట మండల గొర్లెపాలెంకు చెందిన అధికారి బుజ్జిలు బుధవారం ద్విచక్ర వాహనంపై గొంప నుంచి సీతయ్యపేట వైపు వెళ్తున్నారు. వీరి ద్విచక్ర వాహనం, అటువైపు నుంచి ఖాళీగా వస్తున్న ఆటో గొంప సమీపంలోని గెడ్డ వద్ద ఢీకొన్నాయి. తీవ్రంగా గాయపడిన ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరిని అనకాపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన ఆటో రావికమతానికి చెందిన వ్యక్తిదిగా గుర్తించామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై రామకృష్ణ తెలిపారు.


బోల్తాపడిన ఆటో

ఎమ్మెల్యేకు పరామర్శ

చోడవరం పట్టణం, న్యూస్‌టుడే: ఇటీవల తల్లిని కోల్పోయిన ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజును బుధవారం పలువురు పరామర్శించారు. డీసీసీ అధ్యక్షుడు పసుపులేటి బాలరాజు, పీసీసీ నాయకులు పి.సతీష్‌వర్మ, షుగర్ ఫ్యాక్టరీ ఛైర్మన్ మల్లునాయుడు, అనకాపల్లికి చెందిన కొణతాల రఘు తదితరులు ఎమ్మెల్యే ఇంటికి వచ్చి ఆయనకు ధైర్యం చెప్పారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాలతో పాటు పట్టణానికి చెందిన పలువురు ఎమ్మెల్యేను కలశారు.

మహనీయురాలు సావిత్రిబాయిపూలే

గోవిందమ్మకాలనీ, లక్ష్మీపురం (చోడవరం గ్రామీణం), న్యూస్‌టుడే: భారతదేశంలో తొలి బాలికా పాఠశాలను స్థాపించిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే అని లక్ష్మీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.వి. శేషగిరిరావు పేర్కొన్నారు. బుధవారం సావిత్రిబాయిపూలే జయంతి వేడుకలను పాఠశాలలో నిర్వహించారు. అనంతరం ఆమె చిత్రపటానికి పూలమాల వేసిన మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. అంకుపాలెం పంచాయతీ గోవిందమ్మకాలనీలో హెచ్‌ఎం ఎం.వి.స్వామి ఆధ్వర్యంలో ఉపాధ్యాయినులను సన్మానించారు. అలాగే స్థానిక ప్రేమసమాజంలో ఫోరం ఫర్ బెటర్, ఆర్క్ ప్రసాద్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ రామ్‌నరేష్ ఆమె చిత్రపటానికి పూలమాల వేశారు. ఈ కార్యక్రమంలో స్త్రీ విముక్తి జిల్లా కన్వీనర్ ఒ.వి.వి.ఎస్ లక్ష్మీకుమారి , అంకుపాలెం సర్పంచి మజ్జి నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు ఎం.సరస్వతి, ఎ. మహేశ్వరి, పి. భాగ్యలత, వై.లక్ష్మీదేవి, బొడ్డు శ్యామలత, నాగమణి, ఎంపీటీసీ సభ్యుడు మైచర్ల జోగినాయుడు, లక్ష్మీపురం ఉపాధ్యాయులు జ్యోతి, బాల, అరుణకుమారి, దేవి, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.


గోవిందమ్మకాలనీలో ఉపాధ్యాయినులకు సన్మానం

ఒప్పంద విద్యుత్తు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

చోడవరం గ్రామీణం, న్యూస్‌టుడే: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఒప్పంద విద్యుత్తు కార్మికులు బుధవారం చోడవరం అసిస్టెంట్ డివిజన్ ఇంజినీరు కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా నల్ల రిబ్బన్లు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. విద్యుత్తు ఒప్పంద ఐక్యవేదిక రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ధర్నా చేపట్టినట్లు యూనియన్ నాయకుడు ప్రేమ చంద్రరావు తెలిపారు. కార్మికుల డిమాండ్లు పరిష్కరించని పక్షంలో ఈ నెల 27వ తేదీ నుంచి నిరవధిక సమ్మె చేస్తామని స్పష్టంచేశారు. అనంతరం ఏడీఈ చెల్లబాబుకు తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు.


ఆందోళన చేస్తున్న ఒప్పంద విద్యుత్తు కార్మికులు

ముద్దుర్తి ఉన్నత పాఠశాలకు స్థలం కేటాయింపు

ముద్దుర్తి (చోడవరం గ్రామీణం), న్యూస్‌టుడే: మండలంలోని ముద్దుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన స్థలాన్ని మండల విద్యాశాఖాధికారి పి. అచ్యుతరావు బుధవారం పరిశీలించారు. కొండపోరంబోకుతో పాటు గ్రామ కంఠంకు సంబంధించిన మూడు ఎకరాల 30 సెంట్లు భూమిని పంచాయతీ పాలకులు కేటాయించారు. ఈ ఏడాది ప్రాథమికోన్నత పాఠశాలను ప్రభుత్వం ఉన్నత పాఠశాలుగా అప్‌గ్రేడ్ చేసింది. ఇప్పటికే కొత్తగా కేటాయించిన స్థలంలో రెవెన్యూ అధికారులు సర్వే పూర్తిచేసి నివేదికను ప్రభుత్వానికి పంపించారు. త్వరలో భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు కావాల్సిఉంది.


ముద్దుర్తిలో స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ

వంద టన్నులకు పైగా సైలేజ్‌గడ్డి పంపిణీ

కొమరవోలు (రోలుగుంట), న్యూస్‌టుడే: రాష్ట్ర పశు సంవర్ధక శాఖ ద్వారా రాయితీపై కిలో రూ.రెండుకే సైలేజ్ గడ్డిని రోలుగుంట, రావికమతం మండలాల్లో కలిపి సుమారు 100 టన్నులకుపైగా పంపిణీ చేశామని పశు సంవర్ధక శాఖ రావికమతం సహాయ సంచాలకుడు డాక్టర్ రాజగోపాల్ వెల్లడించారు. రోలుగుంట మండలం కొమరవోలు, జానకిరాంపురం గ్రామాల్లోని పశుగ్రాసక్షేత్రాలను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. నిజానికి సైలేజ్ గడ్డి కేజీ రూ.ఆరు ఉండగా దీనిపై ప్రభుత్వం రూ.నాలుగు రాయితీ ఇస్తుందన్నారు. అలాగే గ్రామాల్లో 30 నుంచి 100 ఎకరాల్లో పశుగ్రాసాలను పెంచే ఆసక్తిగల రైతులుంటే వారికి పూర్తిస్థాయిలో తగిన సహకారం అందిస్తామని డాక్టర్ రాజగోపాల్ వివరించారు. అలాగే ఎస్సీ రైతులకు రాయితీపై పశుదాణా ను అందజేస్తున్నామన్నారు. దీని కేజీ ధర బయట మార్కెట్‌లో కిలో రూ.16 నుంచి రూ.20 వరకు పలుకుతోందన్నారు. అలాంటిది ఎస్సీ రైతులకు రాయితీపై కిలో దాణాను రూ.నాలుగుకే అందిస్తున్నామని ఆయన తెలిపారు. ఆయన వెంట బుచ్చెంపేట పశువైద్యాధికారి పడాల్ పాల్గొన్నారు.


కొమరవోలులో పశుగ్రాస క్షేత్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

చోడవరం



మైచర్లపాలెంలో క్రికెట్ పోటీలు ప్రారంభం

మైచర్లపాలెం (చోడవరం), న్యూస్‌టుడే: కనకదుర్గమ్మ తీర్థమహోత్సవం పురస్కరించుకుని మండలంలోని మైచర్లపాలెంలో బుధవారం క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ నెల 16వ తేదీ వరకు ఈ పోటీలు జరుగుతాయి. అదే రోజున విజేతలకు బహుమతి ప్రదానం చేస్తారు. 14 నుంచి 16వ తేదీ వరకు గల్లీ క్రికెట్ పేరిట మరో పోటీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

సమస్యలు పరిష్కారానికి జన్మభూమిని ఉపయోగించుకోండి

జడ్పీ సీఈవో జయప్రకాష్‌నారాయణ


జెడ్.కొత్తపట్నం జన్మభూమి గ్రామ సభలో మాట్లాడుతున్న సీఈఓ జయప్రకాష్‌నారాయణ

జెడ్.కొత్తపట్నం (రావికమతం), న్యూస్‌టుడే: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలందరికీ తెలియజేయడానికే జన్మభూమి కార్యక్రమం ఉద్దేశమని, సమస్యల పరిష్కారానికి దీన్ని ఉపయోగించుకోవాలని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈవో) జయప్రకాష్‌నారాయణ సూచించారు. బుధవారం జెడ్.కొత్తపట్నం, గంపవానిపాలెంల్లో జరిగిన జన్మభూమి గ్రామ సభల్లో సీఈవో జయప్రకాష్‌నారాయణ పాల్గొన్నారు. జెడ్.కొత్తపట్నంలో చందక రమణ తనకు 2014 నుంచి వస్తున్న పింఛన్‌ను నిలిపివేయించారని, సీఈవో దృష్టికి తీసుకురాగా ఆన్‌లైన్ అయిందని, ఇస్తామని చెప్పారు. జెడ్,కొత్తపట్నం, గంపవానిపాలెం, మత్స్యవానిపాలెం, దొండపూడి గ్రామాల్లో జన్మభూమి గ్రామ సభలు జరిగాయి. సర్పంచులు గాలి మహేశ్వరి, మాకిరెడ్డి రాజిబాబు, ఎంపీటీసీ సభ్యురాలు గాలి సత్యవతి, ఎంపీడీవో జయప్రకాష్‌రావు, తహసిల్దారు సిద్ధయ్య, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

సమస్యలపై గ్రామస్థుల గరం..గరం...

ముద్దుర్తి, గోవాడ (చోడవరం గ్రామీణం), న్యూస్‌టుడే: జన్మభూమిలో రెండోరోజైన బుధవారం పలు సమస్యలపై గ్రామస్థులు నిలదీశారు. ముద్దుర్తిలో రుణమాఫీ కాలేదంటూ అధికారుల ముందు పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీటీసీ సభ్యుడు మొల్లి శ్రీను కలగజేసుకొని గ్రామంలో ఎన్ని ఇళ్లు మంజూరయ్యాయో, పింఛన్లు, డ్వాక్రా రుణాలు ఎంత మందికి మాఫీ అయ్యాయో చెప్పాలని అధికారులను కోరారు. సర్పంచి నంబారు దివ్యభారతి మాట్లాడుతూ గ్రామంలో సీసీరోడ్లు, ఎత్తిపోతల పథకం వంటి పలు అభివృద్ధి పనులకు రూ.కోటి వరకు ఖర్చు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు రవి, వెలుగు ఏపీఎం ఆదినారాయణ, ఈఓఆర్డీ ఆంజనేయులు గ్రామానికి మంజూరైన వివిధ పథకాలను వివరించారు. అనంతరం జన్మభూమి ప్రత్యేకాధికారి చలం చేతుల మీదుగా కొత్త రేషన్‌కార్డులు, చంద్రన్న బీమా పత్రాలను పంపిణీచేశారు.

అరకొర పింఛన్లు మంజూరుపై ఆగ్రహం

గోవాడ పంచాయతీ పరిధిలో సుమారు 65 మంది అర్హులు పింఛన్లు కోసం దరఖాస్తు చేస్తే కేవలం 25 మందికి మంజూరు చేశారని వైకాపా జిల్లా కార్యవర్గ సభ్యుడు అల్లం రామఅప్పారావు అధికారులను నిలదీశారు. నంతరం సర్పంచి ఏడువాక మాధవీలత గ్రామంలో చేపడుతున్న అభివృద్ధి పనులను వివరించారు. గాంధీగ్రామంలో తహసీల్దారు రవి బృందం పాల్గొని ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను వివరించారు. సర్పంచి డి.కె. శ్రీను పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు.


గోవాడలో మా ఇంటి మహలక్ష్మీ పథకంలో డబ్బులు పడటంలేదని అధికారులకు చెబుతున్న లాలంశెట్టి లక్ష్మి

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూస్తామని మండల ప్రత్యేక అధికారి కేశవ్‌పాండే తెలిపారు. మండలంలోని లింగభూపాలపుర అగ్రహారం, ఎల్.సింగవరం, పొట్టిదొరపాలెం, గంటికొర్లాం గ్రామాల్లో బుధవారం జన్మభూమి సభలు నిర్వహించారు. లింగభూపాలపుర అగ్రహారంలో మరుగుదొడ్లు నిర్మించుకున్న 30 మందికి బిల్లులు అందకపోవడంపై సర్పంచి తమరాన దాసు అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ప్రత్యేకాధికారి మాట్లాడుతూ జిల్లాకలెక్టరు దృష్టికి తీసుకువెళ్లి బిల్లులు మంజూరయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు దాడి సూరినాగేశ్వరరావు, డెయిరీ డైరక్టరు గేదెల సత్యనారాయణ, తహసీల్దార్ కెవీవీ శివ, ఎమ్పీడీఓ కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

జానకిరాంపురం (రోలుగుంట), న్యూస్‌టుడే: జన్మభూమి గ్రామసభలు మండలంలోని జానకిరాంపురం, కొమరవోలు గ్రామాల్లో బుధవారం ప్రశాంతగా ముగిశాయి. జానకిరాంపురం గ్రామసభకు మండల ప్రత్యేకాధికారి ఆనందరావు అధ్యక్షత వహించగా కొమరవోలు సభకు ఎంపీడీఓ శచీదేవి సారథ్యం వహించారు. ఈ సభల్లో భాగంగా జానకిరాంపురం విద్యార్థులు వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణంపై ప్రదర్శించిన నాటిక ఎంతగానో అలరించింది. ఈ గ్రామలకు గొర్లె చెల్లమ్మనాయుడు (సర్పంచి) తో పాటు, ఇన్‌ఛార్జి తహసీల్దార్ చైనులు, ఈవోఆర్డీ రామ్మోహన్‌రావు, ఏఈలు శివ సత్యనారాయణ, కరుణ, వ్యవసాయాధికారిణి విజేత తదితరులు పాల్గొన్నారు.

వెంకన్నపాలెంలో పీహెచ్‌సీ ఏర్పాటు చేయాలి

సీమునాపల్లి (చోడవరం), న్యూస్‌టుడే: మండలంలో ప్రజలు ఆరోగ్యానికి వెంకన్నపాలెంలో మరో వైద్య కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని రాయపురాజుపేట ఎంపీటీసీ సభ్యుడు బొడ్డేడ రామునాయుడు కోరారు. బుధవారం సీమునాపల్లిలో ఎంపీడీవో చిట్టిరాజు అధ్యక్షతన జన్మభూమి సభ జరిగింది. ఈ సభలో ఎంపీటీసీ సభ్యుడు మాట్లాడుతూ తమ గ్రామం నుంచి 20కి.మీ. దూరం ప్రయాణిస్తేనే గాని వైద్యం అందని దుస్థితి నెలకొందన్నారు. ప్రజలను ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని వెంకన్నపాలెంలో ఏర్పాటు చేయాలని ఆయన అధికారులను కోరారు. ఈ అటవీశాఖాధికారి రామనరేష్ మాట్లాడుతూ మొక్కలు పెంచడంతో ఆరోగ్యం సమకూరుతుందన్నారు. కామాక దేముళ్లమ్మ అనే వృద్ధురాలు తన వేలి ముద్రలు పడలేదని డీలరమ్మ బియ్యం ఇవ్వడం లేదని ఎంపీడీవో వద్ద వాపోయింది. సర్పంచి శరగడం ఉమ, ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.


వేలిముద్ర పడలేదని బియ్యం ఇవ్వలేదని ఎంపీడీఓకు చెబుతున్న వృద్ధురాలు దేముల్లుమ్మ

మరుగుదొడ్లు నిర్మించుకోని వారికి పింఛన్ల నిలుపుదల

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: మండలంలోని లింగభూపాలపుర అగ్రహారంలో మరుగుదొడ్లు నిర్మించుకోని వారికి పింఛన్లు నిలిపివేశారు. పంచాయతీ కార్యాలయం దగ్గర బుధవారం నుంచి పింఛన్లు బట్వాడా చేస్తున్నారు. పింఛను తీసుకోవడానికి లబ్ధిదారులంతా కార్యాలయానికి చేరుకున్నారు. అయితే మరుగుదొడ్లు నిర్మించుకోని సుమారు 60 మందికి పింఛన్లు ఇవ్వలేదు. వీరంతా సాయంత్రం వరకు కార్యాలయం దగ్గర ఎదురుచూసి నిరాశతో తిరిగివెళ్లిపోయారు. జిల్లా కలెక్టరు ఆదేశాలమేరకు పింఛన్లు నిలిపివేశామని, మరుగుదొడ్లు నిర్మించుకున్న వెంటనే చెల్లింపులు చేస్తామని అధికారులు చెబుతున్నారు. స్థలాలు లేవని, సరైన ఇల్లు కూడా లేదని, ఈ పరిస్థితుల్లో తాము మరుగుదొడ్లు ఎక్కడ నిర్మించుకుంటామని వృద్ధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


పింఛన్లు కోసం పంచాయతీ కార్యాలయం వద్ద ఎదురు చూస్తున్న వృద్ధులు

వేంకటేశ్వరుని దేవాలయంలో దీపోత్సవం

గోవాడ (చోడవరం గ్రామీణం); న్యూస్‌టుడే: మండలంలోని గోవాడ వేంకటేశ్వరుని దేవాలయంలో బుధవారం తెల్లవారుజామున అయిదు గంటలకు దీపోత్సవం నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి దీపాలు వెలిగించారు. ధనుర్మాసం 19వ రోజు సందర్భంగా లలితా పారాయణం నిర్వహించారు. పాలఆలయ ప్రధాన అర్చకులు జె.టి. ఆచార్యులు(పెదబాబు)ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. ఈ కార్యక్రమంలో సకలా సూరిబాబు, పోలినాటి వెంకటేష్ పాల్గొన్నారు.


గోవాడ వేంకటేశ్వరుని దేవాలయంలో నిర్వహించిన దీపోత్సవంలో పాల్గొన్న భక్తులు

చంద్రన్న సంక్రాంతి సరకులు పంపిణీ

మైచర్లపాలెం (చోడవరం), న్యూస్‌టుడే: మండలంలోని మైచర్లపాలెం రామకోవెల వద్ద రేషన్ కార్డులున్న వారికి ప్రభుత్వం ఇచ్చిన చంద్రన్న సంక్రాంతి కానుకలను బుధవారం పంపిణీ చేశారు. గ్రామంలో 296 మందికి వీటిని అందజేస్తున్నట్లు సర్పంచి భూరు కనక నరసింహం చెప్పారు. తెదేపా మండల శాఖ మాజీ ప్రధాన కార్యదర్శి మైచర్ల కనకరాజు, వీఆర్వో సింహాచలం, అంగన్‌వాడీ కేంద్రం నిర్వహకురాలు కనకమ్మ, డీలర్ శ్రీను, పంచాయతీ వార్డు సభ్యులు పాల్గొన్నారు.


చంద్రన్న సంక్రాంతి కానుకలు పంపిణీ చేస్తున్న సర్పంచి నరసింహం

బాలికల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి

చోడవరం గ్రామీణం, న్యూస్‌టుడే: బాలికలు తమ ఆరోగ్యంపై తగు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రభుత్వాసుపత్రి యువ క్లీనిక్ సమన్వయకర్త సెరీనా పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం కౌమార దశలో ఉన్న విద్యార్థినులకు ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎ. మోహన్‌రావు, అధ్యాపకులు పాల్గొన్నారు.


బాలికలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరిస్తున్న సెరీనా

పదో తరగతి పరీక్షలకు సమాయత్తం చేయండి

చోడవరం గ్రామీణం, న్యూస్‌టుడే: ఈ ఏడాది జరగనున్న పదో తరగతి పరీక్షలకు తల్లిదండ్రులు పిల్లలను సమాయత్తం చేయాలని ప్రధానోపాధ్యాయురాలు డి.కృష్ణకుమారి పేర్కొన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం తల్లిదండ్రుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ పదో తరగతిలో బాలికలు శతశాతం ఉత్తీర్ణతకు తల్లిదండ్రులు కృషి అవసరమన్నారు. వెనుక బడిన బాలికలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చేనేత కార్మికులకు పింఛన్లు మంజూరు

దేవరాపల్లి, న్యూస్‌టుడే: మండలంలో అర్హులైన 12 మంది చేనేత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా పింఛన్లను మంజూరు చేసింది. వాటిలో దేవరాపల్లికి చెందిన అయిదుగురికి పింఛన్లు పొందే అవకాశం దక్కింది. పంచాయతీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సర్పంచి కిలపర్తి చినమ్మలు వీటిని లబ్ధిదారులకు అందజేశారు. ఆమెతో పాటు ఎంపీటీసీ సభ్యురాలు సోమిరెడ్డి సత్యవతి కూడా పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ విస్తరణాధికారి బి.ఎరకయ్య, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు పేదలకు దుప్పట్ల పంపిణీ

మునగపాక, న్యూస్‌టుడే: మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ 61వ జన్మదినోత్సవం సందర్భంగా వాడ్రాపల్లిలో గురువారం పేదలకు దుప్పట్లు పంపిణీ చేయనున్నట్టు గోపాలమిత్ర దాడి చిన్నారావు తెలిపారు. మునగపాక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు రొట్టెలు, పాలు, పండ్లు పంపిణీ చేయనున్నట్టు ఆడారి గణపతి అచ్చింనాయుడు తెలిపారు.

ఎలమంచిలి

నేడు అచ్యుతాపురంలో సదరం శిబిరం

మునగపాక, న్యూస్‌టుడే: అచ్యుతాపురం ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం నిర్వహిస్తున్న సదరం శిబిరాన్ని దివ్యాంగులందరూ సద్వినియోగం చేసుకోవాలని తెదేపా మండల అధ్యక్షుడు దాడి ముసిలినాయుడు కోరారు. మునగపాక తెదేపా కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ముసిలినాయుడు మాట్లాడుతూ వైకల్యంతో బాధపడుతున్నా అనేకమందికి ధ్రువపత్రాలు లేక పింఛన్లు అందని పరిస్థితి నెలకొందన్నారు.

గోతులకు మోక్షం

తీరిన కష్టం

లాలంకోడూరు (రాంబిల్లి), న్యూస్‌టుడే

పదకొండేళ్ల క్రితం భూసేకరణ పూర్తయిన మండలంలో లాలంకోడూరు శివారు సీతపాలెం గ్రామానికి వెళ్లే రహదారికి ఎట్టకేలకు మోక్షం కలిగింది. సుమారు 70 కుటుంబాలున్న ఆ గ్రామంలో గ్రామకంఠంలో ఉన్న ఇళ్లకు తప్ప సెజ్ కోసం సేకరించిన జిరాయతీ భూములు, అందులో ఉన్న ఇళ్లకు 2006లో రైతులకు నష్ట పరిహారం చెలించారు. అంచనాలు వేసినా గ్రామకంఠంలో ఇళ్లకు ఇప్పటికీ నష్టపరిహారం చెల్లించలేదు. దీంతో ఆ గ్రామస్థులంతా తమకు ఏ ప్రాంతంలో పునరావాసం కల్పిస్తారో? అంటూ ఇంతకాలం నిరీక్షించినా అధికారులు మిన్నకుండిపోయారు. మరోవైపు దశాబ్ద కాలం రహదారి ఛిద్రంగా తయారై గోతులతో నిండిపోయి రాకపోకలకు అవస్థలు పడేవారు. ఆ రహదారిపై ఉన్న గోతుల గురించి 'ఈనాడు' వెలుగులోకి తేవడంతో అధికారులు స్పందించారు. సుమారు రెండుకిలోమీటర్ల నిడివిగల ఆ మార్గంలో పడ్డ గోతులను పూడ్చుతున్నారు. తమ గ్రామం ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్) పోవడంతో అధ్వానంగా తయారైన రహదారి గురించి అందరూ పట్టించుకోవడం మానేశారని కొందరు గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎట్టకేలకు గోతులను పూడ్చుతుండటంతో గతపదేళ్లుగా పడుతున్న ఇబ్బందులు కొంతవరకు తీరాయని కొందరు గ్రామస్థులు చెప్పారు. తాత్కాలికంగా ఆ రహదారిపై గోతులను పూడుస్తున్నామని మండల జేఈ వర్మ చెప్పారు. ప్రతిపాదించిన నిధులు మంజూరైతే ఆ రహదారిని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.



సీతపాలెం రహదారిపై పూడ్చిన గోతులు

బెల్లం దిగుబడులపై అధికారుల అధ్యయనం

మునగపాక, న్యూస్‌టుడే: చెరకు సాగుచేస్తున్న రైతులు బెల్లం దిగుబడులు ఏ విధంగా సాధిస్తున్నారనే దానిపై అధ్యయనం చేస్తున్నామని వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు కామేశ్వరరావు తెలిపారు. మునగపాక వెలగావారి ఇస్తవలో చెరకు సాగుచేస్తున్న రైతులతో బుధవారం అధికారులు సమావేశమయ్యారు. మొక్క చెరకు తోటను, కార్శి చెరకు తోటను వేరువేరుగా క్రషింగ్ చేయించి బెల్లం దిగుబడులను గుర్తించారు. గత ఆరేళ్లగా తోటలకు అంతుపట్టని తెగుళ్లు వ్యాపించి తీవ్ర నష్టం కలిగిస్తున్నాయని రైతులు దాడి చంద్రరావు, వెలగా శ్రీను తెలిపారు. పెట్టుబడులు కూడా రాని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. తెగుళ్ల నివారణకు శాస్త్రవేత్తలు ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదన్నారు. చెరకు సాగుకు స్వస్తి పలకాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. మొక్క, కార్శి తోటల్లో బెల్లం దిగుబడుల వ్యత్యాసాన్ని గుర్తించారు. పూర్తి నివేదికను ప్రభుత్వానికి అందజేయనున్నట్లు కామేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో గణాంక అధికారి (విజయవాడ) రవిప్రసాదు, అధికారులు శ్రీరామమూర్తి, జయప్రకాష్, మునగపాక సహాయ గణాంకాధికారి శ్రీలక్ష్మి, రైతులు వెలగా మురళి తదితరులు పాల్గొన్నారు.



మరిగించేందుకు సిద్ధం చేసిన చెరకు రసం పరిశీలిస్తున్న అధికారులు

శానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై దాడి

ఎలమంచిలి, న్యూస్‌టుడే: ఎలమంచిలి కూరగాయల మార్కెట్‌లో పాలిథిన్ సంచులు విక్రయిస్తున్న దుకాణాలపై తనిఖీలు చేస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావుపై కూరగాయల వ్యాపారి లావేటి శ్రీను బుధవారం దాడి చేశాడు. విధి నిర్వహణలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగిపై చేయి చేసుకోవడంతోపాటు, దుర్భాషలాడి విధులకు ఆటంకం కలిగించాడన్న నేరంపై లావేటి శ్రీనుపై కేసు నమోదు చేశామని స్థానిక పట్టణ ఎస్సై నారాయణరావు బుధవారం రాత్రి చెప్పారు. మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు పాలిథిన్ సంచులు విక్రయిస్తున్న, వాడుతున్న వారిని తనిఖీ చేస్తున్న సమయంలో ఈ దాడికి పాల్పడ్డాడన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. కేసును రాజీ చేయమని కోరుతూ బుదవారం రాత్రి పెద్దసంఖ్యలో కూరగాయల వ్యాపారులు పట్టణ పోలీస్ స్టేషన్‌కి చేరుకున్నారు. దీంతో స్టేషన్ వద్ద ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. నిందితుడిని అరెస్ట్ చేస్తామని ఎస్సై నారాయణరావు చెప్పారు.

పాడి రైతులకు అండగా విశాఖ డెయిరీ : ఆనంద్

తిమ్మరాజుపేట(మునగపాక), న్యూస్‌టుడే: పాడి రైతులకు విశాఖ డెయిరీ అండగా నిలుస్తోందని ఐకాన్ కృషి ఆసుపత్రి ముఖ్య కార్యనిర్వహణాధికారి ఆడారి ఆనందకుమార్ అన్నారు. డెయిరీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండలంలోని తిమ్మరాజుపేట పాలసొసైటీలో బుధవారం 150 మంది పాడిరైతులకు రూ. 3.7 లక్షల సంక్రాంతి బోనస్‌ను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి పాడిరైతు కుటుంబం ఆనందంగా ఉండాలన్నదే విశాఖ డెయిరీ ధ్యేయమన్నారు. ఈ కార్యక్రమంలో పాలిటెక్నిక్ కళాశాల అధ్యాపకుడు బీమిశెట్టి లక్ష్మణరావు, మాజీ ఎంపీపీ ఆడారి మంజు, తెదేపా బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు బీమరశెట్టి శ్రీనివాసరావు, పాలసొసైటీ అధ్యక్షుడు కొయిలాడ సూరిబాబు, కాండ్రేగుల జగ్గారావు, చలపతి పాడిరైతులు పాల్గొన్నారు.



రైతులకు సంక్రాంతి బోనస్ అందజేస్తున్న ఆనందకుమార్

హరిపాలెం (అచ్యుతాపురం), న్యూస్‌టుడే: హరిపాలెం, కొండకర్ల గ్రామాల్లో పాడి రైతులకు ఆడారి ఆనందకుమార్ బుధవారం సంక్రాంతి బోనస్ పంపిణీ చేశారు. హరిపాలెంలో 246 మందికి రూ. 7.06 లక్షలు, కొండకర్లలో 263 మందికి రూ. 10.89 లక్షలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతుల కోసం ఏర్పాటుచేసిన కృషి ఆసుపత్రిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పాలసంఘం అధ్యక్షుడు శరగడం ఈశ్వరరావు, దూలి నూక అప్పారావు, తెదేపా జిల్లా కార్యదర్శి పీలా తులసీరాం, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ జనపరెడ్డి నర్సింగరావు, సర్పంచులు కాండ్రేగుల సూర్యనారాయణ, ఏడిద నూకాలమ్మ కార్యదర్శులు గోవింద, కృష్ణారావు పాల్గొన్నారు.

భారీ నీటి పథకంతో ప్రతి ఇంటికీ కొళాయి

ఎలమంచిలి, న్యూస్‌టుడే: ఎలమంచిలి మున్సిపాలిటీలో ప్రతి ఇంటికి కొళాయి ఇవ్వడానికి భారీ రక్షిత మంచినీటి పథకాన్ని నిర్మించతలపెట్టామని తెదేపా పట్టణశాఖ అధ్యక్షుడు ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. ఎలమంచిలి మున్సిపాలిటీలో కొత్తగా వేసిన తాగునీటి కొళాయిలను ఆయన బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడకుండా చూస్తున్నామన్నారు. ఎలమంచిలిలో తులసీ ఫౌండేషన్ ద్వారా 20 లీటర్ల శుద్ధజలం కేవలం రూ. 2కే ఇస్తున్నామన్నారు. సాంకేతిక లోపాల వల్ల తాగునీటి సరఫరా రాని సమయాల్లో ఉచితంగానే అందిస్తున్నామని తెలిపారు. భారీ రక్షిత మంచినీటి పథకం నిర్మాణానికి పనులకు చర్యలు చేపడుతున్నామని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి, కమిషనర్ వేగి సత్యనారాయణ, అధికారులు పాల్గొన్నారు.

గ్రామస్థుల సహకారంతోనే పాఠశాల అభివృద్ధి

హరిపాలెం (అచ్యుతాపురం), న్యూస్‌టుడే: పాఠశాల అభివృద్ధికి గ్రామస్థుల సహకారం అవసరమని హరిపాలెం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వై.జగదీశ్వరరావు తెలిపారు. బుధవారం పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 41 మంది విద్యార్థులకు డీసీఈబీ ముద్రించిన స్టడీమెటీరియల్‌ను గ్రామస్థులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్థుల సహకారం, పర్యవేక్షణతోనే ప్రభుత్వ పాఠశాలలు మంచి ఫలితాలు సాధిస్తాయన్నారు. ఉన్నత విద్యావంతులు ఉండే ప్రభుత్వ పాఠశాలల్లో మంచి ఫలితాలు సాధించడం చాలా సులభమన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాకమిటీ ఛైర్మన్ పిల్లి గోవిందరాజు, పెంటకోట నాయకుడు, పొలమరశెట్టి సోమునాయుడు, మారిశెట్టి అప్పలనాయుడు, మత్తుర్తి శ్రీనివాసరావు, కాండ్రేగుల రమణ, వ్యాయామ ఉపాధ్యాయుడు ధర్మిరెడ్డి రాజు పాల్గొన్నారు.



స్టడీ మెటీరియల్ తీసుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు

సావిత్రీబాయ్ పూలే సేవలు మరువరానివి

మర్రిబంద (ఎలమంచిలి) : బడుగు బలహీన వర్గాల విద్యాభివృద్ధికి సావిత్రీబాయ్ పూలే అందించిన సేవలు మరువరానివని మర్రిబంద ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కూరపాటి వినోద్‌కుమార్ అన్నారు. బుధవారం ఎలమంచిలి మండలం మర్రిబంద గ్రామంలో ఆయన సావిత్రీబాయ్ పూలే జయంతి వేడుకలను నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం సావిత్రీబాయ్ జయంతిని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించడం అభినందనీయం అన్నారు. ప్రతి విద్యార్థి ఈమె గురించి తెలుసుకోవాలన్నారు.

తిమ్మరాజుపేట(మునగపాక) : భారత దేశంలో తొలిమహిళా ఉపాధ్యాయినిగా పనిచేసిన సావిత్రిబాయి పూలే ఆ వృత్తికి గౌరవం తీసుకొచ్చిన మహోన్నత వ్యక్తి అని ఉపాధ్యాయులు ఎస్.ఎస్.అప్పారావు, ఉమామహేశ్వరరావు అన్నారు. మండలంలోని తిమ్మరాజుపేట ఉన్నత పాఠశాలలో బుధవారం సావిత్రిబాయి జయంతి వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో సి.ఆర్.పి. కర్రి లక్ష్మినారాయణ, ఉపాధ్యాయులు మారమ్మ, రాజ్యలక్ష్మి, సుబ్రహ్మణ్యం, సురేష్, లక్ష్మణనాయుడు పాల్గొన్నారు.

కొండకర్ల (అచ్యుతాపురం) : కొండకర్ల ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో చిన్నారులు సావిత్రిబాయి వేషధారణలో అలరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రొంగలి రాంబాబు మాట్లాడుతూ స్త్రీలకు చదువుకునే హక్కు నిరాకరించిన రోజుల్లో సావిత్రిబాయి తన భర్త జ్యోతిరావ్‌పూలే సహకారంతో విద్యను అభ్యసించారన్నారు. అనంతరం మహిళా ఉపాధ్యాయురాలు వి.ఎం.నళినిని ఉపాధ్యాయులు సత్కరించారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు టి.వి.సత్యనారాయణ, మారిశెట్టి వెంకటఅప్పారావు, కొణతాల సోమశేఖర్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



కొండకర్లలో పూలే చిత్రపటం వద్ద ఉపాధ్యాయులు, విద్యార్థులు

ఎలమంచిలి

నేడు జన్మభూమి గ్రామసభలు ఎక్కడంటే..

ఎలమంచిలి : ఎలమంచిలి మండలం గూండ్రుబిల్లి గ్రామంలో గురువారం జన్మభూమి గ్రామసభ నిర్వహిస్తున్నామని ఎంపీపీ కొలకలూరి పద్మావతి చెప్పారు. లక్కవరం గ్రామంలో మధ్యాహ్నం గ్రామ సభ నిర్వహిస్తామన్నారు. ఎలమంచిలి మున్సిపాలిటీ పరిధిలో ఎర్రవరం, సింగవరం, పాత వీధి, ఫైర్ ఆఫీస్ కాలనీల్లో జన్మభూమి సభలు జరుగుతాయని తెదేపా పట్టణ అధ్యక్షుడు పిట్టా శ్రీను తెలిపారు.



అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యం

మునగపాక, న్యూస్‌టుడే: అర్హులైన ప్రతి వ్యక్తికి సంక్షేమ పథకాలు అందజేయాలన్నదే ప్రభుత్వ సంకల్పమని ఎలమంచిలి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అన్నారు. మండలంలోని పాటిపల్లి, రాజుపేట గ్రామాల్లో బుధవారం జన్మభూమి కార్యక్రమం నిర్వహించారు. నారాయుడుపాలెంలో జరిగిన జన్మభూమి కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ నారాయుడుపాలెంలో అసంపూర్తిగా ఉన్న రామాలయం నిర్మాణానికి రూ. నాలుగు లక్షలు నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని, పైపులైన్లు ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరారు. పాటిపల్లి ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శనను ఎమ్మెల్యే తిలకించారు. రాజుపేటలో మండల ప్రత్యేక అధికారి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతాలు మండల వైద్యాధికారి బి. అనిల్ కుమార్ ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఆడారి మంజు, తహసీల్దార్ జి. రాంబాబు, ఎంపీడీఓ డి. శాంతలక్ష్మి, సర్పంచులు చందనాటి సింహాచలం, దూబాసి రమణ, ఎంపీటీసీ సభ్యురాలు ఇల్లా శిరీషా, మండల తెదేపా అధ్యక్షుడు దాడి ముసిలినాయుడు, చందనాటి శ్రీను, కొయ్యపరాలు, సబ్బి శ్రీను పాల్గొన్నారు.


పులపర్తిలో రైతులకు రుణమాఫీ పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు తదితరులు


కుమ్మరాపల్లి సభలో రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

సోమలింగపాలెం (ఎలమంచిలి): జన్మభూమి పేదల పాలిట వరమని స్థానిక మున్సిపల్ ఛైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి అన్నారు. సోమలింగపాలెం, కట్టుపాలెం, తెరువుపల్లి గ్రామాల్లో బుధవారం జన్మభూమి గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆమె మాట్లాడుతూ మున్సిపాలిటీలో ప్రతి ఒక్కరికి సొంతిల్లు ఉండాలన్న ఆశయంతో పక్కాగృహాల పథకం అమలు చేస్తున్నామన్నారు. కమిషనర్ వేగి సత్యనారాయణ, పట్టణ ప్రణాళికాధికారి గౌరు, డీఈఈ. సురేష్‌కుమార్, మున్సిపల్ కౌన్సిలర్లు పండూరి శ్రీను, ఎల్లపు గోపీ, తెదేపా నాయకులు పిళ్లా గంగాధరరావు పాల్గొన్నారు.

దిమిలి (రాంబిల్లి): రజాల, కుమ్మరాపల్లి, దిమిలి గ్రామాల్లో బుధవారం జన్మభూమి కార్యక్రమం జరిగింది. కుమ్మరాపల్లి సభలో పాల్గొన్న ఎమ్మెల్యే లబ్ధిదారులకు రేషన్‌కార్డులు, కొత్త పింఛన్లు, మహిళా సంఘాల సభ్యుల పిల్లలకు ఉపకార వేతనాలను పంపిణీ చేశారు. గ్రామసభల్లో యువతులు వేసిన ముగ్గులను ఆయన పరిశీలించి విజేతలకు బహుమతులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ చలపతిరావు, ఎంపీపీ కన్నం అనిత, ప్రత్యేకాధికారి శంకరరావు, మార్కెట్‌కమిటీ ఛైర్మన్ దూళి రంగనాయకులు, తహసీల్దారు మహేశ్వరరావు, ఎంపీడీఓ పి. నిర్మల, తెదేపా మండల కమిటీ అధ్యక్షుడు వి. దిన్నుబాబు, సర్పంచులు నునపర్తి చిలుకమ్మ, సేనాపతి నాగేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు ఏదూరి రమణమ్మ పాల్గొన్నారు.


జంగుళూరులో బాలింతలను దీవిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల

ఇదో బృహత్తర కార్యక్రమం

పులపర్తి (ఎలమంచిలి) : అధికారులు గ్రామాల్లో ప్రజల ముంగింటకే వచ్చి వినతులు తీసుకుని, వాటిని పదిరోజుల్లో పరిష్కరించడం అన్నది ఒక బృహత్తర కార్యక్రమమని ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు అన్నారు. ఎలమంచిలి మండలం పులపర్తి గ్రామంలో బుధవారం జన్మభూమి కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం లబ్ధిదారులకు రేషన్ కార్డులు, రైతులకు రుణమాఫీ పత్రాలు, కొత్త పింఛనులు పంపిణీ చేశారు. పాడి రైతులకు రాయితీపై పరికరాలు అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి ఈటి వెంకట సత్యప్రభ, వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఛైర్మన్ కొలకలూరి విజయబాబు, తెదేపా నాయకులు ఈటి మోహనరావు, ఇత్తం శెట్టి సన్యాసినాయుడు, ఎంపీడీఓ సందీప్, తహసీల్దార్ వై. అప్పలరాజు, డీఈఈ ప్రసాదరావు, శశిభూషణరావు, ఏఈలు తెదేపా నాయకులు కార్యకర్తలు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

నిర్వాసితుల సమస్యల పరిష్కారం

దిబ్బపాలెం సెజ్‌కాలనీ (అచ్యుతాపురం), న్యూస్‌టుడే: మండలంలో జంగుళూరు, దిబ్బపాలెం సెజ్‌కాలనీ, అచ్యుతాపురం గ్రామాల్లో జన్మభూమి-మాఊరు కార్యక్రమం జరిగింది. జంగుళూరు, దిబ్బపాలెం సెజ్ కాలనీల గ్రామసభలకు ఎమ్మెల్యే రమేష్‌బాబు హాజరయ్యారు. ముందుగా ఎమ్మెల్యే అధికారులు అందరూ హాజరయ్యారా లేదా? అనేది ముందుగా పరిశీలించారు. దిబ్బపాలెం సభలో ఆయన మాట్లాడుతూ పుష్కరకాలంగా పరిష్కారానికి నోచుకోని అన్ని సెజ్ నిర్వాసితుల సమస్యలను పరిష్కరించామన్నారు. వెదురువాడలో పునరావాసకాలనీ, మేజర్ల కట్ ఆఫ్ డేట్ 2010కి, ఆడపిల్లలకు కూడా ఆర్ అండ్ ప్యాకేజీ, ప్యాకేజీ నగదును రూ. 1.20 లక్షల నుంచి రూ. 1.65 లక్షలకు పెంచామన్నారు. దిబ్బపాలెం, జంగుళూరు గ్రామాల్లో గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ చేకూరి శ్రీనివాసరాజు, జడ్పీటీసీ సభ్యులు జనపరెడ్డి శ్రీనివాసరావు, మండల ఉపాధ్యక్షుడు రాజాన రమేష్‌కుమార్, తూర్పుకోస్తా రైల్వేబోర్డు సభ్యుడు కూండ్రపు సత్యనారాయణ, తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ బలరాముడు, డీఈ శశిభూషణరావు, సర్పంచులు బైలపూడి లక్ష్మిభవానీ, లాలం నాగేశ్వరరావు, తెదేపా నాయకులు బైలపూడి రాందాసు, కూండ్రపు వెంకునాయుడు, కూనిశెట్టి రమణ, బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ నిధులతో మార్కెట్ నిర్మాణం

మునగపాక, న్యూస్‌టుడే: మునగపాక సంతబయల కూరగాయల మార్కెట్‌లో పంచాయతీ నిధులతో షెడ్లు ఏర్పాటుచేసి నీడ కల్పించనున్నట్టు సర్పంచి టెక్కలి రమణబాబు తెలిపారు. మునగపాక సంతబయల కూరగాయల మార్కెట్ షెడ్ల నిర్మాణానికి బుధవారం సర్పంచి రమణబాబు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా రమణబాబు మార్కెట్‌లో చిరువ్యాపారులు నిలువనీడ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించనున్నట్టు తెలిపారు. పంచాయతీ నిధులు రూ. నాలుగు లక్షలతో పనులు చేపడుతున్నామన్నారు. త్వరితగతిన పనులు పూర్తిచేసి వ్యాపారులకు అప్పగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ వార్డు సభ్యులు ఆడారి పోలిసన్యాసిరావు, ఆడారి కాశిబాబు, దాడి పోలీసు, దొడ్డి లక్ష్మి, బీశెట్టి అంజలినాయుడు, మళ్ల రామజగన్నాథం, బీలా లక్ష్మణరావు, ముసిలినాయుడు తదితరులు పాల్గొన్నారు.


షెడ్ల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న రమణబాబు

కొట్లాటలో ఇద్దరికి గాయాలు

కొక్కిరాపల్లి (ఎలమంచిలి), న్యూస్‌టుడే: ఎలమంచిలి మున్సిపాలిటీ పరిధిలోని కొక్కిరాపల్లి శివారు వెంకటాపురం నవాబుపేటలో బుధవారం ముగ్గురు వ్యక్తులు చేసిన దాడిలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. నిందితులు కర్రలతో దాడి చేయడంతో వీసం నారాయణమ్మ, వీసం అప్పారావు గాయపడ్డారు. వీరిని ఎలమంచిలి ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించగా నారాయణమ్మ పరిస్థితి ప్రమాదకరంగా ఉండటంతో అనకాపల్లి ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పాస్టర్ల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం

గంగాదేవిపేట (మునగపాక), న్యూస్‌టుడే: మండలంలోని గంగాదేవిపేట గ్రామంలో మండల పాస్టర్ల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గ ఎన్నికలు బుధవారం జరిగాయి. షాలేము ప్రార్థన మందిరంలో పాస్టర్ కె. శామ్యూల్ అధ్యక్షతన జరిగిన నూతన కార్యవర్గ ఎన్నికల్లో అధ్యక్షునిగా ఎ. జోసఫ్ కిషోర్, గౌరవాధ్యక్షుడిగా జి. సుబుద్ధి, ఉపాధ్యక్షునిగా వై. డేవిడ్‌రాజు, కార్యదర్శిగా కె. జాన్‌బాబు, కోశాధికారిగా ఎం. పాల్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. ఈ సందర్భంగా జోషఫ్ కిషోర్ మాట్లాడుతూ క్రైస్తవ సోదరులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నూతన పాలకవర్గం కృషి చేస్తుందన్నారు. మునగపాక సువార్తదళ ప్రార్థనామందిరంలో మరో సంఘః నూతన కార్యవర్గాన్ని ఎన్నుకొన్నారు. ప్రార్థన మందిరం ఫౌండర్ వినోద్ అబ్రహం ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల్లో ఛైర్మన్‌గా పూడి మూర్తి అబ్రహం, ప్రెసిడెంట్‌గా ఎం. కృపారావు, ఉపాధ్యక్షునిగా పి. పీటర్, కార్యదర్శిగా పి. కృపాపాల్, కోశాధికారిగా కె. తిమోతిని ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు.


మునగపాక చర్చిలో పాస్టర్సు వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు


ఎలమంచిలి రామాలయం వద్ద పాటలు పాడుతున్న మహిళలు

రామాలయంలో మేలుకొలుపులు

ఎలమంచిలి, న్యూస్‌టుడే: ఎలమంచిలి పట్టణంలో బుధవారం మహిళలు నిర్వహించిన ఆధ్యాత్మిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. స్థానిక కొత్తరామాలయం వద్ద మహిళలు మేలుకొలుపులు నిర్వహించారు. భక్తిపాటలు ఆలపిస్తూ పురవీధుల్లో తిరిగారు. కోలాటం చేశారు. దేవుడి చిత్రపటంతో పురవీధుల్లో నగర సంకీర్తన నిర్వహించారు. అనంతరం తెల్లవారుజామున మహిళలంతా కలిసి ఆలయం వద్ద సహపంక్తి భోజనాలు చేశారు. మేలుకొలుపులు కార్యక్రమంలో వచ్చిన బియ్యం, నగదుతో ఇక్కడ వంటలు చేసి మహిళలకు భోజనాలు వడ్డించారు. తెల్లవారుజామున మూడు గంటలకు ప్రారంభమైన ఈకార్యక్రమం ఉదయం 6 గంటల వరకూ కొనసాగింది. ఆలయ అర్చకులు సుబ్రహ్మణ్యం అందరికీ సామూహిక హారతి ఇచ్చారు.



పాడేరు

104 సమాచారం

పాడేరు పట్టణం, న్యూస్‌టుడే: పాడేరు మండలం మినుమలూరు ఆరోగ్య కేంద్రం పరిధిలో గురువారం కించూరు పంచాయతీ బంట్రోతుపుట్టు తదితర గ్రామాలకు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు... జి.మాడుగుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని బీరం పంచాయతీ పరిసర గ్రామాల్లో ఉదయం, అనర్భ గ్రామంలో మధ్యాహ్నం 4 గంటలకు వైద్య సిబ్బంది ఉచిత సంచార వైద్య సేవలు అందిస్తారు.

సమాజ శ్రేయస్సే ఉపాధ్యాయుల ధ్యేయం

చింతపల్లి, న్యూస్‌టుడే: సమాజ శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని నవ సమాజ నిర్మాణానికి ఉపాధ్యాయులు పాటుపడాలని చింతపల్లి మండల సహాయ గిరిజన సంక్షేమాధికారి టి.చంద్రశేఖరరావు అన్నారు. మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో బుధవారం చింతపల్లి గిరిజన సంక్షేమ బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కోరాబు రాజేశ్వరిని ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి ప్రసాద్, వసతి గృహ సంక్షేమాధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు పి.వినాయకరావు, పీఆర్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఉగ్రంగి గిరి, ఉపాధ్యాయులు రమణ, దామోదర్ పాల్గొన్నారు.


పాడేరులో ప్రధానోపాధ్యాయురాలిని సత్కరిస్తున్న అధికారులు

గూడెంకొత్తవీధి: దేశ మొదటి మహిళా ఉపాధ్యాయిని సావిత్రిబాయిపూలే మార్గం అనుసరణీయమని పీఆర్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఉగ్రంగి గిరి తెలిపారు. సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా రింతాడలో మహిళా ప్రధానోపాధ్యాయురాలు రాజ్యలక్ష్మిని, ఉపాధ్యాయినులను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే ఉపాధ్యాయురాలిగా పనిచేస్తూ సమస్యలపై పోరాటం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా కమిటీ సభ్యుడు కుడుముల రమణ, గూడెంకొత్తవీధి మండల అధ్యక్షుడు శామ్యూల్, గిరిజన ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సేవా రాజారావు, కౌన్సిలర్ సువర్ణరాజు పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా సమాచార వ్యవస్థ

చింతపల్లి, న్యూస్‌టుడే: చింతపల్లిలో సమాచార వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. భారత్ సంచార్ నిగం లిమిటెడ్‌కు (బీఎస్ఎన్ఎల్) చెందిన చరవాణులు, దూరవాణులు తరచూ మూగబోతున్నాయి. సెల్‌లో గంటల తరబడి ప్రయత్నిస్తున్నా లైను కలవడం లేదు. కనీసం ఎస్ఎంఎస్‌లు సైతం వెళ్లని పరిస్థితి నెలకొంది. ల్యాండ్ ఫోన్ సేవలు సైతం మొరాయిస్తున్నాయి. చింతపల్లిలో కేవలం బీఎస్ఎన్ఎల్ సేవలు ఒక్కటే ఉండటంతో ప్రత్యామ్నాయం లేక వినియోగదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. బీఎస్ఎన్ఎల్ అధికారులు స్పందించి సేవలు మెరుగుపరచాలని వినియోగదారులు కోరుతున్నారు.

పల్లె కబుర్లు

కొయ్యూరు, న్యూస్‌టుడే

కొయ్యూరు: విదేశీ విద్యకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని గిరిజన సంక్షేమ శాఖ సహాయ అధికారి శ్రీనివాస్ తెలిపారు. ఒక్కో విద్యార్థి ఉన్నత చదువుకు లక్షలాది రూపాయలను అందిస్తోందన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

కొయ్యూరు: పోలీసుల బందోబస్తు మధ్య జన్మభూమి-మా ఊరు కార్యక్రమం నిర్వహించడం సిగ్గుచేటని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అప్పన వెంకటరమణ విమర్శించారు. గత జన్మభూమిలోని సమస్యలనే నేటికీ పరిష్కరించలేదని ఆయన ఆరోపించారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే అర్హులందరికి పింఛన్లు, కార్డులు వెంటనే పంపిణీ చేయాలన్నారు.

కొయ్యూరు: మనకోడి పథకంలో పీవీటీజీలకు వనరాజా కోళ్లను తొందర్లోనే అందిస్తామని డౌనూరు పశువైద్యాధికారి ఎల్.రమేష్ తెలిపారు. రూ. 4,560 కలిగిన యూనిట్‌ని ఐటీడీఏ, తమశాఖ ఆధ్వర్యంలో నూరుశాతం రాయితీపై అందిస్తామన్నారు.

ఆడాకుల (కొయ్యూరు): ఆడాకుల పంచాయతీ దూసరకొత్తూరులో రెండువీధులు ఉన్నాయి. కిడ్నీ సంబంధ వ్యాధుల నేపథ్యంలో ఒక వీధిలో మాత్రమే ఆర్.ఒ. ప్లాంట్ ఏర్పాటు చేశారు. మరో వీధిలో కూడా ప్లాంట్ నీరు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని అక్కడి ప్రజలు కోరుతున్నారు.

బందవీధి (జి.మాడుగుల): బందవీధి బాలికల ఆశ్రమ పాఠశాలలో బుధవారం వనసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి ప్రధానోపాధ్యాయుడు బులయ్య మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్య అభ్యసించి అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలని ఆయన అన్నారు. ఉప సంక్షేమాధికారి నూకరత్నం, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

చౌడుపల్లిలో వైద్య శిబిరం

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: చింతపల్లి డిగ్రీ కళాశాల జాతీయ సేవావిభాగం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో సేవాకార్యక్రమాల్లో భాగంగా చౌడుపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్యులు సుమారు 60 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసపాత్రుడు, సర్పంచి అప్పలమ్మ, ఎన్ఎస్ఎస్ యూనిట్- 2 అధికారి గణేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.


చౌడుపల్లిలో రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

డీటీఎఫ్ దైనందిని ఆవిష్కరణ

గూడెంకొత్తవీధి: కంట్రిబ్యూటరీ పింఛను విధానం (సీపీఎస్) రద్దు చేసి పాత పింఛను విధానాన్ని అమలు చెయ్యాలని డెమొక్రటిక్ ఉపాధ్యాయ సమాఖ్య (డీటీఎఫ్) మండల అధ్యక్షుడు కోటేశ్వరరాజు డిమాండ్ చేశారు. బుధవారం డీటీఎఫ్ దైనందిని (డైరీ) మండల విద్యాశాఖ అధికారి చెల్లయ్య విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై డీటీఎఫ్ నిరంతరం పోరాడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీటీఎఫ్ నాయకులు మునిస్వామి, దేముడు, వీరయ్యదొర, పెదబాలరాజు, వినోద్, మోహన్, పరమేష్, గణపతి, శ్యామ్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రభుత్వం చేపట్టిన జన్మభూమి కార్యక్రమంలో గిరిజనుల సమస్యలు పరిష్కరించాలని ఎర్రబొమ్మలు సర్పంచి కూడా చిన్నబ్బాయి అన్నారు. బుధవారం పెద్దూరులో గిరిజనులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత జన్మభూమిలో 70 మందికి రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోగా కేవలం 18 మందికే మంజూరు అయ్యాయన్నారు. అటవీహక్కుల పట్టాల కోసం ఎన్నో ఏళ్లుగా పంచాయతీ పరిధిలోని పలు గ్రామాలకు చెందిన 60 మంది గిరిజనులు దరఖాస్తులు చేసుకోగా 28 మందికి మాత్రమే మంజూరు అయ్యాయని తెలిపారు. గ్రామాల్లో రహదారులు, తాగునీటి సౌకర్యాల కోసం గిరిజనులు ఎన్ని ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని, ఇప్పటికైనా గిరిజనుల సమస్యలు పరిష్కరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రాజబాబు, నాగేశ్వరరావు, చంటిబాబు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచి చిన్నబ్బాయి

లబ్ధిదారుల చేతికి చంద్రన్న బీమా బాండ్లు

మన్యంలో 2.52 లక్షల మంది లబ్ధిదారులు

పాడేరు, న్యూస్‌టుడే: ఏజెన్సీ వ్యాప్తంగా చంద్రన్న బీమాకు అర్హులైన లబ్ధిదారులకు అధికారులు బాండ్ల పంపిణీకి చర్యలు చేపట్టారు. ఇప్పటికే మండలాల వారీగా ఎంపిక చేసిన లబ్ధిదారుల బాండ్లు స్థానిక వెలుగు కార్యాలయానికి చేరుకున్నాయి. జన్మభూమి గ్రామ సభల్లో వాటిని పంపిణీ చేస్తున్నారు. నిరుపేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం చంద్రన్న బీమా అమలు చేస్తోంది. దీని ద్వారా పదకొండు మండలాల పరిధిలో 2,52,863 మంది బీమా రక్షణ పరిధిలోకి వచ్చారు. నామమాత్రపు ఫీజు చెల్లించడం ద్వారా ప్రమాద, సాధారణ మరణానికి సైతం పరిహారం ఈ పథకం ద్వారా నగదు లబ్ధిదారునికి చేరుతోంది. ప్రమాద భరిత మరణానికి రూ. 5 లక్షలు, సాధారణ మరణానికి రూ. 2 లక్షల వరకూ లబ్ధిదారునికి పరిహారం అందనుంది. దీంతోపాటు గాయపడిన వ్యక్తులకు ఆయా గాయాల ప్రభావం మేరకు బీమా సొమ్ము చెల్లిస్తున్నారు. ఈ పథకం అన్నివిధాలా ప్రయోజనకరంగా ఉండటంతో ఉండటంతో చంద్రన్న బీమాలో చేరేందుకు నిరుపేదలు ముందుకొస్తున్నారు. ఏజెన్సీ వ్యాప్తంగా చింతపల్లి మండలంలో అత్యధికంగా 29,363 మంది నమోదు కాగా, అత్యల్పంగా డుంబ్రిగుడ మండలంలో 16,346 మంది బీమాకు అర్హులయ్యారు. మండలాల వారీగా వరుసగా చూస్తే అరకులోయ 20,258 అనంతగిరి 23,976 హుకుంపేట 26,508 పెదబయలు 21,056 జి.మాడుగుల 21,300 గూడెంకొత్తవీధి 21263, కొయ్యూరు మండలానికి 25362 మందిని ఎంపిక చేశారు. ఎంపికైన లబ్ధిదారులందరికీ బాండ్ల జారీ ప్రక్రియ పూర్తి చేయనున్నారు. పరిస్థితిని బట్టి ఎక్కడికక్కడ పరిహార చెల్లింపుల ప్రక్రియ జరుగుతోందని వెలుగు ఏపీఎం ప్రసాదరావు పేర్కొన్నారు.

కాబోయే అమ్మలకు కిరీటాలు

చింతపల్లి, న్యూస్‌టుడే: లంబసింగిలో బుధవారం గర్భిణులకు సామూహిక సీమంతాలు చేశారు. జన్మభూమి కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కాబోయే అమ్మలకు కిరీటాలను అలంకరించి సీమంతాలు జరిపారు. ఈ కార్యక్రమంలో క్లస్టరు పర్యవేక్షకురాలు కొండమ్మ, మినీ పర్యవేక్షకులు కుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు దేవి, కమల, గంగ, పెద్దమ్మి, వెంకటలక్ష్మి, నారాయణమ్మ, తలుపులమ్మ, భవానీ పాల్గొన్నారు.


సామూహిక సీమంతాల్లో పాల్గొన్న గర్భిణులు

అత్యాచారం కేసులో నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలి

విశాఖపట్నం, న్యూస్‌టుడే: అత్యాచారానికి గురైై కేజీహెచ్ ప్రసూతి విభాగంలో చికిత్స పొందుతున్న గిరిజన బాలికకు పలు సంస్థలు అండగా నిలిచాయి. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ వివిధ హక్కుల సంఘాల ప్రతినిధులతో పాటు, రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధులు బాలికను పరామర్శించి, ఘటన వివరాలను ఆమె బంధువులను అడిగి తెలుసుకున్నారు. బాధితురాలికి న్యాయం చేయాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని వారు అధికారులను కోరారు. రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఛైర్‌పర్సన్ గంటా హైమావతి, సభ్యులు కె.అప్పారావు, పి.వి.వి.ప్రసాద్, బాలల సంరక్షణ అధికారి ఎ.సత్యనారాయణ, కె.ఎల్.మనోహర్‌లు బుధవారం సాయంత్రం కేజీహెచ్‌కు వచ్చారు. బాలికను కలిసి ఓదార్చారు. అనంతరం ఆసుపత్రి పర్యవేక్షక వైద్యాధికారి డాక్టర్ ఎ.కృష్ణమూర్తితో సమావేశమై బాలిక ఆరోగ్య స్థితిని అడిగి తెలుసుకున్నారు. కమిషన్ ఛైర్‌పర్సన్ హైమావతి మాట్లాడుతూ బాధితురాలికి మెరుగైన వైద్యం అందించాలని, ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న సఖి 1స్టాప్ కేంద్రం ద్వారా అవసరమైన న్యాయ, వైద్య సహాయం అందిస్తామని చెప్పారు. ఘటనకు పాల్పడ్డవారిపై కఠిన చర్యలను తీసుకోవాలని ఆమె పోలీసు అధికారులను కోరారు.

సీతారాముల విగ్రహాల ఊరేగింపు

కొయ్యూరు, న్యూస్‌టుడే: భద్రాచలం నుంచి తీసుకొచ్చిన సీతారాముల ఉత్సవ విగ్రహాలను బుధవారం కాకరపాడు, సింగవరం, ములకలపాడు, పోతవరం గ్రామాల్లో పల్లకీలో ఘనంగా ఊరేగించారు. ఈ సందర్భంగా హిందూ ధర్మపరిరక్షణ సమితి సభ్యుడు దన్యంరాజు శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ మండలంలో ఇప్పటి వరకు 56 గ్రామాల్లో సీతారాముల ఉత్సవ విగ్రహాలతో పల్లకీ యాత్ర నిర్వహించామన్నారు. 108 గ్రామాల్లో పల్లకీయాత్ర నిర్వహించి అనంతరం భద్రాచలం రామాలయంలో అప్పగిస్తామని తెలిపారు. పల్లకీ యాత్రను గ్రామాల్లోని భక్తులంతా విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ధర్మజాగరణ సమితి సభ్యులు వీర్రాజు, సింహాద్రి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.



కాకరపాడులో విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు

మాజీ సర్పంచి నారాయణరావు మృతి

గూడెంకొత్తవీధి: గూడెంకొత్తవీధి మాజీ సర్పంచి వండలం నారాయణరావు అనారోగ్యంతో మృతి చెందారు. కొత్తూరు గ్రామానికి చెందిన ఆయన అనారోగ్యానికి గురవడంతో కుటుంబీకులు వైద్యం నిమిత్తం మైదానానికి తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందారు. బుధవారం మృతదేహాన్ని స్వగ్రామం కొత్తూరుకు తీసుకువచ్చారు. జడ్పీటీసీ సభ్యురాలు గంటా నళినీకృష్ణ, తెదేపా మండల అధ్యక్షుడు కొర్ర బలరాం, మృతదేహానికి నివాళులు అర్పించారు.

జన్మభూమి ప్రజా సమస్యల పరిష్కార వేదిక



పెదబరడ జన్మభూమి గ్రామసభలో ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

చింతపల్లి, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చేపడుతున్న జన్మభూమి-మా ఊరు కార్యక్రమం ఒక చక్కని వేదిక అని భారతీయ జనతా పార్టీ గిరిజన మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లోకుల గాంధీ అన్నారు. చింతపల్లి మండలం పెదబరడ పంచాయతీ కేంద్రంలో బుధవారం జరిగిన జన్మభూమి-మా ఊరు గ్రామసభలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సర్పంచి బోయిన సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మండల పరిషత్తు అధ్యక్షురాలు మచ్చమ్మ, జన్మభూమి కమిటీ అధ్యక్షుడు చల్లంగి లక్ష్మణరావు, మండల తెదేపా అధ్యక్షుడు బేరా సత్యనారాయణ పాల్గొన్నారు. మండల ప్రత్యేకాధికారి రవీంద్రనాథ్ ఆధ్వర్యంలో ఎంపీడీఓ రహమాన్ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల ప్రగతిని వివరించారు. పలు పథకాలకు ఎంపికైన లబ్ధిదారులకు అర్హత ధ్రువపత్రాలు అందించారు. చంద్రన్న సంక్రాంతి కానుకలు అందించారు. ఈ కార్యక్రమంలో సహాయ గిరిజన సంక్షేమాధికారి చంద్రశేఖరరావు, వెలుగు ఏపీఎం రాజశేఖర్‌తోపాటు అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు. కాంగ్రెస్ నాయకులు ఉల్లి లక్ష్మయ్య, గురుమూర్తి, ఆనంద్, కాఫీ సంక్షేమ సంఘం నాయకుడు అబ్బాయినాయిడు తదితరులు హాజరయ్యారు.

మంచినీటి సమస్యపై అధికారుల నిలదీత

పెదబరడ పంచాయతీలో ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న దిగువపాకలు గ్రామంలో చాలాకాలంగా గిరిజనులంతా తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారని కనీసం మంచినీటిని కూడా సరఫరా చేయని అధికారులు, ప్రజా ప్రతినిధులు సమాధానం చెప్పాలంటూ గ్రామసభలో కొందరు యువకులు, మహిళలు నిలదీశారు. సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామంటూ అధికారులు నచ్చచెప్పడంతో పరిస్థితి సద్దుమణిగింది.

లంబసింగి (చింతపల్లి గ్రామణం), న్యూస్‌టుడే: లంబసింగి పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచి రఘునాథ్ అధ్యక్షతన జన్మభూమి కార్యక్రమం నిర్వహించారు. మండల విద్యాశాఖాధికారి ప్రసాద్ మాట్లాడుతూ పంచాయతీలో 33 మంది రైతులకు రూ. 6.3 లక్షల రుణ మాఫీ జరిగిందని, 70 మంది విద్యార్థులకు ఉపకార వేతనాలు, నలుగురికి చంద్రన్న బీమా పథకాలు మంజూరు అయ్యాయన్నారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కొండమ్మ ఆధ్వర్యంలో గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు రమణమ్మ, వ్యవసాయాధికారి జ్ఞానమణి, ఏపీవో లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

అర్హులందరికి సంక్షేమ ఫలాలు

కొయ్యూరు, న్యూస్‌టుడే: అర్హులందరికి సంక్షేమ ఫలాలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకొంటోందని మండల పరిషత్తు అధ్యక్షుడు జి.సత్యనారాయణ అన్నారు. బుధవారం మండలంలోని కంఠారం, ఆర్.కొత్తూరు, ఆడాకుల, కొమ్మిక పంచాయతీల్లో జన్మభూమి-మా ఊరు కార్యక్రమం నిర్వహించారు. జడ్పీటీసీ సభ్యుడు శ్రీరామ్మూర్తి, చింతపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ చిట్టిబాబు, తెదేపా జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.వి.వి.ప్రసాద్, మండల ప్రత్యేకాధికారి పార్వతమ్మ, ఎంపీడీఓ ఇమ్మానుయేల్, తహసీల్దార్ రమాదేవి ప్రభుత్వ పథకాలను వివరించారు. చంద్రన్న సంక్రాంతి కానుకలు, కొత్తగా మంజూరైన రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఆర్.కొత్తూరు పంచాయతీ మల్లవరం గ్రామంలో తాగునీటి సదుపాయం, రహదారి లేక చాలా ఇబ్బందులు పడుతున్నామని అక్కడి ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. కొమ్మిక పంచాయతీ కొప్పుకొండ, గంగవరం గ్రామానికి నూతనంగా మంజూరైన రహదారి పనులను అధికారపార్టీ నేతలు ఎందుకు అడ్డుకుంటున్నారని అక్కడి సర్పంచి లోవరాజు, ఎంపీటీసీ సభ్యుడు బాబ్జి ప్రశ్నించారు. ఎంపీపీకు, ఎమ్మెల్యేకు తెలియకుండానే పనులకు శంకుస్థాపన చేయడం ఎంతవరకు సబబని మార్కెట్ కమిటీ ఛైర్మన్ చిట్టిబాబు ఎదురు ప్రశ్నించారు. చంద్రన్న బీమా చేసినా 350 మందికి సంబంధించి ఈకేవైసీ చేయలేదని కొమ్మికవాసులు తెలపగా ఇందుకోసం తగు చర్యలు తీసుకొంటామని తహసీల్దార్ రమాదేవి హామీ ఇచ్చారు. కొయ్యూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఉదయ్ కుమార్, ఎస్సై రుక్మంగదరావుల ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచులు గంగాభవాని, నూకరాజు, గంగయమ్మ, లోవరాజు, ఎంపీటీసీ సభ్యులు బాబ్జి, రాములమ్మ, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఆర్.గోవిందు, సహాయ గిరిజన సంక్షేమాధికారి శ్రీనివాస్‌తోపాటు మండలంలోని వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బోయ వాల్మీకులను ఎస్టీల్లో చేర్చొద్దు

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: బోయ వాల్మీకులను ఎస్టీల్లో చేర్చొద్దంటూ జన్మభూమి కార్యక్రమంలో ఆందోళన చేపట్టారు. గూడెంకొత్తవీధి మండలం దేవరాపల్లి, లకవరపుపేట పంచాయతీల్లో బుధవారం జన్మభూమి-మా ఊరు కార్యక్రమం నిర్వహించారు. దేవరాపల్లిలో సమావేశం జరుగుతుండగా అక్కడి ఎంపీటీసీ సభ్యుడు, ఏపీ గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి మొట్టడం రాజుబాబు, సర్పంచ్ సిరిబాల బుజ్జిబాబులు స్థానిక నాయకులతో కలసి బోయ వాల్మీకులను ఎస్టీల్లో చేర్చవద్దంటూ, కొండకుమ్మర్లను ఎస్టీలుగా గుర్తించాలని కోరుతూ ఆందోళన చేపట్టారు. అనంతరం తహసీల్ధారు చిరంజీవిపడాల్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం అధికారులు లబ్ధిదారులకు చంద్రన్న సంక్రాంతి కానుకలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి రాధాకృష్ణ, సహాయ గిరిజన సంక్షేమాధికారి లక్ష్మి, వ్యవసాయాధికారి వాసుదేవరావు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు మత్సరాజు, మాజీ సర్పంచులు రామచంద్రరాజు, పద్మ తదితరులు పాల్గొన్నారు.



దేవరాపల్లిలో తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు



రహదారిపై బైఠాయించిన నాలుగు గ్రామాల ప్రజలు

రహదారిపై బైఠాయింపు

జి.మాడుగుల: సొలభం, గడుతూరు, పెదలోచలి, వంతాలలో బుధవారం జరగాల్సిన జన్మభూమి సభలను ప్రజలు బహిష్కరించారు. నాలుగు పంచాయతీలకు ప్రధాన మార్గమైన సొలభం ఘాట్ రహదారి నిర్మిస్తామని గతంలో ఇచ్చిన హామీ నెరవేర్చిన తరవాతనే జన్మభూమి కార్యక్రమాలను నిర్వహించాలని గిరిజనులు ప్రధాన రహదారిపై బైఠాయించారు. ఉదయం 10 గంటలకు మండల ప్రత్యేకాధికారి, తహసీల్దార్, ఎంపీడీఓ, ఎంపీపీ, జడ్పీటీసీ సభ్యుడు, ఇతర అధికారుల వాహనాలను ప్రజలు అడ్డుకున్నారు. నాలుగు విడతలుగా జరిగిన జన్మభూమిలో రహదారిని నిర్మించాలని వినతులు ఇచ్చినా ఇంతవరకు పట్టించుకోలేదని ప్రజలు ఆవేదన చెందారు. ఎమెల్యే ఈశ్వరి వస్తారని భావించి ఉదయం 10 నుంచి మధ్యాహ్నం వరకు అందరూ రహదారిపైనే బైఠాయించారు. రహదారి సదుపాయం కోసం రూ. 2.2 కోట్లతో ప్రతిపాదనలు పెట్టినట్లు మండల ప్రత్యేకాధికారి శంకరరెడ్డి ప్రజలకు వివరించారు. అనంతరం 3 గంటల సమయంలో ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి వచ్చారు. ప్రజలు, ప్రజా ప్రతినిధులు ఎమ్మెల్యేను కలిసి సొలభం ఘాట్ రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరారు.



ధర్నా చేస్తున్న కార్మికులతో మాట్లాడుతున్న జెన్‌కో ఈఈ రమేష్

విద్యుత్ ఒప్పంద కార్మికుల డిమాండ్లు తీర్చండి

సీలేరు, న్యూస్‌టుడే: విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల న్యాయమైన కోర్కెలను తీర్చాలని ఏపీ విద్యుత్ ఒప్పంద కార్మికుల ఐక్యవేదిక ప్రాంతీయ కన్వీనర్ వరహాలు డిమాండ్ చేశారు. బుధవారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో సీలేరులోని ఏపీ జెన్‌కో కార్యాలయం ఎదుట ఒప్పంద కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలీచాలని జీతాలతో ఏళ్లతరబడి పనిచేస్తున్నామని తెలిపారు. యాజమాన్యాలు శ్రమదోపిడీ చేస్తున్నాయే తప్ప వేతనాలు పెంచడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ధర్నా విషయం తెలుసుకున్న ఏపీజెన్‌కో ఈఈ రమేష్ కార్మికుల వద్దకు వచ్చి వారితో మాట్లాడారు. కార్మికుల డిమాండ్లను ఉన్నతాధికారులకు, ప్రభుత్వానికి తెలియజేస్తానని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో ఐక్యవేదిక నాయకులు అప్పలరాజు, సురేంద్ర, నూకరాజు పాల్గొన్నారు.

‘ఆర్టీసీ డీఎం తీరుమారకుంటే ఆందోళన’

పాడేరు, న్యూస్‌టుడే: ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగులపై పాడేరు ఆర్టీసీ డిపో మేనేజర్ చూపుతున్న వైఖరిలో మార్పు రాకపోతే ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని నేషనల్ మజ్దూర్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పి.పి.ఎం.రాజు పేర్కొన్నారు. స్థానిక ఆర్టీసీ డిపో గేటు వద్ద బుధవారం నేషనల్ మజ్దూర్ యూనియర్ పాడేరు డిపో పరిధి నాయకుల ఆధ్వర్యంలో గేటు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ కార్మికులకు ఏకరూప దుస్తులు పంపిణీ చేయాలని, అనంతరం ఆర్టీసీ డిపో పరిధిలో కార్మికుల సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో సంఘం డిపో అధ్యక్షుడు తురక రమణ, కార్యదర్శి కె.జె.రాజు, కార్మికులు ఎస్.ఆర్.వి.బాబు, ఎస్.ఎస్.బాబు, రామారావు, నాయుడు, మూర్తి, వీరభద్రుడు, ఒ.బి.రాజు, కె.వై.నాయుడు, వల్లీ, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్వెట్టర్ల పంపిణీ

పాడేరు: ఉత్తరాంధ్ర మా ఆసరా పౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం హుకుంపేట, పాడేరు గిరిజన ఆశ్రమాలకు చెందిన విద్యార్థులకు స్వెట్టర్లు పంపిణీ చేశారు. హుకుంపేట ఆంగ్ల ఆశ్రమ పాఠశాల, పాడేరులో శ్రీకృష్ణపురం ఆశ్రమ పాఠశాలలో ఉన్న సికెల్‌సెల్ ఎనీమియా వ్యాధిగ్రస్థులైన విద్యార్థులకు సంస్థ ఆధ్వర్యంలో స్వెట్టర్లు అందించారు. వేర్వేరుగా నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో హుకుంపేట ఆంగ్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణారావు, స్థానిక శ్రీకృష్ణపురం ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామకోటేశ్వరరావు, సంస్థ ప్రతినిధులు వి.హెచ్.ప్రసాద్, చిన్నారావు, రామ్‌సాగర్, గౌరీ శంకర్, సంతోష్, అనూష, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

ఆరోగ్య సహాయకులతో చర్చలు విఫలం

పాడేరు, న్యూస్‌టుడే: పాడేరు సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) పరిధిలో పని చేస్తున్న ఆరోగ్య సహాయకులతో బుధవారం సాయంత్రం ప్రాజెక్టు అధికారి రవి సుభాష్ జరిపిన చర్చలు విఫలమయ్యాయి. ఉద్యోగ భద్రత కల్పించాలని, పూర్తిస్థాయి ఉద్యోగులుగా గుర్తించాలనే డిమాండ్లతో 15 రోజులుగా తాత్కాలిక ఆరోగ్య సహాయకులు ఐటీడీఏ కార్యాలయం వద్ద రిలే దీక్షలు చేస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో ఆరోగ్య సహాయకులను ప్రాజెక్టు అధికారి చర్చలకు ఆహ్వానించారు. ఈ చర్చల్లో తమ సమస్యలకు సంబంధించి అధికారి నుంచి సానుకూల స్పందన రాకపోవడంతో ఆరోగ్య సహాయకులు అసంతృప్తితో బయటకు వచ్చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ సంఘం నాయకులు నాగరాజు మాట్లాడుతూ ఆరోగ్య సహాయకులు ఎంతో ప్రయాసతో పదిహేను రోజులుగా ఉద్యమిస్తుంటే పీఓ మొక్కుబడి చర్చలకు పిలిచారని ఆరోపించారు. విధుల్లో చేరాలని పీఓ నోటి మాట ద్వారా చెప్పారని, ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ వచ్చే వరకూ తాము చేపడుతున్న ఆందోళన కార్యక్రమాలు విరమించే ప్రసక్తి లేదని స్పష్టీకరించారు. పీఓతో చర్చల్లో పాల్గొన్న వారిలో గిరిజన సంఘం నాయకులు ఎం.ఎం.శ్రీను, ఆరోగ్య సహాయకుల సంఘం నాయకులు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

ఊటీలో కూరగాయల సాగుపై పరిశీలన



కూరగాయల సాగును పరిశీలిస్తున్న గిరిజన రైతుల బృందం

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: ఊటీలో సాగవుతున్న సేంద్రియ కూరగాయల సాగు విధానం తెలుసుకనేందుకు వెళ్లిన గిరిజన రైతులు ఏడురోజుల శిక్షణ ముగిసింది. అక్కడ సేంద్రియ విధానంలో పండిస్తున్న క్యారెట్, బీట్‌రూట్, క్యాబేజి, బ్రకోలి వంటి కూరగాయల పంటలను ప్రత్యక్షంగా చూసేందుకు ఉద్యానశాఖ జిల్లా ఏడీహెచ్ అనురాధ, లీఫ్ కంపెనీ ప్రతినిధులు డా. రఘు, నాగేశ్వరరావు చింతపల్లి, గూడెంకొత్తవీధి మండలాలకు చెందిన 22 మంది గిరిజన రైతులను గత వారం ఊటీ తీసుకువెళ్లారు. అక్కడ ఉద్యాన పంటల సాగుపై అవగాహన కల్పించారు. బుధవారం వారు అక్కడ నుంచి తిరుగుపయనమయ్యారు. ఈ కార్యక్రమంలో గిరిజన రైతులతోపాటు గూడెంకొత్తవీధి ఉద్యాన ఎంపీఈఓ శోభన్ పాల్గొన్నారు.

వెండితెర

శ్రీసాయిలక్ష్మి: 2 కంట్రీస్,
సాయిలక్ష్మి: ఎంసీఏ సాయి సిరిమాక్స్:
ఒక్క క్షణం ఎల్‌.కె.పూర్ణా: హలో,
రవి టాకీస్(కొత్తకోట): 2 కంట్రీస్
శ్రీ వెంకటేశ్వర (రావికమతం): ఎంసీఏ
కనకరత్నం(మాడుగుల): ఒక్క క్షణం

గ్యాస్ సమాచారం

చోడవరం : స్థానిక పుష్కల గ్యాస్ ఏజన్సీ నుంచి సిలెండర్లను గురువారం చోడవరం, గ్రామాల వినియోగదారులకు పంపిణీ చేస్తారు. ఇతర సమాచారానికి ఫోను నం. 245122లో సంప్రదించగలరు.

మాడుగుల

మైచర్లపాలెంలో క్రికెట్ పోటీలు ప్రారంభం

మైచర్లపాలెం (చోడవరం), న్యూస్‌టుడే: కనకదుర్గమ్మ తీర్థమహోత్సవం పురస్కరించుకుని మండలంలోని మైచర్లపాలెంలో బుధవారం క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ నెల 16వ తేదీ వరకు ఈ పోటీలు జరుగుతాయి. అదే రోజున విజేతలకు బహుమతి ప్రదానం చేస్తారు. 14 నుంచి 16వ తేదీ వరకు గల్లీ క్రికెట్ పేరిట మరో పోటీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

గ్రామీణ రహదారులు ఛిద్రం

గ్రానైట్ క్వారీల లారీలతో ముప్పు
పంట పొలాలకు నష్టం


కింతలిలో క్వారీ

మాడుగుల గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని అవురవాడ, చింతలూరు, ఒమ్మలి జగన్నాథపురం, కింతలి వల్లాపురం పంచాయతీల పరిధిలో అధికంగా గ్రానైట్ క్వారీలు ఉన్నాయి. ఏకువాడ, ఎం.కృష్ణాపురం గ్రామాల్లో కంకర క్వారీలు ఏర్పాటు చేసుకున్నారు. వివిధ గ్రానైట్ క్వారీల నుంచి భారీ వాహనాలు ప్రయాణించడంతో రహదారులు శిథిలావస్థకు చేరుకున్నాయి.

ప్రయాణం భారం

మండలంలోని ఘాట్‌రోడ్డు కూడలి నుంచి కింతలి వెళ్లే రహదారి చూస్తే అడుక్కో గొయ్యి ఉంది. గడిచిన అయిదేళ్లగా ఈ రహదారి మీదుగా భారీ వాహనాలు ప్రయాణిస్తుండటంతో పూర్తిగా గోతుల మయంగా మారింది. మండలంలో ఎక్కువ గ్రామాలు ఈ రహదారిని ఆనుకొనే ఉన్నాయి. ఘాట్ రోడ్డు కూడలి నుంచి కింతలికి 20 నిముషాల్లో చేరుకోవచ్చి ఉండగా, ప్రస్తుతం గోతులతో 40 నిమిషాలు పైగా పడుతుంది.

క్వారీలతో గ్రామాల్లో ఇబ్బందులు....

రహదారులు పరిస్థితి ఇలా ఉంటే నిత్యం క్వారీల్లో పేలుళ్ల వల్ల ఎగసిపడుతున్న దుమ్ముధూళితో పర్యావరణానికి విఘాతం కలుగుతోంది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. ఈ క్వారీల వల్ల కొండల నుంచి వస్తున్న గెడ్డల నుంచి చుక్కనీరు రావడం లేదని స్థానికులు చెబుతున్నారు. దీంతో వాటిపై ఆధారపడి వ్యవసాయం చేస్తున్న వేలాది ఎకరాలకు నీరందకుండా పోతోంది. కాగా మరికొందరు క్వారీలకు ఇటీవల దరఖాస్తు చేసుకున్నారు. వీటిని కూడా మంజూరు చేస్తే పచ్చటి చెట్లు నాశనం అవుతాయని పర్యావరణ వేత్తలు ఆందోళన చెందుతున్నారు. అధికారులు జోక్యం చేసుకుని క్వారీల యజమానులు నిబంధనలు పాటించేలా చూడాలని వీరు కోరుతున్నారు.


అధిక బరువుతో వెళ్తున్న భారీ వాహనాలు


శిథిలమైన కింతలి రహదారి

క్యాన్సర్ వైద్య శిబిరంలో ఉచితంగా పరీక్షలు

మాడుగుల గ్రామీణం, న్యూస్‌టుడే: స్థానిక శ్రీనివాస్ ఆసుపత్రి సహకారంతో ఉప సర్పంచి వేమరపు వెంకటమణ, మద్రాస్ కృష్ణ, టీబీఎస్ఎస్ శర్మ దేవరాపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం డాక్టర్ శ్రీనివాస్ పేరెంట్స్ స్మారక ప్రాంగణంలో ఉచిత మెగా క్యాన్సర్ వైద్య శిబిరం బుధవారం నిర్వహించారు. ఎమ్మెల్యే బూడి ముత్యాలనాయుడు శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం మహాత్మ గాంధీ క్యాన్సర్ హాస్పిటల్ ఆండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ డాక్టర్ మహేంద్రగిరి మాట్లాడుతూ ఈ శిబిరంలో క్యాన్సర్ రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో దంగేటి సూర్యారావు, పెదబాబు, గొల్లవిల్లి సంజీవరావు, బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, కొట్యాడ భాస్కరరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బూడి ముత్యాలనాయుడు

పాడి రైతులకు బోనస్ అందజేత

ఎం.అలమండ (దేవరాపల్లి), న్యూస్‌టుడే: విశాఖ డెయిరీకి పాలు సరఫరా చేసే పాడి రైతులకు డెయిరీ ఛైర్మన్ ఆడారి తులసీరావు అనేక విధాలుగా ఆర్థిక తోడ్పాటుని అందిస్తున్నారని ఆ డెయిరీ ట్రస్టు బోర్డు సభ్యుడు గొర్లె గోవింద అన్నారు. మండలంలోని ఎం.అలమండలోని పాల ఉత్పత్తిదారులకు సంక్రాంతి బోనస్ కింద 154 మందికి రూ. 4.37 లక్షల్ని విడుదలైంది. పాల సంఘంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రైతులకు గోవింద ఈ బోనస్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల సంఘ డైరెక్టర్లు పొలిపిరెడ్డి రమణ, కసిరెడ్డి గోవింద, పోతల వెంకటరావు, సూపర్‌వైజర్ గోవింద, పాలసొసైటీ వేతన కార్యదర్శి సిహెచ్. శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.


పాడి రైతులకు బోనస్ అందజేస్తున్న గోవింద తదితరులు

వెంకన్నపాలెంలో పీహెచ్‌సీ ఏర్పాటు చేయాలి

సీమునాపల్లి (చోడవరం), న్యూస్‌టుడే: మండలంలో ప్రజలు ఆరోగ్యానికి వెంకన్నపాలెంలో మరో వైద్య కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని రాయపురాజుపేట ఎంపీటీసీ సభ్యుడు బొడ్డేడ రామునాయుడు కోరారు. బుధవారం సీమునాపల్లిలో ఎంపీడీవో చిట్టిరాజు అధ్యక్షతన జన్మభూమి సభ జరిగింది. ఈ సభలో ఎంపీటీసీ సభ్యుడు మాట్లాడుతూ తమ గ్రామం నుంచి 20కి.మీ. దూరం ప్రయాణిస్తేనే గాని వైద్యం అందని దుస్థితి నెలకొందన్నారు. ప్రజలను ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని వెంకన్నపాలెంలో ఏర్పాటు చేయాలని ఆయన అధికారులను కోరారు. ఈ అటవీశాఖాధికారి రామనరేష్ మాట్లాడుతూ మొక్కలు పెంచడంతో ఆరోగ్యం సమకూరుతుందన్నారు. కామాక దేముళ్లమ్మ అనే వృద్ధురాలు తన వేలి ముద్రలు పడలేదని డీలర్ బియ్యం ఇవ్వడం లేదని ఎంపీడీవో వద్ద వాపోయింది. సర్పంచి శరగడం ఉమ, ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అనాథ బాలికలకు వసతి కల్పించిన
'జియో' ఉద్యోగులు

తారువ (దేవరాపల్లి), న్యూస్‌టుడే: జిల్లాలో రిలయన్స్ జియో సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులంతా అనాథ బాలికల కోసం ఒక వసతిగృహాన్ని నిర్మించి తమలో దాగి ఉన్న దాతృత్వాన్ని చాటుకున్నారు. జియో జనరల్ మేనేజర్, ఏరియా బిజినెస్ హెడ్ శాంతి గౌరి ప్రసాద్ ఆధ్వర్యంలోని ఉద్యోగులంతా తమ నెల వారీ జీతంలో నెలకు రూ. వంద చొప్పున ఒక చోట పోగు చేసి రాష్ట్రంలోని పలు జిల్లాల్లో సామాజిక సేవకు ఖర్చు చేస్తున్నారు. దీనిలో భాగంగా దేవరాపల్లి మండలం తారువలోని అనాథ శరణాలయాన్ని శాంతి గౌరి ప్రసాద్ సారథ్యంలోని రిలయన్స్, జియో ఉద్యోగులంతా ఇటీవల సందర్శించారు. ఆ సమయంలో బాలికలకు ప్రత్యేక గదిని నిర్మించడానికి అవసరమైన వ్యయాన్ని భరించాలని నిర్ణయించారు. ఈమేరకు ప్రస్తుతం ఒక ప్రత్యేక వసతి గృహాన్ని నిర్మించారు. రూ. 60 వేల వ్యయంతో నిర్మించిన ఈ నూతన వసతి గృహాన్ని రిలయన్స్, జియో ఉద్యోగుల సమక్షంలో జనరల్ మేనేజరు శాంతి గౌరి ప్రసాద్ బుధవారం ప్రారంభించారు. ఈ భవనం ప్రారంభోత్సవం సందర్భంగా అనాథ శరణాలయానికి నిత్యావసర సరుకుల కొనుగోలుకు రూ. 15 వేల ఆర్థిక సాయాన్ని ఉద్యోగులంతా అందజేశారు.


బాలికల వసతి గదిని ప్రారంభిస్తున్న జియో జనరల్ మేనేజరు శాంతి గౌరి ప్రసాద్

ఘనంగా సావిత్రిబాయిపూలే జయంతి


సావిత్రిబాయి పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బేతపూడి కస్తూర్బా బాలికలు

రైవాడ, ఎం.అలమండ (దేవరాపల్లి), న్యూస్‌టుడే: భారత దేశ తొలి మహిళా ఉపాధ్యాయిని సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకుని జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని ఎం.అలమండలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంస్థ వ్యవస్థాపకుడు తాడి చంటి ఆధ్వర్యంలో పూలే జయంతి వేడుకలు అట్టహాసంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి పలువురు నివాళులర్పించారు. అనంతరం పలువురు మహిళా ఉపాధ్యాయుల్ని కార్యక్రమ నిర్వాహకులు తాడి చంటి తదితరులు సత్కరించారు. రైవాడ శివారు బేతపూడిలోని కస్తూర్బా గురుకుల విద్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సావిత్రి బాయి పూలే చిత్రపటానికి కస్తూర్బా బాలికలు, ఉపాధ్యాయులు నివాళులర్పించారు.

చీడికాడ, న్యూస్‌టుడే: విద్యార్థులను తీర్చిదిద్దడంలో ప్రత్యేక శ్రద్ధ వహించిన ఉపాధ్యాయులకు ఎప్పుడూ గౌరవం ఉంటుందని మండల విద్యాశాఖాధికారి కె.గంగరాజు అన్నారు. మండల ఉత్తమ ఉపాధ్యాయురాలుగా చుక్కపల్లి పాఠశాలకు చెందిన అనపర్తి జయలక్ష్మి ఎంపిక య్యారు. సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకుని బుధవారం మండలంలోని మంచాలలోని నిర్వహించిన జన్మభూమి-మాఊరు కార్యక్రమంలో జయలక్ష్మిని జన్మభూమి కార్యక్రమం నియోజకవర్గ పరిశీలకుడు రవిప్రకాశ్, తహసీల్దారు పి.భాగ్యవతి, మండల విద్యాశాఖాధికారి కె.గంగరాజు, సర్పంచి కశిరెడ్డి కొండమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు ఒబ్బలరెడ్డి చిట్టమ్మ, ఏపీటీఎఫ్ మండల అధ్యక్షుడు నాయుడు సన్మానించారు.

కె.కోటపాడు, న్యూస్‌టుడే: కె.కోటపాడులో బుధవారం సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగాయి. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి యూటీఎఫ్ నాయకులు పూలదండలు వేసి నివాళులర్పించారు. అనంతరం 'నవ సమాజ నిర్మాణంలో మహిళా ఉపాధ్యాయుల పాత్ర' అనే అంశంపై పలు పాఠశాలల్లో వ్యాసరచన పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి కె.రాజేంద్రకుమార్, అధ్యక్షుడు దొగ్గ శ్రీను, ఉపాధ్యక్షుడు సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.



మహిళా ఉపాధ్యాయురాలు జయలక్ష్మిని సన్మానిస్తున్న ఉన్నతాధికారులు

మాడుగుల

వేంకటేశ్వరుని దేవాలయంలో దీపోత్సవం

గోవాడ (చోడవరం గ్రామీణం); న్యూస్‌టుడే: మండలంలోని గోవాడ వేంకటేశ్వరుని దేవాలయంలో బుధవారం తెల్లవారుజామున అయిదు గంటలకు దీపోత్సవం నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి దీపాలు వెలిగించారు. ధనుర్మాసం 19వ రోజు సందర్భంగా లలితా పారాయణం నిర్వహించారు. పాలఆలయ ప్రధాన అర్చకులు జె.టి. ఆచార్యులు(పెదబాబు)ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి.

ప్రజలు ఇచ్చే ప్రతి అర్జీకి అధికారులే జవాబుదారీ



పింద్రంగి కార్యక్రమంలో మాట్లాడుతున్న గోవిందరాజులు

కె.కోటపాడు, న్యూస్‌టుడే : ప్రజలు సమర్పించే ప్రతీ అర్జీకి అధికారులే జవాబుదారులని నియోజకవర్గ ప్రత్యేకాధికారి గోవిందరాజులు అన్నారు. జన్మభూమి మాఊరు కార్యక్రమాలు బుధవారం పింద్రంగి, లంకవానిపాలెం, గొండుపాలెం, రొంగలినాయుడుపాలెం గ్రామాల్లో ఎంపీడీఓ సుబ్బలక్ష్మి, తహసీల్దారు బీవీ రాణి ఆధ్వర్యంలో జరిగాయి. ఈ సందర్భంగా పింద్రంగిలో జరిగిన సభలో గోవిందరాజులు మాట్లాడుతూ ఇంతకు ముందులా కాకుండా ఆన్‌లైన్ ద్వారా అర్జీలు స్వీకరిస్తున్నందున వీటి విషయంలో ఎలాంటి తేడాలు ఉండరాదన్నారు. రొంగలి నాయుడుపాలెంలో జరిగిన కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి డీవీ రమణమూర్తి పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ సబ్బవరపు పుష్పావతి, సర్పంచులు రొంగలి సత్యవతి, వంటాకు శ్రీను, అవుగడ్డ సోంబాబు, సింగంపల్లి రమణమ్మ, ఎంపీటీసీ సభ్యులు కొల్లి లక్ష్మి, బండారు మంగపతి, కొరుప్రోలు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. వీరంతా కొత్తగా మంజూరైన పింఛన్లు, తెలుపుకార్డులను, చంద్రన్న సంక్రాంతి కానుకలను పంపిణీ చేశారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి జన్మభూమి

మంచాల, తునివలస (చీడికాడ), న్యూస్‌టుడే: ప్రభుత్వ పథకాలు అందించి వాటిపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, ప్రజా సమస్యల పరిష్కారానికి జన్మభూమి-మాఊరు కార్యక్రమం చక్కటి వేదికని ఈ కార్యక్రమ నియో



మంచాల సమావేశంలో మాట్లాడుతున్న రవిప్రకాశ్

జకవర్గ పరిశీలకుడు, జీసీసీ ఎండీ రవిప్రకాశ్ అన్నారు. బుధవారం మండలంలోని తునివలసలో ఎంపీడీఓ ఆర్.ఎం. గ్లాడ్స్, మంచాలలో తహసీల్దారు పి.భాగ్యవతి ఆధ్వర్యంలో జన్మభూమి-మాఊరు కార్యక్రమాలు జరిగాయి. జన్మభూమి కార్యక్రమాలకు నియోజకవర్గ పరిశీలకుడు రవిప్రకాశ్, మండల సమన్వయాధికారి టి.సత్యనారాయణ, మండలాధ్యక్షురాలు కుచ్చు కళావతి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. తునివలసలో పలువురు ఉపాధి హామీ పథకం, మరుగుదొడ్ల బిల్లుల అందలేదని, తునివవలస-వింటిపాలెం తారురోడ్డు వేయాలని అధికారులను అడిగారు. మంచాలలో విస్సుంశెట్టి దేముడు మాట్లాడుతూ మరుగుదొడ్ల గోతులు తీసుకున్నా.. బిల్లులు ఇవ్వలేదని, సిరికి సుభద్రమ్మ వృద్ధిరాలికి మూడేళ్లగా రేషన్ సరకులు ఇవ్వలేదని, వేలిముద్రలు పడక సరకులు అందలేదని ఆయన అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలపై స్పందించిన తహసీల్దారు పి.భాగ్యవతి వేలిముద్రలు పడనివారికి వీఆర్వో వేలిముద్రలతో సరకులను అందజేస్తామని, మిగిలిన సమస్యలు త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తునివలస, మంచాల సర్పంచులు పడాల అప్పలనాయుడు, కశిరెడ్డి కొండమ్మ, ఎంపీటీసీ సభ్యులు రాకోటి వెంకటసత్యనారాయణ, ఒబ్బలరెడ్డి చిట్టమ్మ, కోనాం జలాశయం ఛైర్మన్ గండి ముసలినాయుడుతదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

చీడికాడ, న్యూస్‌టుడే: మండలంలోని మంచాలలో బుధవారం జరిగిన జన్మభూమి-మాఊరు కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు చూపర్లను విశేషంగా ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపల్ టి.హీరాలాల్ ఆధ్వర్యంలో విద్యార్థిని, విద్యార్థులు దేశభక్తి, సినీ గీతాలకు చక్కటి నృత్యాలను చేశారు. విద్యార్థుల నృత్యంతో వారి వేషధారణ విశేషంగా ఆకట్టుకున్నాయి. తునివలసలో ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు చక్కటి రంగవల్లికలు వేశారు.



మంచాలలో ఆదర్శ పాఠశాల బాలికల నృత్యం



బేతపూడిలో కస్తూర్బా బాలికల ప్రదర్శన

సజావుగా గ్రామసభలు

దేవరాపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని రైవాడ, తామరబ్బ, చింతలపూడి గ్రామాల్లో బుధవారం జన్మభూమి జరగింది. తామరబ్బలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ భాస్కరరావు, రైవాడలో జరిగిన కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు గాలి వరలక్ష్మితో పాటు మాడుగుల నియోజకవర్గ ప్రత్యేక అధికారి గోవిందరాజులు పాల్గొన్నారు. తామరబ్బలో సర్పంచి మూలగుమ్మి అప్పన్నదొర అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి జి.మహలక్ష్మి పాల్గొనగా తమ పంచాయతీ పరిధిలోని శారదా నది నుంచి ఇసుక అక్రమరవాణాతో పాటు సాధికార మిత్రల నియామకం, అంగన్‌వాడీ సేవలపై అధికారులు ప్రజలు ప్రశ్నించడంతో కొంత సేపు వాగ్వాదం చోటు చేసుకుంది. సభలో ఉన్న ఎంపీపీ భాస్కరరావు కలుగజేసుకుని సర్దిచెప్పడంతో వివాదం సద్దుమణిగింది. ఈ పంచాయతీ అనంతరం చింతలపూడిలో సర్పంచి కె. ఈశ్వరరావు అధ్యక్షతన తహసీల్దారు వై.ఎస్.నాగరాజు ఆధ్వర్యంలో జరిగిన సభలో ఎంపీటీసీ సభ్యుడు చిటిమిరెడ్డి సూర్యనారాయణ సహా పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. రైవాడలో సర్పంచ్ చల్లా కృష్ణవేణి అధ్యక్షతన జరిగిన జన్మభూమి కార్యక్రమంలో వివిధ ప్రభుత్వ పథకాల గురించి ఎంపీడీఓ డి. చంద్రశేఖర్ తదితర అధికారులు వివరించారు. ఈ మూడు గ్రామాల్లో జరిగిన సీమంతాల్లో గర్భవుతుల్ని ఎంపీపీ భాస్కరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు గాలి వరలక్ష్మి దీవించారు.

సమస్యలు అన్నింటికి పరిష్కారం జన్మభూమే

మాడుగుల గ్రామీణం, న్యూస్‌టుడే: జన్మభూమిలోనే సమస్యలన్నీ పరిష్కారమవుతాయని ప్రత్యేక అధికారిణి శైలజ, ఎంపీడీవో డేవిడ్‌రాజ్ తెలిపారు. మండలంలోని సాగరం, జంపెన గ్రామాల్లో ఎంపీడీవో బృందం, సత్యవరం, గాదిరాయి తహసీల్దార్ బృందం బుధవారం అధికారులతో పర్యటించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, గ్రామపెద్దలు, మండస్థాయి అధికారులు పాల్గొన్నారు.



నృత్యంచేస్తున్న సాగరం కస్తూర్బా విద్యార్థినులు

నేడు జన్మభూమి జరిగే గ్రామాలివే

కె.కోటపాడు, న్యూస్‌టుడే : జన్మభూమి మాఊరు కార్యక్రమాలు గురువారం ఎ.కోడూరు, సూరెడ్డిపాలెం, మేడిచర్ల, ఎ.భీమవరం గ్రామాల్లో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుబ్బలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమాలకు ఉన్నతాధికారులు, మండలస్థాయి అధికారులు అందరూ హాజరవుతారన్నారు.

చీడికాడ, న్యూస్‌టుడే: జన్మభూమి-మా ఊరు కార్యక్రమం గురువారం మండలంలోని ఉదయం 10 గంటలకు తురువోలు, అప్పలరాజుపురం పంచాయతీల్లో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఆర్.ఎం.గ్లాడ్స్ చెప్పారు. ప్రజాప్రతినిధులు, ప్రజలు హాజరు కావాలని ఆమె కోరారు.

దేవరాపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని మారేపల్లి, వెంకటరాజపురం, వాకపల్లి గ్రామాల్లో గురువారం జన్మభూమి-మన ఊరు కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీఓ డి.చంద్రశేఖర్ తెలిపారు.

మాడుగుల గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని వీజేపురం, ఒమ్మలి పొంగలిపాక, కింతలి గ్రామాల్లో గురువారం జన్మభూమి గ్రామసభలు నిర్వహించనున్నారు.



పింఛన్లు అందజేస్తున్న సర్పంచి, ఎంపీటీసీ సభ్యురాలు

చేనేత కార్మికులకు పింఛన్ల మంజూరు

దేవరాపల్లి, న్యూస్‌టుడే: మండలంలో అర్హులైన 12 మంది చేనేత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా పింఛన్లను మంజూరు చేసింది. వాటిలో దేవరాపల్లికి చెందిన అయిదుగురికి పింఛన్లు పొందే అవకాశం దక్కింది. పంచాయతీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సర్పంచి కిలపర్తి చినమ్మలు వీటిని లబ్ధిదారులకు అందజేశారు. ఆమెతో పాటు ఎంపీటీసీ సభ్యురాలు సోమిరెడ్డి సత్యవతి కూడా పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ విస్తరణాధికారి బి.ఎరకయ్య, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

.పాడి రైతులకు బోనస్ పంపిణీ

చినపాచిల (రావికమతం), న్యూస్‌టుడే: మండలంలోని చినపాచిలలో పాడి రైతులకు విశాఖ డెయిరీ ద్వారా రూ.3.25 లక్షల నగదు, పశువుల దాణా బేసిన్‌లను ప్రోత్సాహకాలుగా బుధవారం అందజేశారు. ఇక్కడి విశాఖ డెయిరి పాల సొసైటీలో 203 మంది పాడి రైతులు పాలు పోస్తున్నారు. ఎంపీటీసీ సభ్యుడు సాసుబిల్లి నూకరాజు, పాల సంఘం అధ్యక్షుడు ఆదాడ రాజారావు, ఉప సర్పంచి కోమటి శంకరరావు రైతులకు అందజేశారు. అలాగే సభ్య రైతులు అందరికీ పశువులకు దాణా పెట్టుకోడానికి అవసరమైన సిల్వర్ బేసిన్‌లను ప్రోత్సాహకాలుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో విశాఖ డెయిరీ ఆఫీసర్ ఎస్.ఓ గణేష్‌కుమార్, విశాఖ డెయిరీ పాల సొసైటీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వంద టన్నుల సైలేజ్ గడ్డి పంపిణీ

కొమరవోలు (రోలుగుంట), న్యూస్‌టుడే: రాష్ట్ర పశు సంవర్ధక శాఖ ద్వారా రాయితీపై కిలో రూ.రెండుకే సైలేజ్ గడ్డిని రోలుగుంట, రావికమతం మండలాల్లో కలిపి సుమారు 100 టన్నులకుపైగా పంపిణీ చేశామని పశు సంవర్ధక శాఖ రావికమతం సహాయ సంచాలకుడు డాక్టర్ రాజగోపాల్ వెల్లడించారు. రోలుగుంట మండలం కొమరవోలు, జానకిరాంపురం గ్రామాల్లోని పశుగ్రాసక్షేత్రాలను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. నిజానికి సైలేజ్ గడ్డి కేజీ రూ.ఆరు ఉండగా దీనిపై ప్రభుత్వం రూ.నాలుగు రాయితీ ఇస్తుందన్నారు.

పేదల సంతోషం కోసం చంద్రన్న కానుకలు

ఖండివరం (చీడికాడ), న్యూస్‌టుడే: పేద, మధ్యతరగతి ప్రజలు పండగ సంతోషంగా చేసుకోవాలనే ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చంద్రన్న కానుకలు ఉచితంగా అందజేస్తున్నారని ఖండివరం సర్పంచి సింగంపల్లి ముత్యాలనాయుడు అన్నారు. మండలంలోని ఖండివరంలో బుధవారం రేషన్ డిపోల ద్వారా అందజేస్తున్న ఉచిత చంద్రన్న కానుకల పంపిణీ కార్యక్రమాన్ని సర్పంచి ముత్యాలునాయుడు ప్రారంభించారు. అనంతరం కార్డుదారులకు చంద్రన్న కానుకలు ఆయన గ్రామ పెద్దల, జన్మభూమి కమిటీ సభ్యులతో కలిసి అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ బండారు దయాకర్, తెదేపా గ్రామశాఖ అధ్యక్షుడు యాళ్ల అమ్మతల్లినాయుడు, గ్రామపెద్దలు సింగంపల్లి పెదనాయుడు తదితరులు పాల్గొన్నారు.



సంక్రాంతి కానుకలను అందజేస్తున్న సర్పంచి, గ్రామపెద్దలు

ఆటో.. బైక్ ఢీ ఇద్దరికి తీవ్ర గాయాలు

గొంప (రావికమతం), న్యూస్‌టుడే: గొంప గ్రామానికి సమీపంలో ఆటో, ద్విచక్ర వాహనం ఢీకొని ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. తట్టబందకు చెందిన సింబోతు ఈశ్వరరావు, బుచ్చెయ్యపేట మండల గొర్లెపాలెంకు చెందిన అధికారి బుజ్జిలు బుధవారం ద్విచక్ర వాహనంపై గొంప నుంచి సీతయ్యపేట వైపు వెళ్తున్నారు. వీరి ద్విచక్ర వాహనం, అటు వైపు నుంచి ఖాళీగా వస్తున్న ఆటో గొంప సమీపంలోని గెడ్డ వద్ద ఢీకొన్నాయి. తీవ్రంగా గాయపడిన ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరిని అనకాపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన ఆటో రావికమతానికి చెందిన వ్యక్తిదిగా గుర్తించామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై రామకృష్ణ తెలిపారు.

నర్సీపట్నం

నేడు జన్మభూమి జరిగే గ్రామాలివే..

మాకవరపాలెం గ్రామీణం: మాకవరపాలెం మండలంలో గురువారం మూడు గ్రామాల్లో జన్మభూమి సభలు నిర్వహించనున్నట్లు నోడల్ అధికారి బి.వి. శ్రీనివాసకుమార్ పేర్కొన్నారు. ఉదయం 10.30గంటల నుంచి జంగాలపల్లి, భీమబోయినపాలెం, కొండల అగ్రహారం గ్రామాల్లో ఎంపీడీఓ, తహసీల్దార్, పంచాయితీ విస్తరణాధికారుల బృందంతో కూడిన అధికారులు, సిబ్బంది ఆయా గ్రామాల్లో పర్యటించనున్నట్లు ఆయన వివరించారు.

నేడు మంత్రి అయ్యన్న కొత్తఎల్లవరం రాక

కొత్తఎల్లవరం(గొలుగొండ), న్యూస్‌టుడే: రాష్ట్ర రోడ్లు భవనాలశాఖ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు గురువారం కొత్తఎల్లవరం పంచాయతీలో పర్యటిస్తారని ఎంపీపీ లక్ష్మీనారాయణ తెలిపారు. సాయంత్రం ఆయన ఇక్కడ విలేకర్లతో మాట్లాడుతూ ఈ పంచాయతీలో చేపట్టిన పలు అభివృద్ధి పథకాలను ఆయన పరిశీలన చేయడంతోపాటు ఇక్కడ ప్రజల సమస్యలను తెలుసుకుంటారన్నారు.

ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు



నర్సీపట్నం కొత్తవీధి సభలో ప్రసంగిస్తున్న ఛైర్‌పర్సన్ అనిత

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: ప్రభుత్వం ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలను చేరువ చేసిందని నర్సీపట్నం పురపాలిక ఛైర్‌పర్సన్ చింతకాయల అనిత అన్నారు. బుధవారం ఆమె పట్టణంలోని ఐదు, తొమ్మిది వార్డుల్లో జన్మభూమి గ్రామసభల్లో పాల్గొని ప్రసంగించారు. ప్రతి వార్డును అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. డ్రైనేజీ, రహదారులను అభివృద్ధి చేశామని, విద్యుత్తు, తాగునీటి సరఫరాను పూర్తిగా మెరుగుపర్చామని తెలిపారు. తడి-పొడి చెత్తని వేరు చేసి పారిశుద్ధ్య సిబ్బందికి అందించాలని కోరారు ఆరు, ఏడు వార్డుల్లో వైస్‌ఛైర్మన్ చింతకాయల సన్యాసిపాత్రుడు పాల్గొన్నారు. కమిషనర్ జంపా సురేంద్ర, డీఈ కామేశ్వరరావు ఈ సభలను నిర్వహించారు. విద్యార్థినులు నృత్యాలతో ఆకట్టుకున్నారు. డి.ఎఫ్.ఓ. బి.శేఖర్‌బాబు ప్రత్యేక అధికారి హోదాలో ఆరో వార్డు సభకు హాజరయ్యారు. చెట్టుపల్లిలో నిర్వహించిన గ్రామసభలో మండలాధ్యక్షురాలు సుకల రమణమ్మ, మండల ప్రత్యేకాధికారి సీహెచ్.మహాలక్ష్మి, జన్మభూమి ప్రత్యేకాధికారి డాక్టర్ గెడ్డం శేఖర్‌బాబు, డి.ఎల్.పి.ఓ. శిరీషారాణి పాల్గొన్నారు. కోతుల బెడద నివారించాలని గ్రామస్థులు డి.ఎఫ్.ఓ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే బోన్లు పంపిస్తామని ఆయన హామీ ఇచ్చారు. తెదేపా మండల కమిటీ అధ్యక్షుడు లాలం శ్రీరంగస్వామి, తెదేపా నాయకుడు మోపాడ ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు. సర్పంచి ముత్యాల వెంకయ్యమ్మ అధ్యక్షత వహించారు. ఈ సభలో కొత్త రేషన్‌కార్డులను పంపిణీ చేశారు. ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యామేళా ఆకట్టుకుంది.

చీడిగుమ్మల(గొలుగొండ), న్యూస్‌టుడే: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారానికే జన్మభూమి సభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ సుర్ల లక్ష్మీనారాయణ అన్నారు. బధవారం చీడిగుమ్మలలో ఏర్పాటు చేసిన సభావేదిక నుంచి ఆయన మాట్లాడుతూ గత సభల్లో వచ్చిన వినతులను పరిష్కరిస్తూ సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందిస్తున్న తీరును వివరించారు.

మాకవరపాలెం గ్రామీణం, న్యూస్‌టుడే: అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకే దక్కుతుందని ఎంపీపీ రుత్తల చిన్నయ్యమ్మ, పీఏసీఎస్ అధ్యక్షులు అల్లు రామునాయుడు అన్నారు. బుధవారం బయ్యవరం, తాడపాల, జమీందారి గంగవరం గ్రామాల్లో జన్మభూమి-మాఊరు కార్యక్రమాన్ని నిర్వహించారు. బయ్యవరం సభలో పాల్గొన్న రామునాయుడు మాట్లాడుతూ ఎన్టీఆర్ భరోసా కింద పింఛన్లు ఇచ్చే అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు చెప్పారు. ప్రజల సంక్షేమంతో పాటు గ్రామాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఎం.ఉదయశ్రీ, తహసీల్దార్ జె.తారకేశ్వరి, జిల్లా టెలికాం ఎడ్వయిజర్ కమిటీ సభ్యులు పైల వెంకటరమణ, సర్పంచి అప్పలనాయుడు, విశాఖ డెయిరీ డైరెక్టర్ శీరంరెడ్డి సూర్యనారాయణ, మాజీ సర్పంచి లాలం వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు. తాడపాల ఉపాధి హామీ క్షేత్రసహాయకులు కోరెడ్డి అప్పారావు రావికమతం మండలం సాంకేతిక సహాయకులుగా పదోన్నతి పొందిన సందర్భంగా జన్మభూమి సభలో అధికారులు, ప్రజాప్రతినిధులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉప ఎంపీపీ వబ్బులరెడ్డి వెంకటరమణ, ఉప తహసీల్దార్ కె.ప్రసాద్‌రావు, పంచాయతీ విస్తరణాధికారి ఎస్.సత్యన్నారాయణ పాల్గొన్నారు.



చీడిగుమ్మల సభలో మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మీనారాయణ

వజ్రగడ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు వ్యాసరచన, ముగ్గుల పోటీలను నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు ప్రసాద్ ఆధ్వర్యంలో పలువురు విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నూకరాజు, ఎం.పార్వతిదేవి, చక్రవర్తి, నిర్మల పాల్గొన్నారు.



జిల్లా పంచాయతీ అధికారికి సమస్యలు వివరిస్తున్న ఈశ్వర్రావు

శ్మశానవాటిక లేని పంచాయతీగా వదిలేస్తారా!

గాంధీనగరం (నాతవరం): శ్మశానవాటిక లేని పంచాయతీగా గాంధీనగరాన్ని వదిలేస్తారా అంటూ సర్పంచి ఈశ్వరావు జిల్లా పంచాయతీ అధికారి కృష్ణకుమారి ముందు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం జన్మభూమి గ్రామసభలో ఆయన గ్రామంలో సమస్యలను వివరించారు. తాండవ నిర్వాసిత గ్రామంగా వెలసిన గాంధీనగరంలో ఎవరైనా చనిపోతే దూరంగా అటవీ స్థలం దహనం చేస్తున్నామని , గ్రామకంఠం భూములు ఆక్రమణలో ఉన్నాయన్నారు. వీటిలో శ్మశానవాటిక కోసం 10 సెంట్లు కేటాయించాలని రెండేళ్ల నుంచి కోరుతున్నా అధికారులు పట్టించుకోలేదన్నారు. ఇంకుడు గుంతలు నిర్మాణంలో ఆదర్శంగా ఉన్న తమ గ్రామస్థులకు ఇప్పటికీ చెల్లింపులు జరగలేదని ఆరోపించారు. గ్రామంలో ఎంతోకాలంగా నివాసమున్న వారికి పట్టాలు ఇవ్వాలన్నారు. తమ గ్రామాన్ని శృంగవరం రెవెన్యూ పరిధి నుంచి తప్పించాలని కోరారు. డీపీవో స్పందిస్తూ ఈసమస్యలపై విడివిడిగా వినతులు ఇవ్వాలని కోరారు. అనంతరం జడ్పీటీసీ సత్యానారాయణ ఆధ్వర్యంలో ఎంపీడీవో గ్రామసభను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి ఛైర్మన్ కాశపు అప్పారావు పాల్గొన్నారు.

కనీస వేతనాల కోసం ఆందోళన

నర్సీపట్నం, న్యూస్‌టుడే: విద్యుత్తు మీటర్ రీడర్లు పెదబొడ్డేపల్లిలోని ఏపీఈపీడీసీఎల్ డివిజన్ కార్యాలయం ఎదుట బుధవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా విద్యుత్తు కాంట్రాక్టు కార్మికుల ఐక్య వేదిక ప్రతినిధులు మాట్లాడుతూ మీటర్ రీడర్లకు పీస్‌రేటు రద్దు చేసి కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. తమిళనాడులో మాదిరి అందరినీ పర్మినెంట్ చేయాలని కోరారు. ఈ సమస్యల పరిష్కారానికి వీరు ఈ నెల 27 వరకూ దశలవారీగా ఆందోళనలు చేపట్టనున్నట్లు చెప్పారు. రోజూ మధ్యాహ్నం భోజన విరామ సమయంలో డివిజన్ కార్యాలయం ఎదుట ధర్నా చేపడతారన్నారు. ప్రభుత్వం పట్టించుకోని పక్షంలో ఈ నెల 28 తరువాత రాష్ట్ర వ్యాప్తంగా మిగిలిన కార్మికులతో కలిసి నిరవధిక సమ్మెలో పాల్గొంటామన్నారు. ఈ ఆందోళనలో డివిజన్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు అప్పలకొండ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



ఆందోళనలో పాల్గొన్న మీటర్ రీడర్లు

గ్రామాల్లో మౌలిక సదుపాయాలు

కొంగశింగి(కృష్ణదేవిపేట), న్యూస్‌టుడే: అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ ఫలాలు అందిస్తామని జడ్పీటీసీ సభ్యుడు తారకవేణుగోపాల్ స్పష్టం చేశారు. బుధవారం కొంగశింగి, అమ్మపేట గ్రామాల్లో జన్మభూమి సభలో ఆయన మాట్లాడుతూ మంత్రి అయ్యన్నపాత్రుడు కుగ్రామాల్లో సిమెంట్ రోడ్లు, తాగు, సాగునీటి సౌకర్యం కల్పించారన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ఎంపీపీ సుర్ల లక్ష్మీనారాయణ, మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్, తహసీల్దార్ అంబేడ్కర్, ఎంపీడీఓ సువర్ణరాజు వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు గొర్లి ఉమాదేవి, చెల్లూరి సత్యానారాయణ, ఉప సర్పంచి కె.కృష్ణ పాల్గొన్నారు.

నర్సీపట్నం

వడ్డీ రాయితీ వినియోగించుకోవాలి

పాయకరావుపేట: పాత బకాయిల చెల్లింపునకు అమల్లోకి తెచ్చిన రుణస మాధాన్-2 పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌బీఐ బ్రాంచి మేనేజర్ కె.సౌమిత్రి పేర్కొన్నారు. బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మొండి బకాయిలున్న ఖాతాదారులకు ఈ పథకం ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. దీనిలో పూర్తివడ్డీ రాయితీ తో పాటు అప్పులో కేవలం 50 నుంచి 60 శాతం సొమ్ము చెల్లిస్తే సరిపోతుందన్నారు.

ప్రత్యేక ఐటీడీఏ ఏర్పాటుకు డిమాండ్

గొలుగొండ, న్యూస్‌టుడే: ఏళ్ల తరబడి మైదాన మండలాల్లో గిరిజనులు సాగుచేస్తున్న భూములపై హక్కు కల్పించాలని రైతు సంఘం జిల్లా సమితి సభ్యుడు ఎస్.నారాయణమూర్తి అన్నారు. బుధవారం బుడ్డపాడులో జరిగిన మండల పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇక్కడ మైదాన గిరిజనులకు ఏజెన్సీ వాసులతో కుటుంబ సంబంధాలు ఉన్నా అక్కడ వారికి ఐటీడీఏ అందించే సౌకర్యాలు అందడం లేదన్నారు. నర్సీపట్నం కేంద్రంగా ప్రత్యేక ఐటీడీఏ ఏర్పాటు చేయాలని ఏళ్లతరబడి ఉద్యమాలు చేస్తున్నా పాలకుల్లో స్పందనలేదన్నారు. ఈ మండలంలో 23 గ్రామాల్లో వందలాది ఎకరాల భూములు పేద గిరిజనులు సాగు చేస్తున్నా పట్టాలు లేవన్నారు. వీటితోపాటు ప్రజలు ఎదుర్కొంటున్న ఇతర సమస్యలన్నీ ఈ నెల 7, 8 తేదీల్లో అచ్యుతాపురంలో జరిగే జిల్లా మహాసభల దృష్టికి తీసుకెళ్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం బహిరంగసభ వివరాలతో కూడిన గోడ ప్రతులను విడుదల చేశారు. రెండు రోజులపాటు జరిగే ఈ సభలను విజయవంతం చేసేందుకు కార్యకర్తలు భారీగా తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ సభ్యులతో పాటు పలు ప్రజాసంఘాల నేతలు పాల్గొన్నారు.



బహిరంగ సభ ప్రచార పత్రిక ఆవిష్కరిస్తున్న నాయకులు

ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి

మాకవరపాలెం గ్రామీణం, న్యూస్‌టుడే: భారతీయ సంఘ సంస్కర్త, రచయిత్రి సావిత్రిబాయి పూలే జయంతిని బుధవారం మాకవరపాలెంలో యువమోర్చా జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూల మాల వేసి జిల్లా అధ్యక్షులు నగిశెట్టి గంగబాబు నివాళులు అర్పించారు.

నర్సీపటం: సావిత్రిబాయిపూలే జయంతిని మహిళా ఉపాధ్యాయ దినంగా ప్రభుత్వం ప్రకటించాలని వక్తలు డిమాండ్ చేశారు. గిరిజన బాలికల వసతిగృహంలో బుధవారం జనవిజ్ఞాన వేదిక, ఐద్వా సంయుక్తంగా జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సమావేశంలో విశ్రాంత తెలుగు అధ్యాపకుడు జెట్టి యల్లమంద, జవివే రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.త్రిమూర్తులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ వేలం

నర్సీపట్నం జిల్లా పరిషత్ బాలిక ఉన్నత పాఠశాలలోని టేకు, వేప చెట్లు వేలం తేది. 08-01-2018ది మధ్యాహ్నం 11.00 గంటలకు పాఠశాల ఆవరణలో ఏర్పాటు కాబడినది. వివరములకు పాఠశాల ప్రధానోపాధ్యాయినిని సంప్రదించగలరు. ఈ క్రింది సంతకందారు నియమించిన సిబ్బందిచేగాని అనివార్య కారణాల వల్ల వాయిదా వేయబడును. ధరావత్తు Rs. 1000/- చెల్లించవలెను.

ప్రధానోపాధ్యాయురాలు

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నర్సీపట్నం

అందరికీ జాబ్‌కార్డులు ఇవాల్సిందే!



కూలీలకు జాబ్‌కార్డులు పంపిణీ చేస్తున్న నాయకులు

పుత్తడిగైరంపేట(గొలుగొండ), న్యూస్‌టుడే: వ్యవసాయ కూలీలందరికీ వివక్ష లేకుండా ఉపాధి పథకం జాబ్‌కార్డులు ఇవ్వాలని సర్పంచి, ఉపసర్పంచులు లక్ష్మి, రమణ అన్నారు. పుత్తడిగైరంపేటలో బుధవారం కూలీలకు జాబ్‌కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ అధికారులు జన్మభూమి కమిటీల సిపార్సులపై ఆధారపడకుండా క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి అర్హులకు అందించాలన్నారు. దీని వల్ల ఉపాధి లభించడంతోపాటు వలసల సంఖ్య తగ్గుతుందన్నారు. పనులు కల్పించడంతోపాటు చెల్లింపులు కూడా సకాలంలో అందితే కూలీలకు ఆకలి బాధలు తప్పుతాయనే అభిప్రాయం వ్యక్తం చేశారు. తెదేపా నేత తుమ్మగుంట నాయుడు మాట్లాడుతూ అర్హులకు అన్యాయం జరగదని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

పాయకరావుపేట



104 వైద్య సమాచారం

రమణయ్యపేట(నక్కపల్లి), న్యూస్‌టుడే: నక్కపల్లి, ఎస్.రాయవరం మండలాల్లో గురువారం 104 వైద్యసేవలు అందనున్నాయి. దీనిలో భాగంగా వాహనం ఉదయం రమణయ్యపేట, మధ్యాహ్నం పెట్టుగోళ్లపల్లి గ్రామాల్లో అందుబాటులో ఉంటుంది.

అందుబాటులో నిధులున్నా..
అభివృద్ధి జాడలేదు

నక్కపల్లి, న్యూస్‌టుడే నిధులున్నా నక్కపల్లి శ్మశానం అభివృద్ధికి నోచుకోవడంలేదు. ప్రభుత్వం ఓవైపు రుద్రభూముల అభివృద్ధికి నిధులు కేటాయిస్తున్నా ఇక్కడ మాత్రం పనులు జరగలేదు. నక్కపల్లిలో సుమారు పదెకరాల్లో శ్మశానం ఉంది. ఇందులో తుప్పలు పెరిగిపోయాయి. ఎవరైనా కాలం చేస్తే అంతిమ సంస్కారాలు చేయడానికి కొద్దిపాటి స్థలం మాత్రమే అనువుగా ఉంది. దీనికితోడు ఈ భూమిని ఆనుకుని రైతుల భూములున్నాయి. దీంతో కొందరు ఆక్రమణలకు పాల్పడ్డారు. ఈ స్థలం అంతకు తక్కువ కుదించుకుపోతోంది. ఈ ఆక్రమణలు తొలగించాలంటూ పలుమార్లు అధికారులకు వినతులు ఇచ్చినా పట్టించుకోలేదు. చివరికి దీని అభివృద్ధి చేయాలని ప్రభుత్వం ఉపాధి పథకం ద్వారా రూ. 7లక్షలు విడుదల చేసింది. ఇదంతా జరిగి కొన్ని నెలలవుతోంది. వాస్తవానికి ఈ శ్మశానం అభివృద్ధికి రూ. 10 లక్షలు అవసరం. మిగిలిన రూ. 3 లక్షల నిధులు అందుబాటులో లేకపోవడంతో పనులు జరగలేదు. వర్షాకాలం వచ్చిందంటే దహన సంస్కారాలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీని అభివృద్ధితోపాటు, ఆక్రమణల తొలగింపునకు అధికారులు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.



◄ తుప్పలతో కూడిన శ్మశాన ఆవరణ

రూ.11.50 లక్షలతో గ్రంథాలయ భవన మరమ్మతులు



శిథిలావస్థకు చేరిన గ్రంథాలయ భవనం

కోటవురట్ల, న్యూస్‌టుడే: కోటవురట్ల గ్రంథాలయానికి ఎట్టకేలకు నిధులు మంజూరయ్యాయి. నీలం తుపానుకు శిథిలావస్థకు చేరిన ఈ భవనం మరమ్మతులకు రూ. 11.50 లక్షలు మంజూరు చేశారని ఆ శాఖ అధికారి బుధవారం రాజుబాబు చెప్పారు. భవనం మరమ్మతులకు చేరడంతో శ్లాబ్ పెచ్చులూడి పాఠకులపై పడేవి. దీంతో పాఠకులు గ్రంథాలయానికి రావడానికి ఆందోళన చెందేవారు. వర్షం కురిస్తే గ్రంథాలయం అంతా కారిపోవడంతో పాటు, విలువైన పుస్తకాలు తడిచిపోయేవి. ఈ సమయంలో నిధులు మంజూరు కావడంతో త్వరితగతిన భవన మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

వడ్డీ రాయితీ వినియోగించుకోవాలి

పాయకరావుపేట, న్యూస్‌టుడే: పాత బకాయిల చెల్లింపునకు అమల్లోకి తెచ్చిన రుణసమాధాన్-2 పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌బీఐ బ్రాంచి మేనేజర్ కె.సౌమిత్రి పేర్కొన్నారు. బుధవారం బ్రాంచి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మొండి బకాయిలున్న ఖాతాదారులకు ఈ పథకం ప్రయోజనం చేకూరుతుందన్నారు. దీనిలో పూర్తివడ్డీ రాయితీ రావడమే కాకుండా తీసుకున్న అప్పులో కేవలం 50 నుంచి 60 శాతం సొమ్ము చెల్లిస్తే సరిపోతుందన్నారు. బ్రాంచి పరిధిలో 75 మంది బకాయిదారులున్నారని పేర్కొన్నారు. ఈనెల 9న బ్యాంకు వద్ద సదస్సు ఏర్పాటు చేసినట్లు వివరించారు. నెట్, మొబైల్, కార్డు ద్వారా లావాదేవీలను ప్రోత్సహిస్తున్నట్లు చెప్పారు. బ్యాంకులో డిపాజిట్లు చేసిన ఖాతాదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఎఫ్.ఆర్.డి.ఐ. బిల్లుపై కొంతమంది అపోహ పడుతున్నారని, ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో డిపాజిట్ల విషయంలో ఏవిధమైన ఇబ్బందులు లేవని చెప్పారు. ఈ కార్యక్రమంలో అకౌంటెంట్ రాజేంద్రనాథ్, ఫీల్డ్ ఆఫీసర్ సతీష్, రిలేషన్‌షిప్ మేనేజర్ రవితేజ పాల్గొన్నారు.



వివరాలు తెలియజేస్తున్న ఎస్‌బీఐ బ్రాంచి మేనేజర్ సౌమిత్రి

సంక్రాంతి కానుకలు అందజేత

పాలేరు(పాయకరావుపేట), న్యూస్‌టుడే: పాలేరులో చంద్రన్న సంక్రాంతి కానుకలను బుధవారం తెదేపా నాయకుడు దేవరపు వెంకట్రావు పంపిణీ చేశారు. గ్రామంలోని లబ్ధిదారులకు సరుకుల కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలను ఆదుకోవడమే ధ్యేయంగా చంద్రబాబు పథకాలు అమలు చేస్తున్నారని వివరించారు. ప్రతీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామాల్లో అభివృద్ధి పనులకు పెద్దపీట వేస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.



కానుకలు అందజేస్తున్న వెంకట్రావు

నేడు మంత్రి అయ్యన్న కొత్తఎల్లవరం రాక

కొత్తఎల్లవరం(గొలుగొండ), న్యూస్‌టుడే: రాష్ట్ర రోడ్లు భవనాలశాఖ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు గురువారం కొత్తఎల్లవరం పంచాయతీలో పర్యటిస్తున్నారని ఎంపీపీ లక్ష్మీనారాయణ తెలిపారు. సాయంత్రం ఆయన ఇక్కడ విలేకర్లతో మాట్లాడుతూ ఈ పంచాయతీలో చేపట్టిన పలు అభివృద్ధి పథకాలను ఆయన పరిశీలన చేయడంతో పాటు ఇక్కడ ప్రజల సమస్యలను తెలుసుకుంటారని ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు.

ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి

వేంపాడు(నక్కపల్లి), న్యూస్‌టుడే: పలు ప్రభుత్వ పాఠశాలల్లో సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. వేంపాడులో ప్రధానోపాధ్యాయుడు రాచకొండ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి ఉద్యమ స్ఫూర్తిని విద్యార్థులకు వివరించారు. అనంతరం పాఠశాలలోని మహిళా ఉపాధ్యాయులు నాగలక్ష్మి, వరలక్ష్మి, భవాని, తేజశ్రీ, మహేశ్వరి తదితరులను సత్కరించారు. నక్కపల్లి బాలుర ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి ఆధ్వర్యంలో, ప్రాథమిక పాఠశాల వద్ద ఐక్య ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. సంఘం నాయకులు పి.వెంకటరావు, టి.ఆర్.అంబేడ్కర్, రాధాకృష్ణ, నాయక్, నానాజీ పాల్గొన్నారు.



వేంపాడులో మాట్లాడుతున్న శ్రీనివాస్

యూత్ లీడర్ వర్క్‌షాపునకు ఇద్దరు ఎంపిక

పాయకరావుపేట, న్యూస్‌టుడే: జన విజ్ఞాన వేదిక ఆల్ ఇండియా సైన్సు నెట్‌వర్క్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న యూత్ లీడర్‌షిప్ వర్క్‌షాపునకు స్పేసెస్ డిగ్రీ కళాశాలకు చెందిన బి.మహేశ్వరి, సి.హెచ్.ధనలక్ష్మి ఎంపికయ్యారు. వీరు కర్నూలులో ఈనెల 6 నుంచి 8వ తేదీ వరకు సైన్సు విభాగంలో పలువురు శాస్త్రవేత్తలు ఆధ్వర్యంలో జరగనున్న చర్చల్లో పాల్గొననున్నారు. మూఢనమ్మకాలను తొలగించడంలో సైన్సు దోహదం చేస్తుందనే అంశాలను వివరించనున్నట్లు స్పేసెస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.వీర్రాజు తెలిపారు. ఈ సందర్భంగా వీరిని సంస్థ సంయుక్త కార్యదర్శి సి.హెచ్.విజయ్‌ప్రకాష్ తదితరులు అభినందించారు.



విద్యార్థినులను అభినందిస్తున్న డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్



రాజానగరం విద్యార్థులతో ఉపాధ్యాయులు



నక్కపల్లి విద్యార్థులతో ఉపాధ్యాయులు


ఆటల పోటీల్లో సత్తా చాటిన విద్యార్థులు

పాయకరావుపేట, న్యూస్‌టుడే: మండలంలోని రాజానగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు కబడ్డీ పోటీల్లో సత్తా చాటారు. కొరుప్రోలులో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో కబడ్డీలో బాలికల జట్టు ప్రథమస్థానం సాధించింది. ఈ సందర్భంగా జట్టు సభ్యులను ప్రధానోపాధ్యాయుడు జి.రామారావు, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు ఆటలకు సమాన ప్రాధాన్యమివ్వాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభకు కొదవ లేదన్నారు. వెన్నుతట్టి ప్రోత్సహిస్తే ఉత్తమ ఫలితాలు సాధిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జి.రాంబాబు, బి.శ్రీనివాసరావు, అబ్దుల్‌ఖాదర్, ఆర్.రవికృష్ణ, షేక్ రహమాన్ తదితరులు పాల్గొన్నారు.

నక్కపల్లి, న్యూస్‌టుడే: జోనల్ స్థాయి ఆటల పోటీల్లో నక్కపల్లి బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటినట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు కుందురు రాజు తెలిపారు. తొమ్మిది క్రీడాంశాల్లో విరంతా పతకాలను పొందారు. క్రికెట్ అండర్-17, 14 విభాగంలో ప్రథమస్థానం, అండర్-14 వాలీబాల్ విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచారు. దీంతోపాటు డిస్కస్‌త్రో, పరుగుపందెం తదితర విభాగాల్లో విజయాలు సాధించారు. వీరిని ప్రధానోపాధ్యాయుడు పద్మావతి తదితరులు బుధవారం పాఠశాలలో అభినందించారు. ముందుముందు మరిన్ని విజయాలు సాధించాలని విద్యార్థులను కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎన్.వి.ఎస్.ఆచార్యులు, వేణుగోపాల్, బాబూజీ, అప్పారావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఏకరూప దుస్తుల పంపిణీ

గుడివాడ (ఎస్.రాయవరం), న్యూస్‌టుడే: ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని జడ్పీటీసీ సభ్యురాలు బొట్ట లక్ష్మి అన్నారు. గుడివాడ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు ప్రభుత్వం అందజేస్తున్న ఏకరూప దుస్తులను మండల తెదేపా అధ్యక్షులు నల్లపురాజు వెంకటరాజుతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం, ఏకరూప దుస్తులు, ఉపకార వేతనాలు తదితర పథకాలతో ప్రభుత్వం విద్యార్థులకు అన్ని సదుపాయాలను కల్పిస్తోందన్నారు. ప్రతి విద్యార్థి బాగా చదివి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు వీఎస్ఆర్ కళ్యాణి, ఉపాధ్యాయులు జోగినాయుడు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు దుస్తులు అందజేస్తున్న లక్ష్మి, వెంకటరాజు

పాయకరావుపేట

ఉపాధ్యాయినికి ఘన సత్కారం

నక్కపల్లి, న్యూస్‌టుడే: నక్కపల్లి బాలికల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయిని లిడియాగ్రేస్ పదవీ విరమణను బుధవారం పాఠశాలలో ఘనంగా సత్కరించారు. ప్రధానోపాధ్యాయురాలు పుష్యరాగం ఆధ్వర్యంలో సర్పంచి వీసం వెంకటలక్ష్మి, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు వీసం రామకృష్ణ తదితరులు సన్మానించారు.

పథకాల అమల్లో చొరవ తప్పనిసరి

ఎమ్మెల్యే అనిత

దార్లపూడి, పెదగుమ్ములూరు (ఎస్.రాయవరం), న్యూస్‌టుడే: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అమలులో అధికారులు చొరవ తీసుకోవాలని ఎమ్మెల్యే వంగలపూడి అనిత అన్నారు. అయిదో విడత జన్మభూమి కార్యక్రమంలో భాగంగా బుధవారం దార్లపూడి, పెదగుమ్ములూరు, గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ముందుగా ఎమ్మెల్యే అధికారులు, ప్రజలతో జన్మభూమి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అర్హులకు మాత్రమే పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా అన్నిశాఖల అధికారులు మీ దగ్గరకి వస్తున్నారని, ప్రజల మధ్యలో ఉండి కష్టసుఖాల్లో పాలు పంచుకోవాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి ఈ కార్యక్రమాన్ని చేపట్టారని వివరించారు. గ్రామంలో రెండు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో చనిపోయిన ఓ వ్యక్తికి ఇప్పటికీ మరణ ధ్రువపత్రం ఇవ్వకపోవడంపై పంచాయతీ కార్యదర్శి, వెలుగు సిబ్బందిపై అగ్రహం వ్యక్తం చేశారు. దార్లపూడి ఎన్టీఆర్ కాలనీలో ఇళ్లపై నుంచి విద్యుత్తు తీగల వేలాడుతున్నాయని ఫిర్యాదు చేయగా, పంచాయతీ నుంచి రూ.70 వేలతో ఈ తీగలను సరి చేయిస్తామని తెలిపారు. పెదగుమ్ములూరు కార్యక్రమంలో ఎన్టీఆర్ వైద్యసేవ సీఈఓ డాక్టర్ రవిశంకర్ పాల్గొన్నారు. ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించడానికి జన్మభూమి దోహదపడుతుందని ఎంపీపీ వినోద్ రాజు తిమ్మాపురం సభలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో జడ్పీటీసీ సభ్యురాలు బొట్టా లక్ష్మి, నియోజకవర్గ ప్రత్యేకాధికారిణి పుష్పమణి, మండల ప్రత్యేకాధికారి కోటేశ్వరరావు, సర్పంచులు గరగా చిన్నబ్బాయి, కొండమ్మ, వంగలపూడి సూర్యలక్ష్మి, ఎంపీడీఓ స్వరూపారాణి, తహసీల్దార్ వేణుగోపాల్, మండల తెదేపా అధ్యక్షులు వెంకటరాజు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎమ్మెల్యే అనిత



రాజగోపాలపురంలో వినతిపత్రాలు అందజేస్తున్న గ్రామస్థులు

సమస్యల పరిష్కారానికి పెద్దపీట

పాయకరావుపేట, న్యూస్‌టుడే: సమస్యల పరిష్కారానికి పెద్దపీట వేస్తున్నట్లు తహసీల్దారు పాండురంగారెడ్డి తెలిపారు. బుధవారం కేశవరం, శ్రీరాంపురం గ్రామాల్లో ఎంపీడీవో ఆధ్వర్యంలో, రాజగోపాలపురం, కుమారపురంలలో తహసీల్దారు పాండురంగారెడ్డి నేతృత్వంలో జన్మభూమి సభలు నిర్వహించారు. శ్రీరాంపురం గ్రామసభలో పశువైద్యాధికారిని నియమించాలని గ్రామస్థులు కోరారు. వైద్యుడు లేకపోవడంతో పశువులకు వైద్య అందడంలేదని, చనిపోతున్నాయని వివరించారు. కుమారపురంలో గ్రామకార్యదర్శి సక్రమంగా రావడం లేదంటూ ఫిర్యాదు చేశారు. పింఛన్లు అర్హులకు కేటాయించడం లేదని, మూడేళ్లక్రితం దరఖాస్తు చేసిన వారికి కూడా మంజూరు చేయకుండా కొత్తవారికి ఇచ్చేస్తున్నారని వైకాపా వర్గీయులు ఆరోపించారు. దీనిపై వివరణ ఇచ్చే వరకు గ్రామసభ జరగనీయమంటూ అడ్డుకున్నారు. ఇదే సమయంలో తెదేపా, వైకాపా వర్గీయుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఒకరిని ఒకరు తోసుకున్నారు. ఎస్సై బాబూరావు ఇరువర్గాలకు సర్దిచెప్పడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ పి.వెంకటనారాయణ, ఏడీ జి.వెంకటస్వామి, ఎంఈఓ కె.ఎన్.గాంధీ, ఎ.ఎస్.డబ్ల్యు.ఓ.మూర్తి పాల్గొన్నారు.

నేడు జన్మభూమి సభలు ఎక్కడంటే..

పాయకరావుపేట : పాయకరావుపేట మండలంలోని గురువారం పాల్మన్‌పేట, ఈదటం, నామవరం, పి.ఎల్.పురం గ్రామాల్లో జన్మభూమి సభలు నిర్వహించనున్నారు. గ్రామస్థులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు.

నక్కపల్లి : నక్కపల్లి మండలంలో గురువారం ఆరు గ్రామాల్లో జన్మభూమి గ్రామసభలు జరగనున్నాయి. కాగిత, గొడిచెర్ల, డీఎల్‌పురం, అమలాపురం, జీజేపురం, గుల్లిపాడు గ్రామాల్లో అధికారులు పాల్గొంటారు.

కోటవురట్ల : మండలంలో లింగాపురం, తంగేడు, పిప్పల కొత్తపల్లి, ఆక్నాహబ్‌పేట గ్రామాల్లో గురువారం జన్మభూమి కార్యక్రమాన్ని నిర్వహిస్తామని ఎంపీడీఓ కళ్యాణి చెప్పారు.

కనీస వేతనాల కోసం ఆందోళన

నర్సీపట్నం, న్యూస్‌టుడే: విద్యుత్తు మీటర్ రీడర్లు పెదబొడ్డేపల్లిలోని ఏపీఈపీడీసీఎల్ డివిజన్ కార్యాలయం ఎదుట బుధవారం నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా విద్యుత్తు కాంట్రాక్టు కార్మికుల ఐక్య వేదిక ప్రతినిధులు మాట్లాడుతూ మీటర్ రీడర్లకు పీస్‌రేటు రద్దు చేసి కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. తమిళనాడులో మాదిరి అందరినీ పర్మినెంట్ చేయాలని కోరారు. ఈ సమస్యల పరిష్కారానికి వీరు ఈ నెల 27 వరకూ దశలవారీగా ఆందోళనలు చేపట్టనున్నట్లు చెప్పారు. రోజూ మధ్యాహ్నం భోజన విరామ సమయంలో డివిజన్ కార్యాలయం ఎదుట ధర్నా చేపడతారన్నారు. ప్రభుత్వం పట్టించుకోని పక్షంలో 28న తరువాత రాష్ట్ర వ్యాప్తంగా మిగిలిన కార్మికులతో కలిసి నిరవధిక సమ్మెలో పాల్గొంటామన్నారు. ఈ ఆందోళనలో డివిజన్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు అప్పలకొండ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

వినతుల పరిష్కారానికి ప్రాధాన్యం

దేవవరం, రేబాక, బంగారమ్మపేట(నక్కపల్లి), న్యూస్‌టుడే: జన్మభూమి గ్రామసభల్లో వచ్చే వినతుల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తామని అధికారులు పేర్కొన్నారు. బుధవారం నక్కపల్లి మండలం దేవవరం, రేబాక, బంగారమ్మపేట, డొంకాడ, రమణయ్యపేట, గునుపూడి గ్రామాల్లో జన్మభూమి కార్యక్రమాన్ని నిర్వహించారు. మూడు బృందాలుగా ఏర్పడిన ఎంపీడీఓ పి.ఉమామహేశ్వరరావు, తహసీల్దార్ రాణి అమ్మాజీ, ఈఓఆర్డీ పి.ఎస్.కుమార్‌ల ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ చేయించిన అనంతరం ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై వివరించారు కార్యక్రమంలో భాగంగా ప్రజలనుంచి అధిక సంఖ్యలో వినతులు వచ్చాయి. అనంతరం చంద్రన్న బీమా, చంద్రన్న సరకుల పంపిణీ చేశారు. గర్భిణులకు సామూహిక సీమంతాలు చేశారు.



బంగారమ్మపేటలో చంద్రన్నబీమా మంజూరు పత్రాల పంపిణీ

ఈ కార్యక్రమాల్లో సర్పంచులు దేవర సత్యనారాయణ, గొట్టి ముక్కల శ్రీహరిరాజు, పి.జగ్గ, ఎంపీటీసీ గొర్ల రాఘవకుమారి, కొవిరి వెంకటలక్ష్మి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

అర్హులకు అందించడమే లక్ష్యం

బీకేపల్లి, నీలిగుంట, బోడపాలెం, రామచంద్రపాలెం (కోటవురట్ల), న్యూస్‌టుడే: ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు అందించడమే జన్మభూమి లక్ష్యమని మండల ప్రత్యేకాధికారి శ్రీధర్ అన్నారు. బుధవారం బీకేపల్లి, రామచంద్రపాలెం తహసీల్దార్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో, నీలిగుంట, బోడపాలెంలో ఎంపీడీఓ కళ్యాణి ఆధ్వర్యంలో ఆ గ్రామాల సర్పంచుల సమక్షంలో నిర్వహించారు. ప్రత్యేకాధికారి మాట్లాడుతూ గృహాలు, పింఛన్లు, రేషన్ కార్డులు లేనివారు ధరఖాస్తులు చేసుకోవాలని చెప్పారు. నీలిగుంటలో జడ్పీటీసీ సభ్యురాలు వంతర వెంకటలక్ష్మి, సర్పంచి సత్తిబాబు, ఎంపీడీఓ చేతుల మీదగా వడ్డీ రుణ పత్రాలను డ్వాక్రా గ్రూపుల మహిళలకు అందించారు. మరుగుదొడ్లు నిర్మించుకోవడానికి స్థలాలు లేవని, సామూహిక మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలని రామచంద్రపాలెంలో గ్రామస్థులు కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వరహాలమ్మ, జడ్పీటీసీ సభ్యురాలు వంతర వెంకటలక్ష్మి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం కరుణానిధి

కల్వర్టు పనుల జాప్యంతో అవస్థలు

కందిపూడి (పాయకరావుపేట), న్యూస్‌టుడే: కందిపూడి ప్రధాన రహదారిలో కల్వర్టు పనుల్లో జాప్యంతో గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. నీళ్లట్యాంకు ఎదురుగా ఉన్న రోడ్డును కల్వర్టు కట్టేందుకు తవ్వేశారు. దీని పనులు ఇంకా చేపట్టలేదు. దీంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. శ్రీరాంపురం, ఎస్.నర్సాపురం, రాజగోపాలపురం, పాల్తేరు, ఈదటం తదితర గ్రామాల నుంచి గ్రామం మీదుగా రాకపోకలు సాగుతుంటాయి. రోడ్డును తవ్వేయడంతో ట్రాక్టర్లు, ఆటోలు, ఇతర వాహనాలు వెళ్లలేని దుస్థితి నెలకొంది. అధికారులు స్పందించి పనులు తక్షణమే పూర్తి చేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.



రోడ్డు మధ్యలో గొయ్యి

పాఠశాలల్లో జన్మభూమి సందడి

కోటవురట్ల, న్యూస్‌టుడే : ప్రభుత్వ పాఠశాలల్లోనూ జన్మభూమి సందడి నెలకొంది. బుధవారం బీకేపల్లి, రామచంద్రపాలెం, నీలిగుంట, బోడపాలెం కొడవటిపూడి, తంగేడు, చౌడువాడ పాఠశాలల్లో విద్యార్థులకు కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్, షటిల్, చిత్రలేఖన పోటీలు, కోలాటాలు నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

ఎస్.రాయవరం : ఎస్.రాయవరం ఉన్నత పాఠశాల విద్యార్థులు బుధవారం గ్రామంలో ర్యాలీ చేశారు. గ్రామ స్వరాజ్య సమితి ఆధ్వర్యంలో జన్మభూమి కార్యక్రమంలో భాగంగా 'పరిసరాల పరిశుభ్రత, స్వచ్ఛభారత్, బాల్య వివాహాలు అరికట్టాలి, మొక్కలను పెంచాలి' తదితర నినాదాలతో వీధుల్లో ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ స్వరాజ్య సమితి మండల కోఆర్డినేటర్ ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్.రాయవరంలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు



చౌడువాడలో కోలాటం చేస్తున్న విద్యార్థినులు

నక్కపల్లి : ప్రభుత్వం నిర్వహిస్తున్న జన్మభూమి గ్రామసభలపై ప్రభుత్వ పాఠశాల, కళాశాలల్లో విద్యార్థులకు చర్చ నిర్వహిస్తున్నారు. బుధవారం వేంపాడు ఉన్నత పాఠశాల, నక్కపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో బోధన సిబ్బంది చర్చా కార్యక్రమం ఏర్పాటు చేశారు. ప్రధానోపాధ్యాయుడు రాచకొండ శ్రీనివాస్, కళాశాల ప్రిన్సిపల్ రామచంద్రరావు, ఎన్.ఎస్.ఎస్. అధికారి కొండలరావు పాల్గొన్నారు.